

వారు ఎవరంటే...
కస్తూరి బెహెన్


వారు ఎవరంటే...
కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

సిస్టర్ కస్తూరీగారి తెలుగు పుస్తకాల కొరకు

కె. రామదాస్ - **9440652774**

కె. సుదర్శన్ - **9247805058** లేదా

**9063177540**

సంప్రదించగలరు.

# వారు ఎవరంటే...


రచయిత్రి

**కస్తూరి చతుర్వేది**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| **1.** | **ముందుమాట** | **5** |
| **2.** | **అంకితం** | **6** |
| **3.** | **శ్రీ లాలాజీ సాహెబ్** | **7** |
| **4.** | **కౌన్ థే వే (వారు ఎవరంటే)** | **12** |
| **5.** | **దివ్య కిరణాలు** | **172** |
| **6.** | **కౌన్ థే వే (పాట భావం)** | **175** |
| **7.** | **కౌన్ థే వే (పాట తెలుగు అనువాదం)** | **182** |

# ముందుమాట

**"కౌన్ థే వే?"** అను ఈ పుస్తకాన్ని వ్రాయాలన్న ఆలోచనను నాలో కలిగించిన ఆ అభ్యాసీ సోదరుని గురించి రెండు మాటలు చెప్పాలని ఈ రోజున నా మనస్సు ఉత్సాహపడుతున్నది. "బెహెన్‌జీ! శ్రీ బాబూజీ మహరాజ్‌ను గురించి, 'వారి' జీవన విధానం, 'వారి' కటుంబ జీవితం మొదలగు విషయాలను గూర్చి, దయచేసి మీకు తెలిసినదంతా ఒక పుస్తకరూపములో వ్రాయగలరు. అందువలన రాబోయే తరాలవారు 'వారి'ని గూర్చి కొంచెమైన తెలుసుకోగలరు" అని ఆ సోదరుడు నన్ను కోరాడు. ఈ పుస్తకం యొక్క అవసరం ఎంతో ఉందని మళ్ళీ మళ్ళీ నొక్కిచెప్పి ఆ సోదరుడు నాలోని ఆలోచన క్రియారూపం పొందుటకై ఉత్సాహాన్ని పెంపొందింప చేశాడు. దాని ఫలితంగా "కౌన్ థే వే?", "వారు ఎవరంటే....." అను ఈ పుస్తకం పూర్తయి, ఈ సృష్టి యొక్క మనో ప్రాణాలకు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దివ్య రూపాన్ని అంకితం చేయు గౌరవాన్ని పొందనున్నది. ఇటువంటి సందర్భంలో ఆ సోదరుని పేరు తెలపటానికి ఈ సోదరి ఏ విధంగా మరచిపోగలదు! ఆ సోదరుడు శ్రీ హెచ్. ఆర్. పగార్ గారు, డిప్యూటి జనరల్ మేనేజర్‌గా భోపాల్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్నారు.

**కస్తూరి**

# అంకితం

**“కితనే భీ కహెూ ఆంఖే నమ్ ఆజ్ భీ హెూ జాతీహై।**
**జబ్ యాద్ ‘ఉన్‌కి’ ఆయేహై, ఛవి ఉభర్ ఉభర్ ఆతీహై॥”**

“ఎంత చెప్పినా నేటికి కూడా ‘వారు’ గుర్తుకు రాగానే మన కళ్ళు చెమ్మగిల్లుతాయి; ‘వారి’ దివ్య రూపం పదే పదే మన ఎదుట ప్రత్యక్షమవుతుంది.”

ఎవరైతే ఈ విశ్వానికే గురుదేవులో ‘వారి’ మృదు మధురమైన చిరునవ్వు యొక్క పవిత్ర నాట్యం వలన వాతావరణమంతా ఆనందంతో ఊగిసలాడుతుంది.

‘వారి’ శూన్య దృష్టి (శూన్య నిగాహ్) కూడ అభ్యాసులపట్లగల దివ్యప్రేమతో సంపూర్ణంగా నిండి ఉన్నట్లుగా కనపడుతుంది. ఈశ్వరీయ ప్రకాశం నుండి వెలువడిన దివ్య కిరణాలను రకరకాల ఆధ్యాత్మిక స్థితులతో కూడిన దివ్య సంపదతో నిండిన నా హృదయం “కౌన్ థే వే?” అని పదే పదే నన్నే ప్రశ్నిస్తున్నది. అప్పుడు నేను అమితాశ్చర్యం పొందునట్లుగా, నాలోని గురుదేవులే తమ దివ్యమైన చిరునవ్వుతో, మధుర ధ్వనితో స్వయంగా మాట్లాడసాగారు. హృదయాంతరాళాలను స్పర్శించునటువంటి అనుభవాలను ప్రసాదించిన ఆ దివ్య పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్ పవిత్ర చరణాలకు నేను వందనం చేస్తున్నాను. ఈ రోజున “కౌన్ థే వే?” అను దైవ రహస్యాన్ని సమస్త జనులకు ప్రకాశవంతం చేసిన మన గురు పితామహులు శ్రీ లాలాజీ సాహెబ్ పావన చరణ ద్వయం నందు “కౌన్ థే వే?” అను ఈ పుస్తకాన్ని పుష్పాంజలిగా అంకితం చేస్తున్నాను.

**ఫిబ్రవరి 8వ తేది 1992**

**(బసంత్ పంచమి)** **కస్తూరి**

# శ్రీ లాలాజీ సాహెబ్

ఏ మహామహాత్ముని దివ్య చరణాలకు నా ఈ పుస్తకం అంకితం చేయబడినదో ఆ మహాత్ముని గురించి కొంచెమైన తెలుసుకోవాలని మనం కోరుకుంటాము. అందువల్లనే ఆ మహాత్ముని పవిత్ర పరిచయాన్ని గురించి కొన్ని మాటలు వ్రాయటానికే ఈ వినమ్రపూర్వకమైన ప్రయత్నాన్ని చేస్తున్నాను. ఆ మహాత్ముని పరిచయాన్ని తెలపగల సాహసం ఎవరికి ఉన్నది? ఎందుకంటే, ఆ పరమపూజ్యులు తమ పరిచయాన్ని ఈ భూమిపై దైవీయ కార్యంలో లీనమై ఉన్న ఆ దివ్యపురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్‌లో తమ శుభనామ సహితంగా 'విలీనం' గావించి ఉన్నారు. భూమి ఎప్పుడైనా ఇటువంటి చరణాల స్పర్శను పొంది ధన్యురాలైనదా? లేదు. ఇంతకుముందు ఎప్పుడూ ఈ విధంగా జరగలేదు. ఇకముందు జరగబోదు. ఆ ఆధ్యాత్మికంగా మహోన్నతులైన శ్రీ లాలాజీ సాహెబ్‌ను గురించి, స్వయంగా నా బాబూజీ మహరాజ్ నాకు తెలిపినట్టి సూక్ష్మ పరిచయాన్ని, అదే విధంగా మీకు తెలపడానికి నాకు వరాన్ని ప్రసాదించమని శ్రీ బాబూజీ మహరాజ్‌ను ప్రార్థిస్తున్నాను.

ఒకరోజు స్వతహాగానే నాలో ఒక దైవిక ప్రశ్న ఉత్పన్నమై, ఎదుట నిలబడి, పదే పదే నా నుండే జవాబును కోరుతున్నట్లుగా ఉన్నది. "ఆది గురువు", "సమర్థ" మరియు "సద్గురువు" – అను ఈ మూడు దివ్య బిరుదులతో పరమ పూజ్య శ్రీ లాలాజీ సాహెబ్‌ను ఎవరు అలంకరించి ఉంటారు? ఎందుకంటే, ఈ దివ్య బిరుదులను ఎవరు కూడ తమకు తాముగా ఉంచుకోరు. 'వారి' గురుదేవులు

కూడా 'వారి'ని వీటితో సత్కరించలేదు. కాని ఎప్పుడైతే 'వారు', 'వారి'కి అప్పగించబడిన దైవ కార్యాన్ని పూర్తిచేసి, ఆ దివ్య పురుషుని భూమి మీదకు తీసుకొచ్చారో, అప్పుడు స్వయంగా "దైవమే" వారిని ఈ దివ్యమైన బిరుదులతో అలంకరించింది.

శ్రీ లాలాజీ మహరాజ్‌గారి పూజ్య గురుదేవులు 'వారి'కి, యుగపరివర్తనకై ఆదిశక్తిని భూమి మీదకు తీసుకురావల్సినదిగా, ఒక అత్యంత క్లిష్టమైన దైవకార్యాన్ని అప్పగించారు. అప్పుడు శ్రీ లాలాజీ సాహెబ్ తీవ్ర సాధనచేసి ఆ దివ్యశక్తిని భూమి మీదకు అవతరింపజేసే విధానాన్ని కనిపెట్టారు. అవతారాలు ఏ విధంగా భూమి మీదకు అవతరించాయో మనకు తెలుసు. మునులు, ఋషులు మరియు దేవతల యొక్క నిరంతర ప్రార్థనల వలన ఈశ్వరీయ శక్తిలో క్షోభ (చలనం) ఏర్పడి, కాలావసరానికి తగినట్లుగా ఈశ్వరీయ శక్తి యొక్క గమనం ధరణీతలం వైపుకు మరలుతుంది. తత్ఫలితంగా శ్రీరాముడు మరియు శ్రీకృష్ణుని యొక్క అవతారాలు భూమిపై అవతరించాయి. కాని యుగపరివర్తన కోసం **"భూమా" అంటే ఆదిశక్తి యొక్క శక్తిని** భూమి మీదకు తీసుకురావడానికి, తమ ప్రార్థనను "భూమా" స్వీకరించటానికి, ప్రథమంగా ఒకరు సాధన ద్వారా ఆ యోగ్యతను సంపాదించుకోవాల్సి ఉంది. అత్యంత కఠినమైన ఈ దైవ కార్యాన్ని పూర్తిచేయటంలో మన లాలాజీ సాహెబ్ సమర్థులయ్యారు. అప్పటి నుండి "సమర్థ" – అనే ఈ దివ్యమైన బిరుదు సహజంగానే 'వారి' పేరులో కలిసిపోయింది. ఇప్పుడు ఇంకా ముందుకు వెళ్ళదాం. ఎందుకంటే, రచయిత్రి తొందర పడుతున్నది. ఆ తొందరను ఆపలేము. ఇచ్చేవారు ఇవ్వటానికై ఆరాట పడుతున్నప్పుడు, రచయిత్రి నెమ్మది నెమ్మదిగా ఎలా వెళ్ళగలరు!

శ్రీ లాలాజీ సాహెబ్‌గారు ఏడు మాసాలు తీవ్రమైన సాధన చేసి, తమ ప్రార్థన ద్వారా 'అంతిమం'లో స్పందనలు కలిగించారు. తమ ప్రార్థన "భూమా" అంగీకరించిందని 'వారి'కి అర్థమయ్యింది. ఆ మహత్తరమైన దివ్యశక్తి విశ్వమంతటా వ్యాపించియున్న దానిని 'వారు' గమనించారు. అపుడు ఆ దివ్య పురుషుని యొక్క దర్శనం పొందటం 'వారి'కి అవసరమయ్యింది. ఈ సందర్భంలో నేను వ్రాసిన పాటలోని ఒక పంక్తి నా ఎదుట నిలిచి స్వయంగా ఈ విధంగా పాడసాగెను.

**"ప్రకృతి నే ఆంచల్ సజాయా, పురుష్ భీ విస్మిత్ హువా।**
**నేహ్ సే లేనే కో చుంబన్, భూమా భూ పర్ ఛా గయా॥"**

ఆ దివ్య బాలకుని తన ఒడిలోనికి తీసుకోవడానికి ప్రకృతి తన చేతులను చాపింది. తన ప్రతిరూపం ఆ దివ్య బాలకుని రూపంలో భూమి మీద అవతరించటం చూసి, మహా సంతోషంతో 'భూమా' కూడా తన 'భూమా శక్తి' సహితంగా, ఆ దివ్య బాలకుని ప్రేమతో ముద్దుపెట్టుకోవాటానికై భూమిపైకి వచ్చింది. ఈ దృశ్యాలను చూసి భగవంతుడు కూడా ఆశ్చర్యపడ్డాడు.

దివ్య ప్రాణాహుతి శక్తి యొక్క ప్రవాహం అప్పటి నుండి మానవమాత్రుల కోసం సులభతరమయ్యింది. అప్పుడే ధ్యానంలో శ్రీ లాలాజీగారు ఆ దివ్య బాలకుడ్ని దర్శించారు. శ్రీ బాబూజీ మహరాజ్ ఆరు రోజుల పసిబాలునిగా ఉన్నప్పుడు, 'వారి'ని చేటలో పడుకోబెట్టడం, అదే సమయంలో 'వారి'కి శ్రీ లాలాజీ సాహెబ్ నుండి 'ప్రాణాహుతి' శక్తి లభిస్తూ ఉండేదని 'వారు' మనకు చెప్పిన

మాటలవలన తెలుస్తున్నది. ఎప్పుడైతే 'వారు' మూలం నుండి ప్రసారం చేసిన ఆ దివ్యశక్తిని అంటే ప్రాణాహుతిని, ఆ దివ్య బాలకుడు సంపూర్ణంగా గ్రహించినట్లు శ్రీ లాలాజీ సాహెబ్ గమనించారో, అప్పటి నుండి **వారు** 'సద్గురువు' బాధ్యతను చేపట్టి, ఆ దివ్య బాలకునకు ఆధ్యాత్మిక శిక్షణ నివ్వటం ప్రారంభించారు. అపుడు నా పాటలోని ఒక పంక్తి స్వతంత్రరూపంలో స్వతహాగానే ఈ విధంగా పాడసాగెను.

**"సద్గురుహ్ కి పులక్ పలకే, దేఖ్‌తేహి రహ్‌గయే।"**

'వారు' ప్రసారం చేసిన దివ్యశక్తిని ఆ బాలకుడు సంపూర్ణంగా గ్రహించడం చూసిన సద్గురువు అమితమైన సంతోషంతో పులకించి పోయి, ప్రేమ, వాత్సల్యంతో నిండిన తమ దృష్టిని సంపూర్ణంగా, నిశ్చలంగా ఆ దివ్య బాలకునిపై నిలిపి, అతడినే చూస్తూ ఉండి పోయారు.

నేను పైన వ్రాసిన దానికి కూడా ప్రత్యక్షమైన నిరూపణ ఒకటి ఉన్నది. **"ఎప్పుడైతే నేను శ్రీలాలాజీ సాహెబ్ దివ్య పాదపద్మాల వద్దకు చేరుకున్నానో, అప్పటికే నాలో లయావస్థ పూర్తయ్యిందని శ్రీ లాలాజీగారు అన్నారు" అని 'వారు' (బాబూజీ) మనకు తెలిపారు. శ్రీ లాలాజీ సాహెబ్ ఒకసారి వారితో, "నా మరియు నీ యొక్క అవతరణ సాక్షాత్తు 'భూమా' నుండి జరిగింది" అని అన్నారని, 'వారు' మనకు చెప్పటంవలన తెలుస్తున్నది.**

ఈ దైవరహస్యాన్ని సత్యస్వరూపంగా వ్రాయటానికి శ్రీ బాబూజీ మహరాజ్ తమ అపారకృపను సదా నాకు ఆధారంగా

ఇవ్వవలసిందిగా మరియు తమ 'ఈశ్వరీయ ధార' అనే వర్షంతో ప్రాణుల హృదయాలను నిరంతరం తడిపివేయవలసిందిగా 'వారి'ని ప్రార్థిస్తున్నాను.

'వారి'కి అత్యంత ప్రియమైన ఈ కుమార్తె, ఈ ఆశతో, నయనాశ్రువులతో, ఎల్లవేళలా 'వారి' పవిత్ర చరణద్వయాన్ని కడుగుతూ ఉండుగాక!

## సందేశం

ఎవరి యొక్క జ్ఞాపకం కలుగుతూనే హృదయంలో నుంచి ప్రేమ పెల్లుబుకుతుందో వారిని సదా స్మరించండి. బాబూజీ స్మరణ మరవ వద్దు. బాబూజీ మీ ఎదుటనే ఉన్నారని, 'వారి' నుంచి మీకు ప్రేమ, ప్రాణాహుతి లభిస్తున్నాయని అనుభూతి చెందండి. మీ జీవన సర్వస్వం వారేనని అర్పణ భావంతో ఉండండి. "మీరు మా వారు, మేము మీ వారము" అని వినమ్రతా భావంతో అనుబంధాన్ని పెంచుకోండి. మీరంతా మంచి అభ్యాసులుగా మెలుగుతూ పురోగతిని సాధించుకుని మీ సెంటర్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు ఆర్జించి పెట్టండి. ఇదే నా సందేశం.

**– కస్తూరి బెహెన్**

# కౌన్ థే వే (వారు ఎవరు)

అకస్మాత్తుగా దివ్యత్వం అనే సముద్రములో స్పందన ఏర్పడింది. అపుడు దైవం తన ఒడిలోని దివ్యశిశువును ఆప్యాయంగా నిమిరి సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క ప్రేమమయమైన ఒడిలో ఉంచింది. అత్యంత పరమానందభరితులైన శ్రీ లాలాజీ సాహెబ్, ఆ దివ్య శిశువు భూమి మీద జన్మించకముందే తమ శు భనామమును (రామచంద్ర) ఆ దివ్య శిశువునకు ప్రదానం చేసినట్లున్నది. ఆ దివ్య శిశువు యొక్క దివ్య విరాట్ స్వరూపం సమస్త విశ్వమంతా వ్యాపించింది. ఏ అవతారమైన భూమి మీద అవతరించడానికి ముందు, ఆ అవతారం యొక్క విరాట్ రూపం మొదట బ్రహ్మాండంలో ప్రత్యక్షమవుతుంది. ఉదాహరణకు శ్రీరాముడు జన్మించడానికి పూర్వమే కౌసల్యామాత శ్రీరాముని యొక్క దివ్య విరాట్ స్వరూపాన్ని దర్శించింది. "ఓ ప్రభూ! ఈ దైవీయ రూపం వదిలి భౌతిక రూపాన్ని ధరించు" అని కౌసల్యామాత ప్రార్థించగానే ఆ విరాట్ రూపం మానవ రూపాన్ని దాల్చి భగవాన్ శ్రీరాముని పేరుతో భూమిపై అవతరించటం జరిగింది. అదే విధంగా దేవకీ, వసుదేవులు కూడ భగవాన్ శ్రీకృష్ణుని యొక్క దివ్యస్వరూపం కారాగారంలో దర్శించి నపుడు, ప్రార్థించగానే ఆ దివ్య స్వరూపం, శ్రీకృష్ణ నామధేయంతో భూమిపై అవతరించి, ఆడుకోవటానికి యశోద ఒడిలోనికి చేరడం జరిగింది.

అవతారులు ఎప్పుడు కూడా దేవతలు, ఋషులు మరియు మునుల యొక్క ప్రార్థనల వలన భూమిపై అవతరిస్తారు. కాని

మన సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ తమ గురుదేవునిచేత అప్పగించబడిన దైవకార్యాన్ని పూర్తి చేయటానికి, ఆ పరమ ఆదిశక్తిని ధరణిపై ఆవిర్భంప చేయటానికి ఏడు నెలలు తీవ్రమైన సాధనచేసి, మొదట తమలో ఆ పరిపూర్ణత్వాన్ని పొందారు. అప్పుడు ప్రకృతి యొక్క ఆ మహత్తరమైన కార్యాన్ని సంపూర్ణం చేయటానికి దైవశక్తి అనగా 'అంతిమం'ను భూమిపై అవతరింపజేయటానికి 'వారు' చేసిన ప్రార్థన 'అంతిమం' స్వీకరించింది. తత్ఫలితంగా ప్రారంభంలో నేను వ్రాసినట్లుగా, దివ్యత్వం అనే సాగరంలో కదలిక ఏర్పడి క్రీ. శ. 1899 సంవత్సరం వైశాఖమాస బహుళ పంచమి రోజు, ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో బాబూ బద్రీప్రసాద్‌గారి గృహంలో ఈ పుత్రరత్నం జన్మించింది. అపుడు ఎటువంటి దివ్యచమత్కారం జరిగిందంటే, పండితులు కూడా ఆ దివ్య శిశువుకు **"రామచంద్ర"** అని సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ యొక్క పరమ ప్రియ శు భనామమునే ప్రదానం చేశారు. ఆ దివ్య శిశువు **"రామచంద్ర"** అనే పేరుతో ఏ విధంగా పెరిగి పెద్దవారయ్యారో మరియు తమ ఆధ్యాత్మిక మాతృమూర్తి అయిన సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క దివ్యచరణాలవద్దకు ఎప్పుడు, ఏ విధంగా చేరుకున్నారు, మొదలగు విషయాలన్నింటినీ శ్రీ బాబూజీగారు తమ 'ఆత్మకథ'లో వ్రాసి ఉన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ దివ్య అవతరణం గూర్చి పైన నేను తెలిపినది అంతా కూడా 'వారు' దివ్య కృపతో ప్రసాదించిన స్థితిలోనే వ్రాయటం సంభవమైనది.

సమర్థ సద్గురు శ్రీ రామచంద్రజీ మహరాజ్, షాజహాన్‌పూర్, ఉత్తరప్రదేశ్ గారిచేత స్థాపించబడిన **'సహజమార్గం'** అనే ఈ

ఆధ్యాత్మిక మార్గం ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశిస్తూ, అభ్యాసుల యొక్క సాధనను నేడు సఫలం చేస్తూన్నది. **'వారు' తమ దివ్య సంకల్పశక్తితో ఈ సహజమార్గ సాధనను మన సమక్షంలో ఏ విధంగా ఉంచారంటే, అభ్యాసులమైన మనకు, ఈ సాధన కఠినమైనదనే భావన లేశమాత్రం కూడ అనిపించదు. అంతేకాకుండా మన హృదయంలో నిరంతరం ఏర్పడే స్వచ్ఛమైన ఆధ్యాత్మిక దశలు, మనలను ఎల్లప్పుడు లక్ష్యప్రాప్తికి అధికమైన అప్రమత్తతో ఉంచుతాయి.** సహజమార్గ సాధనలో నేను ప్రవేశించి, శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యచరణాలవద్ద నిరంతరం 'వారి' దివ్య ప్రాణాహుతిని పొందుతూ, 'వారి' కనుచూపులలోనే నివసిస్తూ, 'వారి' దివ్యకృప వలన నాకు తెలిసిన దైవీయ రహస్యాలన్నింటిని ఈ పుస్తకములో వ్రాయడానికి ప్రయత్నించాను. 'వారి' కృప లేకుండా ఈ దైవ రహస్యాలను విశదపరచి ఈ భూమిని ఎవరు సుసంపన్నం చేయగలరు? ఇది అంతా కూడా సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క అలౌకికమైన సామర్థ్యం మాత్రమే. ఆ పరమ పూజ్యులు అంతిమ శక్తి యొక్క కేంద్రంలో స్పందన కలిగించి, ఈ దివ్య రత్నంతో పృథ్విని అలంకరించారు. శ్రీ బాబూజీ మహరాజ్ తమ సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్‌ను గురించి "ఆధ్యాత్మిక మహా మహెూన్నతుడు" అని చెప్పటం సరైనది. ఎవరైతే సమస్త ప్రాణికోటికి తమ ప్రేమమయమైన ఒడిలో ఆశ్రయం ఇచ్చారో, కేవలం 'వారి'కి మాత్రమే తమ ఆధ్యాత్మిక జననికి కీర్తి ప్రతిష్టలను తీసుకురాగల సామర్థ్యం ఉంది. ఆ సామర్థ్యం శ్రీ బాబూజీ మాహరాజ్‌కు తప్ప ఇతరులకు అసాధ్యం. ఎవరైతే ఆ 'భూమా' నుండి 'భూమాశక్తి'

సహితంగా అవతరించారో, కేవలం 'వారు' మాత్రమే మనలను 'భూమా'వద్దకు తీసుకుపోగలరు. ఇంతేకాదు **శ్రీ బాబూజీ మహరాజ్ తమ అమోఘమైన సంకల్ప శక్తితో ఈశ్వరీయ శక్తి యొక్క ప్రవాహాన్ని మానవాళి శ్రేయస్సుకొరకు సులభంచేసి, క్రమంగా మనలను ఒక్కొక్క మెట్టు ఎక్కించి పైకి తీసుకుపోతూ, ఆధ్యాత్మిక మార్గాన్ని సుగమం చేస్తూ, మన కోసం 'పరమ సాక్షాత్కారం' యొక్క ద్వారాలను తెరచి ఉంచారు. 'వారి'ని గురించిన దివ్య రహస్యాన్ని ఎవరు తెలుసుకో గలరు? 'వారు' రహస్యానికే అతీతులు మరియు దివ్యత్వమే 'వారి' యొక్క రహస్యమై ఉన్నది. ఆధ్యాత్మిక స్థితుల్లోని రహస్యాలన్నింటిని 'వారు' మనకు అర్థమయ్యేట్లుగా చేస్తూ, మనల నందరిని ఆధ్యాత్మిక పథంలో ఒక్కొక్క మెట్టు ఎక్కించి పైకి తీసుకుపోతున్నారు.**

మనలోని భౌతిక ఆవరణలను విచ్ఛేదనచేసి అత్యంత సూక్ష్మాతి సూక్ష్మమైన స్థితులను కూడా, ఇదేమీ రహస్యం కాదన్నట్లుగా వాటిని గూర్చి మనకు తెలియజేస్తారు. ప్రేమపూరితమైన విశాల హృదయం, శూన్యదృష్టి, మన ఆధ్యాత్మికోన్నతి కోసం ఎల్లప్పుడు మెలకువగా ఉంటూ, అనుక్షణం ఆరాటపడే మనస్సు, దివ్యమైన చిరునవ్వుతో కూడిన **'వారి' పవిత్ర స్వరూపం మొదలైన వన్నీ కూడా ప్రాణిమాత్రులను సహజంగానే ముగ్ధులను చేయునటువంటి ప్రేమతో కూడిన ఆహ్వానమా! అన్నట్లుగా ఉంటుంది. అటువంటి దివ్య ఆకర్షణ నుండి ఎవరు వెనుదిరుగగలరు?**

శ్రీ బాబూజీ మహరాజ్ శుభాగమనం యొక్క రహస్య ప్రకటన విషయాన్ని గురించి పైన నేను ఉదహరించినది అంతా కూడా ఒక

సంస్మరణ ద్వారా ప్రమాణితమై ఉన్నది. ఒకసారి షాజహాన్‌పూర్‌లో వర్షం కురిసిన తరువాత బాబూజీగారి ఇంటిలోని దుస్తులన్నింటిని, నేను మరియు సోదరి ఎండలో ఆరవేస్తూన్నపుడు అందులో మాకు ఒక చిన్న అంగీ మరియు చిన్న టోపి కనబడ్డాయి. వాటిని కూడా మేము ఆరవేసాం. ఇంతలో అక్కడకు వచ్చిన బాబూజీగారి యొక్క పూజ్యులైన తల్లిగారిని, “ఇంత చిన్న దుస్తులు ఎవరివి?” అని మేము అడిగాము. వెంటనే ఆమె ఆ దుస్తులను మా చేతిలో నుండి తీసుకొని, “ఇవి రామచందర్ ఆరు రోజుల నవ-శిశువుగా ఉన్నప్పుడు ధరించిన దుస్తులు. ఇవి వాళ్ళ మేనత్త ఇచ్చారు. వెంటనే వీటిని లోపల దాచిపెట్టండి. వాటిని జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చాం. లేకపోతే ఇతరుల దిష్టి తగలవచ్చు” అని అన్నారు. అనుకోకుండా శ్రీ బాబూజీగారు కూడా అక్కడకు వచ్చారు. “బాబూజీ! ఇవి మీరు ఆరు రోజుల శిశువుగా ఉన్నప్పుడు ధరించిన దుస్తులు అని అమ్మమ్మ మాతో చెప్పారు. కాని మీరు కూడా ఒకప్పుడు ఇంత చిన్నగా ఉన్నారా?” అని మేము చిన్నపిల్లల్లాగా అడిగాము. వెంటనే ‘వారు’ గంభీర స్వరంతో, “అవును; **నాకు ఇప్పటికి కూడా చాలా స్పష్టంగా జ్ఞాపకం ఉన్నది. నేను ఆరు రోజుల శిశువుగా ఉన్నప్పుడు, నాకు స్నానం చేయించి ఎప్పుడైతే చేటలో పడుకోబెట్టారో అపుడే శ్రీ లాలాజీ సాహెబ్ నాకు ప్రాణాహుతిని ప్రసారం చేశారు” అని అనగానే మేమంతా నిశ్చేష్టులమయ్యాము. “పూవు పుట్టగానే పరిమళిస్తుంది కదా!”**

## కుటుంబ పరిచయం

నేను సంస్థలో చేరినపుడు "సౌభాగ్యవశమున మాతాజీ అంటే శ్రీ బాబూజీగారి సతీమణిగారు జీవించియే ఉన్నారు. వాళ్ళది అలౌకికమైన జంట. మన బాబూజీగారు బక్కపలుచటి శరీరం కలిగి ఉండి పొడవుగా ఉండేవారు. మాతాజీ లావుగా, ఆరోగ్యమైన శరీరం కలిగి ఉండేవారు. వీరు ఎంతో బలహీనులు. ఆమె ఎంత శక్తివంతు రాలంటే, పొలం నుండి వచ్చిన క్వింటాళ్ళ ధాన్యాన్ని ఆమె ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల నుండి రెండు చేతులతో రెండు రోకళ్ళతో దంచి, చేటతో చెరిగి శుభ్రం చేసేవారు. ఆ తరువాత ఆమె పెద్ద పెద్ద ఇత్తడి గంగాళాలను కడిగి, వాటి నిండా నీటిని నింపేవారు. స్నానాంతరం నాలుగు చపాతీలను తిని, కొంచెంసేపు ముచ్చటించిన తరువాత పిల్లలకు స్నానం చేయించి, బట్టలు ఉతికి, వంట వండటం ఆరంభించేవారు. ఒకరోజు పూజ్య మాతాజీ మా అమ్మతో, "వదినగారు, వీరు చిన్న పిల్లవానిని కూడా ఎత్తుకోలేనంత బలహీనులు" అని అన్నారు. నిజమే, ఇది మేము కూడ గమనించాము. రాత్రిపూట బాబూజీగారి కటుంబ సభ్యులందరు మేడమీద నిద్రించేవారు. మాతాజీ నిద్రిస్తూన్న చిన్న పిల్లలను ఎత్తుకొని మేడపైకి తీసుకు వెళ్ళేవారు. బాబూజీగారు మాత్రం నీళ్ళ చెంబు, గ్లాసును తీసుకువెళ్ళేవారు. ఆ సమయంలో 'వారి' ఆరోగ్యం కూడా బాగానే ఉండేది. 'వారు' కోర్టుకు వెళ్ళేప్పుడు చిన్న గిన్నె నిండా సగ్గుబియ్యపు జావను త్రాగి, నాలుగు మిఠాయిలను తినేవారు. మరల సాయంత్రం కోర్టు నుండి రాగానే దుస్తులను మార్చుకొని, శుభ్రంగా కడుగుకొని అల్పాహారంగా కొన్ని ఉప్పు

శెనగలు, ఊరగాయ మరియు ఒక గ్లాసు పాలు తీసుకునేవారు. వారికి ఒక అక్క మరియు ఒక చెల్లెలు ఉండేవారు. **అక్క పేరు తేజారాణి. చెల్లెలు పేరు కుటుమ్‌ప్యారి.** వీరిద్దరు హిందీ సాహిత్యరంగంలో గ్రంథకర్తలుగా పేరు పొందారు. **'వారి' తండ్రి పూజ్య రాయ్‌బహదూర్ బాబూ బద్రీప్రసాద్‌జీ,** పట్టణంలో పేరు పొందిన జమిందారులలో ఒకరు. పూజ్యులైన 'వారి' తల్లిగారు పూజకు గుడికి వెళ్ళేప్పుడు సనాతన సాంప్రదాయం ప్రకారం చీరమీద ఇంకొక వస్త్రం కూడా ధరించేవారు. పూజ్యులైన 'వారి' తల్లిగారిని మేమందరం చూశాం. కాని 'వారి' తండ్రిగారిని చూడలేకపోయాం. శ్రీ బాబూజీగారికి నలుగురు కుమారులు మరియు ఇద్దరు కుమార్తెలుగల సంపూర్ణ కుటుంబం. 'వారి' కుటుంబ పరిచయాన్ని విహంగదృష్టితో నాకు తెలిసిన విధంగా వ్రాశాను. ఆ పరమ పూజ్యులను దర్శించగానే మనలను మనమే మరచిపోతూ ఉన్నప్పుడు ఇంక వేరే ఏమి చూడగలం? 'వారి' పరిచయం మాత్రం ఏమిటి? మూలాన్నే మరపించేదిగా ఉంటుంది. ఒక్కొక్కసారి 'వారు' మాకు పూర్తిగా సొంత ఇంటి మనిషిలాగా ఆప్యాయంగా కనబడేవారు. అప్పుడప్పుడు 'వారు' దివ్య వ్యక్తిత్వరూపంలో మా ఎదుట నిలబడగానే మాలో విస్మృతావస్థ వ్యాపించేది. **'వారి' దివ్యకృప వలన ఎప్పుడైతే నాలోని అన్ని బంధాలు తెగిపోయి, సృష్టి ప్రారంభంలోగల ఆ నిజస్థితి యొక్క స్పర్శను పొందానో అప్పుడే ఈ పుస్తకం వ్రాయటానికి నేను 'వారి' నుండి సాహసాన్ని ఋణంగా తీసుకోవటానికి సాహసం చేసాను.**

### వ్యావహారిక జీవనం

మన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క వ్యవహారిక జీవితానికి మరియు ఆధ్యాత్మిక జీవితానికి మధ్య ఎలాంటి భేదం లేదు. 'వారి' ప్రాపంచిక జీవితంలో మరియు దైనందిన చర్యల్లో నాకు ఎల్లప్పుడూ మహోన్నతమైన వ్యక్తిత్వం యొక్క దృఢత్వం మరియు మానవత్వం యొక్క ప్రకాశం కనబడేది. దూరదృష్టి విషయంలో ప్రపంచంలోని ఏ వ్యక్తి కూడా వారిని చేరుకోలేరు. షాజహాన్‌పూర్‌లో ఆశ్రమం నిర్మించడానికి అభ్యాసులు రకరకాల నమూనాలు తయారుచేసి పంపినపుడు, 'వారు' వాటనన్నింటిని చూసేవారు. కాని 'వారు' అన్నటువంటి మాటలు ఇప్పటికి నాకు జ్ఞాపకం ఉన్నాయి. "మన దగ్గర ధనం లేదు. ఈ విషయం అర్థం చేసుకోకుండా, ఆలోచించకుండా అభ్యాసీలు ఎందుకు ఈ నమూనాలు తయారు చేస్తున్నారు" అని అన్నారు. మరల వారు, "సాధ్యమైనంత ఎక్కువగా స్థలం తీసుకొని చుట్టూ పెద్ద ప్రహరీగోడ కట్టించి, అందులో వీలైనంత పెద్దదిగా ఒక్కటే గది నిర్మించాలి. మరల మిగతా ఖాళీ ప్రదేశంలో సంవత్సరమంతా వ్యవసాయంచేయగా వచ్చే ఆదాయం, రోజు రోజుకు పెరుగుతున్న సత్సంగీలకు భోజన వసతులు ఏర్పాటు చేయడానికి అయ్యే ఖర్చులకు ఉపయోగపడుతుంది. భవనం ఎంత పెద్దగా కట్టినప్పటికీ అది మనకు సరిపోదు. డేరాలు ఎలాగైనా వేయక తప్పదు. ఇంకొక విషయం ఏమిటంటే, ఎంతవరకైతే అభ్యాసీల మనస్సు ఆధ్యాత్మిక క్షేత్రంలో వికసించదో, అంతవరకు ప్రతి ఒక్కరు కూడా ఆ భవనంలోనే ఉండడానికి ఇష్టపడతారు. అసలు భవనమే లేనపుడు మనం కనీసం ఆ ఒక్క దురాశ నుండి

అయినా తప్పించుకొన్న వాళ్ళం అవుతాము. అంతేకాదు, 'వాళ్ళు భవనంలో ఉన్నారు, మేము బయట డేరాలలో ఉన్నాం' అనే అసూయ కూడా మనస్సులోనికి రావటానికి అవకాశమే ఉండదు" అని అన్నారు. ఇంతలో ఒకరు, "బాబూజీ! వీళ్ళంతా అభ్యాసులు కదా, ఎందుకు ఈ విధంగా ప్రవర్తిస్తారు" అని అడిగినపుడు, 'వారు' తమ సహజమైన సౌమ్య స్వరంతో, "ఎందుకంటే, ఒక్కసారిగా ఎవ్వరు కూడా మహాత్మునిగా మారలేరు. **నీవు చూస్తున్నదంతా కూడా అభ్యాసుల సముదాయం, కాని నిజమైన అభ్యాసీలను వ్రేళ్ళ మీద లెక్కించవచ్చు"** అని అన్నారు.

"ఆశ్రమంలో ఒక ఆసుపత్రి కూడా నిర్మించవచ్చును కదా!" అని ఎవరో ఒకతను సలహా నిచ్చినప్పుడు బాబూజీగారు ఈ విధంగా అన్నారు: **"నా సంస్థ ఆధ్యాత్మిక సంస్థ. కేవలం భగవంతునిలో ఐక్యం కావాలి – అనే ఆలోచనలు మాత్రమే ఇందులో ఉండాలి. ఎప్పుడైతే, ఎక్కడైతే ఇటువంటి బాహ్యవిషయాలు ఆశ్రమంలో ప్రవేశిస్తాయో, అప్పుడు అవి ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించు కుంటాయి. నెమ్మదిగా ఆధ్యాత్మికత అనేది అదృశ్యమవుతుంది"** అని అన్నారు. తాను స్థాపించిన ఆధ్యాత్మిక సంస్థ యొక్క పురోభివృద్ధి విషయంలో ఎంతటి దూరదృష్టి మరియు తన అభ్యాసుల యొక్క ఆత్మోన్నతిపట్ల 'వారు' ఎంత జాగ్రత్తగా ఉన్నారో, ఈ సంఘటన వలన మనకు తెలుస్తుంది.

**అభ్యాసుల మనస్సు సాక్షాత్కారం నుండి ఇతర విషయాలపట్ల ఏమాత్రం మరలకుండా 'వారు' అతిజాగ్రత్తగా మనలను గమనించే**

**వారు.** తొలిసారిగా బసంత్ పంచమి ఉత్సవం నిర్వహించటానికి చందాను వసూలు చేయాలనే ప్రస్తావన వచ్చినపుడు, 'వారు' చాలా బాధపడుతూ, "తల్లి తన పిల్లలను పోషించడానికి వాళ్ళ నుండి డబ్బులు అడగాలని మీరంతా కోరుతున్నారా?" అని అన్నారు. దీని గురించి చాలా వాదోపవాదాలు జరిగిన తర్వాత కూడా, దీనికి 'వారి' మనస్సు నుండి సమ్మతి లభించలేదు. **'వారి' జన్మదినోత్సవం, అంటే 30 ఏప్రియల్ తేదీన ఉత్సవాన్ని మనం జరుపుకోవాలి అనే ప్రశ్న ఎప్పుడు కూడా 'వారి' ముందు వచ్చేది కాదు. ఎందుకంటే, 'వారు' ఎప్పుడూ ఈ విధంగా అనేవారు "మన శ్రీరామచంద్రా మిషన్‌లో 'భండారా', మన సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ పవిత్ర జన్మ దినముననే జరుగుతుంది. వేరే ఇతర ఉత్సవాలు ఏవీ కూడా మన మిషన్‌లో జరుపుకోబడవు. లేకపోతే అభ్యాసులు ఏ ఉత్సవంలో పాల్గొందామా అని వాటి కోసం ఎదురుచూస్తూ, తమ ధ్యేయమైన సాక్షాత్కారాన్ని ప్రక్కకు నెట్టివేస్తారు" అని అనేవారు.**

అభ్యాసుల సుఖసౌకర్యాల గురించి 'వారు' ప్రతి విషయంలోను ఎంత శ్రద్ధ వహించేవారంటే, తమ సౌకర్యాలను గురించి అసలు పట్టించుకునేవారు కాదు. ఎప్పుడైతే విదేశాల నుండి అభ్యాసీ సోదరీ సోదరులు రావడం ప్రారంభించారో అపుడు 'వారు' కొన్ని నెలలపాటు పాలు త్రాగడం మానుకోవడం నేను గమనించాను. "బాబూజీ! ఈ మధ్య మీరు పాలు త్రాగడంలేదు" అని మేము ఒకసారి అడిగినపుడు **వారు,** "ఇప్పుడు ఎంతో దూరం నుండి విదేశీ అభ్యాసులు ఇక్కడకు వస్తూ ఉన్నారు. వాళ్ళకు బ్రెడ్, వెన్న తినడం అలవాటు. మనలాగా వాళ్ళు చపాతీలు, పప్పు తినలేరు

కదా!" అని మరల, "అయినా పాలంటే నాకంత పెద్దగా ఇష్టం లేదు. పాలు త్రాగనంత మాత్రాన నేనేమి బలహీనుడను కాను" అని అన్నారు. ఈ మాటలు వినగానే మాకు మనస్సులో చాలా బాధ కలిగింది.

ఇంతేకాదు, 'వారు' వారి పిల్లల చదువు, పాఠశాల ఫీజులు, దుస్తులు మొదలగు విషయాలలో చాలా శ్రద్ధగా వ్యవహరించేవారు. పాఠశాలలో ఫీజు కట్టవలసిన తేదీ, ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి పిల్లలకు క్రొత్త బట్టలు కొనడం మొదలగు విషయాలు 'వారు' ఎప్పుడు కూడా మరచిపోయే వారు కారు. పిల్లలు అనారోగ్యంగా ఉంటే, వెంటనే వైద్యం చేయించడం, కోర్టు నుండి ఇంటికి వచ్చేప్పుడు స్వయంగా వారే మందులు కొనడం, వారికి ఎప్పుడూ గుర్తుండేవి. ప్రతి చిన్న విషయాన్ని కూడా ఎంతగా గుర్తుపెట్టుకునేవారంటే, ఇంటిలో గోధుమ పిండి ఎప్పటివరకు సరిపోతుందనేది కూడా 'వారు' క్షుణ్ణంగా గుర్తుంచుకునేవారు. ఇంటిలో ఏ ఏ వస్తువులు అవసరమో వాటిని తమ కుమార్తెలను అడిగి తెలుసుకొనేవారు. యదార్థం ఏమిటంటే, దిన దిన ప్రవర్థమానమవుతున్న మిషన్ మరియు రోజు రోజుకు పెరుగుతున్న అభ్యాసుల యొక్క సేవలో వారి కుమార్తెలు మరియు పెద్దకోడలు ఎక్కువగా పాలుపంచుకునేవారు. ధనం సమృద్ధిగా ఉన్నప్పుడు సహాయం చేయువారు కూడా ఎక్కువగా ఉంటారు. కాని ఇంటిలో ధనం కొఱతగా ఉన్నటువంటి సమయంలో మనకు సహాయం చేయడమనేది గొప్పగా పొగడదగిన విషయం. 'వారి' కూతుళ్ళు మరియు కోడలు, "మాకు క్రొత్త బట్టలు కావాలి మరియు ఆ వస్తువు

కావాలి, ఈ వస్తువు కావాలి" అని ఎప్పుడూ కూడా వారిని కోరలేదు. 'వారు' తమ ఇష్టంతో ఏది తీసుకువస్తే దానిని వాళ్ళు ఎంతో సంతోషంతో స్వీకరించేవారు. **అభ్యాసుల సంఖ్య రోజు రోజుకు ఎక్కువ కావడం వలన పాలు, పండ్లు, నెయ్యి మొదలైనవి ఏవీ కూడా వాళ్ళకు మిగిలేవి కావు. ఆ విధంగా ఉన్నప్పటికీ వాళ్ళంతా కూడా సంతృప్తికరంగా, ప్రసన్నంగా ఉండేవారు. అభ్యాసులు అధిక సంఖ్యలో రావడంవలన వాళ్ళు ఎప్పుడూ కూడా ఇబ్బందిపడలేదు సరికదా వాళ్ళు ఎంతగానో సంతోషించేవాళ్ళు.**

శ్రీ బాబూజీగారు ఏ పని చేసినా, అందులో కృత్రిమత్వం, కఠినత్వం అనేవి లేశమాత్రం కూడా ఉండవు. 'వారు' చేసే ప్రతి పనిలోను సహజత్వం ఉట్టిపడేది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. అందులో ఇది ఒకటి. ఒకసారి 'వారి' ముదుసలి చాదస్తపు తల్లి వారిని పిలిచి, ఇంటిలో చిన్నపిల్లలు చేస్తూన్న బొమ్మల పెళ్ళిలోని బొమ్మలకు బొట్టుపెట్టమని అనగానే 'వారు' ఆ బొమ్మలకు బొట్టుపెట్టి, తరువాత వరండాలోకి వచ్చి కూర్చిలో కూర్చొని హుక్కా పీల్చుకో సాగారు. ఇది అంతా గమనించిన ఒక అభ్యాసీ సోదరుడు, "బాబూజీ! అప్పుడప్పుడు మీరు కూడా ఇటువంటి కష్టాలలో చిక్కు కుంటారన్న మాట. మేము కూడా స్నేహితులతోను లేదా బంధువు లతోను తప్పనిసరిగా గుడికి పోవాల్సి వచ్చినప్పుడు మాకు కూడా ఇదే విధంగా జరుగుతుంది. అపుడు ఇంకా ఏమి చేస్తాం? ఆ విగ్రహాన్ని మీరుగా భావించి పూజిస్తాము" అని అనగానే 'వారు' వెంటనే "దయచేసి నన్ను విగ్రహంలో బంధించకండి. ఎందుకంటే, **నా లాలాజీ సాహెబ్ నాకు పరిపూర్ణమైన స్వేచ్ఛను ప్రసాదించారు.**

**అందువలన నన్ను స్వేచ్ఛగానే ఉండనివ్వండి. ఇంకొక విషయం ఏమిటంటే, నా తల్లిగారి సంతోషం కొరకు విధిలేని పరిస్థితిలో నేను ఆ విధంగా చేయాల్సి వచ్చింది. అంతేకాని, ఆ సమయంలో నా చేతులు ఏమి చేసాయో, నా నేత్రాలకు తెలియదు. ఎందుకంటే, నా దృష్టి ఏనాడో మన లాలాజీ సాహెబ్ యొక్క దృష్టిలాగా మారి పోయింది" అని అన్నారు. ఈ విధంగా 'వారి' దినచర్య నుండి కూడా మనకు ఎంతో శిక్షణ లభించేది.**

శ్రీ బాబూజీ మహరాజ్‌ను గురించి 'వారి' గురుభాయీలు (అంటే శ్రీ లాలాజీగారి శిష్యులు) మరియు 'వారి' కుటుంబ సభ్యులు చెప్పే విషయాలు వింటుంటే మాకు చాలా సంతోషంగా అనిపించేది. 'వారు' ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల బాలునిగా ఉన్నప్పుడు, 'వారు' ఎవరైనా రోగి సమీపంలో ఉంటే చాలు, ఆ రోగి యొక్క బాధ స్వతహాగానే తగ్గిపోయేది. ఒకసారి 'వారి' పాఠశాల ప్రధానోపాధ్యాయునికి శరీరంలోని ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలగటంవలన బాధతో మూలుగుతూ ఉన్నారు. అపుడు బాబూజీగారి బాల్యమిత్రుడు ఒకతను, "మీరు అనుమతిస్తే రామచందర్‌ను పిలిపిస్తాను; మీ బాధ తగ్గిపోతుంది" అని ప్రధానోపాధ్యాయునితో అనగానే, వారు సందేహిస్తూనే అంగీకరించారు. ఆ బాలుడు రామచందర్‌ను పిలుచుకొని వచ్చాడు. నిజంగానే ప్రధానో పాధ్యాయుని బాధ తగ్గిపోయింది. అప్పటి నుండి వారికి బాలుడైన రామచందర్‌పట్ల ఎంతో ఆదర భావాలు కలిగాయి. "ఆ స్థితి ఆంతరంగిక లయావస్థ యొక్క దైవిక పరిణామం" అని నాకు ఇప్పుడు పదే పదే అనిపిస్తుంది. ఇటువంటి లయావస్థ యొక్క

స్థితికి నన్ను తీసుకువెళ్ళిన తర్వాత ‘వారు’ నాకు ఈ విధంగా వ్రాశారు: “బిటియా! నాకు చాలా సంతోషంగా ఉన్నది. ఎందుకంటే, ‘నా’ స్థితియే నీలో పునరావృతమవుతున్నది” అని వ్రాశారు. **“వారి బాల్యకాలం కూడా అత్యున్నతమైన లయావస్థ స్థితికి ఉదాహరణ”** అని తెలియగానే నేను ఆశ్చర్య సముద్రంలో మునిగిపోయాను. ఆ మహా వ్యక్తిత్వాన్ని గురించి మాటలు ఏ విధంగా వ్యక్తం చేయగలను?

**మృదువైన చిరునవ్వు:**

మన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క మృదు మధురమైన చిరునవ్వు కూడా దివ్య మందహాసమే. ఈ **దివ్యమైన చిరునవ్వుతో ‘వారు’ తమ ఇచ్ఛాశక్తి ద్వారా ఈశ్వరీయ ధారను ప్రవహింపజేసి, అభ్యాసుల హృదయాలలోని మాలిన్యాలను శుభ్రపరుస్తారు.** తమ దివ్య సంకల్పాన్ని నెరవేర్చటంలో ‘వారు’ ధృఢ సంకల్పులు. ఆధ్యాత్మికతకు సంబంధించిన ఆలోచనలు ఏమైనా ‘వారి’ మనస్సులో ఉత్పన్నంకాగానే, అవి వెనువెంటనే ‘వారి’ దివ్య శక్తి యొక్క సహాయాన్ని పొంది కార్యరూపం దాలుస్తాయి. **మన హృదయాలలో దివ్య శక్తిని నింపి, మనలను ‘సత్యపథ్’ వద్దకు తీసుకు వెళ్ళటానికే ఆ దివ్య పురుషుని యొక్క శుభాగమనం ఈ భూమిపై జరిగింది.** శ్రేష్టమైన ఆధ్యాత్మిక స్థితులనే వజ్రాలను, ముత్యాలను మానవ మాత్రుల ఉపయోగార్థం వెదజల్లటానికే అన్నట్లుగా ఆ రోజు ‘మాలిక్’ నన్ను ఆశీర్వదించి, నాకు రచనాశక్తిని ప్రసాదించారు. ఆ దివ్య దృశ్యం, ఆ పరమ ప్రియునిలో లయావస్థ పొందిన తరువాతనే మనం ఈ విధంగా చూడగలం.

**"దర్ద్ మానస్ కా ఛుపాయే లాల్ 'లాలా' కా ఖుదా యో।**
**మానో చిర విజయీ యోద్ధ, సృష్టి కా గహనా సజా జ్యో॥"**

**మొదటిసారి శ్రీ బాబూజీగారిని దర్శించగానే, శ్రీ లాలాజీ సాహెబ్ ద్వారా భూమి మీదకు తీసుకు రాబడిన దివ్య పురుషుడు వీరే అని నాకు అనిపించింది. తమ దివ్య శక్తితో సమస్త విశ్వంపై విజయం సాధించటానికే ఈ భూమి మీదకు వచ్చాను అని అన్నట్లుగా ఆ రోజు 'వారు' నా ఎదుట నిలిచారు. 'వారి' పవిత్రమైన భౌతిక రూపం ఎంతటి అపూర్వమైన సౌందర్యంతో ఉన్నదంటే, 'వారి' శుభాగమనం వలన సృష్టియే ఒక సుందరమైన ఆభరణం ధరించినదా! అన్నట్లుగా ఉన్నది.**

**నిజమే; 'వారు' ఈ సృష్టికే ఆభరణం వంటివారు;** 'భూమా' యొక్క శక్తి తీసుకొని ఈ భూమిపై అవతరించిన ఆ సహృదయుని యొక్క దివ్యరూపాన్ని వర్ణించటం ఎవరికైనా సాధ్యమా? ఎప్పటికీ కాదు. ఆధ్యాత్మికోన్నతి మార్గంలో అడ్డంకులుగా ఉన్న సంస్కారాలను తమ దివ్య ప్రాణాహుతి శక్తి ద్వారా ఛిన్నాభిన్నం చేస్తూ, మన హృదయంలో ఆ తియ్యని, దివ్యమైన చిరునవ్వుతో సమానమైన దివ్యానందం యొక్క అనుభవాలను నిరంతరం కలగజేస్తారు. 'వారి'కి 'వారే' సాటి. దీనికి దృఢమైన ప్రమాణం కూడా మన ఎదుటనే ఉన్నది. **సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ ఆ దివ్య పురుషుని భూమి మీదకు అవతరింపజేసిన తరువాత 'వారి' దర్శనం పొంది, వేరుగా ఉండలేక, 'వారి'లోనే తమను సంపూర్ణంగా 'విలీనం' చేసుకొన్నారు. దీని ఫలితంగా నేడు శ్రీ బాబూజీ మహరాజ్‌గారి సామీప్యంతోపాటుగా శ్రీ లాలాజీ మహరాజ్‌గారి యొక్క సామీప్యత**

**కూడా మనకు సదా లభిస్తూ ఉన్నది. దివ్యమైన చిరునవ్వుతో విలసిల్లుతున్న 'వారి' సుందర రూపాన్ని దర్శించు సౌభాగ్యం మనకు కలిగిన ప్రతిసారి, "ఈ పనిని నా లాలాజీ సాహెబ్‌గారే చేసారు" అనే మాటలు 'వారి' మధురమైన వాణి నుండి వెలువడటాన్ని మనం గమనిస్తాము.** దుఃఖంతో విలపిస్తూన్న భూమి యొక్క కొంగుకు 'చిరునవ్వు' అనే ముత్యాలను కట్టి, ఈ భూమిని సౌభాగ్యశీలిగా చేసిన ఘనత సమర్థ సద్గురు శ్రీ లాలాజీగారిదే. ఆ దివ్య పురుషుడు శ్రీ బాబూజీగారి యొక్క పవిత్ర ముఖారవిందం యొక్క చిరునవ్వు ఈ విశ్వానికే చిరునవ్వు వంటిది. ఎప్పుడైతే ఆ దివ్యమైన చిరునవ్వు 'వారి' దివ్యమైన మోముపై వెల్లివిరియగానే, అది విద్యుత్‌లాగా సమస్త విశ్వమంతా వ్యాపిస్తుంది. "కౌన్ థే వే?" అని అడిగితే మీరు ఏమైనా చెప్పగలరా? అన్నట్లుగా నాట్యం చేస్తూన్న ఆ మృదువైన చిరునవ్వు మనలను ప్రశ్నిస్తున్నట్లుగా ఉన్నది. మీరు జవాబు చెప్పలేకపోతే ఇది చదవండి.

తరచుగా 'వారి' చిరునవ్వు సంతోషంతో కూడిన కిలకిలా రావంగా మారుతుంది. శ్రీ బాబూజీగారు పకపకా నవ్వినప్పుడు ఈశ్వరీయ ప్రకాశం యొక్క దివ్యకాంతులు మనలో అణువణువు వ్యాపించటాన్ని నేను గమనించాను. స్వతహాగానే సంతోషంతో ఊయల లూగుతుంది, నాట్యం చేస్తుంది. ఎప్పుడైనా శ్రీ బాబూజీగారు కుర్చీలో కూర్చొని ఏవైనా విషయాలను గూర్చి మాట్లడుతూ, బాలునిలాగా చెయ్యెత్తి పకపకా నవ్వితే, విశ్వమే పకపకా నవ్వినట్లుగా ఉంటుంది. ఎప్పుడైనా 'వారు' కుర్చీలో కూర్చొని చిరునవ్వు నవ్వినప్పుడు విశ్వంలోని వాతావరణమంతా కూడా ఆధ్యాత్మిక

ధారతో శుభ్రం చేయబడినట్లుగా నాకు అనిపించేది. 'మాలిక్' యొక్క శూన్య నేత్రాలను నిశ్చలంగా చూస్తే మనలను మనమే మరచి పోతాము; కనీసం ఒక్క క్షణమైనా సరే, మనం మన 'ఉనికి'ని కోల్పోతాం. అంతేకాదు, మనం శూన్యంలో వ్యాప్తి చెందినట్లుగా అనిపిస్తుంది. ఈ కారణంవల్లనే 'శూన్యత్వం' యొక్క దివ్య దశను మనం జీవించి ఉండగానే పొందగలుగుతున్నాం అనే ఈ రహస్యం నాకు ఈరోజు అర్థమయ్యింది. ఎప్పుడైనా 'వారు' ఉదాసీనంగా కనబడినపుడు, ఈ ప్రపంచమంతా కూడా ఉదాసీనంగానే ఉన్నట్లు కనబడేది. ఆ సమయంలో నా మనస్సు దేనిమీద కూడా నిలిచేది కాదు.

"దయచేసి ఈ రోజు శ్రీ బాబూజీ మహరాజ్ గురించి మాకు కొద్దిగా చెప్పండి" అని మేము 'వారి' ఇంటికి వచ్చే 'వారి' గురుభాయీలను కోరటం నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నది. 'వారి' గురుభాయీలలో పండిట్ రామేశ్వర్ ప్రసాద్‌జీ మిశ్రా ముఖ్యమైన వారు. వీరు కూడా షాజహాన్‌పూర్‌లోనే నివసించేవారు. వీరు తరచుగా దుకాణం మూసివేసిన తర్వాత బాబూజీగారి ఇంటికి వచ్చేవారు. బాబూజీగారు తమ గురుభాయీలపట్ల అపారమైన ప్రేమ, ఆదరభావాలను చూపించేవారు. "రామేశ్వర్ భాయి నా కుడి భుజం వంటి వారు" అని 'వారు' తరచుగా అనేవారు. వాస్తవానికి రామేశ్వర్‌జీ మూర్తీభవించిన ప్రేమ స్వరూపానికి ఒక నిజమైన ఉదాహరణ. "వీరిద్దరు కూడా రామ-లక్ష్మణుల జంట" అని మా అమ్మగారు అంటూ ఉండేవారు. రామేశ్వర్ ప్రసాద్‌గారి అంతరంగం ఎల్లప్పుడు దైవీయ ప్రేమతో లీనమై ఉండటం వలన, దాని యొక్క

ప్రతిబింబం వారి యొక్క ప్రతి చర్యలోను బాహ్యంగా మనకు కనబడుతూ ఉండేది. వారి ముఖం ఈశ్వరీయ శక్తితో దేదీప్య మానంగా ఉండేది. నడుస్తూ ఉన్నప్పుడు ప్రేమ అనే మత్తులో ఉన్నారా అన్నట్లుగా వారి అడుగులు అటూ ఇటూ పడుతూ ఉండేవి. గంభీరమైన స్వరం మరియు ప్రతి పనిలో సన్మార్గం – ఇదే వారి నిజమైన స్వరూపం. “నా భాయీ సాహెబ్ ఎప్పుడూ నాకు ఏదో ఒక ఆధ్యాత్మిక స్థితిని ప్రసాదిస్తూనే ఉంటారు” అని రామేశ్వర్‌జీ మాకు ఒకసారి తెలిపారు. “రామేశ్వర్‌జీ! ఇపుడు నిన్ను ‘పారిషత్’ స్థితికి చేర్చనా!” అని ఒకసారి బాబూజీగారు అడిగినపుడు, “భాయీ సాహెబ్! మీ ఇష్టానుసారమే కానివ్వండి” అని రామేశ్వర్‌జీ జవాబు నిచ్చారు. **బాబూజీగారు తమ గురుభాయీలను గురుదేవుని యొక్క అమూల్యమైన సంపదగా భావించి, వారిని ప్రేమతో సంభాళిస్తూ, వారిని ఉన్నత స్థితుల్లోకి తీసుకువెళ్ళాలనే ఆలోచనలోనే ఎల్లవేళలా నిమగ్నమై ఉండేవారు.**

**దివ్య ప్రేమకు శ్రీ బాబూజీగారు ఒక ప్రతిరూపం.** ఒకసారి ఒక బ్రాహ్మణుడు బాబూజీగారివద్దకు వచ్చి సహజమార్గ సాధన గురించి అంతా విన్న తరువాత, “నీవు కాయుస్థునివై ఉండి ఇటువంటి ప్రచారం చేస్తున్నావా?” అని నిందించాడు. శ్రీ బాబూజీగారు జవాబు నివ్వకుండా మౌనంగా ఉన్నారు. కాని ఇది అంతా గమనించిన రామేశ్వర్‌జీ మాత్రం తన భాయీ సాహెబ్‌కు జరిగిన అవమానాన్ని భరించలేకుండా ఉన్నారు. “బాబూజీ! నేను బ్రాహ్మణుని కదా! వీరిని మా ఇంటికి తీసుకువెళ్ళతాను” అని ‘వారి’ అనుమతి తీసుకొని ఆ బ్రాహ్మణుని తన ఇంటికి తీసుకువెళ్ళారు.

అతిథి మర్యాదలన్నీ అయిన తరువాత, ఇపుడు నీకు సహజమార్గ సాధన యొక్క చమత్కారాన్ని చూపిస్తాను అని రామేశ్వర్‌జీ అనగానే ఆ బ్రాహ్మణుడు కళ్ళు మూసుకొని కూర్చున్నాడు. ఆ బ్రాహ్మణునికి నెమ్మదిగా శ్వాస ఆగిపోతున్నట్లుగా అనిపించింది. నాలుగు, ఐదు నిమిషాలు కాగానే "ఇంకా ఆపి వేయండి! లేకపోతే నా ప్రాణం పోతుంది" అని ఆ బ్రాహ్మణుడు అరచాడు. అప్పుడు రామేశ్వర్‌జీ, "సహజమార్గంలోని రామచందర్ శక్తి యొక్క గొప్పతనం ఇపుడు నీకు తెలిసినదా! **బ్రహ్మను గురించి తెలుసుకొన్న వాడే బ్రాహ్మణుడు. నీవు బ్రాహ్మణునివే కావు. ఒకవేళ నీవు బ్రాహ్మణునిగా మారాలని కోరుకుంటే రామచందర్‌జీ వద్దకు రావలసినదే" అని అన్నారు.** తన భాయీ సాహెబ్ ఇక్కడ ఏమి జరిగినదో అన్న బెంగతో ఉంటారని, రామేశ్వర్‌జీ ఆరోజు సాయంత్రమే 'వారి'వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పారు. అపుడు 'వారు' తమ సహజమైన శాంత స్వభావంతో, "రామేశ్వర్‌జీ! సహజమార్గంలోని ఈ శక్తిని గురించి మనం తెలపకూడదు. **సహజమార్గం భగవత్ సాక్షాత్కారం కోసం ఇవ్వబడిన మార్గం.** చమత్కారాలు చేయడానికి కాదు. సరే! ఇంకెప్పుడు ఈ విధంగా చేయవద్దు" అని అనగానే రామేశ్వర్‌జీ శాంతించారు.

శ్రీ లాలాజీ సాహెబ్‌పట్ల వారికి గల గురుభక్తి అద్వితీయ మైనది. **'వారు' మనలను ఆధ్యాత్మిక క్షేత్రంలో ఒక్కొక్క మెట్టు ఎక్కించి పైకి తీసుకువెళ్ళుతూ, తమ పవిత్ర ప్రాణాహుతి ద్వారా మన అంతరంగాన్ని శుభ్రపరచి, దైవీయ కృపతో నింపినప్పటికి కూడా, "ఇది అంతా మన లాలాజీ సాహెబ్ యొక్క కృప; 'వారు' ఎప్పుడు,**

**ఎవరికి, ఏమి ఇస్తారో ఎవరికి తెలుసు!" అను మాటలే సదా శ్రీ బాబూజీగారి నోటి నుండి వెలువడేవి.** వీరి రూపంలో శ్రీ లాలాజీ మహరాజ్ జీవించి ఉన్నారని నాకు అనుక్షణం అనిపించేది. మనం ఎవరినైతే బాబూజీ! అని పిలుస్తున్నామో, ఎవరినైతే బాబూజీ అని అనుకుంటున్నామో, వారు ఎవరు? ఎక్కడ ఉన్నారు? అనేది మనకు తెలియదు. ఎప్పుడైనా 'వారు' నిశ్శబ్దంగా, శూన్యంగా కూర్చుని ఉన్నప్పుడు నాకు ఈ విధంగా అనిపించేది – **ఇక్కడ నా బాబూజీ గారే కూర్చొని ఉన్నారు ('వారి' శరీరం మాత్రమే ఇక్కడ ఉంది) కాని 'వారు' ఎక్కడో, ఇతర లోకంలో ఉన్నట్లుగా అనిపించేది. నాకు ఇప్పటికి కూడా చాలా స్పష్టంగా జ్ఞాపకం ఉన్నది. ఆ సమయంలో బాబూజీ! అని మనం పిలిచినపుడు, 'వారు' మనలను చూసినపుడు నాకు ఈ విధంగా అనిపించేది– 'వారు' మన పిలుపును అసలు విననేలేదు అని. కాని 'వారి' శ్రవణేంద్రియం ఆ పిలుపును విని 'వారి' ముఖం మనవైపు మరల్చింది. ఎంత ఆశ్చర్యకరమైన దృశ్యం! అస్థిత్వ విహీనతకు గల మరో పేరు బాబూజీ!**

'వారు' తమ పనిలో చాలా కుశలత్వం కలవారు మరియు అదే సమయంలో 'వారు' పరమదాత కూడా. సహజమార్గం గురించి 'వారు' చాలా సరళంగా తెలిపేవారు. కాని సహజమార్గం చాలా సులువైనదని, ఇందులో అభ్యాసీ చేయవలసినది ఏమీ లేదని, 'వారు' ఎప్పుడూ కూడా స్వయంగా అనలేదు మరియు అభ్యాసులు ఆ విధంగా భావించునట్లు కూడా 'వారు' చేయలేదు. ఉదయం ఒక గంటసేపు ధ్యానం, సాయంత్రం ఇరవై నిమిషాలు క్లీనింగ్ (క్షాళన) మరియు రాత్రి నిద్రపోయే ముందు ప్రార్థన చేయాలని

'వారు' చెప్పేవారు. కాని ఏదైతే చివరి వాక్యం చెబుతారో, అది మనం వినడానికి చాలా సరళంగా ఉండి, అసలు మనం చేయవలసినది ఏమీ లేదన్నట్లుగా అనిపిస్తుంది. **"రోజంతా ధ్యానంలోనే మునిగి ఉండటానికి కృషిచేస్తే చాలా పురోభివృద్ధి ఉంటుంది" - అని అనేవారు. నిజానికి ఈ వాక్యమే మన సాధన అంతటికీ ప్రాణం. ఏ శబ్దంలో కూడా ఒత్తిడి కనబడదు. 'వారు' మాట్లాడే ప్రతిమాట కూడా ఎంతో సహజంగా, ఊరకనే మాట్లాడినట్లుగా ఉంటుంది. కాని ఈ పనిని తప్పక చేయాలనే ఒత్తిడి మాత్రం ఉండదు.**

'వారి' స్వరూపం ఎటువంటి ప్రేమకు నిదర్శనమో మనకు తెలియదు కాని, మన హృదయంలో మాత్రం అది ఇమడలేదు. మేము లఖింపూర్ నుండి షాజహాన్‌పూర్‌కు తరచుగా వెళ్ళేవాళ్ళం. మాతోపాటుగా మాస్టర్ ఈశ్వర్ సహాయ్‌జీ గారు మరియు బాబూ మురళీధర్ గారి కుటుంబాలు కూడా వచ్చేవి. రైలు రాత్రి పదకొండు గంటల ముప్పై నిమిషాలకు షాజహాన్‌పూర్ చేరుతుంది. ఆ పరమ పూజ్యులు అప్పటివరకు మాకోసం ఎదురుచూసి, ఆ తరువాత మా అందరితో కలిసి భోజనం చేయడానికి కూర్చునేవారు. వారికి ఏది ఇష్టమో నాకు తెలియదు. కాని, 'వారు' మాత్రం మా అమ్మతో, "అమ్మా! బంగాళదుంపలతో చేసిన ఈ వంటకాలంటే నాకు చాలా ఇష్టం. ఇటువంటి మిఠాయిలను ఒకసారి నేను మధురలోని ఒక దుకాణంలో తిన్నాను. మరల ఇప్పుడు తింటున్నాను" అని అనేవారు. మా అందరితో కలిసి 'వారు' భోజనం చేస్తూ ఉన్నప్పుడు ఇంత

గొప్ప దివ్య పురుషుడు మాతో కలిసి, మాలో ఒకరిగా ఈ విధంగా భోజనం చేస్తూ ఉన్నారని మాకు ఎప్పుడు కూడా అనిపించలేదు.

ఒకసారి షాజహాన్‌పూర్‌కు రైలు ఆలస్యంగా వెళ్ళడంవలన, మేమందరం రైలులోనే భోజనం చేసాం. ఆహారాన్ని మా అందరి మధ్యలో ఉంచి, అందులో నుండి తీసుకొని తిన్నాం. మేము షాజహాన్‌పూర్ చేరుకొని, బాబూజీ గారి ఇంటికి వెళ్ళగానే వారు, “నాకు ఆకలిగా ఉన్నది” అని అన్నారు. అప్పుడు ఏమి చేయాలో తోచక మేము నిశ్శబ్దంగా ఉన్నాం. “భాయీ! ఆహారం ఎంగిలి అయ్యింది. అందువలన దానిని మీకు ఇవ్వలేము'' అని మా అమ్మగారు అనగానే, ‘వారు’ ఎంతో సరళంగా, “అమ్మా! మీరు ఆహారం తిని ఎంగిలి చేసి, దానిని మళ్ళీ అందులో ఉంచలేదు కదా! చేతితోనే తీసుకొని తిన్నారు కదా!” అని అన్నారు. ఇంకేముంది ఎంగిలి అన్న భావాన్ని మరచి, మేము ‘వారి’కి అదే ఆహారాన్ని ఇచ్చాం.

షాజహాన్‌పూర్‌లో శ్రీ బాబూజీగారి ఇంటిలో మేము ఏ గదిలో నయితే ఉండేవాళ్ళమో, దానిని ‘వారు’ మా గది అనే చెప్పేవారు. ఆ పరమపూజ్యులు మాతో ఆ గదిలో కూర్చొని భుజించునపుడు మా అంతరంగం ఆనందంతో నిండిపోయేది. కాని ‘వారు’ చాలా గొప్పవారు, అలౌకికులు అనే విశేషణాలు ఎప్పుడూ కూడా మా మనస్సులోకి రాలేదు. అటువంటప్పుడు ఇక మాటలలో ఎలా వస్తాయి? ఈ రోజు నాకు తెలిసినది ఏమిటంటే, మనం ఎంత అయితే గ్రహించగలమో అంత మాత్రమే ‘వారు’ తమ యొక్క నిజ స్వరూపం గూర్చి మనకు విశదపరుస్తారు. కాని **‘వారు’ పూజకంటే**

**కూడా ఎక్కువగా మాకు ఎందుకు ఇష్టమయ్యారనేది మాకు మాత్రం తెలియదు.** శీతాకాలంలో రాత్రిళ్ళు 'వారు' మా గదిలోనే భోజనం చేసేవారు. భోజనమైన తర్వాత మా అమ్మగారు తన తమలపాకుల పెట్టె నుండి ఒక ఆకును తీసి 'వారి'కి ఇచ్చేవారు. ఆ తర్వాత 'వారు' చలి కాచుకొనే కుంపటిని దగ్గర ఉంచుకొని, నవ్వు పుట్టించే మాటలు చెప్పేవారు.

బసంత్ పంచమి ఉత్సవంలో అందరి భోజనాలు అయ్యిన తరువాతనే 'వారు' మా గదిలోకి భోజనం చేయడానికి వచ్చేవారు. ఒకసారి భోజనానికి చాలా ఆలస్యం అయ్యిందని బాబూజీగారిని పిలుచుకొని రమ్మని మా అమ్మగారు నన్ను పంపారు. నేను బయటకు వచ్చినపుడు, 'వారు' ఎంగిలి విస్తరాకులన్నీ ఏరి అన్నపు మెతుకులన్నింటిని ఊడ్చి బయట పారవేయడం చూసాను. ఈ సంగతి నేను మా అమ్మగారితో చెప్తూ ఉండగా 'వారు' కూడా నా వెనుకనే ఇంటిలోకి వచ్చారు. అపుడు మా అమ్మగారు నవ్వుతూ, "బాబూజీ! ఊడ్చేవాడు చేసే పనిని ఇపుడు మీరు ఎందుకు చేస్తున్నారు?" అని అడగ్గానే, వెంటనే 'వారు' నవ్వి, "లాలాజీ సాహెబ్ నన్ను ఊడ్చేవానిగానే తయారు చేశారమ్మా!" అని అన్నారు. 'వారు' చెప్పే మాటలను అప్పుడు మేము ఏమి అర్థం చేసుకొనే వాళ్ళం? కాని **'వారి' నోటి నుండి వెలువడిన ప్రతిమాట మాకు చాలా ఇష్టంగా అనిపించేది.**

శ్రీ బాబూజీగారు ప్రతి సంవత్సరం నవంబర్ 15వ తేదీ తరువాత, మాస్టర్ ఈశ్వర్ సహాయ్‌గారితో కలిసి దక్షిణ భారతదేశాన్ని సందర్శించి, తిరిగి షుమారు జనవరి 15వ తేదీ నాటికి ఇంటికి

చేరుకునేవారు. 'వారి' దక్షిణదేశ యాత్ర గుర్తుకువస్తేచాలు నా నేత్రాలు కన్నీటితో నిండిపోతాయి. ఎందుకంటే, 'వారు' పద్నాలుగు సంవత్సారాలపాటు రిజర్వేషన్ లేకుండానే, మూడవ తరగతి జనరల్ కంపార్ట్‌మెంట్‌లో దక్షిణదేశ యాత్ర చేసారు. యాత్రకు వెళ్ళేముందు తమ ఇంటిలోను మరియు ఈశ్వర్ సహాయ్‌జీ ఇంటిలోని ఆహార పదార్థాలు మొదలుకొని పిల్లల పాఠశాల ఫీజువరకు అన్ని ఏర్పాట్లు చేసిన తరువాతనే 'వారు' యాత్రకు బయలుదేరేవారు. మద్రాసు, రామేశ్వరం, ధనుష్కోటి మరియు సేలం మొదలగు ప్రాంతాలన్నీ తిరిగేవారు. యాత్ర నుండి ఇంటికి తిరిగివచ్చిన తరువాత నాతో ఈ విధంగా అనేవారు: "బిటియా! మేము స్టేషన్‌లో దిగగానే ఒక గుర్రపు బండిని అద్దెకు తీసుకొని చవుకగా దొరికే సత్రం కోసం వెదికేవాళ్ళం. గుర్రపు బండి సవారీ చాలా చవుక కాబట్టి మేము దాని మీదనే ప్రయాణం చేసేవాళ్ళం. మేమిద్దరం పొడుగ్గా ఉన్నాం. కాబట్టి గుర్రపు బండి వేగంగా వెళ్ళుతున్నపుడు ఒకసారి నా తల, ఒక్కొక్కసారి ఈశ్వర్ సహాయ్‌గారి తల గుర్రపు బండి పైభాగానికి తగిలేది. అపుడు తలను పట్టుకొని, దెబ్బ తగిలిన చోట నిమురుకుంటూ, మేము ఒకరినొకరిని చూసుకుంటూ నవ్వుకునే వాళ్ళం. డబ్బులు మిగల్చడానికి అప్పుడప్పుడు మేము కాలి నడకనే ప్రయాణం చేసే వాళ్ళం" అని అనేవారు.

ఢిల్లీ నుండి దక్షిణ భారతదేశానికి మొదటిసారిగా 'వారి'కి మూడవ తరగతిలో రిజర్వేషన్ చేయించినపుడు నేను ఒక విచిత్రమైన దృశ్యాన్ని చూసాను. ఒక క్రొత్త వస్తువు పొందినపుడు చిన్న పిల్లలలో ఎటువంటి కుతూహలం మరియు అమాయకత్వంతో కూడిన

సంతోషం కనపడుతుందో సరిగ్గా అదే కుతూహలం మరియు సంతోషంతో కూడుకొన్న అమాయకత్వం నాకు 'వారి' ముఖంలో కనబడింది. 'వారు' రైలు ఎక్కుతూ, దిగుతూ, "ఈశ్వర్ సహాయ్‌జీ! ఈ పూర్తి బెర్త్ అంతా నా కోసమేనా! ఇది మొత్తం నేను వాడుకోవచ్చా!" అని ఎంతో అమాయకంగా అడిగేవారు. ఆ దృశ్యాన్ని నేను వర్ణించలేను. 'వారి' ముఖంలో ఎంతటి కుతూహలం! ఎంతటి అమాయకత్వం! పవిత్రమైన 'వారి' అమాయకత్వం ముందు పసిపిల్లవాడు కూడా తప్పకుండా ఓడిపోతాడు.

శ్రీ బాబూజీ మహరాజ్ నన్ను ఒక అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థితికి తీసుకువెళ్ళిన తరువాత మాస్టర్ ఈశ్వర్ సహాయ్‌గారికి నా గురించి ఈ విధంగా లేఖ వ్రాశారు: "నా కుమార్తె విషయంలో నేను చేయాల్సింది అంతా చేశాను. ఇపుడు ఆమె సంబంధం సూటిగా 'భగవంతుని'తో ఏర్పరిచాను. అంతేకాదు. భగవంతునిలో ఆమెకు 'లయావస్థ'ను కూడా ప్రసాదించాను. ఇంతటితో నా కుమార్తెపట్ల నాకుగల ఆధ్యాత్మిక బాధ్యత సమాప్తమయ్యింది. కాని ప్రకృతి నియమానుసారం అటువంటి అత్యున్నతమైన స్థితి పొందినవారు కేవలం ఒక్కరు మాత్రమే జీవించి ఉండాలి. ఒకే సమయంలో ఇద్దరు వ్యక్తులు ఈ ప్రపంచంలో జీవించి ఉండటానికి వీలులేదు" అని వ్రాశారు. పూజ్యులైన శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు వెంటనే మా ఇంటికి వచ్చి నాకు ఆ లేఖ చదివి వినిపించారు. అది విన్న వెంటనే నేను మరియు నా తండ్రిగారు, శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారితోపాటుగా షాజహాన్‌పూర్‌కు ప్రయాణమయ్యాము. "ఓ బాబూజీ మహరాజ్! మీరు ఆధ్యాత్మికంగా నాకు ఏదైతే కానుక ప్రసాదించారో, అది

పూర్తిగా మీ చరణాలకే సమర్పిస్తున్నాను. నేను సంపూర్ణంగా మీ మీదనే ఆధారపడి జీవిస్తున్నాను. 'హే మాలిక్!' జీవిత పర్యంతం మీరు నాతోనే ఉండాలి!" అని నేను షాజహాన్‌పూర్ చేరేవరకు మనస్సులో దీనాతిదీనంగా ప్రార్థిస్తూనే ఉన్నాను. 'వారి'ని మరల దర్శించడానికి వెళ్ళుతూ ఉన్నప్పటికీ, మనస్సులో సంతోషానికి బదులుగా, వియోగం యొక్క బాధతో దుఃఖించాను. షాజహాన్‌పూర్ రాగానే 'వారి' ఇంటికి చేరుకొని, నా 'ప్రభువు' ఎదుట నిలబడి, "బాబూజీ! నాకు ఎటువంటి ఆధ్యాత్మిక పురోభివృద్ధి వద్దు. నాకు కేవలం 'మీరు' మాత్రమే కావాలి. ఈ స్థితులన్నింటిని మీరే తీసుకోండి" అని అన్నాను. ఈ మాటలు వినగానే స్వామి వివేకానంద మరియు పరమ ప్రియులైన సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ అత్యంత పరమానందభరితులై శ్రీ బాబూజీగారికి తమ ఆదేశాలు ఇచ్చారు. శ్రీ బాబూజీ మహరాజ్‌గారు వాటిని నాకు తెలిపారు. వాటిల్లో సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్‌గారు చెప్పినవి నాకు ఇంకా బాగా గుర్తున్నాయి. **శ్రీ లాలాజీ సాహెబ్‌గారు, "ఇతని (రామచందర్) మంచితనాన్ని ఎంతని పొగడగలం? పసిపిల్ల వానిలాగా ఏ మాత్రం కూడా మొహమాటం లేకుండా, నిస్వార్థంగా, తనకు ఏమీ కాదన్నట్లుగా తన ప్రాణాన్ని సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాడు" అని అన్నారు.** శ్రీ బాబూజీగారు ఆ మహాపురుషుల ఆదేశాల గురించి నాకు తెలిపినపుడు, "నా 'మాలిక్' యొక్క గొప్పతనం ఏమంటే, తను ప్రేమతో పెంచి, పెద్ద చేసిన తన బిడ్డకోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్దపడ్డాడు" అని నేను అనగానే వారు, "ఇక నీవు ఏమాత్రం దిగులు లేకుండా,

సంతోషంతో ఇంటికి వెళ్ళు" అని అన్నారు. బాబూజీగారిని గురించి లాలాజీ సాహెబ్ ఈ విధంగా కూడా అన్నారు: "ఇది నీ యొక్క మంచితనానికి ఒక చిన్న నిదర్శన మాత్రమే. నిన్ను ఎవరు అర్థం చేసుకుంటారు?"

ఒక అద్భుతమైన విషయం ఏమిటంటే, ఆ మహా మహాత్ముని సమక్షంలో జరిగే ఆధ్యాత్మిక సమావేశాలలో పాలుపంచుకునే పరమ సౌభాగ్యం 'వారి' అభ్యాసులందరికి సమానంగా ఇవ్వబడేది. ఎవరైనా తెలిసీ, తెలియని భాషలో మాట్లాడితే నవ్వుతూ, వాళ్ళకు జవాబు చెప్పేవారు. ఎవరైనా పాండిత్యంతో కూడిన ప్రశ్నలు వేస్తే ముసిముసి నవ్వులు నవ్వుతూ వాళ్ళకు కూడా సమాధానం చెప్పేవారు. ప్రశ్నలే తెలియని మనలాంటి వారిని 'వారు' చిరునవ్వుతో చూసేవారు. 'వారు' ఆ విధంగా చిరునవ్వుతో మనలను చూసినపుడు, మనం కూడా వారికి చెందినవాళ్ళమే అని అనిపిస్తుంది. ఒకసారి రాత్రి పన్నెండు గంటల సమయమయ్యింది. చర్చ చాలా జోరుగా జరుగుతున్నది. ఇంతకూ ప్రశ్న ఏమిటంటే, "ఆశ్రమం నిర్మాణానికి కేవలం రెండు రోజులవరకు సరిపడే డబ్బులు మాత్రమే ఉన్నాయి. ఆ తరువాత ఏం చేయాలి?" అనేదే సమస్య. ఆ పరమ పూజ్యులు మాత్రం ప్రశాంతంగా హుక్కా పీల్చుకొంటున్నారు. ఈ సమస్యకు ఎటువంటి పరిష్కారం కూడా కనబడలేదు. చివరకు అందరు నిశ్శబ్దంగా ఉన్నారు. అపుడు 'వారు' ఒక్కసారిగా హుక్కాను ప్రక్కకుపెట్టి, "ఏమవుతుంది? డబ్బులు లేకపోతే ఆశ్రమం పనిని ఆపివేస్తాము. ఆశ్రమం నిర్మించాలనే ఉత్సాహం లాలాజీ సాహెబ్ ఇచ్చారు కాబట్టి, వారే దీనిని పూర్తి చేయాలి" అని అన్నారు.

అంతటితో ఆ విషయం ఎక్కడ ఉన్నదో అక్కడే ఉండిపోయింది. ఆ మరుసటి రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు పోస్టుమాన్ రాగానే వారు, "భాయీ! మాకు ఏమైనా మనీ ఆర్డర్‌గాని, ఇంకేమైనా తెచ్చావా?" అని అడగ్గానే అతను, "బాబూజీ! మీకు ఒక రిజిష్టర్ కవర్ ఉన్నది" అని అనగానే 'వారు' కళ్ళజోడు పెట్టుకొని, కలం తీసికొని సంతకం చేసి, ఆ కవర్ తీసుకొని తెరచి చూసారు. అందులో యాభైవేల రూపాయల డ్రాఫ్ట్ ఉన్నది. 'వారు' పోస్టుమాన్‌కు ప్రసాదం, త్రాగటానికి చల్లని నీళ్ళు ఇచ్చి, తరువాత కుర్చీలో కూర్చొని, "చూశారా! మన లాలాజీ సాహెబ్ చివరకు ఈ ఆశ్రమం పనిని ఆగిపోకుండా చేసారు. ఎందుకో తెలుసా? ఒకవేళ ఈ పని ఆగిపోతే వెంటనే ఈ విషయం షాజహాన్‌పూర్‌లో అందరికి తెలుస్తుంది. ఆఖరికి బాబూజీ ఆశ్రమం పని కూడా ఆగిపోయిందని అందరు నవ్వుకుంటారు" అని అన్నారు. ఈ విధంగా జరగటాన్ని నేను ఎన్నోసార్లు గమనించాను. ఆ ప్రేమ యొక్క దృఢత్వం గూర్చి, 'వారు' ఈ ప్రకారంగా మనకు నేర్పిస్తూనే ఉండేవారు. **"ఎప్పుడైతే నీవు నీ సమస్య యొక్క బాధ నుండి విడిపోతావో, అప్పుడే నీ యొక్క బాధ స్వయంగా 'మాలిక్'కు అనుభవమవుతుంది. కాని దీనికి ఒక షరతు ఉన్నది. అది ఆంతరికమైన 'ప్రేమ బంధం' మాత్రమే" అని అనేవారు.**

నాకు ఇప్పటికీ ఆ రోజులు, ఆ రాత్రులు గుర్తుకు వస్తాయి. ఇక్కడ అంటే లఖింపూర్‌లో ఉన్న నాకు నిద్ర పట్టేది కాదు. ఎందుకంటే, ఆ నిద్ర కూడా శ్రీ బాబూజీగారి ధ్యానంలో లయ లీనం కావాలనే దృఢసంకల్పాన్ని ఏర్పరచుకొన్నది. మనందరి కోసం

'వారు' దైవీయ జాగృతి సందేశాన్ని తీసుకువచ్చారని ఆ నిద్ర కూడా తెలుసుకొన్నది. అటువంటప్పుడు నిద్ర ఏ విధంగా వస్తుంది? అక్కడ అంటే షాజహాన్‌పూర్‌లో నా బాబూజీ మహరాజ్, దివ్య పురుషులు తమ అభ్యాసులపట్లగల ప్రేమతో, వాళ్ళ ఆధ్యాత్మికోన్నతి కోసం తమ విశ్రాంతిని పణంగా ఉంచారని  అనిపిస్తుంది. ఇక్కడ రాత్రి 12 గంటల 40 నిమిషాలకు నేను 'వారు' ప్రసాదించిన స్థితిని గురించి లేఖలో విపులంగా వ్రాయడానికి ప్రయత్నం చేస్తూ ఉన్నప్పుడు, అక్కడ పరమ పూజ్యులైన శ్రీ బాబూజీగారు తమ కుమార్తె వ్రాసిన స్థితులను గురించి వివరిస్తూ, నా ఉత్తరం వారికి చేరడాని కంటే ముందుగానే 'వారు' జవాబు వ్రాసి ఉంచేవారు.

లఖింపూర్‌లో ఒకరోజు రాత్రి మూడు గంటలకు ఉన్నట్లు ఉండి నాకు మెలకువ వచ్చింది. మెలకువ రాగానే నేను నా ఆంతరిక దశను గురించి వారికి లేఖ వ్రాయడానికి ఉపక్రమించాను. నాకు కలిగిన ఇతర అనుభవాలతోపాటుగా ఈ అనుభవాన్ని కూడా, "అగ్ని వంటిది ఏదో ఉప్పొంగి, అది నాలో అంతటా వ్యాప్తి చెందినది" అని వ్రాసాను. అక్కడ షాజహాన్‌పూర్‌లో శ్రీ బాబూజీగారు సరిగ్గా అదే తేదీ, అదే రోజు రాత్రి మూడు గంటలకు నారాయణ్ దత్ అనే అభ్యాసీతో ఒక లేఖను నాకు ఈ విధంగా వ్రాయించారు: "ఇప్పుడు రాత్రి మూడు గంటల సమయం అయ్యింది. నీలో 'అగ్ని' బిందువు తెరవబడటాన్ని నేను అనుకోకుండా గమనించాను. అగ్ని వంటి ప్రకాశం నీలో అంతటా వ్యాపించి ఉన్నది" అని వ్రాసారు. కాని దీని తరువాత 'వారు' వ్రాసిన వాక్యాన్ని వింటే చాలు, నేత్రాలు కన్నీటితో నిండిపోతాయి. నేటికి కూడా 'వారి' దివ్యప్రేమ యొక్క

అనుభూతి, స్మరణకు రాగానే "వారు ఎవరు? (కౌన్ థే వే?)" అని మరల ఒకసారి ఎవరో నన్ను ప్రశ్నించినట్లుగా ఉంటుంది. కాని ఈ ప్రశ్నకు నా దగ్గర ఎటువంటి జవాబు లేదు. ఆ దివ్యానుభూతితో నేత్రాలే కాదు, నా హృదయమే సంపూర్ణంగా ద్రవించిపోయింది. "బిటియా! నాకు కొద్దిగా దిగులుగా ఉన్నది. నీకు ఎక్కడైనా బాధ కలగలేదు కదా! ఏదైనా నరం మీద ఒత్తిడి అనిపించలేదు కదా!" అని 'వారు' నాకు వ్రాసారు. నారాయణ్ దత్‌తో ఆ ఉత్తరాన్ని నాకు పంపారు. పవిత్రమైన ప్రేమ వర్షంలో తడిసిన ఆ ఉత్తరం చదివినకొద్ది నా హృదయం ద్రవించిపోయి, నా సంపూర్ణ హృదయమే నేత్రంగా మారింది; ఎదురుగా సాక్షాత్తు శ్రీ బాబూజీగారే నిలబడి ఉన్నారా! అని అనిపించింది. ఈరోజున ఒక రహస్యం నాకు స్పష్టంగా తెలిసినది ఏమిటంటే, సద్గురువు తమ దైవిక సందేశాన్ని ఈ విధంగా మన అంతరంగంలో జాగృతం గావించినపుడు భౌతికమైనటువంటి ఆకలి-దప్పిక, మేల్కొనడం-నిద్రించడం మొదలగు విషయా లన్నింటిని మనం మరచిపోతాము.

మన తెలివితక్కువ కోరికలు 'వారి'ని ఎటువంటి కష్టాలకు గురిచేస్తాయో ఇపుడు నేను చెప్పేది వినండి. కాని అటువంటి మన తెలివితక్కువ కోరికలను కూడా నెరవేర్చడంలో ఆ పరమప్రియులు ఎటువంటి ఉపాయాలను ఆలోచించి చేస్తారో ఇపుడు చూద్దాం. దీనిని వర్ణించడమనేది అసంభవమైన విషయం. కాని ఈ రోజు 'వారు' ఈ విషయాలన్నింటిని నాతో వ్రాయించాలని కోరుతూ ఉన్నప్పుడు నేను ఊరకనే ఎలా కూర్చోగలను! ఆ సంగతి నాకు బాగా జ్ఞాపకం ఉన్నది. శ్రీ బాబూజీగారు దయతో నన్ను 'యూ-2'

అనే బిందువువద్దకు చేర్చి, ఆ బిందువు నుండి నా యాత్ర ప్రారంభింపజేసారు. కాని ఆ బిందువువద్దగల పరమానంద స్థితిలో నా అంతర్ మనస్సు ఏ విధంగా మునిగిపోయిందంటే, ఆ పరమానందం నుండి ఒక్క క్షణం కూడా బయటకు రావటానికి ఇష్టం లేదు. 'వారు' ఆ బిందువువద్ద నా యాత్ర పూర్తి చేయించి 'వి–2' అనే బిందువు వద్దకు తీసుకుపోవాలనే తొందరలో ఉన్నారు. అపుడు ఆ పరమానంద స్థితి నా నుండి దూరమవుతన్నట్లుగా అనిపించింది. వెంటనే బాబూజీగారికి నేను ఈ విధంగా లేఖను వ్రాసాను: "బాబూజీ! ప్రతి స్థితిలో మీరు నన్ను రెండు, మూడు రోజులకంటె ఎక్కువగా ఉంచడంలేదు. మీకు మనుమరాలు పుట్టిన ఈ సంతోషంలోనైన దయచేసి నన్ను ఈ పరమానంద స్థితి నుండి అప్పుడే తొలగించవద్దు" అని వ్రాసాను. తిరుగు టపాలో వారి జవాబు రానే వచ్చింది. – "నాకు మనుమరాలు పుట్టినదన్న వార్తను మొదట నీవే తెలిపావు. ఎందుకంటే, నాకు ఆ విధంగా అనిపించనే లేదు. అందువలన నాకు మనుమరాలు పుట్టినదన్న విషయాన్నే నేను మరచిపోతున్నాను. ఇది మొదటి విషయం. ఇంక రెండవది నీ కోరిక ప్రకారమే, నిన్ను ఆ పరమానంద స్థితిలో మరికొన్ని రోజులు ఉంచుతాను. కాని దీని వలన నేను చాలా కష్టంలో పడ్డాను. ఎందుకంటే, పిల్లలను ఎప్పుడు కూడా ఇంకా ముందుకు తీసుకుపోవాలని శిక్షకుని ధర్మం చెప్పుతుంది. అదే విధంగా నా బాధ్యతను నిర్వర్తించాను. కాని నీ ఈ చిన్న కోరికను కూడా నా హృదయం కాదనలేకపోతున్నది" అని ఇంకా ఈ విధంగా వ్రాసారు: "మన లాలాజీ సాహెబ్ ఎంత దయామయులో చూడు! నీ ఈ

చిన్న కోరికను నెరవేర్చే విధానాన్ని కూడా 'వారు' నాకు తెలిపారు" అని వ్రాసారు. ఇంతేకాదు, నాకు నేర్పించడానికి అన్నట్లుగా 'వారు' ఆ విధానాన్ని కూడా వివరించారు. "నీ మనస్సు యొక్క ఊర్ధ్వముఖ గమనాన్ని నేను 'యూ-2' బిందువు యొక్క స్థితి నుండి తీసి 'వి-2' స్థితిలో ఉంచాను. మనస్సు యొక్క అథోముఖ వృత్తిని ఊర్ధ్వముఖం వైపుకు మరల్చి, దానికి 'యూ-2' స్థితి యొక్క స్పర్శను కూడా ఇచ్చాను" అని వ్రాసారు. ఇప్పుడు మీరే చెప్పండి. "వారు ఎవరు? (కౌన్ థే వే?)" అని అడిగితే ఎవరు చెప్పగలరు. 'వారి' ప్రేమ మహత్యంలో మునిగి మనలను మనం మరచిపోతాం. 'వారి' యొక్క సామర్థ్యం, కార్యదీక్ష, అభ్యాసుల పురోభివృద్ధి కోసం అనుక్షణం వ్యాకులపడే 'వారి' మనస్సును చూసి, మన మనస్సు స్వయంగా తన అస్థిత్వం ఎప్పుడూ కోల్పోతూనే ఉంటుంది. కాని 'వారి'వద్ద నుండి ఉత్తరం రాకముందే నేను నా తప్పును గ్రహించి, వెంటనే వారికి ఇంకొంక ఉత్తరంలో - "బాబూజీ, నా వలన పొరపాటు జరిగిపోయింది. మీ పాదాలు చుట్టుకొని ఉన్న మీ ఈ కుమార్తెను ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడికైనా సరే, మీ ఇష్టప్రకారమే తీసుకు వెళ్ళగలరని ప్రార్థిస్తూ ఉన్నాను'' అని వ్రాసాను. విశ్వాన్నే గౌరవాన్వితం చేసే ఆ మహా, దివ్య పురుషుడు, తమ అమోఘమైన సంకల్ప శక్తితో ప్రాణులందరి ప్రాణాలలో దివ్య ప్రకాశం యొక్క దీపం వెలిగించి, వాళ్ళ అణువణువును పవిత్రం మరియు ఉజ్జ్వలం చేయగలరని, మనందరికి 'వారి' పవిత్ర చరణాలను ఆసరాగా నిచ్చి, ఎల్లప్పుడు సూర్యునిలాగా ప్రకాశించాలని 'వారి'ని ప్రార్థిస్తున్నాను.

శ్రద్ధతో కూడిన ఇటువంటి పుష్పాలే ఆ పరమ ప్రియుని చరణద్వయానికి సదా సమర్పించబడతాయి.

'వారి' యొక్క అలౌకికమైన మరియు దైవిక కార్య సామర్థ్యంతో పాటుగా దైవికమైన దూరదృష్టి కూడా వందనీయమైనది. 'వారి' పర్యవేక్షణతో ఇమిడిపోయిన మనలను 'వారు' ప్రతిక్షణం, ప్రతి స్థితిలో ఏ విధంగా కాపాడుతున్నారనేది అభ్యాసులమైన మనం అప్పుడప్పుడు ఆశ్చర్యపడటాన్ని నేను చాలాసార్లు గమనించాను. అందువలన ఆ పరమ పూజ్యులు మనలను జ్ఞాపకం చేసుకొన్నప్పుడు, మనం 'వారి' సన్నిధిలో హాజరవడానికిగాను, మనం మరింత మెలకువగా ఉండాల్సి ఉన్నది.

ఒకసారి నాకు సిట్టింగ్ (పూజ) ఇచ్చిన తరువాత గౌరవనీయులైన శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు శ్రీ బాబూజీగారికి ఈ విధంగా ఒక లేఖ వ్రాసారు: "నాకు కస్తూరీ లోపల కొద్దిగా చీకటిలాగా కనబడినది. కాని ఎంత ప్రయత్నించినప్పటికీ దానిని శుభ్రం చేయలేకపోయాను. హుజూర్! దీనిని నేను ఏ విధంగా తీసివేయగలనో మీరే తెలపగలరు" అని. ఈశ్వర్ సహాయ్‌గారు ఈ విషయాన్ని నాకు తెలపగానే, "నేను ఏమి తప్పు చేసాను? నాలో ఈ చీకటి ఎందుకు ఏర్పడినది?" అని నేను చాలా దుఃఖించాను. ఈశ్వర్ సహాయ్‌గారి ఉత్తరం బాబూజీగారికి చేరక ముందే నాలోని చీకటి మాయమైపోవాలని నేను బాబూజీగారిని ప్రార్థించాను. కాని అతిశీఘ్రంగానే 'వారి' నుండి ఈశ్వర్ సహాయ్‌జీకి జవాబు వచ్చింది. ఆ ఉత్తరం చదువగానే మనస్సు సంతోషంతో

నిండిపోయింది. హృదయం 'వారి' పవిత్ర చరణారవిందాలకు మరింత గాఢంగా చుట్టుకొనిపోయింది. 'వారు' ఈ విధంగా వ్రాసారు: "నేను ఈశ్వర్ సహాయ్‌జీకి గల ఎదుటివారి ఆధ్యాత్మిక స్థితిని గమనించు సామర్థ్యం చాలా మెచ్చుకుంటున్నాను. నిజానికి ఏదైతే చాలా కఠినమైనదో అటువంటి సూక్ష్మ స్థితిని కూడా వారు తెలుసుకో గలిగారు. కాని వారు ఒక చిన్న పొరపాటు చేసారు. వారు ఏదైతే చీకటి అని భావించారో వాస్తవానికి అది సత్‌పదార్థం యొక్క 'రంగు'. నిజానికి అది చీకటి కాదు, వెలుగు కాదు. అక్కడ ఉన్న దానిని అర్థం చేసుకోలేనివారు చీకటి అని అంటారు. నేను ఈశ్వర్ సహాయ్‌జీకి గల గమనించగల శక్తిని ఇంకా పదును గావిస్తాను" అని క్రింద సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ ఆశీస్సులతో నిండిన కొన్ని ముఖ్యమైన వాక్యాలను వ్రాసారు. "బిటియాతో చెప్పండి. భగవంతుడు తలచుకుంటే ఆమె తప్పకుండా ఆధ్యాత్మికత యొక్క శిఖరాన్ని చేరుకోగలదు. శ్రీ లాలాజీ సాహెబ్ కూడా తథాస్తు అని అన్నారు" అని ఇంకా ఈ విధంగా, "నాకు చాలా సంతోషంగా ఉన్నది. ఎందుకంటే, నా స్థితియే ఆమెలో పునరావృత మవుతున్నది. ఆ అంతిమసత్యం యొక్క చివరి దశను కూడా చేరుకోవడానికి కావలసిన శక్తి, ధైర్యాన్ని శ్రీ లాలాజీ సాహెబ్ ఆమెకు ప్రసాదించు గాక!" అని వ్రాసారు.

"భాయీ! నా ఇన్‌స్పెక్టర్ సాహెబ్‌ను (సోదరి కస్తూరి) పిలవండి" అన్న శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క మధుర స్వరం నా కర్ణకుహరాలలో పడగానే ఎంత బాగుంటుందో! చిన్న చిన్న అభ్యాసులను కూడా 'వారు' ఎంతో గౌరవించేవారు. 'వారి'

సమక్షంలో హాజరయ్యి నాలో నేను ఒదిగిపోయి, "బాబూజీ! మీరు నన్ను పిలిచారా?" అని అడగ్గానే 'వారు' నవ్వుతూ, ఒక భిక్షగత్తెను కూడా స్వాగతం పలుకుతున్నట్లుగా, "అవును. భాయీ! మేము ప్రిసెప్టర్‌ను తయారుచేయాలన్నా, ఎవరికైనా ఇనీషియేషన్ ఇవ్వాలన్నా, మాకు మా ఇన్‌స్పెక్టర్ యొక్క అవసరం తప్పకుండా ఉంటుంది" అని అనేవారు. ఈరోజు ఒక విషయం నాలోని స్మృతులను కుదిపి ఒక రహస్యాన్ని స్పష్టం చేస్తూన్నది. అది ఏమిటంటే, "నన్ను గుర్తు పెట్టుకోండి" అనే మాట ఎప్పుడూ కూడా 'వారి' నోటి నుండి రాలేదు. ఎందుకంటే, 'వారు' మనలను పిలుచుకొని, లక్ష్యంవద్దకు తీసుకుపోవడానికే వచ్చారు. ఇన్‌స్పెక్టర్ అనే పేరుతో 'వారు' నన్ను ఎంత ప్రసిద్ధి గావించారంటే, దక్షిణ భారతదేశం నుండి వచ్చేవారిని మరియు విదేశీ సోదర సోదరీ మణులను నావద్దకు పంపి, వాళ్ళ ఆంతరిక స్థితిని గురించి వ్రాయమని కోరేవారు. మరల నేను వ్రాసిన దానికి జవాబుగా వారు, "వాళ్ళ స్థితులను గురించి నీవు వ్రాసిన తరువాతనే నా మనస్సు కుదుటపడింది" అని వ్రాసేవారు. ఈ పుస్తకం వ్రాస్తూ ఉన్నప్పుడు ఏఏ మధుర స్మృతులు గుర్తుకు వచ్చాయో వెనువెంటనే ఆ సమయంలోని నా ఆధ్యాత్మిక స్థితి కూడా నా ఎదుట ప్రత్యక్షం కావటం నేటికి కూడా నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం కూడా సత్యస్వరూపంగానే వ్రాయాలని 'వారు' కాంక్షిస్తూ ఉన్నారని దీని వలన తెలుస్తుంది. సోదరులు వరదాచారిగారు కాని, పార్థసారథి రాజగోపాలాచారిగారు కాని, ఎక్కడైనా సరే, నేను నా సోదరులతో ఉన్నప్పుడు వాళ్ళు నన్ను తమతోనే ఉంచుకొనే వాళ్ళు. నన్ను తమతోపాటుగా వాహనంలో

షాజహాన్‌పూర్ తీసుకువచ్చి స్వయంగా వాళ్ళు శ్రీ బాబూజీ మహరాజ్‌ను కలుసుకునేంతవరకు కూడా నన్ను వాళ్ళతోనే ఉంచుకొనే వాళ్ళు.

ఒకసారి కొంతమంది అభ్యాసులు శ్రీ బాబూజీగారి వద్ద కూర్చొని, 'వారు' ఎప్పుడు ఏమి చెబుతారోనని మరల మరల 'వారి' పావన ముఖారవిందంవైపు చూస్తూ కూర్చున్నారు. ఇంతలో ఒక అభ్యాసీ సోదరుడు, "బాబూజీ! మీరు ఎంతో కష్టపడి మమ్మల్ని ఆధ్యాత్మిక క్షేత్రంలోకి తీసుకుపోతున్నారు. మమ్మల్ని ఎక్కడికి చేర్చాలో అక్కడికి ఒక్కసారిగా చేర్చవచ్చును కదా!" అని అడిగాడు. ఆ మహాపురుషుని సమక్షంలో ఈ యాచన చాలా సాధారణమైనది. కాని 'వారి' జవాబు మాత్రం అసాధారణమైనది. ఆ పరమ ప్రియులు ఈ విధంగా జవాబు నిచ్చారు: "అవును; నీవు చెప్పేది నిజమే. నాకూ కష్టం తప్పుతుంది. నీకూ సమయం కలిసివస్తుంది. కాని ఇందులో రెండు విషయాల గురించి నాకు భయం ఉన్నది. మొదటిది, ఆ 'అంతిమసత్యం' యొక్క స్థితి మీకు ముందుగానే ఇస్తే, దానిని స్వీకరించడానికి బదులు మీరు దాని నుండి చాలా దూరంగా పారిపోతారు. ఎందుకంటే, ఆ 'అంతిమసత్యం' యొక్క స్థితిలో ఎటువంటి ఆనందం ఉండదు. ఆ స్థితిని 'ఉప్పదనం లేనటువంటి ఉప్పు'గా వర్ణించ వచ్చు. ఇక రెండవది, **నా శక్తి భరించగలగటం అనేది అసంభవమైన విషయం. ఎందుకంటే, ఈ శక్తి గురించి స్వయంగా నాకే తెలియదు. నేను ఏమిటో నాకే తెలియని విధంగా లాలాజీ సాహెబ్ నన్ను తయారుచేసారు.** కాని ఒక్కటి మాత్రం నిజం. ఆ అంతిమసత్యం యొక్క స్థితిని ఒక్కసారిగా ఇచ్చినట్లయితే

దానిని ఏ భౌతిక శరీరం కూడా ఓర్చుకోలేదు. మరణమే దాని ఫలితం" అని అన్నారు. ప్రియమైన అభ్యాసులారా! ఇపుడు మనం ఎక్కడ ఉన్నాము? అనే విషయాన్ని మీరే చెప్పండి. శ్రీ బాబూజీగారి శక్తి యొక్క ఒక్క బిందువు కూడా పూర్ణరూపములో త్రాగ గలిగిన సామర్థ్యం మనకు లేదు. వాస్తవానికి మనం ఎంత పురోభివృద్ధి సాధించినప్పటికీ, ఎంత అత్యున్నతమైన స్థితి పొందినప్పటికీ ఈ రోజుకు కూడా 'వారి' శక్తి సామర్థ్యాలముందు, కార్యదీక్ష ముందు మనం ఏ మాత్రం కూడా పనికిరాము అనేది యదార్థం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, 'వారి' దివ్య పాదపద్మాలను కడిగినటువంటి పవిత్ర జలంతో కూడా మనం సరితూగలేము.

మనం ఎంత తెలివితక్కువ ప్రశ్నలు వేసినప్పటికీ, ఎవ్వరిని నిరాశపరచకుండా, ఏ మాత్రం నొప్పించకుండా 'వారు' జవాబు చెప్పేవారు. ఒకసారి ఒక ప్రిసెప్టర్ తన ఎదుటి వారి స్థితిని గమనించు శక్తిని అధికం చేయవలసినదిగా ప్రార్థించినపుడు వారు, "నీ హృదయం అద్దంలాగా మార్చుకో. అపుడు ఎదుటివారి హృదయం ఏ విధంగా ఉంటే, ప్రతిబింబం కూడా అదే విధంగా ఉంటుంది. అపుడు నీవు గమనింపవలసిన పని లేకుండానే ఎదుటివారి స్థితిని గమనించగలవు" అని అన్నారు. ఈ జవాబును మించినటువంటి జవాబు ఇంకొకటి ఏముంటుంది! ఆ ప్రిసెప్టర్ మరల మాట్లాడలేదు. "బాబూజీ! మా స్థితిని మేము ఏ విధంగా తెలుసుకోగలం?" అని ఒక అభ్యాసీ అడిగినపుడు వారు, "హృదయంలో ఉన్న 'మాలిక్'ను నిరంతరం చూస్తూ ఉంటే, స్వయంగా ఆ స్థితియే మాట్లాడు తుంది" అని అన్నారు. ఈ సూత్రాలను గురించి అప్పుడు మేము ఎంతవరకు

అర్థం చేసుకోగలిగాము? ఈ రోజు అవి ఒక్కొక్కటి తనను తాను తెలియజేసుకుంటున్నట్లు నా ఎదుట ప్రత్యక్షమైనకొద్దీ అర్థమవుతున్నాయి.

మన మందరం కూడా శ్రీ బాబూజీగారి బిడ్డలం అనే భావన 'వారి'ని చూడగానే మనలో ఏర్పడుతుంది. దక్షిణ దేశయాత్రలో అభ్యాసులు ఖరీదైన గులాబీ పూలమాలతో 'వారి'కి స్వాగతం పలికేవారు. కాని ఇది 'వారి'కి ఎంతమాత్రం ఇష్టం లేదు. వారు, "భాయీ! అనవసరంగా ఇంత డబ్బును ఖర్చుచేయడం దేనికి? నేను ఖర్చుపెట్టినా, మీరు ఖర్చుపెట్టినా డబ్బులు ఒకటే కదా! సరే; ఈ విధంగా చేయండి – ఈ గులాబీలను స్త్రీ లందరికి పంచితే వాళ్ళకు కనీసం రెండు రోజుల పువ్వుల ఖర్చులు మిగులుతాయి. ఒకవేళ వాళ్ళు ఇవి మలినమైన పువ్వులు అని అంటారేమో, కాని ఇవి నా శరీరాన్ని స్పృశించనేలేదు. ఎందుకంటే, ఇవి జరీకాగితం లోపల బంధించబడి ఉన్నాయి. నేను కనీసం వీటి సువాసన కూడా చూడలేదు. ఈ గులాబీలను మాలనుండి విడదీసి అందరికి పంచిపెట్టండి" అని అనేవారు. 'వారు' తమ నోటితో ఏమీ చెప్పకుండానే మనలో 'సోదర భావం' పెంపొందింపజేసేవారు. ఈ సోదరభావం ఎంత అభివృద్ధి అయ్యిందంటే విదేశాల నుండి వచ్చిన అభ్యాసీలు మమ్మల్ని 'విదేశీ అభ్యాసీలు' అని పిలువవద్దని కోరేవారు.

ఒక్కొక్కసారి ఎటువంటి ఆశ్చర్యకరమైన సంఘటనలు జరుగుతాయంటే, అవి మన ఆలోచనా శక్తికి అతీతంగా ఉంటాయి. కాని ఆ సంఘటనలతో మన హృదయం 'వారి' దివ్యచరణాలవద్ద,

మరింత వినమ్రతతో ఒదిగి పోతుంది. ఒకసారి 'వారి' ఇంటిలో 'బసంత్ పంచమి' ఉత్సవం జరిగినపుడు, అభ్యాసులందరు బయట మైదానంలో మధ్యాహ్న భోజనం చేస్తూ ఉన్నారు. రెండవ పంక్తి అయ్యింది. మూడవ పంక్తిలో అందరు భోజనానికి సిద్ధంగా కూర్చుని ఉన్నారు. కాని అప్పటికే పప్పు ఇంచుమించుగా పూర్తయి పోయింది. ఈ సంగతి ఎవ్వరికి చెప్పకుండా మేము నిశ్శబ్దంగా ఉన్నాం. ఇంతలో 'వారు' గుమ్మంవద్దకు వచ్చి, "పప్పు అయిపోయినంత మాత్రాన ఏమి ఫరవాలేదు. పాత్రలో ఉన్న ఆ కొద్ది పప్పులోనే నీళ్ళు పోసి, వేడి చేయండి" అని అన్నారు. 'వారు' చెప్పిన విధంగానే కొద్దిగా పప్పు ఉన్న పాత్రలో సగంవరకు నీళ్ళుపోసి, వేడిచేసి దానిని అందరికి వడ్డించాము. నీళ్ళ పప్పును వడ్డించామని, వాళ్ళంతా అంటారేమోనని మేము దిగులుపడుతున్నాం. కాని అందరూ కూడా ఆ వేడి వేడి పప్పు చాలా రుచికరంగా ఉన్నదని పొగిడారు. ఆ తరువాత మేము కూడా ఆ నీళ్ళ పప్పును భుజించినపుడు ఇంత అద్భుతమైన రుచితో కూడిన పప్పు ఇంతకుముందు ఎప్పుడూ కూడా తినలేదనిపించింది. ఇదే విధంగా ఎప్పుడైనా పప్పు లేదా కూరలు తక్కువగా అయినపుడు మా అంతట మేమే వేడినీళ్ళు అందులో పోసేవాళ్ళం. కాని అప్పుడు ఆ పప్పు, కూరలు అంత రుచికరంగా ఉండేవి కావు. ఈ విషయాన్ని గూర్చి ఒకసారి శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు శ్రీ బాబూజీ గారిని అడిగినపుడు వారు, "మరల మరల చూపించడానికి ఇదేమైనా మహిమా? ఇది ఆ సమయం యొక్క అవసరం కాబట్టి దానిని లాలాజీ సాహెబ్ పూర్తి చేసారు" అని అన్నారు.

"ప్రవాహం తల నుండి జారినప్పుడు దానిని గురించి తెలియదు కాని తెలివికి వచ్చినపుడు ఆ విధంగా ఎందుకు జరిగిందని, ఎంత ప్రయాసపడినా అర్థం కాదు" అనే సామెత ప్రకారం అప్పుడప్పుడు జరుగుతుంది. ఒకసారి ఇంట్లో నెయ్యి అయిపోయింది. అదే సమయంలో దూరప్రాంతం నుండి ఒక అభ్యాసీ వచ్చాడు. అతడు భోజనానికి కూర్చున్న తరువాత "నాకు పప్పులో నెయ్యి వేసుకోవడం అలవాటు. నెయ్యి ఉన్నదా?" అని అడిగాడు. కాని ఆ సమయంలో ఇంటిలో నెయ్యి అయిపోయింది. అప్పుడే ఇంటిలోకి వచ్చిన శ్రీబాబూజీని, వారి పెద్ద కూతురు, మాయ, "నాన్నగారు! ఇంటిలో నెయ్యిలేదు. ఈ సోదరుడేమో నెయ్యి అడుగుతున్నాడు" అని అనగానే 'వారు' వెంటనే "సామానులు భద్రపరిచే గదిలో చిన్న గిన్నెలో నెయ్యి ఉన్నది. దానిని వడ్డించు" అని చెప్పారు. అక్కడికి వెళ్ళి చూడగానే నిజంగానే నెయ్యి ఉంది. మాయ ఆ సోదరునికి పప్పులో నెయ్యి వడ్డించింది. మా అందరికి ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే, మేము ఎవ్వరం ఎప్పుడూ కూడ అక్కడ నెయ్యి ఉంచలేదు. అయినప్పటికీ అక్కడికి నెయ్యి ఎలా వచ్చింది? ఇప్పటికి కూడా అటువంటి సంఘటనలు గుర్తుకు రాగానే మా నోటినుండి, "మా పరువును కాపాడటం కోసం 'వారు' ఎంతటి దయ చూపించారు" అనే మాటలే వెలువడతాయి. కాని ఇది 'వారు' చేసిన చమత్కారం అని ఎప్పుడూ కూడ నోటివెంట రాదు.

శ్రీ బాబూజీగారి సమాధానాలు కూడా సాటిలేనటువంటివి. ఎప్పుడైనా ఆలోచించినపుడు, 'వారి' భాష అలౌకికమైనదే కాదు,

దివ్యమైనదని కూడా నాకు అనిపిస్తోంది. ఒకసారి ఒక అభ్యాసీ సోదరుడు, **"బాబూజీ! ఇప్పుడు మీరు ఎక్కువగా జ్ఞాపకం వస్తున్నారు"** అని వ్రాశాడు. అప్పుడు **'వారు' చాలా సహజమైన పదాలతో, సంక్షిప్తంగా ఇలా జవాబు నిచ్చారు: "జ్ఞాపకం వస్తుందంటే మరచిపోవటం కూడా ఉన్నట్లే. నేను కోరేది ఏమిటంటే, జ్ఞాపకం రావడం కాని, పోవడం కాని ఉండకూడదు"** అని. ఈ చిన్న వాక్యంలో ఎంతో ఆత్మీయత మరియు 'వారి' విశాలహృదయం యొక్క గొప్పదనం మనకు స్పష్టంగా కనిపిస్తున్నది.

ఒకసారి తిరుపతిలో బాబూజీగారు నవ్వుతూ డాక్టర్ వరదాచారిగారితో, "మీరు గొప్ప ఫిలాసఫర్ మరియు విమర్శకులు. కాని నేను మిమ్మల్ని ఓడించగలను" అని అన్నారు. దానికి వారేమి జవాబు చెప్తారో మేము కుతూహలంతో నవ్వుతూ చూస్తున్నాం. అప్పుడు డాక్టర్ వరదాచారిగారు కూడా నవ్వి, "మాస్టర్! మీరు నన్ను ఏవిధంగా ఓడించగలరో చెప్పండి" అని అన్నారు. అపుడు బాబూజీగారు ఈ విధంగా అన్నారు: "పిలాసఫర్ మరియు విమర్శకులు మనస్సు యొక్క ఆధీనంలో ఉంటారు. కాని యోగి, హృదయం యొక్క శక్తిపై పూర్తిగా ఆధిపత్యం కలిగి ఉంటాడు. మనస్సు యొక్క క్రియారంగమే హృదయం. ఇది నేను పరిశోధించి కనుగొన్న విషయం. ఒకవేళ మనం హృదయాన్ని అంటే మనస్సు యొక్క క్రియారంగాన్ని ఆలోచనారహితంగా చేస్తే, పాపం ఆలోచించదలచినవారు ఏమి చేయగలరు?" అని అనగానే బాబూజీ, డాక్టర్ వరదాచారితోపాటుగా మేమందరం నవ్వుకున్నాం.

సోదరుడు డాక్టర్ వరదాచారిగారు ఉపన్యాసం ఇస్తూన్నడు గులాబీ పువ్వును చేతిలో ఉంచుకోవడం అలవాటు. ఉపన్యాసం మధ్యలో అప్పుడప్పుడు ఆ గులాబీ పువ్వు సువాసన చూసేవారు లేదా దాని కాడను పట్టుకొని త్రిప్పేవారు. ఒకసారి బాబూజీగారికి ఏ ఆలోచన వచ్చినదో తెలియదు కాని 'వారు' మాత్రం గులాబీ పువ్వును తీసి దాచారు. డాక్టర్‌గారు వేదిక దగ్గరకు వెళ్ళినప్పుడు ఆ పువ్వుకోసం వెదికారు. కాని అది దొరకలేదు. వేదికపైన కూర్చున్నప్పుడు శ్రీ బాబూజీగారికి మరియు డాక్టర్‌గారికి గులాబీ పూల మాలలను వేశారు. కాని ఆ పువ్వులు జరీ కాగితంలో బంధించబడి ఉన్నాయి. అపుడు బాబూజీగారు, "డాక్టర్! ఈ పూలమాల నుండి ఒక పువ్వును విడదీసి ఇవ్వనా! ఎందుకంటే, మీరు ఉపన్యాసం ఇవ్వాలి కదా!" అని అనగానే డాక్టర్‌గారు "అవసరం లేదు. ఇలాగే మాట్లాడతాను" అని అనగానే "మరి దేనిని చూస్తూ మాట్లాడతారు?" అని బాబూజీగారు అడగ్గానే వారు "మిమ్మల్ని చూస్తూ మాట్లాడతాను" అని అన్నారు. అంతే బాబూజీగారు ముసిముసి నవ్వులు నవ్వగానే, ఆధ్యాత్మిక విషయాన్ని గురించి మాట్లాడటానికి పువ్వుల సహాయం అవసరం లేదు కాని ఎవరైతే ఆధ్యాత్మికతను ప్రసాదిస్తున్నారో, 'వారు' మాతోనే ఉన్నారు అని అపుడు మాకు అర్థమైనది.

ఒకసారి ఒక డాక్టర్‌గారు నాకు చిన్న ప్రేవులలో క్షయ ఉన్నదని తెలిపినపుడు, సరైన రోగ నిర్ధారణ కోసం నేను ఢిల్లీకి దగ్గరగా ఉన్న 'మెహరోలి'లోని టీ.బి. అసుపత్రికి వెళ్ళాల్సిందిగా బాబూజీగారు నన్ను కోరారు. "బాబూజీ! నాకు టీ.బి. ఏమి లేదు"

అని అన్నాను. వారు, "బిటియా! అసుపత్రి మంచి విరామస్థలం; నీవు వెళ్ళు; నేను కూడా నీతోపాటుగా వస్తాను" అని అనగానే, 'వారు' కూడా నాతోపాటుగా వస్తున్నట్లుగా అనిపించింది. 'వారు' పలికిన ఈ మాటల యొక్క ప్రభావం ఆ తరువాత అర్థమైనపుడు నేను చాలా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, నేను ఉన్న వార్డులోనికి డాక్టర్‌గారు ప్రవేశిస్తూనే, వెంటనే ఒక్క అడుగు వెనుకకు వేసి, "ఈ మంచం మీద ఉన్న రోగి ఎవరు?" అని ప్రశ్నించారు. అప్పుడే నేను బాత్‌రూమ్ నుండి బయటకు వస్తున్నాను. విషయం ఏమిటని డాక్టర్‌గారిని అడిగినపుడు వారు, "బేబీ, నీ మంచం చుట్టూ నలువైపులా ప్రకాశం వ్యాపించి ఉన్నది" అని అన్నారు. అపుడు నేను, "నా గురుమహరాజ్, నా బాబూజీ మహరాజ్ నాతోపాటుగా ఇక్కడకు వచ్చారు" అని అన్నాను. ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నేను అక్కడ ఉన్నంత కాలం, ఆ వార్డులోని ప్రతి రోగి ఒక విధమైన స్ఫూర్తిని, చైతన్యాన్ని పొంది, వాళ్ళ ముఖాలు సంతోషంతో వెలిగిపోవడాన్ని నేను గమనించాను. అక్కడ పాటలు పాడుకోవడానికి అనుమతి ఉన్నది. నేను శ్రీ బాబూజీ మహరాజ్ గొప్పతనాన్ని గురించి వ్రాసిన పాటలు పాడేదానిని. అప్పుడు రోగులందరు కళ్ళు మూసుకొని ప్రశాంతతను పొందేవారు. కేవలం 'వారి'ని గురించిన ఆలోచనలకే ఇంతటి అద్భుతమైన మహిమ ఉన్నది. అంతేకాదు, 'వారి'కి నిద్రలో కూడా ఏమైనా ఆలోచనలు వస్తే అవి మన ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదంగా మారేవి. ఒకసారి 'వారు' నాకు ఈ విధంగా వ్రాసారు: "స్వప్నంలో ఒక బిందువు వద్ద నీ యాత్రను ప్రారంభం గావించాను. కాని నాకు మెలుకవ

వచ్చిన తరువాత చూసేసరికి ఆ బిందువు వద్ద నీ యాత్ర పూర్తయిపోయింది. నా తెలియనితనం వలన నీ శరీరానికి ఎటువంటి బాధకాని, కష్టం కాని కలగలేదు కదా! వెంటనే నాకు లేఖ ద్వారా తెలియజేయగలవు. నాకు తెలియకుండానే నేను నిద్రలో కూడా ఏమి చేస్తున్నానో!" అని వ్రాశారు. 'వారి' లేఖ అందకముందే నేను వారికి "బాబూజీ! ఫలానా బిందువువద్ద నా యాత్ర పూర్తి చేయించడమే గాక, మీరు నన్ను ఆ తరువాత బిందువుకు కూడా తీసుకువెళ్ళినట్లుగా అనిపిస్తూన్నది. నేను చాలా తేలికదనాన్ని అనుభవిస్తున్నాను. అంతేకాదు నాలోనికి ఆనంద కెరటాలు ప్రవహిస్తున్నాయా అన్నట్లుగా ఉంది" అని వ్రాసాను. ఈ ఆధ్యాత్మిక రంగంలో పరిశోధన చేయడానికి 'వారు' నన్ను అనుగ్రహించి, ప్రతి బిందువు వద్దగల స్థితిని నాకు అర్థం అయ్యేటట్లుగా నా ప్రయాణాన్ని గావించారు. అంతేకాదు, ఈ ఆధ్యాత్మిక పరిశోధనలో నేను పూర్తిగా లీనమవడానికి కావలసిన సామర్థ్యాన్ని కూడా 'వారే' కానుకగా ప్రసాదించారు. శ్రీ బాబూజీ మహరాజ్‌లో ఏర్పడిన ఆలోచనలే నా ఎదుట అద్దంలాగా ఉండటంవలన నేను ప్రతి బిందువులోగల స్థితిని గమనించి, 'వారి' ఇచ్చానుసారంగా ఆ అనుభవాలన్నింటిని 'వారి'కి వ్రాయగలిగాను. శ్రీ బాబూజీగారిచేత ప్రసాదించబడిన ఈ దివ్య ప్రసాదం నాలో ఎల్లప్పుడు ప్రతిధ్వనించుగాక! నాలోని అచంచలమైన విశ్వాసం కూడా 'వారి' ఆలోచనల యొక్క ఆధారశిల మీదనే నిర్మించబడింది. ఆ దివ్య–శూన్య–వ్యక్తిత్వంలో ఏర్పడిన ఆలోచనలకు అంత అద్భుతమైన ప్రభావం ఉన్నది.

"బాబూజీ! మీరంటే మాకు చాలా ఇష్టం" అని నేను ఒకసారి వారితో అనగానే, "ఎందుకంటే, నేను చాలా మంచిగా ఉన్నాను కదా!" అని 'వారు' అన్నారు. 'వారి' ముఖారవిందం నుండి వెలువడిన ఈ మాటలను వినగానే మేము చాలా సంతోషించాము. మరల వారు, "మంచిగా ఉండడం అంటే ఏమిటో తెలుసా?" అని అడిగారు. మేమంతా వారినే శ్రద్ధగా చూస్తూ ఉన్నాము. నెమ్మదిగా వారు, **"ఎవరిలోనైతే మన లాలాజీ సాహెబ్ యొక్క తేజస్సు ఉంటుందో అతడు మనకు చాలా మంచిగా, చాలా ఇష్టంగా కనబడతాడు. మంచి యొక్క అర్థమే మన లాలాజీ సాహెబ్"** అని అనగానే మేము ఆనందంతో పరవశించిపోయాము.

శ్రీ బాబూజీగారు తమ దివ్యప్రేమతో అభ్యాసులలో ఉత్సాహాన్ని కలిగిస్తూ, అడుగడుగునా మనకు ఆధ్యాత్మిక శిక్షణను ప్రదానం చేస్తూ, తాను ఏది చేయాలో అది నిరాడంబరంగా చేసి కూడా ఆ గొప్పతనాన్ని మాత్రం అభ్యాసులకే ఇవ్వడమనేది వారిలోని సహజమైన విశేషం. ఈ రోజుకు కూడా 'వారి' మధుర స్వరం నా చెవులలో మారుమ్రోగుతున్నది. "బిటియా! నిజం చెప్పాలంటే, ఈ సహజమార్గ ఆధ్యాత్మిక యాత్ర, నీవు నీ భక్తి పరిశ్రమలవల్లనే పూర్తి చేయగలిగావు. నేను నీకు కేవలం 'ఆసరా'ను మాత్రమే ఇచ్చాను" అని అన్నారు. కాని ఆధ్యాత్మికత అంటే ఏమిటి? అందులో కనీసం ఏ, బి, సి, డిలు కూడా తెలియని అజ్ఞానురాలినని నాకు చాలా స్పష్టంగా తెలుసు. అత్యంత సూక్ష్మం, తేజోవంతమైన ఈ సహజమార్గ సాధనకు నేను కనీసం అర్హురాలిని కూడా కాదు. అయినప్పటికీ,

శ్రీ బాబూజీ మహరాజ్ నా ప్రతి బిందువువద్దగల స్థితిని అర్థం చేసుకొనే యోగ్యతను ప్రసాదించి, నన్ను ఎంతో తేజోవంతంగా తయారుచేస్తూ, చేయిపట్టుకొని మార్గాన్ని చూపిస్తూ, నన్ను లక్ష్యం వద్దకు తీసుకువెళ్ళారు. ఈ కారణంవల్లనే ఆ అనన్యమైన శక్తి సహాయం లేకుండా 'వారి' పవిత్ర చరణాల యొక్క ఆశ్రయం పొందడమనేది అసంభవమని నాకు తెలిసినది.

'వారు' మనకు ఎటువంటి సూక్ష్మత్వంతో కూడిన దివ్యకృపను ప్రసాదిస్తారంటే, వారిలో 'లయావస్థ'ను పొందినపుడే, దానిని పట్టుకోవడానికి మనకు సాధ్యం కాగలదు. అప్పుడే 'వారు' మనకు ఒక వాక్యాన్ని చెప్తూ మనలను చైతన్యవంతులుగా చేస్తున్నారు. **"మైనే జబ్ సే లాలాజీ సాహెబ్ కో దేఖా, తబ్ సే కిసీ అవుర్ కో దేఖా హీ నహీ" – ఎప్పుడైతే నేను లాలాజీ సాహెబ్‌ను చూసానో, అప్పటి నుండి మరల ఎవ్వరిని కూడా చూడలేదు.** సామాన్యంగా అనిపించే ఈ వాక్యం యొక్క అర్థం, ప్రేమతో కూడిన ఆ సహజస్థితి మనలో ప్రవేశించినపుడు మాత్రమే మనకు అర్థం కాగలదు. శ్రీ బాబూజీగారు తప్ప ఇంకెవ్వరూ కూడా మన దృష్టిలోకి రాకపోవడమనేది ఈ వాక్యం యొక్క అర్థం కాదు. ఎప్పటివరకైతే శ్రీ బాబూజీగారు మనతోనే ఉన్నారనే భావన ఉన్నంతకాలం కూడా మన సాధన అసంపూర్ణమైనదనే సూక్ష్మమైన అర్థాన్ని ఆ స్థితియే తెలుపుతుంది. శ్రీ బాబూజీ మహరాజ్‌లో 'లయ' మవుతూ, ఆధ్యాత్మిక క్షేత్రంలో దశల తరువాత దశలను దాటుతూ, ఎప్పుడైతే మనం మన ఉనికిని కూడా కోల్పోతామో అప్పుడే ఈ వాక్యం మనలో, మన అంతరంగంలో సార్థకమవుతుంది. 'అనన్య' యొక్క అర్థం ఏమిటంటే,

న – అన్యం, అనగా ఇతరలు ఎవ్వరూ లేకపోవడం అనగా రెండవ దాని ఉనికియే లేకపోవడం అని అర్థం.

'వారి' హృదయం యొక్క విశాలత్వం మరియు ప్రేమ యొక్క లోతును ఎవరైనా ఏవిధంగా పొందగలరు! షాజహాన్‌పూర్ ఆశ్రమానికి పునాది తీయడానికి, బాబూజీగారే స్వయంగా కొంత మట్టిని త్రవ్విన తరువాత, "బిటియా! ఇప్పుడు పునాది తీయడం అయిపోయింది. ఇక దీనిని నిర్మించడానికి డబ్బులు నీవే ఇవ్వాలి" అని అన్నారు. ఆ సమయంలో నా దగ్గర కేవలం నాలుగు అణాలు అంటే ఇరవై అయిదు పైసలు మాత్రమే ఉన్నాయి. "సరే, బాబూజీ! నా దగ్గర ఇరవై అయిదు పైసలే ఉన్నాయి. అయినప్పటికీ మన ఆశ్రమాన్ని నేను తప్పకుండా నిర్మిస్తాను" అనే మాటలు వెంటనే నా నోటి నుండి వెలువడ్డాయి. ఈ విధంగా అన్న తరువాత నా వద్ద ఉన్న ఇరవై అయిదు పైసలను పునాదిలో వేసాను. వారితో పాటుగా తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు, ఇరవై అయిదు పైసలతో ఆశ్రమం ఏ విధంగా తయారవుతుంది? అనే మనోదౌర్బల్యంతో కూడిన ఆలోచన నాలో ఉప్పొంగినది. ఇంటికి రాగానే నేను, "బాబూజీ మహరాజ్! నా దగ్గర అప్పుడు ఇరవై అయిదు పైసలే ఉన్నాయి. వాటితో ఆశ్రమానికి కనీసం ఒక ఇటుక రాయి కూడా రాదు" అని అనగానే వెంటనే వారు, "నీ దగ్గర ఏదైతే ఉన్నదో, అది అంతా ఇచ్చివేశావు. అసలు నీవే నీ దగ్గర లేవు. నా అభ్యాసుల యొక్క ఇటువంటి ఒకే ఒక పవిత్రమైన ఆలోచనయే మన ఆశ్రమాన్ని తయారు చేస్తుంది. నీ నాలుగు అణాలు నాలుగు లక్షల రూపాయలకు సమానంగా నిరూపించబడతాయి" అని అన్నారు. అవును, నిజమే,

మరి ఆశ్రమం నిర్మాణం కోసం డబ్బులు వచ్చిన ప్రతిసారి వారు, "ఇటు చూడండి! బిటియా డబ్బులు పంపించినది ఇరవై అయిదు పైసలతోనే నన్ను కొనివేసింది" అని అనేవారు. కాని 'వారి' కుమార్తె మౌనంగా ఉండటం మినహా, ఏమి మాట్లాడుతుంది. యథార్థమైన మాట ఏమిటంటే, 'వారి'ని అర్థం చేసుకోవడం లేదా 'వారు' చెప్పిన మాటలను అర్థం చేసుకోవడం అనేది అంత సులభం కాదు.

ఒకసారి 'వారి' ఇంటి ప్రాంగణంలో అందరం కూర్చుని ఉన్నాము. కొందరు కుర్చీల మీద, మరికొందరు చాపల మీద కూర్చొని ఉన్నారు. 'వారు' చాలా ఉత్సాహంతో ఉన్నారు. మాకు ఏమైనా చెప్పాలనుకున్నారో లేక ఏదైనా వివరించాలనుకున్నారో తెలియదు కాని 'వారు' మాత్రం ఈ విధంగా మాట్లాడటం ప్రారంభించారు: "ఇంతకుపూర్వం బిటియా పతంజలి మహర్షి సమయంలో కూడా ఉన్నది. అప్పుడు బిటియా సాధనచేసి మోక్షం మాత్రమే పొందగలిగినది. ముక్తిని పొందలేకపోవడం వలన మోక్షం యొక్క నిర్ణీత కాలం పూర్తికాగానే తిరిగి ఈ ప్రపంచంలో మరల ఒక రైతుకు కుమార్తెగా జన్మించింది. కాని పద్నాలుగు సంవత్సరాల వయస్సులోనే మృతి చెంది, మరల ఇప్పుడు వచ్చినది" అని మాట్లాడుతూ ఉండగానే, ఈ మధ్యలో ఒక అభ్యాసీ, "బాబూజీ! పూర్వజన్మలో నేను ఎవరు?" అని అడగ్గానే 'వారు' దానికి జవాబు చెప్పడం ప్రారంభించారు. ఇంతలో రెండవ అభ్యాసీ, "బాబూజీ! పూర్వజన్మలో మీరు ఎవరు?" అని ప్రశ్నించాడు. ఒక వైశ్య కుటుంబంలో జన్మించడం మొదలగునవి.....వారు చెప్తూనే ఉన్నారు. కాని ఇపుడు 'వారు' మొదటి అభ్యాసీ యొక్క పూర్వజన్మ వృత్తాంతాన్ని

గురించి చెప్తుతూ ఉన్నారని, 'వారి' ముఖాన్ని చూసి, వాళ్ళు ఎవరు కూడా అర్థం చేసుకోలేకపోయారు. రెండవ అభ్యాసీ దీనిని బాబూజీగారి యొక్క పూర్వజన్మ వృత్తాంతంగా భావించి వ్రాసు కోవడం జరిగింది. కాని 'వారి' ముఖ భంగిమను ఎవరైనా జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, 'వారు' తమ పూర్వజన్మ వృత్తాంతాన్ని గురించి అడిగిన ప్రశ్నను అసలు వినలేదని తప్పక గ్రహించేవారు. ఆ తర్వాత నేను వారితో "బాబూజీ! మీ గురించి ఇతడు ఏదైతే వ్రాసుకున్నాడో అదంతా తప్పు. ఇతడు వ్రాసుకొన్నది మీ గురించి కాదు, ఆ అభ్యాసీకి సంబంధించిన విషయం" అని అన్నాను. శ్రీ బాబూజీగారు తమ ఆత్మకథను వ్రాయించే సమయంలో కూడా నేను వారికి ఈ విషయాన్ని గుర్తు చేసాను. "అవును. బిటియా చెప్పేది నిజమే. దీనిని వ్రాయవద్దు" అని 'వారు' అన్నారు. కాని ఈ తప్పు విషయం ముద్రించబడినదని వినగానే నాకు చాలా దుఃఖం కలిగింది. లాలాజీ సాహెబ్ కూడా ఇదే విధంగా అన్నారని కొందరు నాతో అన్నప్పుడు, "రెండు శరీరాలకు ప్రాణం ఒక్కటే అని వీరు చెప్పినప్పుడు, లాలాజీ సాహెబ్ ఇంకొక విధంగా ఎందుకు చెబుతారు?" అని నేను వాళ్ళను ప్రశ్నించాను.

ఇదే విధంగా ఒక అభ్యాసీ, "బాబూజీ! మీరు పతంజలి అయి ఉంటారు, మీకు తెలుసును కదా!" అని అడిగినపుడు "బహుశా అదే అయి ఉండవచ్చు" అని 'వారు' అనడం, ఇంతలో ఇంకొక అభ్యాసీ ఈ విషయాన్ని వ్రాసుకోవడం జరిగింది. కాని ఈ 'వే' కౌన్ థే? ఈ రహస్యాన్ని మాత్రం 'వారి' సాక్షాత్కారం అయిన తరువాతనే తెలుసుకోగలం. అంతవరకు ఈ రహస్యాన్ని ఎవ్వరూ

కూడా అర్థం చేసుకోలేరు. ముందు ముందు రాబోయే తరాలవారు ఈ పొరపాటును సరిదిద్దగలరని నేను 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. ఎందుకంటే, ఎప్పుడైతే, ఎవరికైతే శ్రీ బాబూజీ మహరాజ్‌గారు తమ సాక్షాత్కారాన్ని పొందే సౌభాగ్యాన్ని ప్రసాదిస్తారో, అప్పుడు ఆ అభ్యాసీకి స్వతహాగానే సమస్త స్థితులన్నీ కూడా స్పష్టంగా అర్థమవుతాయి. అంతేకాదు, ఆ పరమ సౌభాగ్యాన్ని పొందినటువంటి అభ్యాసీ యొక్క స్థితి, స్వయంగా ఈ విధంగా మాట్లాడుతుంది: "వారు అంతిమం నుండి క్రిందికి దిగివచ్చారు. ఈ భూమి మీద ఉన్న ప్రాణులను అంటే మనలను ఆ అంతిమం వద్దకు తీసుకు పోవడానికి వచ్చారు." అందువలన ఇది నిజంగానే ప్రకాశితమైనది. 'వీరు' అద్భుతమైన మమత, సామర్థ్యాలకు ప్రతిరూపంగా ఈ భూమిపై అవతరించారు.

'వారు' ఎటువంటి దివ్య ఆకర్షణతో కూడిన శాశ్వత సౌందర్యాన్ని కలిగి ఉండే వారంటే మనమందరం కూడా పిచ్చివారిలాగా 'వారి'తోనే ఉండాలని కోరుకుంటాం. తరచుగా 'వారు' సాయంత్రం కోర్టు నుండి రాగానే అల్పాహారం తీసుకున్న తరువాత, "ఛలో భాయీ! మనమందరం షికారుకు తోటకి వెళ్ళదాము" అని అనేవారు. వెంటనే మేమంతా తయారయ్యే వాళ్ళం. ఎందుకంటే, 'వారి' దివ్య ఆకర్షణ ముందు సమస్త విశ్వం కూడా వినమ్రతతో ఒదిగిపోతుంది. శ్రీ బాబూజీగారి మరియు శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారి పిల్లలు కూడా తయారయ్యి మాతోపాటుగా షికారుకు వచ్చేవారు. మేమందరం కలిసి ఎడ్ల బండిలో ప్రయాణం చేసేవాళ్ళం. గతుకుల బాట మీద, కుదుపులతో ప్రయాణం చేస్తూ, బండిలో

'వారి'ని అనుకుని కూర్చొని, 'వారు' ఏమైనా చెప్పుతారేమో వినాలనే ఆశతో వారివైపే దీక్షగా చూసేవాళ్ళం. తోట చేరుకోగానే తోట అంతా మాకు చూపిస్తూ, తమ చేతులతో మామిడి పళ్ళు కోసి తినిపించేవారు. ఇంకా బఠాణీలు, జామ కాయలు, పచ్చి శెనగలు, శనగ ఆకు మొదలైనవి మాకు తినడానికి ఇచ్చేవారు. ఉప్పు పొట్లాన్ని స్వయంగా 'వారే' ఇంటివద్ద నుండి తీసుకు వచ్చేవారు. షికారు అంతా అయ్యి, ఇంటికి వచ్చిన తరువాత, తోటలో ఏం జరిగింది? ఏమేమి తిన్నాం? అని మమ్మల్ని మేము ప్రశ్నించుకున్నప్పుడు దానికి మా దగ్గర ఎటువంటి జవాబు ఉండేది కాదు. నేను ఎవరితో, ఎక్కడికి వెళ్ళాను అంటే నేనేమి చెప్పగలను? అవును, నా డైరీలో ఏదైతే వ్రాసానో అది మాత్రం 'వారి'కి ఇష్టంగా ఉండేది. నేను కేవలం ఈ మాట మాత్రమే చెప్పగలను. "వాస్తవానికి 'వారు' మా అందరికి ఒక చమత్కారాన్ని చూపించి, మరల దానిని ఉపసంహరించేవారు. ఈ విధంగా 'వారు' మాలో నింపిన ఆ దివ్యకృప మా అంతరంగంలో పరిమితమై ఉండక, అది మమ్మల్ని 'మేము' అనే సంకుచితమైన పరిధి నుండి వెలుపలికి తీసి, నెమ్మది నెమ్మదిగా 'వారి' దివ్యచరణాల వద్ద మాకు 'లయావస్థ'ను ప్రసాదించేది. 'వారు' ఇటువంటి కృపను మనలో వర్షింపజేయడానికి ఏదో ఒక కారణం కోసం వెదికేవారు.

మన ధ్యానంలో లోతును, మనకు లక్ష్యం పట్లగల అనుబంధాన్ని, సమర్పణా భావాలను కూడా 'వారు' అప్పుడప్పుడు పరీక్షించేవారు. మన షాజహాన్‌పూర్ ఆశ్రమ నిర్మాణ కార్యక్రమం జరుగుతున్నప్పుడు, ధ్యాన మందిరం వద్ద మెట్లు నిర్మిస్తూన్న

సందర్భంలో, ఎందుకో తెలియదు మరి, ఎంతో ప్రేమతో, దయతో వారు, "బిటియా! అందరి పేర్ల మీద గదులు తయారవుతున్నాయి. నీ పేరు మీద కూడా ఒక గదిని నేను కట్టించనా?" అని అడిగారు. "బాబూజీ! ఇంత తక్కువ భూమిని తీసుకొని నేనేమి చేయగలను?" అనే మాటలు నా నుండి అప్రయత్నంగా వెలువడ్డాయి. "ధ్యాన మందిరంలోనికి వెళ్ళటానికి నిర్మించే మొదటిమొట్టు నందు పేర్చే ఇటుకపై కస్తూరీ అని వ్రాయించగలరు. దాని వలన మీ చరణ కమలంతోపాటుగా, అభ్యాసుల యొక్క పాదస్పర్శను పొంది మన ఆశ్రమం అంతా కూడా 'సోదరభావం' అనే పుష్పంతో వికసించి 'మీ' పరిమళాన్ని వెదజల్లుతుంది. ఇదే నా ప్రార్థన" అని నేను విన్నవించుకోగానే 'వారు' చాలా సంతోషించి, "ఇపుడు నా బిడ్డ చాలా తెలివైనదిగా మారింది. అరే భాయీ! అడుగు వేసేటప్పుడు మెట్లవైపు తప్పక చూస్తాను కదా! చూడండి! నా దృష్టిని ఏ విధంగా ఆకర్షించాలని చూస్తుందో!" అని అన్నారు. అప్పుడు ఈ మాటల యొక్క మహత్యం నాకేమి అర్థం కాలేదు. కాని నాపై 'వారు' అపారమైన ప్రేమను మాత్రం వర్షిస్తూన్నారని అర్థమైనది. కాని ఈ రోజున 'వారి' దివ్యమైన వాణి నుండి వెలువడిన ఆ మాటల యొక్క ప్రభావం అర్థమైనకొద్దీ నేను నా ఉనికినే కోల్పోతున్నాను. 'వారి' మాటలలోని అంతరార్థాన్ని ఎవరు అర్థం చేసుకోగలరు? ఎప్పుడైతే 'వారు' మనకు ఆ శ్రేష్ఠ స్థితిని ప్రసాదిస్తారో అప్పుడే అవి మనకు అర్థమవుతాయి. 'వారి' వాక్యాల యొక్క స్థితి మనకు కలిగి, అవి మనకు అర్థమైనపుడు మనం పరవశంతో ఈ విధంగా గానం చేస్తాం.

**"న కోయీ రూప్ హై, న రంగ్, కహే బాబూ హమ్।**
**ఆజీబ్ రిశ్తే సే దిల్ నే ఇస్సే పుకారా హై॥"**

వారికి ఎటువంటి రూపం లేదు; రంగు లేదు. కాని అది విచిత్రమైన బంధం. అందువల్లనే మన హృదయం వారిని తపనతో 'బాబూజీ' అని పిలిచినది.

ఒకసారి 'వారి' తేజోమయమైన ముఖం నుండి స్వతహాగానే ఒక వాక్యం వెలువడింది. ఆ వాక్యం నన్ను అంతిమసత్యం యొక్క కూడలివద్దకు తీసుకుపోయింది. **"నా హృదయం తెరచి ఉన్న పుస్తకం. కాని అందులో ఏదీ కూడా వ్రాయబడలేదు. ప్రేమలో శబ్దం, భాష ఏమీ ఉండవు. నా హృదయాన్ని చదవాలంటే 'ప్రేమ' అనే సముద్రంలో నీవు మునిగిపోవాల్సి ఉంటుంది" అని అన్నారు.** అంతే మేము ఒకరి ముఖాన్ని ఒకరం చూస్తూ మౌనంగా కూర్చున్నాం. నాకు అర్థమైనది ఏమిటంటే, **"ప్రభువులో 'లయం' కావాలి అనే కోరిక యొక్క బాధ గ్రుచ్చుకొనకపోతే, మనస్సు అనే మానస సరోవరంలో 'తపన' అనే పుష్పం వికసించదు."** నిజానికి ఇవి నాకు అర్థం కాలేదు. కాని అర్థమైనట్లుగా అనిపించింది. **"ఆవేదనతో కూడిన తపనయే ఒక మార్గం. అదే అభ్యాసీని అంతిమం వరకు తీసుకు వెళ్ళుతుంది" అని బాబూజీగారు ఒకసారి అన్నారు.**

శ్రీ బాబూజీగారు చాలాసార్లు ఈ విధంగా అనేవారు: **"అభ్యాసులు నాకు, బాబూజీ! మేము మిమ్మల్ని ఎక్కువగా జ్ఞాపకం చేసుకొంటాము– అని వ్రాస్తారు. కాని వారి స్మరణ యొక్క ప్రభావం నన్ను తాకనంత కాలం నేను వారిని ఏ విధంగా అర్థం చేసుకో**

**గలను?" అని మరల వారు ఇలా అనేవారు. "ఈ విధంగా ఎందుకు జరుగుతుందో తెలుసా? అభ్యాసులు నా భౌతిక దేహాన్ని స్మరిస్తారు. కాని నేను అక్కడ లేను. నేను సంస్కారాలను నశింపజేయువాడిని. ప్రజలు నన్ను తమ ధ్యానంలో ఉంచుకోవాలి. ధ్యానం, జ్ఞాపకం కంటే సూక్ష్మమైనది" అని అన్నారు.** 'వారి' మాటలను ఎవరు అర్థం చేసుకోగలరు? ప్రేమలో మునిగి, ఆ ప్రత్యక్ష అనుభవాన్ని పొందినప్పుడే మనం వాటిని అర్థం చేసుకోగలం.

ఒకసారి ఏదో పండుగ సందర్భముగా ప్రజలు గంగా నదిలో స్నానం చేయడానికి వెళ్ళుతున్నారు. కొంతమంది షాజహాన్‌పూర్‌లో శ్రీ బాబూజీగారి ఇంటి వెనుకనే ప్రవహిస్తున్న ఖన్నౌతి నదిలో కూడా స్నానం చేస్తున్నారు. శ్రీ బాబూజీ గారు తమ పూజ గదిలోని కిటికీ దగ్గర కూర్చొని ఉన్నారు. 'వారు' అక్కడే కూర్చొని తమ సంస్థకు సంబంధించిన విషయాలను చుస్తూంటారు. అనుకోకుండా 'వారి' దృష్టి నదివైపు మరలగానే వారు, "బిటియా! ప్రజలకు కనీసం పండుగ రోజున కూడా స్నానం ఎలా చేయాలో తెలియదు. వారు పూర్తిగా మునగకపోతే పండుగ స్నానం చేసినట్లు ఎలా అవుతుంది?" అని అన్నారు. 'వారి' మాటలు నాకేమీ అర్థం కాలేదు. అపుడు 'వారు' మరల ఈ విధంగా వివరించారు: "నాకు తెలిసినది ఏమిటంటే, ఆ ఈశ్వరీయ ధారలో నీవు పూర్తిగా మునిగిపోవాలి. 'నేను' అనేది స్నానం చేయకపోతే అది ఏమి పరిశుభ్రమైనట్లు?" అని అన్నారు. నేనేమి మాట్లాడగలను. నివ్వెరపోయి 'వారి' ముఖార విందాన్నే శ్రద్ధగా చూస్తూ కూర్చున్నాను. కాని 'వారు' తమ కర్తవ్యంలో మాత్రం ఎంతో జాగ్రత్తగా ఉండేవారు. మరల వారు, **"ధ్యానం**

**ద్వారా 'నీవు' దివ్యత్వంలో మునిగిపోవాలి. అపుడు నీలోని 'అహం' (సెల్ఫ్) కరిగిపోతుంది. ఏ రోజునైతే నీలోని అహం పూర్తిగా కరిగి పోతుందో, అపుడు నీవు దేనికోసమైతే మిషన్‌లో చేరావో, అక్కడ కేవలం 'అది' మాత్రమే ఉంటుంది."** అని అన్నారు.

సమర్థ సద్గురువు శ్రీ లాలాజీ సాహెబ్‌పట్ల 'వారి'కి గల ప్రేమ యొక్క పరాకాష్ఠతను తెలిపే ఒక చిన్న సంఘటనను నేను ఒకసారి చూడడం జరిగింది. ఒకసారి ఎవరో ఒక అభ్యాసీ 'వారి'కి ఫోన్‌చేసి, "ఎవరు మాట్లాడుతున్నారు?" అని ప్రశ్నించాడు. అప్పుడు వారు, "నేను రామచంద్రను మాట్లాడుతున్నాను" అని అనగానే మరల ఆ అభ్యాసీ, "ఎవరు? మీరు? రామచంద్ర మాట్లాడు తున్నారా?" అని అనగానే వెంటనే వారు, "కాదు, కాదు; రామచంద్ర అంటే నా లాలాజీ సాహెబ్, నేను 'వారి' బానిసను; రామచందర్ మాట్లాతున్నాను" అని అన్నారు. ఈ సంభాషణ వినగానే నేను గగుర్పాటు పొందాను. శ్రీ లాలాజీ సాహెబ్ వారిలో సంపూర్ణంగా లయమైనప్పటికి, వారిరువురు ఒకే స్థాయికి చెందినప్పటికి, శ్రీ బాబూజీగారు కనీసం తమ పేరు కూడా తమ గురుదేవుని పేరుతో సమానంగా ఉండటానికి ఏ మాత్రం ఇష్టపడలేదు. ఒకసారి 'వారు' ఒక అభ్యాసీ ఇంటికి వెళ్ళినప్పుడు, "బాబూజీ! మీరు మా ఇంటికి రావడంవలన మా ఇల్లు పావనమైనది; మా మీద మీరు ఎంతో దయ చూపించారు, మమ్మల్ని ఆశీర్వదించారు" అని ఆ అభ్యాసీ అన్నప్పుడు 'వారు' అక్కడ ఏమీ మాట్లాడలేదు. కాని ఇంటికి తిరిగి రాగానే, "భాయీ! మహాత్ములు ఎవరి ఇంటికైనా వెళ్ళతారు. ఆ గృహాన్ని పావనం చేస్తారు. ఇంకా 'కృప'తో కూడా నింపుతారు.

కాని ఈ మూడింటిలో ఏ ఒక్కటి కూడా నేను చేయలేదు" అని అన్నారు. మరల "దీనిలోని అంతరార్థం ఏమిటో తెలుసా?" అని ప్రశ్నించారు. మేము వారినే చూస్తూ జవాబు కోసం ఎదురుచూస్తూ ఉన్నాం. వెంటనే వారు, **"నేను లేని ప్రదేశమంటూ ఉందని నాకు ఎప్పుడూ కూడా అనిపించలేదు (సర్వాంతర్యామి, సర్వవ్యాపి అని అర్థం). అవును; రావడం, పోవడం అనేది ఈ భౌతిక శరీరం మాత్రమే చేస్తుంది. ఇక పవిత్రత విషయానికి వస్తే ఇల్లును గంగా జలంతో కూడా శుభ్రం చేయవచ్చు. కాని మన శ్రీ లాలాజీ సాహెబ్ వంటి దివ్యపురుషుని రాక వలన దివ్యత్వమే అంతటా వ్యాపిస్తుంది. ఆ దివ్యత్వం పవిత్రత కంటే కూడా అతీతమైనది"** అని 'వారు' ముసి ముసి నవ్వులు నవ్వారు.

ఒకసారి సోదరుడు డాక్టర్ వరదాచారిగారు శ్రీ బాబూజీ గారిని చాలా పాండిత్యంతో కూడిన ప్రశ్నను అడిగారు. ఆ ప్రశ్న వినగానే మేమంతా కూడా నివ్వెరపోయి, బాబూజీగారు దానికి ఏమని జవాబు చెబుతారా! అని మనసులో అనుకుంటున్నాము. **"బాబూజీ! మీరు ఆరు రోజుల పసివానిగా ఉన్నప్పుడు శ్రీ లాలాజీ సాహెబ్ మీకు ప్రసారం చేసిన ప్రాణాహుతి శక్తిని పూర్తిగా మీరు తీసుకున్నారని బెహెన్‌జీగారు (సోదరి కస్తూరి) నాతో అన్నారు. కాని అప్పుడు మీకు ఆరు రోజులేనని మీరు ఏ విధంగా తెలుసుకో గలిగారు?" అని డాక్టర్ వరదాచారిగారు ప్రశ్నించారు. అప్పుడు హుక్కా పీల్చుకుంటున్న బాబూజీగారు నోటిలోని హుక్కా గొట్టాన్ని ప్రక్కకు జరిపి, "నేను ఆ ఆరు రోజుల పసిబాలుడినే చూస్తున్నాను. అంతేకాని నేను జన్మించినట్లుగా నాకు ఎప్పుడు కూడా**

**అనిపించలేదు. నాకు ఏ విధంగా అనిపించినదంటే ఆ పసిబాలుడే నా నుండి శక్తి పొందుతున్నట్లుగా అనిపించింది"** అని అన్నారు.

'వారి' ముఖంలో నిర్మలత్వం మరియు చిన్న పిల్లలవంటి అమాయకత్వాన్ని చూసి మనం చాలా ఆశ్చర్యపోతాము. ఒకసారి 'వారు' ఈశ్వర్ సహాయ్‌గారితో "ఈశ్వర్ సహాయ్‌జీ! ఇప్పుడేమో చలి ఎక్కువగా ఉన్నది. మనం దక్షిణ భారతదేశానికి వెళ్ళవలసి ఉన్నది. నా కోటు ఇపుడు చాలా పాతది అయిపోయింది. క్రొత్తది కొనుక్కోవడానికి నా దగ్గర డబ్బులు లేవు" అని అన్నారు. 'వారి' కోటు 29 సంవత్సరాల నాటిదని మాకు తెలిసినది. వెంటనే ఈశ్వర్ సహాయ్‌గారు, "బాబూజీ! మీరేమి విచారపడవద్దు. నేను ఈ కోటును లోపలికి త్రిప్పి కుట్టుతాను. అప్పుడు చూడడానికి క్రొత్తదిగా కనబడుతుంది" అని అనగానే 'వారు' చాలా సంతోషించారు. ఈశ్వర్ సహాయ్‌గారు కోటు యొక్క కుట్లన్నీ పూర్తిగా ఊడదీసి, లోపలి బట్టను వెలుపలికి, వెలుపలి దానిని లోపలికి వేసి మరల కుట్టారు. అప్పుడు ఆ కోటును చూడగానే మేమంతా ఆశ్చర్యపోయాము. ఎందుకంటే, అది చూడడానికి పూర్తిగా క్రొత్తదానిలాగా ఉన్నది. ఇక బాబూజీగారి ఆనందం చెప్పవలవికాదు. వారు, "ఈశ్వర్ సహాయ్‌జీ! ఇప్పుడు మరల నాకు 29 సంవత్సరాల వరకు ఈ కోటు గురించి ఎటువంటి బాధలేదు" అని అన్నారు. **బాహ్యంగా కూడా ఇంత నిరాడంబరంగా ఉన్నవారు మనకు ఎక్కడ కనబడతారు! ఒక్క నయాపైస కూడా వ్యర్థం కాకుండా ఉండడానికి, ఎప్పుడు కూడా 'వారు' ఎంతో జాగ్రత్తగా ఉండేవారు.**

ఒకసారి వారు, "ఈశ్వర్ సహాయ్‌జీ, ప్రింటింగ్ ప్రెస్ (ముద్రణాలయం) మరియు ఆఫీస్ (కార్యాలయం) కోసం రెండు గదులు నిర్మించాలి. అందుకుగాను ఇంటి ప్రాంగణంలోని కొంత స్థలాన్ని ఇస్తాను. కొన్ని ఇటుకలు, సున్నం కూడా నా దగ్గర ఉన్నాయి. ఎందుకంటే, మొన్నటి వరదల వలన ఇంటి ముందటి గేటు, గోడ పడిపోవడంవలన, వాటిని బాగు చేయించడానికి సామగ్రిని తెప్పించాను. అందులో కొంచెం సామాగ్రి మిగిలిపోగా, వాటిని దాచిపెట్టాను" అని అన్నారు. "బాబూజీ! పిల్లలు కూడా అందరు ఉన్నారు. ఆ సున్నం, ఇటుకలు మాకు ఇవ్వండి. ప్రెస్ మరియు ఆఫీసు, ఈ రెండింటిని కూడా ఈ సామగ్రితో నిర్మిస్తాము" అని ఈశ్వర్ సహాయ్‌జీ అన్నారు. మేము, పిల్లలందరం కూడా ఆ పనిలో నిమగ్నమైనాము. ఆ ప్రెస్ మరియు ఆఫీసు గదులను స్వయంగా ఈ ఈశ్వర్ సహాయ్‌గారే నిర్మించారు. అవి ఈనాటికి కూడా చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి. అప్పుడు వారు, **"ఈశ్వర్ సహాయ్‌జీ! నీవు నా కుడి భూజంవంటి వానివి. ప్రతి సేవలో, ప్రతి పనిలో ఎంతవరకంటే పిల్లల చదువు విషయంలో కూడా నీవు పాలుపంచుకుంటున్నావు" అని అన్నారు. వాస్తవానికి శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారి వంటి సేవభావం గల వారు ఇంకొకరు ఎవ్వరూ కూడా మన సంస్థలో లేరు.**

శ్రీ బాబూజీ మహరాజ్ అమితమైన మితవ్యయి. ఒక సెంటర్‌ను సందర్శించి మరొక సెంటర్‌కు వెళ్ళుతున్నప్పుడు, ఎవరైనా అభ్యాసులు వారితోపాటుగా వెళ్ళడానికి పట్టుబడితే 'వారు' ఎంతో ప్రేమతో ఈ విధంగా అనేవారు: "భాయీ! ఇప్పటికి మూడు రోజులు

నేను మీతోనే ఉన్నాను కదా! ఇక్కడ నా పని పూర్తయిపోయింది కాబట్టి ఇప్పుడు నేను ఇంకొక సెంటర్‌కు వెళ్ళుతున్నాను. ఇప్పుడు నీ మీద పని చేయడానికి ఇంకా ఏమీలేదు. ఎందుకంటే, నీ మీద నేను ఏ పనినయితే చేసానో దానిని జీర్ణం చేసుకోవడానికి నీకు నెలల తరబడి పడుతుంది. అందువలన నీవు నాతోపాటుగా వేరే సెంటర్‌కు రావడంవలన, వాళ్ళ మీద అనవసరమైన భారాన్ని కలిగించిన వాడివి అవుతావు. ఈ ప్రయాణం వలన డబ్బులు కూడా వృథాగా ఖర్చవుతాయి. నా జేబులో నుండి ఖర్చు అయినా, నీ జేబులో నుండి ఖర్చు అయినా డబ్బులు మాత్రం మన అందరివే కదా! వీటిని వృథాగా ఖర్చు చేయకూడదు" అని చెప్పి మనలను బుజ్జగించేవారు. ఒకవైపు ఇంత మితవ్యయంగా ఉంటూనే మరొక వైపు ఎవరైనా అభ్యాసుల పిల్లలకు వివాహం జరిగినపుడు, వాళ్ళకు పదకొండు రూపాయలు మనీ ఆర్డర్ చేయడం ఏ మాత్రం కూడా మరచిపోయేవారు కాదు. "బాబూజీ! ఇపుడు రోజు రోజుకు సత్సంగీల సంఖ్య పెరిగిపోతున్నది. ఇంత ఖర్చును మీరు ఎందుకు మీద వేసుకుంటున్నారు?" అని ఒకసారి శ్రీ ఈశ్వర్ సహాయ్‌జీ అడిగినపుడు 'వారు' ఈ విధంగా అన్నారు: "నేను ఈ మిషతో మన అభ్యాసులందరికి ఈ విధంగా బోధించాలనుకున్నాను. ఇటువంటి కార్యాలకు మనం ప్రతి ఒక్కరం కూడా పదకొండు రూపాయల చొప్పున పంపిస్తే, ఆ ఆభ్యాసీకి ధన సహాయం లభిస్తుంది కదా! అరవై మంది అభ్యాసులు ఈ విధంగా చేస్తే, ఆ ఆభ్యాసీకి ఆరు వందల అరవై రూపాయల సహాయం లభిస్తుంది కదా!" అని అన్నారు. శిక్షణ అనేది 'వారి' యొక్క ప్రతి మాటలోను, ప్రతి

చర్యలోను మనకు లభిస్తుంది.

ఒకసారి వారు, "భాయీ! మనం కొంచెంసేపు కబుర్లు చెప్పుకుందాము" అని అనగానే, వెంటనే శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు కలం, కాగితం తీసుకొని సిద్ధంగా ఉన్నారు. ఒక్కసారిగా వారు, **"భాయీ! అసలు నేనేమి పని చేస్తాను. పని అంతా కూడా మన లాలాజీ సాహెబ్ చేస్తారు. నా పని ఏమిటంటే, మానవుడిని మానవత్వం అనే పరిధిలోనికి తీసుకువచ్చి, అతనిని జాగృతం గావిస్తాను. ఆ తరువాత ఈశ్వరుడే స్వయంగా అతని మేలును చూస్తాడు"** అని అనగానే ఈశ్వర్ సహాయ్‌గారు, **"బాబూజీ! ఈశ్వరుని వద్దకు మమ్మల్ని చేర్చేది ఎవరు? ఎందుకంటే ఈశ్వరుని పరిధిలోనికి రానంతకాలం, 'అతడు' మాకు ఏ విధంగా సహాయం చేస్తాడు?"** అని అనగానే వెంటనే వారు, **"మంచిది భాయీ! నీవు మాకు అనుమతి ఇస్తే, లాలాజీ సాహెబ్ కృప వలన ఈ పనిని కూడా నేను పూర్తి చేస్తాను"** అని అన్నారు. మరల ఈశ్వర్ సహాయ్‌గారు, **"బాబూజీ! మమ్మల్ని 'అంతిమం' వరకు చేర్చాలని మీరు అన్నారు కదా! ఆ పనిని ఎవరు పూర్తి చేస్తారు?"** అని అడిగారు. అపుడు **'వారు' ముసి ముసి నవ్వులు నవ్వుతూ, "అంతిమం" అనేది అంతా కూడా మా సామ్రాజ్యం. మన లాలాజీ సాహెబ్ గారి కరుణాపూరితమైన చూపులతో, ఆ సేవను కూడా పరిపూర్ణమైన స్వేచ్ఛతో నేనే పూర్తి చేస్తాను"** అని అన్నారు. **"బాబూజీ! ఆ తరువాత పని చేయడానికి మీకు ఇంకా ఏమి మిగులుతుంది?"** అని శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు ప్రశ్నించగానే, వారు నోటిలోని హుక్కాను తీసి ప్రక్కన ఉంచి, **"శేషం యొక్క శేష భాగం వద్ద కేవలం నా**

**లాలాజీ సాహెబ్ యొక్క గొప్పతనం మాత్రమే ఉంటుంది.** సరే, ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దాము" అని అన్నారు. మేమంతా 'వారి' ముఖ ముద్రనే చూస్తూ నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నాం. 'వారు' చెప్పిన మాటలను అర్థం చేసుకోవడానికి అవి మాకు అతీతంగా ఉన్నాయి.

**"బాబూజీ! ప్రాణాహుతి సరియైన పద్ధతిలో మా లోపల పని చేస్తూన్నదని మేము ఎలా తెలుసుకోగలం?" అని ఒక అభ్యాసీ ప్రశ్నించినప్పుడు వారు, "ఇది చాలా సులభంగా తెలుసుకోవచ్చు. నీవు ప్రాణాహుతి యొక్క నిజమైన ప్రభావాన్ని తెలుసుకోవాలనుకుంటే నీ లోపల కలిగే పరివర్తనల కోసం నిరీక్షించాలి. మన జీవన విధానంలో నిరాడంబరత, స్థిరంగా మాట్లాడం, వ్యవహారిక విషయంలో సహజంగానే మహాత్ములవలె ఆత్మీయతతో కూడిన భావాలు మొదలైనవి – ఇవి అన్నీ కూడా మనలో ఆధ్యాత్మిక నిర్మాణం జరుగుతున్నదని సూచిస్తాయి. ఎప్పుడైతే ఆధ్యాత్మిక నిర్మాణం ప్రారంభమైనదో, ప్రక్క ప్రక్కనే వ్యక్తిత్వం యొక్క నిర్మూలన కూడా జరుగుతున్నదని మనం అర్థం చేసుకోవాలి" అని అన్నారు.**

ఒకసారి ఏ విషయాన్ని గూర్చి బాబూజీగారు చాలా సంతోషంతో ఉన్నారో తెలియదు కాని, 'వారు' తన గురుభాయీ అయిన పండిట్ రామేశ్వర్ ప్రసాద్‌జీతో, "బిటియాకు బహుమతి ఇవ్వాలని నాకు కోరికగా ఉంది" అని అనగానే, "ఇంకా ఆలస్యం దేనికి భాయి సాహెబ్! కాని ఒక్క మాట; మిమ్మల్ని మీరు అదుపులో ఉంచుకొని ఆ బహుమతిని ప్రసాదించండి. లేకపోతే మీ విశాల హృదయంచేత బహుకరించబడే ఆ కానుకను ఈమె భరించలేదు"

అని రామేశ్వర్‌జీ అనగానే, 'వారు' కొద్దిగా విచారపడి, "నా దగ్గర ఏమీ ఉంచుకోకుండా ఇస్తేగాని నా హృదయం శాంతించదు" అని అన్నారు. "సరే! బాబూజీ! మీరు పనిని ప్రారంభం చేయండి" అని రామేశ్వర్‌జీ అన్నారు. అప్పుడు బాబూజీగారు నన్ను పూజగదిలోనికి తీసుకువెళ్ళి, ధ్యానంలో కూర్చోమన్నారు. నేను వాళ్ళిద్దరి సంభాషణ అంతా విన్నాను. కాని నాకేమీ అర్థం కాలేదు. నేను కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చున్నాను. అప్పుడు 'వారు' పూజగదిలో పచార్లు చేస్తూ, ఎంతో తేజస్సుతో ప్రాణాహుతిని ప్రసారం చేయడం నాకు కనిపించింది. బహుశా 'వారు' ప్రసాదించే బహుమతులు 'వారి' అదుపులో లేనట్లుగా ఉంది. ఐదు నిమిషాలు గడిచిపోయాయని కాబోలు బయట నుండి శ్రీ రామేశ్వర్‌జీ గదిలోనికి వచ్చి, "భాయీ సాహెబ్! ఇంక చాలు. ఇప్పటికే మీరు బహుమానంగా బిటియాకు పిండ, బ్రహ్మాండ మండలాలమీద ఆధిపత్యాన్ని ప్రసాదించారు. ఇంకా బిటియా ఏమాత్రం శక్తిని కూడా భరించలేదు" అని అనగానే 'వారు' ఒక్కసారిగా ఉలిక్కిపడి, వెంటనే క్రింద కూర్చున్నారు. ఆ సమయంలో హృదయం బహుమతిగా చాలా పొందినదని మాత్రం నాకు అర్థమయ్యింది. కాని 'వారు' దయతో ప్రసాదించినటువంటి పిండదేశం మరియు బ్రహ్మాండ దేశాల మీద గల ఆధిపత్యాన్ని అంటే ఆ రెండింటిలోని శక్తిని నా సొంతం చేసుకోవడానికి నాకు మూడు సంవత్సరాలు పట్టింది. ఆ తరువాతనే నేను 'వారి'కి ఆ శక్తులను గురించి వ్రాసాను.

శ్రీ బాబూజీగారు దక్షిణ భారతదేశాన్ని సందర్శించి, తిరిగి ఇంటికి వచ్చేసరికి, ఇంటిలోని నౌకర్లు, వంటమనిషి, ఊడ్చేవారు

మరియు ప్రెస్‌లోని కార్యకర్తలు అందరు కూడా సమ్మెలో ఉండడం చాలాసార్లు జరిగేది. కాని 'వారి' స్వరంలో ఎటువంటి అద్భుతమైన మహిమ ఉన్నదో కాని, 'వారు' యాత్ర నుండి రాగానే, వాళ్ళందరి ఇళ్ళకు వెళ్ళి, ఒక్కసారి వాళ్ళను కలుసుకోగానే, మరల అందరు కూడా తమ తమ విధులకు వెంటనే హాజరు అయ్యేవారు. 'వారు' ఎంత దయాళువు అంటే, ఎవరైనా నౌకరుకు పంటి నొప్పి ఉంటే ఆ పన్నును పీకించుకోవడానికి పది రూపాయలు మరియు ఇంకొక ఐదు రూపాయలు పాలు త్రాగడానికి ఇచ్చేవారు. కాని స్వయంగా తమ ఊడిపోయే పన్నుకు మాత్రం త్రాడుకట్టి, ఎవరైనా చిన్న పిల్లవానితో నెమ్మది, నెమ్మదిగా కదిలిస్తూ దానిని ఊడదీయించేవారు. 'వారి' ఇంటిలోని మగ, ఆడ నౌకర్లు అందరు కూడా వారితో, "బాబూజీ! మేము మిమ్మల్ని విడిచిపెట్టలేకుండా ఉన్నాం. అందువల్లనే మీ ఇంటిముందు పడి ఉన్నాం" అని ఎల్లప్పుడూ అనేవారు. 'వారి' వ్యవహారం అందరిపట్ల ఎంతో ప్రేమ పూర్వకంగా ఉండేది. 'వారి'ని ధ్యాన పూర్వకంగా పరిశీలించినట్లయితే ఈ వ్యవహార విధానం అనేది 'వారి' బాహ్యరూపానికి ఒక సౌందర్యంలాగా కనబడుతుంది.

అమాయకత్వం అనేది వారిలోని ఒక అద్భుతమైన గుణం. 'వారి' కుమార్తెకు వివాహం జరిగింది; అప్పగింతలు అన్నీ అయిపోయి, పెళ్ళివారు అందరు వెళ్ళిపోయిన తరువాత శ్రీ ఈశ్వర్ సహాయ్ గారు వారితో, "బాబూజీ! ఈ పెళ్ళి హడావుడిలో మీరు నాలుగు రోజుల నుండి అసలు నిద్రపోలేదు, కాబట్టి ఇప్పుడు మీరు విశ్రాంతి తీసుకోండి" అని అనగానే 'వారి'కి నిద్ర విషయం అప్పుడు గుర్తుకు వచ్చినది కాబోలు "ఈశ్వర్ సహాయ్‌జీ! నిజంగానా! సరే;

ఇప్పుడు నేను నిద్రపోతాను. ఈ పని అంతా నీవు చూసుకో" అని 'వారు' అన్నారు. "సరే! బాబూజీ!" అని ఈశ్వర్ సహాయ్‌జీ అనగానే 'వారు' నిజంగానే ఒక చిన్నపిల్లవానిలాగా నిద్రపోయారు. మరల సాయంత్రానికి నిద్ర నుండి లేచి, "చూశావా! ఈశ్వర్ సహాయ్‌జీ! లాలాజీ సాహెబ్ నాకు నిద్రపోవాలి అనే ఆలోచనే ఇవ్వలేదు. కాబట్టి నాకు నిద్ర విషయం గుర్తుకురాలేదు. నిద్ర పోవాలి అనే అలోచనే రాలేదు. కాబట్టి అలసట కూడా ఏమీ అనిపించలేదు. ఎందుకంటే, లాలాజీగారే స్వయంగా ఈ అలసటను లేకుండా చేసారు. ఇప్పుడు నీవే చెప్పాలి. ఇటువంటి సద్గురువు ఎవరికైనా లభించారా? ఇది కేవలం నా యొక్క అదృష్టం మాత్రమే" అని అన్నారు.

బాబూజీ గారు అతితక్కువ స్థాయిలో ఉన్నవారికి, సామాన్యులకు కూడా ఎంతో గౌరవ, మర్యాదలను ఇచ్చేవారు. 'వారి' కుమారుడు దినేష్ మరణించినప్పుడు 'వారి'ని కలుసు కోవడానికి వచ్చినటువంటి బంధువులు, ఇరుగుపొరుగువారు అందరు కూడా, "బాబూజీ! కొంచెం ఏడ్వండి!" అని అన్నప్పుడు వారు, "ఏడ్వడానికి అసలు నా దగ్గర సమయం ఎక్కడ ఉంది. నా చప్రాసీ ఈ విధంగా అనేవాడు: **వెళ్ళిపోయిన వాళ్ళకోసం ప్రార్థన చేయాలి, ఉన్న వాళ్ళకు సేవ చేయాలి** అని చెప్పేవాడు. చూడండి! అతను ఎంత మంచిమాట చెప్పాడో" అని అన్నారు.

శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారంటే వారికి చాలా ఇష్టం. **ఒకసారి వారు, "ఈశ్వర్ సహాయ్‌జీ! నీది చాలా విశాలమైన హృదయం. నీవు ఏది కావాలనుకుంటే అది నాకు క్షణాల్లో ఇవ్వగలవు" అని అనగానే "హుజూర్! మీకు ఇవ్వడానికి మా దగ్గర ఏముంది? ఏమీ**

**లేదు" అని వినయపూర్వకంగా ఈశ్వర్ సహాయ్‌జీ అన్నారు. అపుడు వారు, "నీ దగ్గర అంతా ఉంది. ఒకవేళ నీ దగ్గర ఏమీ లేకపోతే నేను ఇక్కడకు రావలసిన అవసరమే ఉండేది కాదు. నేను నీ నుండి 'నా' వస్తువును తీసుకుపోవడానికి వచ్చాను. అంటే నీవద్ద ఉన్నదంతా తీసుకొని, నిన్ను నిజమైన మానవునిగా సరిదిద్ది, 'అంతిమం' వద్దకు తీసుకుపోవడానికి ఇక్కడకు వచ్చాను"** అని అనగానే శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారి నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి.

ఒకసారి 'వారు' చాలా ఉత్సాహమైన ధోరణిలో ఉండి, "ఈశ్వర్ సహాయ్‌జీ! ఈరోజు నేను ఒక రహస్యాన్ని చెబుతాను విను; ప్రజలందరు నా నుండి ఆధ్యాత్మికతను పొందడానికి వస్తారు. కాని నేను మాత్రం వాళ్ళందరిని పిచ్చివాళ్ళుగా తయారుచేస్తున్నాను. ప్రజలు నావద్దకు రాగానే, నేను వాళ్ళను పిచ్చివాళ్ళుగా మార్చుతున్నానని వాళ్ళకు వెంటనే తెలిసిపోతుంది. ఎందుకంటే, 'వారే (బాబూజీ) స్వయంగా దోచుకోబడ్డారు. అటువంటప్పుడు వారు మమ్మల్ని లక్ష్యంవద్దకు ఏ విధంగా చేర్చగలరు?' అని వాళ్ళంతా అనుకుంటారు. మీరు కళ్ళు మూసుకొని, ధ్యానంలో కూర్చొని, ఆ అనుభవాన్ని పొందండి అని నేను అంటాను. కాని ధ్యానంలో ఏమి లభించినదో వాళ్ళకు ఇపుడు ఏమీ అర్థం కాదు. సోదరా! అందువలన నేను వీళ్ళందరిని ఎండమావుల్లాగా ఆకర్షిస్తున్నాను. కాని వాళ్ళలో చివరకు 'నేను' అనేది పూర్తిగా దోచుకోబడుతుంది. ఇప్పుడు నీవే చెప్పు. వీళ్ళందరినీ నేను పిచ్చివాళ్ళగా మార్చుతున్నానా? లేదా?" అని అన్నారు. 'వారి' హాస్యపు మాటలు ఈ విధంగా ఉంటాయి.

హాస్యంతో కూడిన మరొక సంఘటనను 'వారు' ఒకసారి

మాకు తెలిపారు. 'వారు' ఈ విధంగా చెప్పారు: "షాజహాన్‌పూర్ ఆశ్రమం తయారైన తరువాత శ్రీ లాలాజీ సాహెబ్ ఈ విధంగా అన్నారు– కూర్చోవడానికి స్థలం తక్కువ అయ్యింది, అని నీవు అనే వాడివి. కాని ఇప్పుడేమో, ఇంత పెద్ద భవనం అంటే ఇంత పెద్ద ఆశ్రమాన్ని నిర్మించావు– అని. అవును; ఇది వాస్తవమే. ఎందుకంటే, ధ్యాన మందిరానికి స్థలం సరిపోవడంలేదని ఫిర్యాదుచేసి నేను వారి నుండి డబ్బులు ఎక్కువగా కోరాను" అని శ్రీ బాబూజీగారు మాతో అన్నారు. అప్పుడు శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు నవ్వుతూ, హుజూర్! (బాబూజీ గారు) "మరి ఏమని జవాబు చెప్పారు?" అనగానే 'వారు' వెంటనే "హుజూర్! (లాలాజీ సాహెబ్) మీరు యథార్థాన్నే చూస్తారని నేను భావిస్తున్నాను అని అన్నాను" అని మాకు తెలిపారు. "ఇంకేమంది నేను ఈ విధంగా విన్నవించుకోగానే శ్రీ లాలాజీ సాహెబ్ ముసిముసి నవ్వులు నవ్వారు. నేను మరల సింహంలాగా మారిపోయాను" అని అనగానే మేమంతా 'వారి' తెలివిని చూసి ఆశ్చర్యపోయాము.

అభ్యాసులను తమ మాటలతో నొప్పించడమనేది 'వారు' ఎరుగనే ఎరుగరు. "బాబూజీ! నాకు చదవడం, వ్రాయడం రాదు. అందువలన మీ పుస్తకాలు ఏమీ చదువలేను, ఏమీ అర్థం చేసుకోలేను" అని ఒక అభ్యాసీ సోదరి విన్నవించుకోగానే, వెంటనే వారు, "అయితే నీకు భగవంతుడు అందరికంటె ముందుగా లభిస్తాడు. ఎందుకంటే, భగవంతునికి కూడా చదవడం, వ్రాయడం రాదు. పాపం, ఆ కాలంలో 'అతడు' చదువుకోవడానికి పాఠశాలలు లేవు. అందువల్లనే భగవంతుడు శ్రేష్ఠమైన జ్ఞాన భాండాగారం.

ఎప్పుడైతే మనుష్యుడు భగవంతునిలో లీనమవుతాడో అపుడే 'జ్ఞాని' అని పిలువబడతాడు" అని అన్నారు.

**ఒకసారి 'వారు' చాలా సంతోషంతో ఉండి, "భాయీ! సాక్షాత్కారం కొంతమందికే కలుగుతుంది. ఎందుకో తెలుసా? ఆధ్యాత్మిక దశలు అందరికి వస్తాయి. వాటి యొక్క ఆనందాన్ని కూడా అందరు అనుభవిస్తారు. కాని ఎవరైతే కేవలం 'లక్ష్యం' మీదనే దృష్టిని ఉంచి, ఆధ్యాత్మిక దశల యొక్క ఆనందాన్ని అనుభవిస్తూ ప్రయాణం చేస్తారో వాళ్ళకు మాత్రం సాక్షాత్కారం తప్పక సిద్ధిస్తుంది" అని అన్నారు. మరల ఒకరోజు, "ప్రజలు నన్ను మహాత్మునిగా భావిస్తారు. కాని నాలోని ప్రత్యేకత ఏమిటంటే, ఎవరైతే తమ దృష్టిని నా మీద నిలుపుతారో వాళ్ళలో చిన్న-పెద్ద, ఎక్కువ-తక్కువ మొదలైన భేదభావాలన్నీ కూడా వెనువెంటనే మాయమవుతాయి. ఇదే నా యొక్క గొప్పతనం" అని అన్నారు.**

ఒకరోజు మేమందరం 'రూపం' మీద ధ్యానాన్ని గురించి చర్చించుకుంటున్నాం. 'వారు' హుక్కా పీల్చుకుంటూ నిశ్శబ్దంగా మా మాటలన్నీ వింటున్నారు. ఉన్నట్లుండి వారు, "ఒకవేళ నీవు నా రూపాన్ని నీ హృదయంలో ఉంచుకొన్నట్లయితే నేను నీ లోపల, నీవు నా లోపల బందీగా ఉంటాము. ఇద్దరం కూడా బందీలుగానే మిగిలిపోతాము. కాని నా లాలాజీ సాహెబ్ నన్ను పరిపూర్ణమైన స్వేచ్ఛతో ఇక్కడకు పంపారు. నీవు నన్ను చూస్తూ ఉంటావు. నేను నిన్ను చూస్తూ ఉంటాను. దీని వలన నీకు ఎటువంటి ప్రయోజనం కూడా చేకూరదు" అని అన్నారు. మరల కొంచెం సమయం తరువాత, **"ఎప్పుడైనా సరే మనం ఎవరైనా మహాత్ముని ఆశ్రయంలో**

**ఉండాలనుకుంటే, మనం ఎల్లవేళలా ఆ మహాత్ముని యొక్క 'కృప' అనే నీడలోనే ఉండాలి. ఈ విషయాన్ని మనం ఎల్లవేళలా మన దృష్టిలో ఉంచుకోవాలి. ఆ మహాత్ముని అభయహస్తం క్రింద మనం నిరంతరం ఉన్నప్పుడే మన ఆధ్యాత్మిక ప్రయాణం చాలా సంతోషంగా, చాలా వేగంగా జరుగుతుంది. అప్పుడే నీవు భగవత్ సామ్రాజ్యంలో ప్రవేశించగలవు. సూర్యుని నుండి నీవు ఎంత దూరంగా ఉంటే నీ యొక్క నీడ అంత పెద్దగా కనబడుతుంది. కాని నీవు ఒకవేళ సూర్యుని క్రిందనే నిలబడి ఉన్నప్పుడు నీ యొక్క నీడ (అహంభావం) నీలోనే కలిసిపోతుంది" అని అన్నారు.**

**"బాబూజీ మీ పద్ధతిలో అభ్యాసులు సాధనను హృదయం మీద ధ్యానంతో ప్రారంభం చేస్తారు. కాని పది సంవత్సరాల తరువాత కూడా వాళ్ళు హృదయం మీదనే ధ్యానం చేస్తూ ఉంటారు. అటువంటప్పుడు అతడు పురోగమిస్తున్నాడని ఎలా చెప్పగలం?" అని ఎవరో ఒకతను ప్రశ్నించినపుడు వారు నవ్వి, "చెట్టు ఎంత పెద్దగా పెరిగినా కూడా, నీళ్ళు దాని వ్రేళ్ళలోనే పోస్తాము కదా!" అని అన్నారు.**

అభ్యాసీల యొక్క భోజన విషయంలో 'వారు' ఎంతో శ్రద్ధ తీసుకునేవారు. ఒకసారి దక్షిణ భారతదేశం నుండి వచ్చిన అభ్యాసీకి త్రాగడానికి బాబూజీ ఇంటిలోనివారు పాలు ఇచ్చినప్పుడు, 'వారు' వెంటనే కుర్చీలో నుండి లేచి, లోపలికి వెళ్ళి, చిటికెడు పసుపును తీసుకువచ్చి, "ఇది తీసుకొని పాలలో వేసుకో, నీకు అలవాటు కదా!" అని అనగానే మేమంతా ఆశ్చర్యపోయాం. ఇది ఒక చిన్న ఉదాహరణ.

మనకు ఏదైనా అర్థం చేసుకునే విధంగా చెప్పాలంటే, ముందుగా వారే స్వయంగా అది చేసి చూపించేవారు. ఒకరోజు వారు 'మాలిన్' అనే ఆడ నౌకరును పిలిచారు. ఆమె వారివద్దకు రాగానే వారు, "చూశారా! నేను పిలవగానే ఈమె ఇక్కడకు వచ్చినది. కాని ఇది నా పిలుపు యొక్క గొప్పతనం కాదు. ఇది పిలిచేవాళ్ళ 'ధ్యాస' యొక్క గొప్పతనం. నేను మాలిన్‌ను పిలుస్తున్నప్పుడు నా ధ్యాస అంతా కూడా ఆమె మీదనే కేంద్రీకరించబడింది. అందువలన నా ఆలోచనా ధార ఆమె హృదయాన్ని తాకగానే ఆమె నా వద్దకు వచ్చినది. మరి మిగతావాళ్ళు అందరు కూడా నా పిలుపును విన్నారు. కాని మాలిన్‌ను మాత్రమే ఇక్కడకు పంపారు. చూశారా! భగవంతుని యొక్క ప్రకృతిలోని ఈ గొప్పతనాన్ని మీరు గమనించారా!" అని అన్నారు. మరల వారు, **"చిన్న పిల్లవాని యొక్క ధ్యాస కేవలం ఏడవడం మీదనే ఉంటుంది. కాని తల్లి యొక్క ధ్యాస ఎప్పుడూ కూడా తన కుమారుని మీదనే ఉంటుంది. ఇక్కడ రెండు వేరు వేరు పరిస్థితులు. కాని రెండిటిలోను ఫలితం ఒక్కటే. అదే విధంగా మనం ఎంతవరకైతే ఆధ్యాత్మికంగా చిన్న పిల్లలుగా ఉంటామో, అంతవరకు మన సద్గురువు శ్రీ లాలాజీ మహరాజ్ యొక్క ధ్యాస ఎల్లవేళలా మన మీదనే ఉంటుంది. అందువలన చిన్న పిల్లల ఏడుపువంటి మన పిలుపు వారి ఆలోచనా ధారను త్రాకుతుంది. కాని ఎప్పుడైతే అభ్యాసీ ధ్యానంలో పరిపక్వమైన స్థితిని పొందుతాడో, అప్పుడు మన ధ్యానం భగవంతునిలో కేంద్రీకృతమై ఉంటుంది. ఫలితంగా ఈశ్వరీయ ధార మనకు ఏదో ఒకటి ప్రసాదిస్తూనే ఉంటుంది. ఇదే మన ధ్యానం యొక్క మహత్యం" అని అన్నారు.** ఇంత సరళమైన

ఉదాహరణతో 'వారు' మనకు ఎంతో గొప్ప విషయాన్ని తెలియ చెప్పుతున్నారు.

ఒకసారి వారు **"ప్రజలు ధ్యానాన్ని ప్రారంభించగానే తమలో ప్రేమ యొక్క అత్యున్నతమైన స్థితి ఏర్పడిందని భావిస్తారు. కాని నా అభ్యాస కాలమంతా కూడా దాదాపు ఇరవై రెండు సంవత్సరాలు ఆవేదనాత్మకమైన తపనతోనే గడిచిపోయింది. ఎవరికైనా అదృష్టంకొద్దీ ఇటువంటి అవేదనతో కూడిన స్థితి కొన్ని రోజులు లభించిన చాలు. అతనికి ఈ జీవితం నుండి ముక్తి లభించినట్లుగా భావింపవచ్చు. ఈ స్థితి శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క కృప వలన నాకు అదృష్టంగా లభించింది" అని అన్నారు.** మరల వారు, "సహజమార్గ పద్ధతి యొక్క ఆధారం సత్‌పదార్థం. ఉదాహరణకు మనం 'ఏ' అనే బిందువు వద్ద యాత్ర పూర్తి చేస్తూన్న సమయంలో, మనకు 'బి' అనే బిందువు యొక్క ప్రతిబింబం కనబడుతుంది. కాని ఎప్పుడైతే 'ఏ' అనే బిందువు వద్ద కల స్థితి సూక్ష్మంగా మారి, ఆ బిందువులోనే పూర్తిగా లయమవుతుందో అపుడే మనం 'బి' అనే బిందువును చేరుకోగలం. ఈ బిందువులవద్ద కల స్థితులను గమనించటానికి నిరంతరం చాలా మెలకువతో కూడిన దృష్టి అవసరం" అని వివరించారు.

అవి శీతాకాలం రోజులు. బయట వరండాలో శ్రీ బాబూజీగారు కంబళిని కప్పుకుని కుర్చీపై కూర్చుని ఉన్నారు. వారు "అమ్మా! చలి అధికంగా ఉన్నది. చలి ఎక్కువ అనిపించినకొద్దీ నేను ఎక్కువగా మాట్లాడతాను. అందువలన నాకు చలి కొద్దిగా తగ్గిపోయినట్లుగా ఉంటుంది" అని అన్నారు. 'వారు' నా తల్లిగారిని

'అమ్మా' అని సంబోధించేవారు. మరల వారు, "అమ్మా! ఇపుడు నేను నీకు ఒక గొప్ప రహస్యాన్ని చెబుతాను" అని అనగానే మా అందరి దృష్టి 'వారి' ముఖారవిందముపై కేంద్రీకరించబడింది. ఇటువంటి సమయంలో 'వారి' ముఖంలో దివ్య తేజస్సు ప్రకాశించి, ఆ సమావేశానికే సౌందర్యాన్ని తీసుకు వచ్చింది. "అమ్మా! నాకు అందరికంటే ఎక్కువ ఎవరు ఇష్టమో నీకు తెలుసా?" అని, వారే స్వయంగా మరలా "ఎవరైతే నన్ను ఎప్పుడు కూడా జ్ఞాపకం చేసుకోరో, వారంటే నాకు చాలా ఇష్టం" అని అన్నారు. మేమందరం నోట మాట రాక వారినే చూస్తూ, మమ్మల్ని మేము మరచిపోయాం. మరల 'వారు' నెమ్మదిగా ఈ విధంగా అన్నారు: "ఎందుకంటే, అతను పూర్తిగా నా స్మరణలోనే (నిరంతర ధ్యానం) మునిగిపోయి ఉంటాడు. కాబట్టి నా దృష్టి కూడా నిరంతరం అతని మీదనే నిలిచిపోయి ఉంటుంది" అని అన్నారు.

నేను మిషన్‌లో చేరిన ఆరు, ఏడు మాసాల తరువాత శ్రీ బాబూజీగారి సతీమణి అంటే మా ప్రేమమూర్తి అయిన మాతాజీ మరణించినట్లు గుర్తు. ఈ వార్త తెలియగానే మేమందరం ఎంతో దుఃఖంతో షాజహాన్‌పూర్‌కు చేరుకున్నాం. అప్పుడు 'వారి' పిల్లలందరు కూడా చిన్నవాళ్ళు. పెద్ద కొడుకు ప్రకాష్ అప్పుడు 'లా' చదువుతున్నాడు. ఆయనకంటే చిన్నవాళ్ళు ఇంకా ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. అందరికంటే చిన్నవాడు అయిన సర్వేష్ వయస్సు ఆ సమయంలో రెండున్నర సంవత్సరాలు మాత్రమే. సర్వేష్ అప్పుడు చాలా అనారోగ్యంగా ఉండేవాడు. పిల్లలందరిని ఈ పరిస్థితిలో చూడగానే మాకు చాలా దుఃఖం

కలిగింది. ఆ రోజు సాయంత్రం 'వారి'కి అత్యంత ప్రియమైన గురుభాయి శ్రీ రామేశ్వర్‌జీ (శ్రీ బాబూజీ గారు వీరికి తమ 'సత్యోదయం' పుస్తకాన్ని అంకితం చేసారు) వద్ద కూర్చున్నాము. వారు మాకు ఈ విధంగా తెలిపారు: "నేను నా జీవితంలో కొంత భాగాన్ని వదినెగారికి (అంటే శ్రీ బాబూజీ సతీమణిగారికి) ధారపోద్దామని అనుకొన్నాను. కాని బాబూజీగారు, ఆ విధంగా చేయవద్దు. ఈ సమయంలో ఈమెకు ఏది అవసరమో అది మాత్రమే చేయమని నన్ను ఆదేశించారు" అని తెలిపారు. బాబూజీగారు రామేశ్వర్‌తో ఇంకా "రామేశ్వర్‌జీ! నీవు నా కుడి భుజం వంటి వానివి. నీ అమూల్యమైన జీవితాన్ని లాలాజీ సాహెబ్ యొక్క పని కొరకు మాత్రమే వినియోగించాలి" అని అన్నారని రామేశ్వర్‌జీ మాకు తెలిపారు. రామేశ్వర్‌జీ ఇంకా మాకు ఈ విధంగా తెలిపారు: "మాతాజీ యొక్క శరీరం దివ్యశక్తితో ఎంతగా నిండి పోయిందంటే (చార్జ్ అయ్యిందంటే) అంతిమ సమయంలో, ఆమె పాదాలను స్పృశించినటువంటి ఇరుగు పొరుగు స్త్రీలకు, ఆమె కూతుళ్ళకు ఆ దివ్యశక్తి 'కరెంట్ షాక్' లాగా తాకి వాళ్ళంతా తమ దుఃఖాన్ని మరచిపోయే విధంగా చేసింది.

మాతాజీ మరణం తరువాత ఇంటి వ్యవస్థంతా వంట మనుష్యులు, నౌకర్లు చూసుకొనేవారు. వీళ్ళందరి నియామకాన్ని బాబూజీగారు చూసుకునేవారు. కోర్టు కేసుల నుండి ఇంటిలోని ఆవులకు, దూడలకు నీళ్ళు పెట్టడం, మొదలైన కార్యక్రమాలన్నింటిని 'వారే' స్వయంగా నిర్వహించేవారు. మనందరికి ఆశ్చర్యకరమైన మరియు శిక్షణా ప్రదమైన విషయం ఏమిటంటే, ఈ ప్రాపంచికమైన

పనుల నుండి తప్పుకోగానే, తిరిగి 'వారు' శ్రీ లాలాజీ సాహెబ్‌లో మునిగిపోయేవారు. "బూడిదకు తనదంటూ కొంత వ్యక్తిత్వం ఉంటుంది కాని బూడిద కూడా బూడిదగా మారినపుడు దానిని మీరు ఏమంటారు?" అని 'వారు' అనేవారు. ఈ దివ్య సూక్తుల యొక్క అర్థాన్ని మనలో ఎవరు అర్థం చేసుకోగలరు?

'వారి' కథనం ప్రకారం **నిరాడంబరతలోని దైవీయ స్థితి మన అంతరంగాన్ని ఏదీ కూడా మలినం కానివ్వకుండా కాపాడుతుంది. అంటే ఆ దివ్యశక్తి మన అంతరంగంలోకి ఎటువంటి మలినం కూడా ప్రవేశించకుండా చేస్తుంది.** ఒకసారి ఒకరు, "బాబూజీ! 'జ్ఞానం' గురించి పుస్తకాలలో చాలా వ్రాశారు. కాని దివ్యత్వం అనే మీ పుస్తకంలో 'జ్ఞానం' అంటే ఏమిటి? అని అడిగారు. వెంటనే వారు, "జ్ఞాన రహిత జ్ఞానం – 'నేను' అనేది పూర్తిగా కోల్పోయిన తరువాత సద్గురువు కృపవలన లభించే జ్ఞానమే జ్ఞాన రహిత జ్ఞానం" అని అన్నారు. ఈ మాటలన్నింటిని మేము విన్నప్పుడు ఇవి వినడానికి అతీతంగా ఉన్నట్లుగా అనిపించేది. వాటిని విన్నా కాని అవి విన్నట్లుగా అనిపించేది కాదు. 'వారు' చెబుతుంటేనే మాకు మంచిగా అనిపించేది.

**'వారు' చెప్పే ఈ విషయాలన్నీ కూడా కేవలం 'సాధన' ద్వారా మాత్రమే మనం పొందగలమని నా అనుభవం నాకు తెలిపింది. ఒకసారి ఒక అభ్యాసీ సోదరుడు, "అభ్యాసులందరు కూడా ప్రతిరోజు బాబూజీగారికి తమ హాజరును తెలపాలి" అని ఒక సలహా నిచ్చినపుడు వారు, "అప్పుడప్పుడు మీరంతా నా హాజరును కూడా తీసుకోవాలి. నా హాజరు మీకు ఎల్లవేళలా**

**దొరుకుతుంది. ఎందుకంటే, ఈ పని కోసమే నేను హాజరయ్యాను. కాని అభ్యాసులు మాత్రం మాకు కుటంబ సమస్యలు ఉన్నాయని గైరు-హాజరు అవుతారు. కాని నా విషయంలో మాత్రం అటువంటి సాకులేమీ లేవు" అని అన్నారు.**

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నేను కూడా ఫలానా సెంటర్‌కు మీతోపాటుగా రావచ్చునా?" అని అడిగినప్పుడు 'వారు' నెమ్మదిగా ఇలా అన్నారు: **"ప్రజలంతా నా వెనకాలే రావాలని ఎందుకు కోరుకుంటారు? నేను కోరేది ఏమిటంటే, నేను ప్రజల వెనకాలే పరిగెత్తేట్లుగా వాళ్ళంతా కృషి చేయాలి" అని అన్నారు.** ప్రేమతో కూడిన ఇటువంటి స్థితిని పొందితేగాని మనకు ఈ మాటలు అర్థం కావు. **ఒకసారి ఒక అభ్యాసీ 'వారి'కి ఈ విధంగా లేఖ వ్రాసాడు: "బాబూజీ! నేను మీ వద్దకు, షాజహాన్‌పూర్ రావాలనుకుంటున్నాను. దయచేసి నాకు అనుమతిని ఇవ్వండి" అని. కాని ఆ అభ్యాసీ 15 రోజుల క్రితమే షాజహాన్‌పూర్ వచ్చి బాబూజీ గారిని సందర్శించి వెళ్ళిపోయాడు. అపుడు బాబూజీగారు ఈ విధంగా జవాబు వ్రాసారు: "నా వద్దకు రావడానికి అనుమతి అవసరం లేదు. నన్ను నీ దగ్గరే, నీలోనే వెదికితే, నీవు షాజహాన్‌పూర్ పేరు మరచిపోతావు. మరల నీకు డబ్బులు కూడా మిగులుతాయి" అని వ్రాశారు.**

ఒకసారి ఏదో ఒక సందర్భంలో 'వారు' నాకు ఈ విధంగా వ్రాశారు: **"ఇప్పుడు ధరలు చాలా పెరిగినందున ప్రజలు కూడా నా జీతాన్ని పెంచాలని నేను కోరుకుంటున్నాను. కాని నా జీతం అంతగా ఖరీదైనది కాదు. మీ 'స్మరణ' నా వద్దకు చేరితే చాలు"**

అని వ్రాసినపుడు, ఆ లేఖ చదవగానే నా మనస్సు అంతా దుఃఖ పూరితమైనది. కాని ఆ సమయంలో నేనేమి అర్థం చేసుకోగలను.

ఒకసారి ఒక విదేశీ అభ్యాసీ సోదరి బాబూజీగార్కి ఈ విధంగా లేఖ వ్రాశారు: "మాస్టర్! మీరు మా సెంటర్‌కు ఎప్పుడు వస్తారు? మమ్మల్ని మీ దగ్గరకు ఎప్పుడు రమ్మంటారు?" అని వ్రాసినప్పుడు 'వారు' ఈ విధంగా వ్రాశారు: "నాకు మిషన్‌కు సంబంధించిన పనులు చాలా ఉన్నాయి. నీవు ఖాళీగానే ఉన్నావు కదా! రోజూ ఇక్కడకు వచ్చి నన్ను కలుసుకొని వెళ్ళు" అని వ్రాశారు. శ్రీ బాబూజీగారి స్నేహ పూర్వకమైన ఈ మాటలు వాస్తవానికి మనందరికి ఒక హెచ్చరికగాను, ప్రేమతో కూడిన ఒక సవాలుగా ఉన్నాయి. **శ్రీ బాబూజీ మహరాజ్ గారు సర్వవ్యాపి, సర్వశక్తి మంతులు. వారిని కలుసుకోవడానికి అంటే వారి సాక్షాత్కారాన్ని పొందడానికి, మనమంతా 'వారి' దివ్య ప్రేమలో మునిగి కృషి చేయాల్సి ఉన్నది.**

ఒకసారి ఒక వ్యక్తి శ్రీ బాబూజీ మహరాజ్‌గారిని కలుసుకోవడానికి వచ్చి, తాను 'సమాజ సేవకుడ' నని పరిచయం చేసుకొని, తాను చేసిన సమాజ సేవను గురించి వర్ణించడం ప్రారంభం చేసాడు. 'వారు' హుక్కా పీల్చుకుంటూ నిశ్శబ్దంగా వింటున్నారు. ఇటువంటి సందర్భంలో, అంటే ఎవరైనా తన స్వంత విషయాలను గురించి గొప్పలు చెపుతుంటే 'వారు' జోరుగా, కొద్దిగా ఎక్కువ శబ్దం వచ్చే విధంగా హుక్కా పీలుస్తారు. కొంత సమయం తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోగానే బాబూజీగారు ఈ విధంగా అన్నారు: "నిజం చెప్పాలంటే, ఆయన ఉట్టుట్టి సేవకుడు మాత్రమే. **నిజమైన**

**సమాజ సేవకుడిని నేనే. శ్రీ లాలాజీ సాహెబ్‌గారి కృప వలన, ప్రాణాహుతి శక్తి ద్వారా ఈ సమాజం యొక్క ఆలోచనా సరళిని ఆధ్యాత్మికతవైపు మరల్చి, సత్సంగముతో కూడిన సమాజంగా మార్పుచేసే ప్రయత్నంలో నేను లీనమై ఉన్నాను" అని అన్నారు.**

ప్రజలు చిన్నపిల్లల్లాగా 'వారి'ని రకరకాల ప్రశ్నలు అడిగేవారు. వాళ్ళ తెలియనితనానికి, వాళ్ళను నొప్పించకుండా వాళ్ళను గౌరవిస్తూ, వాళ్ళకు జవాబులు చెప్పేవారు. ఒకసారి ఒక అభ్యాసీ ఒక నిష్ప్రయోజనమైన ప్రశ్నను ఈ విధంగా అడిగాడు: "బాబూజీ! ఋషులు తమ శరీరాలను ఏ విధంగా అంటే ఆ విధంగా మార్చుకొని నాలుగు వేల సంవత్సారాల వరకు ఏ విధంగా జీవించగలుగుతారు?" అని. అపుడు శ్రీ బాబూజీగారు ఈ విధంగా తెలిపారు: "ఈ శరీరం నశించే సమయం వచ్చినదని ఋషులకు తెలియగానే వారు తమ ఇచ్ఛాశక్తి ద్వారా వయస్సు అనే తాళం చెవి త్రిప్పి, తమ జీవితకాలాన్ని పొడిగించుకుంటారు. ఉదాహరణకు గడియారంలో పన్నెండు కావడానికి ఒక నిమిషానికి ముందుగా దానిని వెనుకకు తీసుకొని వచ్చినట్లయితే అది మరల ఒకటి నుండి నడవడం ప్రారంభించి పన్నెండును చేరుకుంటుంది" అని అన్నారు. అప్పుడప్పుడు 'వారు' నవ్వుతూ, "మనం మన అభిరుచులకు ప్రేమ అనే పదాన్ని ఉపయోగిస్తాం. కాని **ఎవరైనా అత్యున్నతమైన దానిని తమ జీవిత లక్ష్యంగా నిర్ణయించుకొన్నప్పుడు వారికి అక్కడి నుండే ప్రేమ, భక్తి యొక్క సహాయం లభిస్తుంది.** గాలిపటాన్ని ఎగురవేయు వానిని గాలిపటాలు ఎగురువేసేవాడు అని అంటారు. అంతేకాని గాలిపటాలను ప్రేమించువాడు అని అనరు" అని తెలిపారు.

ఒకసారి సోదరులు డాక్టర్ వరదాచారిగారు, "బాబూజీ! మీరు సామాన్యమైన పదాలను ఉపయోగించి ఇంత చిన్న పుస్తకాలను వ్రాశారు. పండితులు మీ పుస్తకాలను కనీసం ముట్టుకోను కూడా ముట్టుకోరు" అని అనగానే 'వారు' వెంటనే, **"సత్‌పదార్థం మీద ఎప్పుడూ కూడా గ్రంథాలు వ్రాయబడలేదు. సమస్త మానవాళిని 'అంతిమం' వద్దకు తీసుకుపోవాలనే ఒక సంకల్పంతో వచ్చాను. కాబట్టి కనీసం ఆ కొద్దిగానైనా వ్రాయగలిగాను** లేకపోతే సత్పదార్థం మీద ఏమి వ్రాయగలుగుతాము? అని అన్నారు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మీరు ఫలానా వ్యక్తితో ఎందుకు సరళంగా వ్యవహరించారు?" అని అడిగినప్పుడు, 'వారు' వెంటనే ఈ విధంగా జవాబు నిచ్చారు: **"పెద్దల నడవడి విషయంలో మనం ఎటువంటి ప్రశ్నలు వేయకూడదు. వాళ్ళు ఏది బోధిస్తే, అది మనం ఆచరించి, దాని నుండి నీతిని గ్రహించాలి"** అని అన్నారు. 'వారు' మనకు ఈ విధంగా శిక్షణా ప్రదమైన సందేశాన్ని ఇచ్చేవారు – **"ఒకవేళ మంచి మనుష్యునిగా మారాలంటే, పెద్దవాళ్ళ యొక్క మంచితనంతో సంబంధం ఏర్పరుచుకొని, దానిని స్థిరంగా ఉంచుకోవాలి. నేనైనా సరే, ఇంకా ఏ మహాత్ముడైనా సరే నీకు సాక్షాత్కారం కావాలంటే, లక్ష్యంతో సంబంధాన్ని ఏర్పరచుకొని, దానిని స్థిరంగా ఉంచుకోవాలి" అని అనేవారు.**

ఒకసారి తిరుపతిలో డాక్టర్ వరదాచారిగారు నవ్వుతూ "బాబూజీ! నేను ఇంతగా మాట్లాడుతాను కదా! ఒకవేళ మధ్యలో నన్ను ఎవ్వరూ ఆపకుండా ఉంటే, నేను 3,4 నెలలపాటు ఏకధాటిగా మాట్లాడుతూనే ఉంటాను" అని అనగానే, బాబూజీగారు దానిని

తారుమారుచేసి ఈ విధంగా అన్నారు: "ఎవ్వరు కూడా నాతో మాట్లాడకుండా ఉంటే, నాకు మాట్లాడాలి అనే ఆలోచనే అసలు రాదు. వాస్తవానికి ఈ దైవీయ కార్యాన్ని నిర్వహించటం నుండి ప్రక్కకు తొలగగానే ఈ భౌతిక ప్రపంచం మన దృష్టిలోకి వస్తుంది. కాని ఈ రెండింటిని అంటే ప్రాపంచికం మరియు ఈ దైవీయ కార్య నిర్వహణ – వాటిని నా లాలాజీ సాహెబ్ చూసుకుంటారు. చూశారా డాక్టర్ గారు! మీకు, నాకు ఎంత సమానత్వం ఉన్నదో" అని అనగానే మేమందరం నవ్వుకున్నాం.

ఒకసారి నేను "బాబూజీ! మీ పుస్తకాలు నేను చదువలేదు" అని అనగానే "నా పుస్తకాలు చదవమని నీతో నేను ఎప్పుడు అన్నాను? నా హృదయం తెరచిన పుస్తకం వంటిది. అందులో ఎటువంటి భాష వ్రాయబడలేదు. ఎటువంటి శబ్దం లేదు. దీనిని ప్రేమతో సొంతం చేసుకోవచ్చు. మరల ఈ రెండు అక్షరాల 'ప్రేమ' అనే శబ్దాన్ని ఎప్పుడైతే మరచిపోతామో, అప్పుడే ఈ పుస్తకాన్ని చదవడానికి వీలవుతుంది. ధైర్యంగా ఉండు. ఈ పుస్తకాన్ని చదవడంలో నీవు సఫలం కాగలవు" అని అన్నారు.

ఒకసారి శ్రీ బాబూజీగారు తమ గురుభాయీ అయిన డాక్టర్ శ్రీ కృష్ణలాల్‌ను గూర్చి శ్రీ లాలాజీ సాహెబ్ గారు అన్న మాటలను మాకు తెలిపారు. "శ్రీ లాలాజీ సాహెబ్ గారు తరచుగా డాక్టర్ శ్రీ కృష్ణలాల్‌తో ఈ విధంగా అనేవారు: నా ప్రాపంచిక విషయాలలో నాకు ఏది అవసరమో అది నేను నీకు చెప్పకపోయినప్పటికీ నీవు తెలుసుకునే వాడివి. ఎందుకంటే, నీ ప్రేమలో ఒక విధమైన ఆకర్షణ

ఉంది. నాకు మంచినీళ్ళు లేదా ఇంకా ఏదైనా కావాలని ఆలోచన వస్తే చాలు, వెంటనే అది నా ముందు ఉంచుతావు. కాని రామచందర్‌కు ఏదైనా స్థితిని ప్రసాదించాలని నాకు కోరికగా ఉన్నప్పుడు, అతనివైపు చూడగానే ఆ స్థితి అతనిలో ప్రత్యక్షమై ఉండేది. ఎప్పుడైనా సరే, ఏదైనా రామచందర్‌కు ఇవ్వాలని కోరుకున్నప్పుడు, ప్రతిసారీ నాకు ఈ విధంగానే జరిగేది. ఇటువంటి ప్రేమ యొక్క ఉదాహరణ ఎక్కడ దొరుకుతుంది? ఇతడు ఎటువంటి ప్రేమకు ప్రతిరూపం? రామచందర్ యొక్క ప్రేమ అనంతమైనది" అని బాబూజీగారు మాకు తెలిపారు.

ఒకసారి బాబూజీగారు షాజహాన్‌పూర్‌లో ఇంటి బయట వరండాలో కూర్చొని హుక్కా పీల్చుకుంటున్నారు. హఠాత్తుగా హుక్కా పీల్చుకోవడం ఆపివేసి వారు "అభ్యాసీని కేంద్రమండలంలో చేర్చగానే నా పని పూర్తవుతుంది. ఇప్పుడు అక్కడ స్థిరంగా ఉండడం అనేది అతని పని" అని అన్నారు. ఇటువంటి క్షణాలలో 'వారి' ముఖభంగిమ ఎంతో దివ్యంగా ఉంటుంది. మరల 'వారు' ఈ విధంగా అన్నారు: "కేంద్ర బిందువు అనేది ప్రతిచోట ఉంటుంది. హృదయం అనేది ఒక కేంద్రం. దానికి కూడా ఒక కేంద్ర బిందువు ఉంది. ఇదే విధంగా మనోమండలం మరియు కేంద్ర మండలాలకు కూడా ఒక కేంద్ర బిందువు ఉంటుంది. కాని ఎప్పటివరకైతే నీవు బిందువుగా అంటే శూన్యంగా (జీరో) కావో, అప్పటివరకు ఆ అనంత సాగరంలో నీవు లీనం కాలేవు అని ఈ కేంద్ర బిందువే మనలను హెచ్చరిస్తుంది" అని అన్నారు. ఈ కారణంవల్లనే శ్రీ బాబూజీ మహరాజ్ గారు ఒకసారి నాకు ఈ విధంగా వ్రాసారు: **"వేల సముద్రాల**

**ఆధ్యాత్మికతను అంటే ఈశ్వరీయ జ్ఞానాన్ని త్రాగినప్పటికీ కూడా, ఇంకా కావాలి, ఇంకా కావాలి అనే మాటలే మన నోటి నుండి వెలువడుతాయి"** అని వ్రాశారు. ఒక అభ్యాసీ, "బాబూజీ! నన్ను జీరో (శూన్యం) చేయండి" అని అనగానే శ్రీ బాబూజీగారు వెంటనే ఈ విధంగా జవాబు నిచ్చారు: "నిన్ను జీరో చేస్తాను కాని నీవు నాకు ఒక చిన్న పనిచేసిపెట్టాలి. అది ఏమిటంటే, నీ అహం చాలా పెద్దగా ఉంది. దానిని తక్కువ చేసుకో" అని అనగానే మేమంతా 'వారి' దివ్యమైన ముఖ కాంతులనే చూస్తూ ఉండిపోయాం. తమ కర్తవ్యం విషయంలో 'వారు' ఎంత జాగ్రత్తగా ఉంటారో!

ఒక అభ్యాసీ, "బాబూజీ! అందరిలో ఉన్న ఆత్మ ఒకటే అయినప్పుడు, ఒకరికి ముక్తి కలిగినప్పుడు అందరికీ కూడా ముక్తి లభించాలి కదా!" అని అడిగినప్పుడు వెంటనే వారు, "అవును, నీవు చెప్పిన విధంగానే జరగాలి. మనం అక్కడ ఉన్నప్పుడు అందరం ఒకే విధంగా ఉన్నాం. కాని ఇక్కడకు వచ్చిన తరువాతనే, వాస్తవానికి మనకు మనమే వేరు వేరుగా విడిపోయాము. తిరిగి మనమందరం కూడా ఆ పూర్వస్థితిని పొంది ఒకటిగా మారాలి, ఇదే నా సంకల్పం. దీని కోసమే నేను కృషి చేస్తున్నాను. నేను ఈ పనిలో విజయం సాధించగానే ప్రతి ఒక్కరు కూడా ముక్తి యొక్క స్థితిలో మునిగి పోతారు" అని అన్నారు. ఈ సందర్భంలోనే ఆత్మ ఎక్కడి నుండి, ఎందుకు విడిపోయినది? అనే ప్రశ్న నాలో ఏర్పడింది. ఎప్పుడైతే "భూమా" శక్తిలో క్షోభ (చలనం) ఏర్పడిందో దాని నుండి కొంత శక్తి విడిపోయింది, దానినే 'ఈశ్వరుడు' అని అన్నాం. మరల 'హిరణ్యగర్భ' అనే దాని నుండి రచనాత్మక శక్తి వెలువడి, అది

క్రియా రూపం ధరించటంచేత సృష్టి ఏర్పడింది. అక్కడి నుండి ఆత్మకు మానవరూపం ఏర్పడింది. ఈ విధంగా ఎందుకు జరిగింది? అనే ప్రశ్న ఒకటి ఇప్పుడు మనకు ఉద్భవిస్తుంది. ఎందుకంటే రచనాత్మక శక్తిలో ఒక భావం, విభిన్న భావాలుగా మారే గుణం అధికంగా ఉంది. అందువల్లనే ఈ సృష్టి ఏర్పడినది. ఆధ్యాత్మికోన్నతి మార్గంలో ప్రయాణం చేస్తూ, ఎప్పుడైతే శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యకృప వలన మనం మన స్వస్థలాన్ని చేరుకొంటామో అప్పుడు ఈ సత్యం సుస్పష్టమవుతుంది. **"నా హృదయం తెరచి ఉన్న పుస్తకం వంటిది"** అని శ్రీ బాబూజీగారు పలికిన ఈ మాటల యొక్క యదార్థ రూపం, సాక్షాత్కారం యొక్క ఆ దివ్య దశను పొందిన తరువాతనే మనకు అర్థమవుతుంది.

"బాబూజీ! మీ రూపం ఇపుడు ధ్యానంలో రావడం లేదు" అని ఒక అభ్యాసీ అడిగినప్పుడు 'వారు' శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారితో, "ఇతనిని రూపం మీద ధ్యానం చేయమని ఎవరు చెప్పారు? నేను రూపంలో ఇమడలేను కదా! అందువల్లనే ఈ విధంగా జరుగుతుంది" అని అన్నారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు, "బాబూజీ! అప్పుడప్పుడు మిమ్మల్ని మీరు ఆధీనంలో ఉంచుకోలేక పోతున్నారు. మీరు ఫలానా వ్యక్తి ఇంటికి వెళ్ళనని మాతో అన్నారు. కాని ఆయన పిలవగానే మీరు వెంటనే వాళ్ళింటికి వెళ్ళారు" అని అనగానే, 'వారు' ఎంతో అమాయకత్వంతో ఈశ్వర్ సహాయ్‌గారివైపు చూస్తూ, **"భాయీ! ప్రేమతో ఆహ్వానించినప్పుడు నన్ను నేను ఆధీనంలో ఉంచుకోవడానికి స్థలం ఎక్కడ ఉంది?" అని అన్నారు.**

"అవతారాలు మరియు దివ్యపురుషుని విషయంలో 'ప్రత్యక్ష మవ్వటం' అనే శబ్దాన్ని ఎందుకు ఉపయోగిస్తారు" అని ఒకసారి ఎవరో నన్ను అడిగారు. 'వారి' దివ్యకృపవలన నాకు తెలిసిన జవాబు ఏమిటంటే, "దైవ కార్యం కొరకు ఎంత శక్తి అయితే అవసరమో అంతే శక్తి ఈ భూమి మీద అవతరిస్తుంది. ఆ దివ్యశక్తి ఈశ్వరీయ శక్తి నుండి వెలువడినది కాబట్టి స్వాభావికంగానే "ప్రత్యక్షమవ్వటం" అనే శబ్దం ఉపయోగించబడుతుంది. శ్రీ బాబూజీ మహరాజ్ విషయంలో కూడా ఇదే విధంగా జరిగినది. దివ్యపురుషుడు శ్రీ లాలాజీ సాహెబ్ ప్రార్థన వలన మొదట ఆ దివ్యశక్తి బ్రహ్మాండంలో అవతరించినది. ఆ తరువాత, మానవ మాత్రులను ఆకర్షించటానికి ఎంత శక్తి అయితే అవసరమో మరియు ఎంత శక్తినయితే మానవ రూపం భరించగలదో అంతే శక్తి ఒక మానవ రూపాన్ని దాల్చి శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలో ఈ భూమిపై అవతరించినది."

**ఒకసారి స్వతహాగానే వారు, "శిష్యుని యొక్క గొప్పతనం ఏమిటంటే, అతను తన గురుదేవుని మనస్సులో ఏమి ఉన్నదో గ్రహించి దాని ప్రకారమే నడుచుకోవాలి, వారికి ఇష్టమైన పనులనే చేయాలి" అని అన్నారు. మరల వారు, "ఆధ్యాత్మిక క్రమశిక్షణ అంటే మనలను మనం అదుపులో ఉంచుకోవడమే; మనం ఎప్పుడు కోపానికి రావాలనుకుంటే అప్పుడు కోపానికి రావడం లేకపోతే లేదు" అని అన్నారు.**

శ్రీ బాబూజీగారు తమ పిల్లల వివాహం మొదలైన సందర్భాలలో అతిధులకు ఏ విషయంలోను ఎటువంటి లోటు రాకుండా 'వారు' చూసుకునేవారు. "మనం బీదరికంతో ఉన్నప్పటికీ

అతిథులకు ఏ విషయంలోను లోటురాకుండా చూసుకోవాలి; ముఖ్యంగా పెళ్ళి సందర్భంలో, వాళ్ళంతా మన ఇంటికి ఒకసారే వస్తారు కదా!" అని 'వారు' అనేవారు. 'వారు' తమ వియ్యంకులకు చూపించిన అతిథి మర్యాదలను మనం అనుసరించదగినవి. వాళ్ళు వస్తున్నారని తెలియగానే వాళ్ళ కోసం రైల్వే స్టేషన్‌కు వెళ్ళేవారు. ఒకవేళ బంధువులు అనుకోకుండా ఇంటికి వచ్చి నట్లయితే, వాళ్ళను చూడగానే వెంటనే లేచి, ఆహ్వానించడానికి వేగంగా గుమ్మం దగ్గరకు వెళ్ళి వాళ్ళను కౌగిలించుకొని, వాళ్ళ సామానులను తాను తీసుకొని, వాళ్ళను తమతోపాటుగా ఇంటిలోనికి తీసుకువచ్చి, తమ కుర్చీలో కూర్చోబెట్టి, అతిథి మర్యాదలు చేసేవారు.

ఒకసారి గొప్ప హాస్యంతో కూడిన సంఘటన ఒకటి జరిగినది. తమ కుమారుని వివాహం జరిగిన తరువాత, బాబూజీగారు, తమ కుమారుడు మరియు కోడలుతోపాటుగా కారులో ఇంటికి వచ్చారు. కారులో నుండి దిగగానే వెంటనే ఇంటిలోపలికి వచ్చి, "బిటియా! త్వరగా బయటకు వెళ్ళి చూడు; అప్పగింతల సమయంలో, నాకు తెలియదు కాని, కోడలు తల మీద ఏదో ఉంచారు. పాపం, ఇప్పటికి ఆమె తల చాలా నొప్పిగా ఉంది కాబోలు దానిని తీసివేయండి" అని అనగానే నేను, నా సోదరి కేసర్ మరియు బాబూజీగారి చిన్న కూతురు ఛాయ మేము ముగ్గురం వెంటనే కారు దగ్గరకు పరుగెత్తాము. అక్కడకు వెళ్ళి చూడగానే బాబూజీగారి కోడలు తల మీద పెద్ద కొప్పు (జడ) కనిపించినది. మేము ముగ్గురం కూడా, అమాయకత్వంతో పసిపిల్ల వానివలె ఉన్న శ్రీ బాబూజీగారి ముఖాన్నే చూస్తూ ఉండిపోయాం.

తాను కర్త అయినప్పటికీ, ఆ విధంగా కనబడకుండా 'వారు' చేసే పనులను గూర్చి ఏమని చెప్పాలి? ఇటువంటి సంఘటలను నేను ఎన్నోసార్లు చూసాను. జూన్ నెల ప్రారంభమైనది. ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయి. ప్రతిరోజులాగానే మేమందరం వరండాలో బాబూజీగారి చుట్టూ, కొందరం కుర్చీలలోను, మరికొంత మంది చాపల మీద కూర్చున్నాం. ఈశ్వర్ సహాయ్‌గారు, "బాబూజీ! చాలా వేడిగా ఉంది. కాని వర్షం కురిసే సూచనలు ఏవీ కనపడటం లేదు. పంట పొలాలకు కూడా నీళ్ళు చాలా అవసరం" అని అనగానే శ్రీ బాబూజీగారు "అచ్చా!" (అలాగా!) అని అకాశంవైపు చూడసాగారు. మా అందరి దృష్టి కూడా ఆకాశంవైపుకు మరలినది. అకస్మాత్తుగా ఆకాశంలో మెరుపులు మెరవసాగాయి. ఈశ్వర్ సహాయ్ గారు ఈ విధంగా అన్నారు. "బాబూజీ! అటు చూడండి! నల్లని మేఘాలు ఎట్లా క్రమ్ముకొని వస్తున్నాయో! మెరుపులు కూడా మెరుస్తున్నాయి" అని అనగానే, శ్రీ బాబూజీ మహరాజ్ గారు ఏమీ తెలియని వానిలాగా ముఖంపెట్టి, ఆకాశంవైపు చూస్తూనే ఈ విధంగా అన్నారు: "చూసారా! మన లాలాజీ సాహెబ్ ఎంతటి దయామయులో!" అని అన్నారు. మేము 'వారి' ముఖారవిందంపై ఈ విషయం యొక్క ప్రకాశాన్ని ప్రత్యక్షంగా దేదీప్యమానమవటం చూసాము. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, శ్రీ బాబూజీగారు చేసే ఇటువంటి అసాధారణమైన కార్యాలను చూసినప్పటికీ కూడా 'చమత్కారం' అనే శబ్దం 'వారి' విషయంలో నిరర్ధకరమైనదని అనిపిస్తుంది. మన నోటి నుండి 'కృప' అనే శబ్దం మాత్రమే బయటకు వస్తుంది.

శ్రీ లాలాజీ సాహెబ్‌గారి యొక్క ఒక ఆదేశంలో ఈ విధంగా ఉన్నది: "ఎప్పుడైతే శ్రీ బాబూజీగారు ఈ ధరణిపై అవతరించారో అప్పుడు వారిలో ఇమిడి ఉన్న దివ్యశక్తులన్నీ కూడా సుషుప్తి అవస్థలోనే ఉన్నాయి." ఈ కారణంవల్లనే సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ స్వయంగా శ్రీ బాబూజీ మహరాజ్‌లో 'లయం' కావల్సిన అవసరాన్ని గుర్తించారు. అందువల్లనే 'వారు' శ్రీ బాబూజీ మహరాజ్ గారి శారీరిక వికాసానికి అనుగుణంగా శ్రీ బాబూజీగారిలోని దివ్యశక్తు లన్నింటిని సముచిత రూపంలో వికసింపజేసారు. శ్రీ లాలాజీ సాహెబ్‌గారు ఇంకా ముందుకు సాగి, ఈ సత్యాన్ని మరలా పునరావృతం చేసారు. ఎప్పుడైతే శ్రీకృష్ణుడు, స్వామీ వివేకానంద మరియు ఇతర మహాపురుషులందరు తమ తమ కార్యాలకు అనుగుణంగా, మర్యాదానుసారంగా దైవీయ శక్తిని శ్రీ బాబూజీగార్కి అప్పజెప్పినపుడు సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ గారు స్వయంగా తమ దైవీయ అవస్థ నుండి విడిపోయి, ఈ శక్తులన్నింటిని ప్రథమంగా తమలో సమకూర్చుకొని, ఆ తరువాత శ్రీ బాబూజీగారు శారీరికంగా భరించే విధంగా క్రమేణా ఆ శక్తులన్నింటినీ శ్రీ బాబూజీగార్కి బదిలీ చేసారు (ధార పోసారు).

**"నాకేది లభించినదో అది అంతా కూడా నా లాలాజీ సాహెబ్ నండియే లభించినది"** అనే ఈ వాక్యం ఎంత సత్యమైనదోనని మనకు దీనివలన తెలుస్తున్నది.

శ్రీ బాబూజీ గారు మనకు శ్రేష్టమైన ఆధ్యాత్మిక స్థితులు ప్రసాదిస్తూ, కేంద్రమండలంలోని 'కేంద్రం' వద్దకు తీసుకొనిపోతూ,

ఆధ్యాత్మిక రంగంలో పరిశోధన చేయటానికిగాను 'కేంద్రం'లో ఒకానొక ప్రత్యేక బిందువులోగల శక్తిని ప్రదానంచేసి, మనం సశరీరంగా జీవించి ఉండటానికి 'వారు' నిజంగా మనకు ఎటువంటి మహోన్నతమైన సహాయాన్ని చేస్తున్నారు? అనే ప్రశ్న ఈ సందర్భంలో ఉదయిస్తుంది. దీనికి ఈరోజున నాకు ప్రత్యక్షంగా లభించిన సమాధానం ఏమిటంటే, 'వారు' మనలను ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తీసుకొని వెళ్ళినపుడు మనం దాటిన మొదటి ప్రదేశంలోని దివ్యశక్తులు స్వతహాగానే 'వారి' కృపవలన సుషుప్తి అవస్థను పొందుతాయి. ఇదే విధంగా, మనం కేంద్ర మండలానికి అతీతంగా ప్రయాణించి, ఎక్కడైతే ప్రయాణానికి కూడా గమ్యస్థానం లేదో అటువంటి 'భూమా' సరిహద్దులో ప్రవేశించి నప్పుడు, అంతవరకు మనం పొందిన సమస్త శక్తులన్నింటిని శ్రీ బాబూజీగారు సుషుప్తి అవస్థలో ఉండేట్లుగా చేస్తారు. దీని ఫలితంగా ఏదైనా అత్యున్నత స్థాయికి చెందినటువంటి ప్రశ్న మన సమక్షంలోకి వచ్చినప్పుడు, వెంటనే ఆ శ్రేష్ఠ స్థితికి సంబంధించిన దివ్యశక్తి తనంతట తానుగా జాగృతమై ఆ ప్రశ్నకు జవాబు చెప్తుతుంది. అపుడు ఈ రచయిత్రి దానిని వ్రాస్తుంది. "కౌన్ థే వే?" అనే ఈ సత్యాన్ని వర్ణించాలని నేను ఏ విధంగా సాహసం చేయగలిగాను! అనేది ఈ నాటికి కూడా ఆశ్చర్యకరంగానే ఉన్నది. "వారు, వారు మాత్రమే." ఇంకా శ్రీ బాబూజీగారి మాటలలో చెప్పాలంటే, "ఏది ఉన్నదో, అది ఉన్నది." కాని ఇది వర్ణనాతీతం. 'వారి'ని గూర్చిన వర్ణనను, 'వారి' దివ్యకృపవలన, దివ్యానుభవ సహితంగా వర్ణించ టానికి కావాల్సిన సామర్థ్యాన్ని ఈ రచయిత్రికి 'వారే' ప్రదానం

చేసారు. కాని అవతరణం నుండి కూడా ఎవరైతే వర్ణనాతీతంగా ఉన్నారో 'వారి'ని ఏ విధంగా వర్ణించగలం? అవును; కేవలం 'వారి' దివ్య చరణాలను స్పృశించడంవల్లనే, ఆ దివ్య స్పర్శవలన 'వారి'ని గూర్చి కొంచెమైన వ్రాయగల సమర్థత నాలో ఏర్పడినది. ఇదే నా జీవితం యొక్క పరమార్థం.

నాకు ఈ విషయం పరిపూర్ణంగా గుర్తు ఉన్నది. ఒకసారి శ్రీ బాబూజీగారు అకస్మాత్తుగా, ఒక పాత అభ్యాసీవైపు తిరిగి, "నీవు నీ అహం నుండి ప్రక్కకు తొలగి, సహజ జీవనాన్ని ప్రారంభించి ఎన్ని రోజులు అయ్యింది? దానితో లెక్కపెట్టు, కాని మిషన్‌లో చేరి ఎన్ని సంవత్సరాలు అయ్యింది అనేది లెక్కకాదు" అని అన్నారు. మరల **వారు, "సహజమార్గ్‌లో పురోభివృద్ధి అంటే పొందటం కాదు. కోల్పోవడం మాత్రమే" అని అన్నారు.** ఇటువంటి సందర్భాలలో శ్రీ బాబూజీగారి ముఖం చుట్టూ ఒక విధమైన బ్రహ్మాండమైన తేజస్సు వ్యాపించి ఉంటుంది. ఆ తేజస్సు మనలనందర్నీ కూడా మనకు మనం మరిచిపోయేలాగ చేస్తుంది.

తరచుగా, దివ్యకాంతులను విరజిల్లే శ్రీ బాబూజీ మహరాజ్ గారి ముఖ కవళికలను చూడగానే, విస్మయం చెందిన మనకు, 'వారు' చెప్పే మాటలేవీ కూడా అర్థంకావు. ఒకసారి ఒక అభ్యాసీవైపు చూసి, చాలా వేగంగా, ఈ విధంగా అన్నారు: **"సంస్కారాలను మరచిపో, వీటిని మరచిపోకుండా ఉంటే అనుభవించాల్సి ఉంటుంది. ఎప్పుడైనా, ఎవ్వరైనా నిన్ను ఈ బంధానాల నుండి విడిపించడానికి వచ్చినప్పుడు ఈ సంస్కారాల విషయాన్ని మరచిపోవాలి" అని అన్నారు.** వారి ముఖారవిందాన్ని చూస్తూ, 'వారు' చెప్పే మాటలు

వింటున్నప్పుడు అమితమైన ఆధ్యాత్మికానందం కలిగేది. కాని ఈ రోజున, 'వారు' చెప్పిన మాటలే, తమ అర్థాన్ని, స్వయంగా స్పష్టం చేస్తున్నాయి.

'వారు' పండితులవలె చదువుకోనప్పటికీ మహాజ్ఞాని అనటానికి ప్రమాణాలు ఎన్నింటినో మనం అనేక పర్యాయాలు చూస్తూనే ఉన్నాము. ఒక పర్యాయం ఒక అభ్యాసీ బాబూజీని ఇలా ప్రశ్నించాడు: "జ్ఞాని అంగవస్త్రాన్ని దులిపి ఆవలపారవేయాలి" అని సంత్ కబీర్ చెప్పిన దానికి అర్థం ఏమిటి? 'వారు' వెంటనే ఈ విధంగా స్పష్టంగా చెప్పారు: "దీని అర్థం చాలా స్పష్టంగానే ఉన్నది. సంపూర్ణ నగ్నత్వానికి అంగవస్త్రం ఏ విధంగా అడ్డుగా ఉంట్నున్నదో ఆ విధంగానే ఆత్మ నగ్నత్వాన్ని పొందడానికి జీవాత్మ ఆవరణం అడ్డుగా ఉన్నది. ఆవరణం తొలగిపోగానే ఆత్మ పరమాత్మకు సమర్పితమవుతుంది. ఆవరణమనే వస్త్రాన్ని విడిచి పరమాత్మ దేశానికి పయనం చేస్తుంది."

మేము లఖింపూర్‌లో నివసించే వాళ్ళము. నా చిన్న చెల్లెలు కేసర్, ఎం.ఏ., హిందీ, ప్రైవేటుగా పరీక్ష వ్రాయడానికి సిద్ధమవుతున్నది. ప్రైవేటుగా చదువకోవడం కారణంగా కబీర్ శ్లోకాలు అర్థం కావడమనేది ఆమెకు చాలా కఠినమైన పనిగా ఉండేది. అకస్మాత్తుగా ఒకరోజు శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు మా ఇంటికి వచ్చి, "రేపు శ్రీ బాబూజీ మహరాజ్‌గారు ఇక్కడకు వస్తున్నారు" అని తెలపగానే మేమంతా చాలా సంతోషపడ్డాము. శ్రీ బాబూజీగారు రావడానికంటే ముందుగానే, మేము, నౌరంగాబాద్‌లో ఉన్న శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటికి

చేరుకున్నాము. ఆ రోజు సాయంత్రం కేసర్ కాలేజీ నుండి సరాసరి శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటికి చేరుకున్నది. శ్రీ బాబూజీ మహరాజ్‌గారు ఫలహారం చేసిన తరువాత, విశ్రాంతిగా హుక్కా పీల్చుకుంటూ, "కేసర్ బిటియా! నీకు పరీక్షలు ఎప్పటి నుండి ఉన్నాయి?" అని అనగానే, ఫలానా తేదీ నుండి ఉన్నాయి అని కేసర్ తెలిపింది. మరల వారే స్వయంగా, "బిటియా! నేను పెద్ద విద్వాంసుడిని మాత్రం కాదు. కాని నీవు ఏదైనా అడిగితే, అది నేను కొంచెంగా చెప్పగలను" అని అనగానే కేసర్ తన మనస్సులోని కోరిక నెరవేరినట్లుగా, చాలా సంతోషపడి, వెంటనే పుస్తకాలు తీసి, అందులోని కబీర్ మరియు మీరాబాయి పదాలను గూర్చి అడిగి వాటి అర్థాలను వ్రాసుకొన్నది. అన్నీ బోధించిన తరువాత, అర్థాలన్నీ సరిగ్గా ఉన్నాయా? అని బాబూజీగారు అడిగినపుడు కేసర్, "బాబూజీ! కబీర్ మరియు మీరాబాయి పదాలను నేను చదివాను. తరగతిలో కూడా చదివించారు, కాని నాకేమీ అర్థం కాలేదు. ఈరోజున మీరు బోధిస్తూ ఉంటే నాకు చాలా స్పష్టంగా అర్థమయ్యాయి" అని అన్నది.

అవును. ఇప్పుడు గుర్తుకు వచ్చినది, అపారమైన కృపతో కూడిన ఆ మనోహరమైన దృశ్యం. ఆ రోజులలో 'వారు' కోర్టులో ఉద్యోగం చేసేవారు. కాని తమ పిల్లల కోసం అంటే మా కోసం, అపారమైన కృపతో కూడిన తమ ఆధ్యాత్మిక నిధిని తెరిచి ఉంచేవారు. దాదాపు ప్రతి శుక్రవారం రోజున సాయంత్రం, శ్రీ ఈశ్వర్ సహాయ్ గారు బాబూజీగారు వ్రాసిన పోస్టుకార్డ్‌ను తీసుకొని, పాఠశాల నుండి సరాసరి మా ఇంటికి వచ్చి శ్రీ బాబూజీ మహరాజ్‌గారు రేపు సాయంత్రం వస్తున్నారు" అనే సంతోషకరమైన వార్తను వినిపించే

వారు. ఇంకేముంది, మేమంతా కూడా శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటికి వెళ్ళడానికి తయారుకావడం ప్రారంభించే వాళ్ళము.

ఒక విషయం మమ్మల్ని ఇప్పటికి తరచుగా బాధిస్తున్నది. ఆ రోజుల్లో మేము ఎందుకు ఆ విధంగా ప్రవర్తించాము? ఎందుకు ఆ విధంగా జరిగింది? మా అజ్ఞానం వలన ఇప్పటికి కూడా మాకేమి అర్థం కావడం లేదు. తరచుగా, ఈశ్వర్ సహాయ్‌గారు పాఠశాలకు వెళ్ళిపోగానే, శ్రీ బాబూజీగారు కాలినడకన మా ఇంటికి వచ్చేవారు. ప్రారంభంలో ఆ పరమ పూజ్యులు మా ఇంటికి వచ్చి, ఇంటి ద్వారంవద్ద నిలబడి తలుపు కొట్టేవరకు మాకు ఏమీ తెలిసేది కాదు. తలుపు తట్టిన శబ్దం వినగానే నేను, 'ఎవరు మీరు?' అని అడిగే దానిని. "నేను రామచంద్రాను" అనే శబ్దం వినబడగానే, తెల్లబోయి, "అరే! బాబూజీ మహరాజ్‌గారు వచ్చారు" అని ఒకరితో ఒకరం అనుకుంటూ, చకితులమై, మేమంతా ద్వారంవద్దకు పరుగెత్తి తలుపు తీసేవాళ్ళము. ఇటువంటి దివ్య పురుషులు ద్వారం వద్ద నిలబడి తలుపు తట్టుతున్నారు అనే విషయం గుర్తుకు వచ్చినప్పుడు, నన్ను నేను మరచిపోయి ఒక అలౌకికమైన స్థితిలో ఉండిపోతాను. **"నేను మిమ్మల్ని తీసుకొని వెళ్ళడానికి వచ్చాను. త్వరగా తయారుకండి" అని 'వారు' మాతో అనేవారు. "నేను ఇక్కడే ఉన్నాను" అని 'వారు' మమ్మల్ని ప్రతిక్షణం హెచ్చరించేవారు.** కాని మేము ఏమి అర్థం చేసుకున్నాం? అంత దూరం నుండి కాలి నడకన నడిచి, మా ఇంటిలోకి వచ్చిన తరువాత కూడా, "బాబూజీ! మంచి నీళ్ళు కావాలా? ఫ్యాన్ వేయమంటారా?" అని అడిగేవాళ్ళము కాదు. ఒక ఫోటో తీసుకోవడంకాని, 'వారి' మధురమైన స్వరాన్ని క్యాసెట్‌లో

బంధించడంకాని, కనీసం కుర్చీలో కూర్చోమని అనడంకాని అసలు ఈ ఆలోచనలేవి మాకు వచ్చేవి కావు. "మేమంతా కూడా త్వరగా బాబూజీగారితోపాటుగా వెళ్ళాలి" అనే ఒకే ఆలోచన మాత్రమే మాలో ఉండేది. బహుశా దీనివల్లనే కాబోలు, మేమంతా త్వరగా బయలుదేరాలని 'వారు' కోరుకోవడం వలన, 'వారి' ఈ దివ్యమైన పిలుపు, నా అంతరంగాన్ని త్రాకి, క్రమంగా నాలో ఇమిడిపోయి, అతి శీఘ్రంగా, నా ఆధ్యాత్మికోన్నతికి దారి తీయడానికి, ఒక కారణంగా, ఒక శక్తి ప్రవాహంగా మారిపోయినది. ఈ రోజునకు కూడా, ఆ సమయంలో స్థితి గుర్తుకు వస్తే నేను ఎక్కడికి వెళ్ళడానికి తయారవుతున్నాను? ఏమిటి? అనే విషయాలు ఏమీ గుర్తుకు రావడం లేదు. ఇంతేకాదు, మేమంతా శ్రీ బాబూజీగారితోపాటుగా నడుస్తున్నప్పటికీ, మాలో ఏ ఒక్కరం కూడ, ఎప్పుడు కూడ, 'వారి' చరణాల వేగాన్ని అందుకోలేక పోయేవాళ్ళము. చేతికర్రను తమ నడుముకు ఆనించుకొని, పరమ మాధుర్యంతో నిండిన ముఖకాంతులతో మా రాకకోసం 'వారు' ఎదురు చూస్తుండేవారు. ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా, మనోహరంగా ఉండేది. నిజం చెపుతున్నాను. ఇటువంటి పరమానందంతో కూడిన దైవిక ఆకర్షణతోపాటుగా, నా ప్రభువు, నన్ను తమ దివ్య దేశంలోకి తీసుకొనిపోయారు. కాని 'వారి' చరణ చిహ్నాలమీద నా అడుగులు పడకుండా, ఆ దివ్యానందం నన్ను కాపాడుతూ, 'వారి' వెనకాలే పరుగెత్తుతూ మరల మరల 'వారి' దివ్యమైన ముఖాన్ని చూస్తూ ఉండడం - ఇవన్నీ కూడా జ్ఞాపకాలు మాత్రమే కావు. మరి ఏమిటవి? నాకు మాత్రం తెలియదు. వీటిని గూర్చి తెలుసుకునేది

ఎవరు? ఎందుకంటే, వీటిని గూర్చి తెలుసుకునే యోగ్యత మనలో ఎవరికీ కూడా లేదు. ఈ దివ్యమైన అనుభవాన్ని అందరికి ప్రసాదించవలసినదిగా శ్రీ బాబూజీ మహరాజ్‌గారికి నా ప్రార్థన. **శ్రీ బాబూజీ మహరాజ్‌గారు తమ చేతికర్రను, నడుముకు ఆసరాగా ఉంచుకొని, మేమంతా 'వారి'ని అతిత్వరగా చేరుకోవాలనే తపనతో, మా రాకకోసం ఎదురుచూస్తూ ఉండడంతోకూడిన ఈ మనోహరమైన దృశ్యంముందు వేలకు వేలు దృశ్యాలతో కూడిన ఆధ్యాత్మిక స్థితుల యొక్క ఆనందం కూడా ఎందుకూ పనికి రావు.** తరచుగా ఈ ముగ్ధ మనోహరమైన దృశ్యం గుర్తుకు వచ్చినప్పుడు, భక్త సూరదాసు వ్రాసిన ఒక పదం – చేత చక్రమును ధరించి, భీష్మ పితామహుని వైపునకు వస్తున్నటువంటి శ్రీకృష్ణ పరమాత్ముని – సుందర దృశ్యం నాకు గుర్తుకు వచ్చేది. ఆ మనోహరమైన, దివ్యమైన దృశ్యం ఈ రోజున కూడా, నా ఎదుట ప్రత్యక్షం కాగానే ఈ రచయిత్రి శిరస్సు 'వారి' దివ్య చరణాల చెంత వ్రాలిపోతుంది. ఇంకా వ్రాయడం అనేది మరచిపోతుంది. మరల బాహ్యస్మృతి వచ్చినప్పుడే, ఈ నేత్రాలు చూసిన స్థితిని గూర్చి, అప్పుడే వ్రాస్తాను అని అన్నట్లుగా ఉంటుంది.

ఒకరోజున ఇంటి బయట ఉన్న రేకుల షెడ్డు క్రింద కూర్చుని బాబూజీగారు విశ్రాంతి తీసుకొంటున్నారు. ఇంతలో ఒక అభ్యాసీ ఈ విధంగా అడిగాడు: ''బాబూజీ! సత్పురుషులకు కూడా మానాభిమానాలు, గౌరవ–అగౌరవాలు అంటూ ఉంటాయా?" అని అనగానే 'వారు' నవ్వుతూ ఈ విధంగా అన్నారు: "భాయీ! ఇటువంటి విరామ సమయంలో నీవు ఎటువంటి ప్రశ్నను అడిగావు? **గురువు ముళ్ళ బాటలో నడచి, ఆ దారిలోని ముళ్ళను ఏరివేస్తారు.**

**అందువలన అవి అభ్యాసీకి గ్రుచ్చుకోవు"** అని అన్నారు.

ఒకసారి శ్రీకృష్ణుడు మరియు అర్జునుని గురించి చర్చ జరుగుతున్నప్పుడు శ్రీ బాబూజీగారు ఈ విధంగా అన్నారు: "మన సంస్థలో అర్జునుని వంటి ఆధ్యాత్మిక స్థితిని పొందినవారు చాలామంది ఉన్నారు. కాని కఠినమైన విషయం ఏమిటంటే, **అర్జునునికి శ్రీకృష్ణునిపట్లగల భక్తి, శరణాగతి భావాలు, మనలో ఎవ్వరిలోను లేవు; ఈ భావాలను అభివృద్ధి చేసుకోవడమనేది స్వయంగా అభ్యాసీ యొక్క కర్తవ్యం"** అని అన్నారు. అభ్యాసీలకు నోటితో ఏదీ చెప్పకుండా తాను ఏది చేయాలో అది చేసేవారు. ఈ విషయంలో 'వారి'ని గురించి మనం ఏమని చెప్పగలం? శ్రీ బాబూజీగారి ఒక్క చిరునవ్వు ఈ వాతావరణంలోని దుఃఖాలన్నింటిని దూరంచేసి మనందరి మనస్సులలో స్వతహాగానే సంతోషాన్ని కలగచేస్తుంది. ఎందుకు? ఎందుకంటే, శ్రీ బాబూజీ మహరాజ్‌గారు సమస్త ప్రాణికోటిని ఉద్ధరించడానికి ఈ భూమిమీద అవతరించి నటువంటి దివ్యపురుషులు కాబట్టి.

ఒకసారి సహజమార్గ్‌కు సంబంధించిన బహిరంగ సభ అయిపోయిన తరువాత, ఇంటికి వచ్చి, ఈ విధంగా అన్నారు: "ఇటువంటి సభలలో సభాధ్యక్షునిగా మనలో నుండి ఎవరో ఒకరిని ఎన్నుకోవాలి. అతడు మన సహజమార్గ పద్ధతి గురించి చక్కటి పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి. లేకపోతే సహజమార్గ్ గురించి సరిగా తెలియక పోవడంవలన, సభలో ఉపన్యాసం ఇస్తున్నప్పుడు మన పద్ధతి, శిక్షణ మరియు సహజమార్గం యొక్క విశేషాలను చెప్పకుండానే ఉపన్యాసాన్ని ముగిస్తారు" అని అన్నారు. ఇది

యధార్థమే. ఎందుకంటే, ఈ సత్యం ఎన్నోసార్లు మా దృష్టిలోకి వచ్చింది.

వికసించిన పుష్పాలు, పచ్చిక బయళ్ళతో కూడిన అత్యంత మనోహరమైన తమ సృష్టిని చూస్తూ 'వారు' ఎంతో పరవశత్వాన్ని పొందేవారు. పరవశించిన 'వారి' నేత్రద్వయం మరియు దివ్యమైన 'వారి' రూపం గుర్తుకురాగానే అవి నా హృదయాంతరాళాన్ని ఎక్కడో స్పర్శిస్తున్నట్లుగాను, అభ్యాసులకు లక్ష్యంపట్ల సుషుప్తి అవస్థలో ఉన్న ఆవేదనను అవి మేల్కొలిపి, మనలను 'వారి' సన్నిధిలోకి ఆహ్వానిస్తున్నట్లుగా నాకు అనిపించేది.

అప్పుడప్పుడు 'వారు' పచ్చిక బయళ్ళను, వికసించిన పుష్పాలను చూసి వాటిలో ఎంతగా లీనమవుతారంటే, సామాన్యుల మైన మనం 'వారి'ని చూసి మోసపోతాము. 'వారు' ఆ విధంగా ప్రకృతి సౌందర్యంలో లీనమైనప్పటికీ 'వారు' ఎంతో మెలకువతో ఉండేవారు. ఒకసారి 'వారు' ఈ విధంగానే ప్రకృతి సౌందర్యాన్ని తిలకించటంలో లీనమై ఉండటం చూసిన ఒక అభ్యాసీ విసిగిపోయి 'వారి' వద్దకు వెళ్ళి, "బాబూజీ! 'విలీనం' ఎప్పుడు జరుగుతుంది?" అని అడిగినపుడు వెంటనే వారు, "ఎప్పుడు అవసరమైతే అప్పుడు. ఎప్పుడైతే అభ్యాసీలో 'నేను' అనేది పూర్తిగా పోయినపుడు 'మాలిక్' స్వయంగా అతనికి 'సాక్షాత్కారం'ను ప్రసాదించాలని భావించినప్పుడు అది జరుగుతుంది" అని అన్నారు. చాలామంది విద్యావంతులు లయావస్థ మరియు విలీనం, ఈ రెండింటిని కూడా ఒక్కటే అని అనుకుంటారు కాని అది సరైనది కాదు. 'లయావస్థ' అనేది అభ్యాసీ యొక్క భక్తిమీద ఆధారపడి ఉంటుంది. రెండవది అయిన 'విలీనం'

మాత్రం పూర్తిగా కేవలం 'మాలిక్' యొక్క కృపవల్లనే సాధ్యమవుతుంది.

ప్రియమైన పాఠక సోదరులారా! శ్రీ బాబూజీ మహరాజ్ గారిని గురించి ఎంతని మరియు ఏమని వ్రాయగలం. శ్రీ బాబూజీ మహరాజ్ గారిని గూర్చి కొంచమైన వ్రాయడానికి సాహసం చేయగలనని నేను ఎప్పుడు కూడా ఊహించలేదు. కాని ఎప్పుడైతే శ్రీ బాబూజీ మహరాజ్‌గారు స్వయంగా తమ సాక్షాత్కారాన్ని నాకు ప్రదానం చేసారో, మరియు ఎప్పుడైతే 'వారి' సాక్షాత్కారం నాలో ప్రత్యక్షమైనదో, అప్పుడే 'వారు', 'వారి' దివ్య హస్తంతో ఈ రచయిత్రి యొక్క చేతితో 'వారు' చెప్పినటువంటి ఈ మాటలను అన్నింటిని వ్రాయించారు.

ఎవరి గురించి ఇదంతా వ్రాస్తున్నాను, అని అప్పుడప్పుడు ఈ రచయిత్రి తనకు తాను ప్రశ్నించుకున్నప్పుడు "ఎవరి పాదపద్మాల స్పర్శచేత ఈ భూమి పావనమైనదో, ఆ అమాయకమూర్తి (ఇగ్నోరెంట్ పర్సనాలిటీ) గురించి" అని జవాబు లభించేది. హాస్యంతో 'వారు' ఏ విధంగా మాట్లాడతారో ఇంకొక ఉదాహరణను చూడండి.

ఒకరోజు షాజహాన్‌పూర్‌లో, మేమందరం ఇంటి బయట ప్రాంగణంలో కూర్చుని ఉన్నాం. ఇంతలో నాలుగు గాడిదలు ఆ ఆవరణలోనికి వచ్చాయి. శ్రీ బాబూజీగారు వెంటనే శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారివైపు చూస్తూ, "ఈశ్వర్ సహాయ్‌జీ! నలుగురు జ్ఞానులు మన ఇంటికి వచ్చారు. నీవు వాళ్ళకు ఏమీ మర్యాద చేయడం లేదు" అని అన్నారు. ఈశ్వర్ సహాయ్‌గారు ఎప్పుడూ ఏదో ఒక

పనిలో నిమగ్నమై ఉంటారు. బాబూజీగారి మాటలు వినగానే, తల పైకెత్తి చూసి, "బాబూజీ! అవి గాడిదలు కదా!" అని అనగానే బాబూజీగారు వెంటనే "అరే భాయీ! అందరికంటే బుద్ధిమంతులు వీళ్ళే" అని ముసిముసి నవ్వులు నవ్వారు. **ఈశ్వర్ సహాయ్‌గారు కూడా ముసి ముసి నవ్వులు నవ్వుతూ, "బాబూజీ! మరి, వీటికి గాడిద అనే పేరు ఎందుకు వచ్చింది?" అని ప్రశ్నించారు. "ఎందుకంటే, వీటికి ఇతరుల దిష్టి తగలకుండా ఉండడానికి" అని మరల గంభీరంగా ఈ విధంగా అన్నారు: "ఇవి ఇతరుల బరువును, మురికిని మోసి సంతోషాన్ని పొందుతాయి. కాని ఈ సమాజం వీటిని మూర్ఖుల క్రింద జమ కడుతుంది. మహాత్ముల యొక్క నడవడి అనుభవం కూడా ఇదే విధంగా ఉంటుంది.** కాని దీనిని గురించి ఎవ్వరూ కూడా ఏమీ అనరు" అని అన్నారు.

ఒక రోజు మేమందరం బయట వరండాలో కూర్చొని బాబూజీగారితోసహా బెల్లపు టీని త్రాగుతున్నాం. అప్పుడు ఒక సోదరుడు ఈ విధంగా అడిగాడు. "బాబూజీ! ఈ విషయం నాకేమి అర్థం కావడం లేదు. నిన్న వీళ్ళ అబ్బాయికి తీవ్రంగా జ్వరం వచ్చినది. ఆయన మిమ్మల్ని తలుచుకోగానే జ్వరం చాలవరకు తగ్గిపోయింది. ఈ రోజు మా అబ్బాయికి కూడా జ్వరం తీవ్రంగా వచ్చినది. కాని నేను మిమ్మల్ని ఎంత స్మరించినప్పటికీ, మరల మరల స్మరించినప్పటికీ కూడా జ్వరం ఆవగింజంతైనా తగ్గలేదు" అని అనగానే బాబూజీగారు నెమ్మదిగా, మృదువుగా "భాయీ! ఈయన నన్ను స్మరించాడు. కాని నీవు ఒక డాక్టర్‌ను స్మరించావు" అని అన్నారు. మీరే గమనించండి. శ్రీ బాబూజీగారి మాటలలో

ఎంత భేదం ఉన్నదో! అప్పుడు ఆ మాటలు వినడానికి చాలా చక్కగా అనిపించేది. కాని ఈ రోజు వాటి అర్థం స్పష్టం అవుతుంటే, శ్రీ బాబూజీగారి ప్రతి మాటలోను, ఏదో ఒక అంతరార్థం ఉంటుందనే యదార్థం మనకు తెలుస్తుంది.

ఇటువంటి సందర్భంలోనే ఒక రోజున ఒక అభ్యాసీ, "బాబూజీ! మీకు ఎవరైనా ఒక మాట చెప్పితే చాలు, మీరు చాలా సంతోషపడతారు. కాని అంతకన్నా ఇంకా మంచి మాటను ఇంకొకరెవరైనా చెప్పినప్పుడు మీరు అసలు సంతోషమే వ్యక్తం చేయరు, ఎందుకు?" అని ప్రశ్నించాడు. శ్రీ బాబూజీగారి పవిత్రమైన సమాధానాన్ని 'వారి' దివ్యమైన వాణి ద్వారా వినడానికి మాలాగానే మీరంతా కూడా చాలా కుతూహలంగా ఉత్సాహంతో ఉన్నారు కదా! అయితే వినండి – **"మాట్లాడడమనేది రెండు రకాలు. మొదటి దానిలో వ్యక్తి తనను తాను మరిచిపోయి, ఆత్మ నివేదన స్థితిలో మునిగిపోయి మాట్లాడతాడు. రెండవ దానిలో వ్యక్తిలోని 'నేను' అనేది మాట్లాడుతుంది" అని అన్నారు.** ఆ మధురమైన స్వరం నుండి వెలువడిన ఆ వాక్కులను వినగానే మేమంతా మా స్మృతిని కోల్పోయాము. తిరిగి కొంత సమయం తరువాత హుక్కా శబ్దం వినగానే, మేము తల పైకెత్తి ఆ మహాశక్తివైపు చూడగానే, వినమ్ర భావంతో, స్వతహాగానే, మా నేత్రాలు క్రిందికి వ్రాలిపోయాయి.

వరదలు వచ్చినప్పుడు ఆ దృశ్యాన్ని అందరు చూసే ఉంటారు కాని అ దివ్య పురుషుని యొక్క ప్రేమ ప్రవాహాన్ని, ప్రేమతో కూడిన ఆ చూపుల యొక్క వరద అనే దృశ్యాన్ని బహుశా ఎవ్వరూ కూడా చూసి ఉండరు. ఒకసారి ఆ కరణామయుని హృదయంలో

మాకు ఏదో ఒకటి, కొంచెం ప్రసాదించాలనే కోరిక ఒకటి 'వారి'లో కలిగింది. ఆ సౌభాగ్యం మాకు దక్కింది. ఎందుకంటే, ఆ సమయంలోనే నేను మరియు నా తండ్రి గారు షాజహాన్‌పూర్‌కు చేరుకున్నాం. అదృష్టవశాత్తు ఆ రోజు సాయంత్రం మేము "ఆఫెతాబే మారిఫత్" అనే పాటను పాడాము. ఇంకా ఏముంది చెప్పడానికి, ఆ పాట సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్‌ను ప్రశంసిస్తూ వ్రాయబడినది. నా తండ్రిగారి ద్వారా ఆ పాట యొక్క భావాన్ని చక్కగా అర్థం చేసుకొని, మేమందరం స్వరయుక్తంగా పాడాము. ఇంకా ఆ దృశ్యాన్ని నేను వర్ణించలేను. ఎందుకంటే, నేను మరియు ఆ పాటను పాడినవారు, విన్నవారు అందరం కూడా మమ్మల్ని మేము మరచిపోయి ఆ దయామయుని యొక్క 'కృప' అనే వరదలో కొట్టుకొనిపోయాము. ఆ సమయంలో, శ్రీ బాబూజీ మహరాజ్‌గారే స్వయంగా, ఆ దివ్య దేశాన్ని మా వద్దకు లాక్కొని వచ్చినట్లుగా నాకు అనిపించింది. ఆ పాటను విన్నంతసేపు, ఆ దివ్య దేశం నుండి మరల ఈ బాహ్య ప్రపంచంలోకి అంటే మా యథాస్థితికి రావాలనే స్మృతి మాలో ఎవ్వరికి కూడా లేదు. మేము ఏమి పొందాము – అనే పరిజ్ఞానం ఎవరికి ఉంది? అంతేకాదు ఆ పాటను వినగానే శ్రీ బాబూజీగారి గురుభాయీ అయిన పండిట్ రామేశ్వర్ ప్రసాద్‌జీ కన్నీటి ధారలను వర్షిస్తూ, తన దగ్గర ఉన్న ఆధ్యాత్మిక సంపదనంతా ఏ మాత్రం కూడా ఉంచుకోకుండా మాకు ఇచ్చివేయాలనే తీవ్రమైన ఆకాంక్షతో ఉన్నారు. కాని శ్రీ బాబూజీగారు వెంటనే, "రామేశ్వర్‌జీ! నిన్ను నీవు సంభాళించుకో" అని బుజ్జగించారు. కాని ఆ వరదలో కొట్టుకొనిపోవడం వలన నాకు

కలిగిన పరిణామం ఏమిటంటే, నేను మరల ఎప్పుడూ కూడా, ఆ దివ్య దేశం నుండి, తిరిగి ఈ బాహ్య ప్రపంచంలోకి రాలేదు. ఎందుకంటే, శ్రీ లాలాజీ సాహెబ్‌ను ప్రశించిస్తూ పాడిన ఆ పాట శ్రీ బాబూజీగారిలోను, శ్రీ రామేశ్వర్‌జీగారిలోను, వారి గురుదేవుల యొక్క పూర్వపు మధుర స్మృతులను మరల పునరావృతం చేసింది.

ఈ సందర్భంలో మరల ఇంకొక దృశ్యాన్ని చూసే అవకాశం కలిగింది. నా సోదరుడు తులసీదాస్ వయస్సు 12 సంవత్సరాలు. అతను ఒకరోజు ధ్యానం నుండి లేవగానే శ్రీ బాబూజీగారి యొక్క గొప్పతనాన్ని గూర్చి ప్రశంసిస్తూ ఒక పాటను వ్రాశాడు. ఆ పాట యొక్క పల్లవి “ఘిర్ రహి సజల్ థి ఘోర్ రజని.” ఆ రోజుల్లో శ్రీ బాబూజీగారి జన్మదిన మహోత్సవాన్ని అంటే ఏప్రియల్ 30వ తేదీన, ఉత్సవాన్ని మా ఇంటి వద్ద లఖింపూర్‌లో జరుపుకోవడానికి మా అమ్మగారికి ‘వారు’ అతికష్టం మీద, అనుమతి నిచ్చారు. అందుకు రెండు కఠినమైన షరతులను కూడా విధించారు. ఒకటి – ప్రసాదం కొరకు కేవలం 5 రూపాయలు మాత్రమే ఖర్చు చేయాలి. రెండవ షరతు ఏమిటంటే, అందరం ఒకేసారి కలసి భోజనం చేయాలి, కాని ఆ భోజనం సాధారణమైనదిగా ఉండాలి. ఉత్సవంలో ఈ రెండు షరతులను అక్షరాలా పాటించేవాళ్ళం. మేమందరం కలిసి స్వయంగా మా చేతులతో రంగు, రంగుల కాగితపు జండాలను తయారుచేసి మా ఇంటిలోని ఒక విశాలమైన గదిలో అలంకరించే వాళ్ళం. ఆ గదిలో దాదాపు 70 మంది కూర్చోవడానికి వీలుండేది. ఆ ఉత్సవ సమయంలో గౌరవనీయులైన ఈశ్వర్ సహాయ్‌గారు, భాయీ మురళీధర్, భాయీ పుత్తిబాబూ (వకీల్) గారి పరివారాలు

మరియు మేము అందరం కలిసి 9, 10 మంది అభ్యాసీలు మరియు 9, 10 మంది చిన్న పిల్లలు ఉండేవాళ్ళం. ఆ ఉత్సవంలో నా సోదరుడు తులసీదాస్ శ్రీ బాబూజీగారిని ప్రశంసిస్తూ తను వ్రాసిన ఆ పాటనుపాడి వినిపించాడు. 'మాలిక్' యొక్క కృపవలన నా సోదరుని కంఠం మృదు మధురంగా ఉండటంచేత స్వరం స్థిరంగా ఉండి, పవిత్రమైన ఆ పాట, అంతటా ధ్వనించిపోయింది. ఆ పాట వినగానే మేమంతా ఊగిపోయాం. దానితోపాటుగా, 'ఈశ్వరీయ ధార' దేనినైతే మనం ప్రాణాహుతి అంటామో, ఆ ధార వ్యాపించినది. ఇంకేముంది, ఆ పాట నా సోదరుడు ఆ రోజు 4, 5 సార్లు, ఇంకా ఎన్నిసార్లు పాడినప్పటికీ మాకు తృప్తి కలగలేదు. ఒక వారం రోజుల తరువాత మేమంతా షాజహాన్‌పూర్ వెళ్ళవలసి వచ్చినది. మా అందరికి ఒక్కటే కోరిక – త్వరగా షాజహాన్‌పూర్ చేరుకొని, నా సోదరునితోపాటుగా మేమందరం కలిసి ఆ పాటనుపాడి శ్రీ బాబూజీ గారికి వినిపించాలి అని. ప్రయాణపు సమయం ఎంతకూ గడవడం లేదు. చివరకు షాజహాన్‌పూర్ రానే వచ్చింది. బాబూజీగారి ఇంటికి వెళ్ళే మార్గం మధ్యలోనే కోర్టు ఉంది. తరచుగా శ్రీ ఈశ్వర్ సహాయ్ గారు అక్కడే గుర్రపు బండిని ఆపి, శ్రీ బాబూజీగారిని ఎక్కించుకొని, మాతోపాటుగా తీసుకొని వచ్చేవారు. మేము కూడా ఆ గుర్రపు బండిలో బాబూజీగారు కూర్చొనడానికిగాను కొద్దిగా ఖాళీ ప్రదేశాన్ని వదిలిపెట్టే వాళ్ళం. పాపం, 'వారు' ఆ కొద్ది ప్రదేశంలోనే సర్దుకుని కూర్చునేవారు. మేమందరం మాట్లాడుకుంటూ బాబూజీగారి ఇంటికి చేరుకునే వాళ్ళం. కాని అంత తక్కువ ఖాళీ ప్రదేశంలో 'వారు' ఏ విధంగా కూర్చుంటారు – అనే ఆలోచన మాకు వచ్చేది కాదు.

బాబూజీగారు మాతోపాటుగానే కూర్చున్నారు – అనేది మాత్రమే గుర్తుండేది. అంతే ఇల్లు రాగానే చిన్న, పెద్ద అందరు కలిసి దాదాపు 12 మంది గుర్రపు బండిలో నుండి దిగేవాళ్ళం. మా అందరితో పాటుగా బాబూజీగారు కూడా సామానులు మోసి, మా గది లోపలికి తీసుకొని వచ్చేవారు. వరండాలో నిలబడి ఈ విధంగా అనేవారు: "బిటియా! ఇటుచూడు. ఈరోజు ఉదయాన్నే నీ గది పూర్తిగా శుభ్రం చేయించాను" అని అనేవారు. ఆ గదిలో ఒక చిరిగిపోయిన జంపఖానా పరిచి ఉండేది. మూలకు ఒక పలుచటి చాప ఉండేది. బాబూజీగారు తమ కోటును, ఆలిగడ్ పైజామాను మరియు తమ చేతికర్రను మేకుకు తగిలించి, మా గదిలో నుండి బయటకు వెళ్ళేవారు. బయట నల్లా వద్ద ముఖం, చేతులు కడుక్కుని, వరండాలోని కుర్చీలో కూర్చునేవారు. చిరిగిపోయిన ఒక చిన్న కంబళి ముక్క 'వారి' కుర్చీమీద పరచబడి ఉండేది. మాలిన్ హుక్కా నిచ్చేది. హుక్కా పీల్చుకొన్న తరువాత ఇంటిలోపలికి వెళ్ళి ఫలహారం చేసి మరల బయటకు వచ్చేవారు. మేము కూడా 'టీ' త్రాగి, బయట అటు, ఇటు పడి ఉన్న కుర్చీలలో కూర్చునే వాళ్ళం. సంభాషణ ప్రారంభమైనది. ఇంతలో శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు, తులసీదాస్ ఒక పాటను వ్రాశాడనే సంగతి, బాబూజీగారికి తెలిపారు. ఒక్కసారిగా బాబూజీగారు ఈ విధంగా అన్నారు: "మన లాలాజీ సాహెబ్‌కు కూడా పాటలంటే చాలా ఇష్టం. 'వారు' చాలా గొప్పగా పాడేవారు. 'వారు' గొంతెత్తి పాడుతుంటే ఎంతో ప్రభావపూరితంగా ఉండి, వాతావరణం అంతా కూడా నిశ్శబ్దంగా మారినదా! అన్నట్లుగా ఉండేది" అని మరల, "లాలాజీగారు పిలుస్తున్నారు. 'వారు' మీ

పాట వినాలని కోరుతున్నారు" అని అన్నారు. మా గదిలో నుండి హార్మోనియం తీసుకొని వచ్చిన తరువాత, మేమంతా కలిసి బాబూజీగారితోపాటుగా, పూజ గదిలోకి వెళ్ళి, పాట పాడటం ప్రారంభించాము. "ఫిర్ రహి సజల్......." ఆ పాట శ్రీ బాబూజీగారిని ప్రశంసిస్తూ వ్రాయబడినది కదా! ఆ పాట వినగానే 'వారు' మౌనం వహించారు. పాట పూర్తికాగానే, వెంటనే 'వారు' ఈ విధంగా అన్నారు: "లాలాజీగారు చాలా సంతోషంతో ఉన్నారు. మరల ఇంకొకసారి పాడండి" అని అనగానే మేమందరం ఆ పాటలో లీనమై మరల పాడాము. పాట పూర్తికాగానే, మేము శ్రీ బాబూజీ మహరాజ్‌గారిని చూడగానే, 'వారి' ముఖ మండలం అంతా ఒక బ్రహ్మాండమైన తేజస్సుతో వ్యాపించి ఉండటాన్ని గమనించాము. ఆ తేజస్సును మేము ఎవ్వరం కూడా చూడలేకపోయాం. 'వారు' శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారితో, "ఈశ్వర్ సహాయ్‌జీ! లాలాజీగారు ఏమంటున్నారంటే ఎప్పుడు, ఎవరికి దొరకనటువంటి బహుమతిని తులసీదాస్‌కు ఇవ్వమంటున్నారు. ఏమి బహుమతిని ఇవ్వాలా అని నేను ఆలోచిస్తున్నాను" అని మరల వెంటనే ఈ విధంగా అన్నారు: "అది ఎంతో మంచి ఆలోచన. దానిని హుజూర్ కూడా ఇష్టపడతారు. ఎటువంటి బహుమానం ఇస్తానంటే, ఈ ప్రపంచం అంతా కూడా దానిని గుర్తు పెట్టుకోవాలి" అని, "తులసీదాస్! ధ్యానంలో కూర్చో" అని బాబూజీగారు కూడా ధ్యానంలో కూర్చున్నారు. ప్రతి పది నిమిషాలకు ఒకసారి బాబూజీగారు కళ్ళు తెరిచి, నా సోదరుని కూడా కళ్ళు తెరవమని చెప్పేవారు. ఈ విధంగా దాదాపు 40 (నలభై) నిమిషాల సమయం గడిచిపోయింది. బాబూజీ గారు

అప్పుడు ధ్యానం నుండి లేచి, "తులసీదాస్! ఇంకా చాలు. నీవు వెళ్ళి ఆడుకో లేదా విశ్రాంతి తీసుకో. ఇంక 6 నెలల వరకు నీవు పూజలో కూర్చోవద్దు" అని అన్నారు. ఈ 40 నిమిషాలపాటు, ఆ గదిలో ఉన్న మా అందరికి కూడా, మేము ఎక్కడ ఉన్నాం? ఏమిటి? అనేది ఏమీ తెలియలేదు. "తులసీదాస్! ఇంకా చాలు" అనే మధురమైన ధ్వని వినబడగానే మరల మేము ఈ లోకంలోకి వచ్చాము. ఆ తరువాత బాబూజీగారు బయటకు వచ్చి వరండాలోని కుర్చీలో కూర్చున్నారు. 'వారి' వెనకాలే మేమంతా కూడా పూజ గదిలో నుండి బయటకు వచ్చి కుర్చీలలో కూర్చున్నాము. కొంచెంసేపు హుక్కా పీల్చుకొన్న తరువాత నా తల్లిదండ్రులకు 'వారు' తమ అభినందనలు తెలిపారు. ఆ తరువాత శ్రీ ఈశ్వర్ సహాయ్ మరియు శ్రీ రామేశ్వర్‌జీవైపు చూస్తూ ఈ విధంగా అన్నారు: **"రామేశ్వర్‌జీ! లాలాజీ సాహెబ్ తులసీదాస్‌కు ఎటువంటి బహుమతిని ప్రసాదించారో తెలుసా; మీరంతా కూడా పురోగతిని సాధిస్తూ కేంద్ర మండలం చేరుకుంటారు. కాని తులసీదాస్ విషయంలో మాత్రం యాత్ర కేంద్ర మండలంలో ప్రారంభమై, ఆ తరువాత క్రమేణా క్రింది యాత్ర పూర్తవుతుంది. మన హుజూర్ యొక్క గొప్పతనం చూశావా! ఇప్పటివరకు ఎవరికైనా ఇటువంటి అద్భుతమైన వరం లభించినదా? హుజూర్ యొక్క ఒక్క చూపుపడితే చాలు, ఎటువంటి వారు ఎలా మారిపోతారో చూడు"** అని అనగానే రామేశ్వర్‌జీ నేత్రాల నుండి అశ్రుధారలు పొంగి పొరలాయి. మేమంతా కూడా ప్రేమకు ప్రతిరూపమైన ఆ దివ్య పురుషుని వైపు రెప్ప వాల్చకుండా చూస్తూ ఉన్నాం. నిజమే; ఆ అంతిమ శక్తి యొక్క

మాస్టర్‌ను నేనే అన్నట్లుగా 'వారు' ఆ సమయంలో మాట్లాడారు. దీని ఫలితంగా నా సోదరుడు తులసీదాస్‌కు అపరిమితమైన మానసిక సమతుల్యత ఏర్పడినది. ఒకసారి 'వారు', "తులసీదాస్ పూజ చేసినా, చేయకపోయినా సరే! కాని అతని మనస్సు అంతా కూడా దివ్య ప్రకాశంతో ప్రకాశిస్తున్నది" అని అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలోనే ఆ అంతిమ శక్తి వరద రూపంలో వచ్చి ఈ విశ్వంలోని అణువణువును పూర్తిగా తడిపివేసిందని నాకు అనిపిస్తున్నది. ఈ ఆర్తియే ఒకరోజు ఆ దివ్యత్వం యొక్క రంగును తీసుకొని వస్తుంది. ఆ దివ్యత్వంతో ఈ భూమి వికసిస్తుంది. శూన్యంతో ఉన్న ఆకాశం నిజమైన శూన్యస్థితిని పొందటానికి తన శిరస్సును ఆ దివ్య పురుషుని దివ్యచరణాల చెంతన ఆనిస్తుంది. "వారు ఎవరు? (కౌన్ థే వే?)" అని అడిగితే అప్పుడు అది కూడా కొద్దిగా చెప్పగలుగుతుంది.

అనుకోకుండా ఒకరోజున శ్రీ ఈశ్వర్ సహాయ్ గారితో పాటుగా షాజహాన్‌పూర్ వెళ్ళాను. శ్రీ బాబూజీగారు ఎందుకు ఉత్సాహంగా ఉన్నారో తెలియదు మరి. 'వారి' కృప అనే వరదతో, ఆ రోజు మాకు ఏమి చూపించాలనుకున్నారో ఏమో, రెండవ రోజు ప్రాతఃకాలంలో నేను మరియు ఈశ్వర్ సహాయ్‌గారు, శ్రీ బాబూజీ మహరాజ్ ఎదురుగా కూర్చుని ఉన్నాము. అకస్మాత్తుగా 'వారు' హుక్కా పీల్చుకోవడం ఆపివేసి, నిశ్శబ్దం వహించారు. అప్పుడు నేనొక ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూసాను. "కుర్చీలో ఎవ్వరూ లేరు. శ్రీ బాబూజీగారు ఈ విశ్వమంతటా వ్యాపించి ఉన్నారు. 'వారి' యొక్క దివ్యశక్తిచేత సృష్టి అంతా క్రియాన్వితమై ఉన్నది." ప్రకృతి ఆ దృశ్యాన్ని చూసి స్తంభించిపోయిందా అన్నట్లుగా ఉంది.

ఈ విధంగా ఎంత సమయం గడిచిపోయిందో నాకు తెలియదు. ఒక్కసారిగా నాకు స్మృతి వచ్చేసరికి, ఆ దశ, అనుభూతిగా నిండిపోయి, నేను జీవించడానికిగాను నా శ్వాస విధానమే మారిపోయిందా! అన్నట్లుగా ఉంది. ఈ దృశ్యం అంతా కూడా ఎప్పుడైతే నాలో పూర్ణరూపంతో అనుభూతి అవతరించినదో, అప్పుడు నాలో ఒక విధమైన స్పందన కలిగింది. అప్పుడు ఒక్కసారిగా నాకు, ఈ విధంగా, ఒక మధురమైన ధ్వని వినబడింది. “బిటియా! మన లాలాజీ సాహెబ్ అంటే ఏమిటో, ఎవ్వరికీ కూడా తెలియదు” –ఆ మధురమైన ధ్వని వినబడగానే నాలో ఒక విధమైన మైమరుపు వ్యాపించింది – ఈ శక్తి ఎవరిది? ఎవరి గురించి మాట్లాడుతున్నారు – ఏమి మాట్లాడుతున్నారు – నాకు ఏమీ అర్థం కాలేదు. మరల హుక్కా శబ్దం రాగానే, వాతావరణం అంతా కూడా అసలేమి జరగలేదన్నట్లుగా, ప్రశాంతంగా మారిపోయింది. ఇంకా నేను నా గురించి ఏమి చెప్పాలి. ఆ రోజే నా వ్యక్తిత్వానికి చివరి రోజు. అనుభూతి యొక్క అనుభూతి అనే బంధం ఏర్పడినదా అన్నట్లుగా, ఆ క్షణంలో, నేను ఆ అనుభూతిలో లీనమయ్యాను. ఇంకా చెప్పాలంటే, నేను ఆ అనుభూతికి అతీతంగా ఉన్నానని, ఆ అనుభూతియే నన్ను తన దానిగా చేసుకొని ఈ విధంగా అంటున్నది. ఇటువంటి దృశ్యాన్ని మానవమాత్రుల కోసం సులభతరం చేసి, ప్రదానం చేసినటువంటి శ్రీ బాబూజీ మహరాజ్ అంటే ఎవ్వరు? ఆ దృశ్యం శ్రీ బాబూజీ మహరాజ్ సాక్షాత్కారంలోని ఒక అంశం మాత్రమే అని నేను భావించాను. అప్పుడే ‘వారు’ ఈ విధంగా

అని, నాకు తెలియజెప్పారు: "ఇప్పుడు నీవు చూసింది ఏముంది? ధైర్యంగా ఉంటే ఇంకా చాలా చూడగలవు" అని అన్నారు.

ఒక విషయం 'వారి'లో ఎంత మధురంగా ఉండేదంటే, 'వారు' మనకు ఏదైనా నేర్పించాలనుకుంటే ముందు 'వారు' దానిని ఆచరణలో ఉంచి మనకు చూపేవారు. ఒక సాధరణమైన సంఘటన –దక్షిణ భారతదేశం నుండి కొంతమంది అభ్యాసీలు వచ్చారు. 'లెట్రిన్'లో ఉంచిన చెంబులోని నీళ్ళతో చేతులను శుభ్రం చేసుకోవడం వారికి ఇష్టం ఉండేది కాదు. అందువలన దక్షిణ దేశం నుండి అభ్యాసులు వచ్చిన ప్రతిసారి 'వారు' ఒక చేతితో మట్టి, మరొక చేతితో నీళ్ళ చెంబును పట్టుకొని 'లెట్రిన్' బయట నిలబడేవారు. 'వారే' స్వయంగా తమ చేతితో వాళ్ళకు మట్టిని ఇస్తూ, నీళ్ళను పోస్తూ వాళ్ళ చేతులను శుభ్రం చేసేవారు. కొన్ని రోజుల తరువాత దక్షిణ దేశ సోదరలు ఈ పనిని ఒకరు నుండి మరొకరు నేర్చుకున్నారు. ఈ విధంగా 'వారు' మన అంతరంగంతోపాటుగా బాహ్యాన్ని కూడా శుభ్రం చేసేవారు.

అభ్యాసీ సోదరులు వివిధ ప్రాంతాలనుండి ఇంటికి వచ్చినప్పుడు 'వారే' స్వయంగా ఇంటిలోనికి వెళ్ళి, తమ పెద్ద కోడలు అంటే ప్రకాష్ సతీమణితో, వాళ్ళ భోజన విషయం గురించి చెప్పేవారు. ఏ ప్రదేశం నుండి వచ్చారు, ఏ రకమైన భోజనాన్ని తింటారు – ఇవన్నీ కూడా 'వారి'కి గుర్తు ఉండేవి. "భాయీ! వీళ్ళు మన అతిధులు. వీళ్ళకు ఎటువంటి కష్టం కలగనీయకూడదు" అని అనేవారు. విదేశాల నుండి వచ్చిన అభ్యాసీ సోదర సోదరీమణులకు బ్రెడ్, వెన్న ఇవ్వడం ఏ మాత్రం మరచిపోయేవారు

కారు. మొదటిసారిగా కొంతమంది అభ్యాసీ సోదరులు విదేశాల నుండి వచ్చినపుడు, 'వారు' వడ్రంగిని పిలిపించి, ఇంట్లో ఉన్న ఒక మేజాను సరిచేయించి, విదేశి అభ్యాసీలకు 'డైనింగ్ టేబుల్'గా ఉపయోగించారు. ఆ సమయంలో శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారితో, "ఈశ్వర్ సహాయ్‌జీ! మన కుర్చీలపైన మెత్తలు లేవు, విదేశీయులు వాటి మీద కూర్చుంటే ఇబ్బందిపడతారు" అని ఇంటిలో ఉన్న చిరిగిపోయిన ధోవతులు, చీరెలు అన్నీ తీసుకొని వచ్చి, "ఈశ్వర్ సహాయ్‌జీ! మీరు ఈ కుర్చీలకు మెత్తలు కుట్టించి, వాటి లోపల ఈ చిరిగిపోయిన దుస్తులను నింపండి. ఎందుకంటే, ఈ సమయంలో దూది కోసం నా దగ్గర డబ్బులు లేవు" అని అన్నారు. ఈ రోజునకు కూడా, అప్పటి ఆ మొత్తం దృశ్యం నేత్రాల ముందు తిరుగుతూ ఉంటే, ప్రేమ అనే సముద్రం, శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలో, మన సమక్షంలో నిలబడి ఉన్నట్లుగా అనిపిస్తుంది. "ఇంకా చాలు. ఇంకా ముందుకు సాగలేను" అని ఈ రచయిత్రి తనకు తానే అనుకుంటున్నది. బాబూజీ అంటే ఎవ్వరు? (కౌన్ థే వే?) అంటే నేనేమి చెప్పగలను?

అసంభవమైన పనులను సంభవం చేసిన ఉదాహరణలు కోకొల్లలు. వాటిని గురించి వర్ణించాలంటే చాలు నాలో అసమర్థత కనిపిస్తున్నది. వాటిని గురించి ఆలోచించి, క్రమబద్ధం చేసి వ్రాయాలనే సాహసానికి ఒడిగట్టడం లేదు. కళ్ళు, అంతా చూసి కూడా అప్పుడు అస్సలేమీ చూడలేదన్నట్లుగా ఉన్నాయి. అవును, ఆ స్థితిలో స్థిరంగా ఉండి, అంతర్ మనస్సుతో, అంతర్ దృష్టితో, నా మనోపటలం మీద ముద్రించబడిన ఆ దైవీయ రహస్యాల

నన్నింటినీ, ఈ రోజు స్పష్టం చేయాలని నేను నిశ్చయించుకున్నాను. అలహాబాద్‌లో నా సోదరునకు వివాహం జరుగుతుంది. ఇంతలో అకస్మాత్తుగా, లఖింపూర్‌లోని మా ఇంటి ముఖద్వారం వద్ద ఎవరో తలుపు తట్టిన శబ్దం వినబడింది. తలుపు తెరిచి చూడగానే ఆశ్చర్యపోయాను. ఎదురుగా, మా జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ మహరాజ్‌గారు నిలబడి ఉన్నారు.

"నేను కూడా పెండ్లికొడుకుతోపాటుగా అలహాబాద్ వెళ్ళడానికి వచ్చాను" అని బాబూజీగారు అన్నారు. ఆ విధంగా అనగానే, నా తల్లిగారు, "బాబూజీ! మీరు అలహాబాద్‌కు వెళ్ళవద్దు. ఈ పెండ్లి హడావిడిలో మీ భోజన, వసతి సౌకర్యాలు ఎవ్వరూ కూడా సరిగా పట్టించుకోరు. అంతా గందరగోళంగా ఉంటుంది" అని అనగానే బాబూజీగారు, "నేను కూడా పెండ్లివారితోపాటుగా అలహాబాద్‌కు వెళ్ళతాను" అని ధృఢంగా చెప్పారు. మేము ఇంకా ఏమీ అనలేకపోయాము. ఆ మరుసటి రోజు బాబూజీగారు పెండ్లివారితోపాటుగా అలహాబాద్ వెళ్ళారు. నేను, నా చెల్లెలు మరియు నా తల్లిగారు – మేమంతా ఇక్కడే, లఖింపూర్‌లోనే ఉన్నాం. అక్కడ, అలహాబాద్‌లో శ్రీ బాబూజీగారు మరియు శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు మా పెద్దనాన్నగారి ఇంటిలో అంటే శ్రీ ఎం. ఎల్. చతుర్వేది, జడ్జిగారి ఇంటిలో ఉన్నారు. అభ్యాసీలు అక్కడికి రావడం, బాబూజీగారిని కలుసుకోవడం, సిట్టింగులు తీసుకోవడం – ఈ కార్యక్రమం జరుగుతూనే ఉన్నది. జడ్జిగారికి ఒక చిన్న పాప ఉన్నది. ఆ సమయంలో ఆ పాప చాలా అనారోగ్యంగా ఉన్నది. అప్పటి పద్ధతి ప్రకారం వివాహం మూడు రోజులపాటు జరిగేది.

కాని రెండవ రోజున ఆ చిన్నపాప యొక్క అనారోగ్య పరిస్థితి విషమించిపోయి, ప్రాణాపాయ స్థితికి వచ్చినది. ఇక్కడ, లఖింపూర్‌లో ఉన్న నాకు, ఎందుకో తెలియదు మరి, శ్రీ బాబూజీ మహరాజ్ గారు తమ ఆయుష్షులోని కొంత భాగాన్ని ఆ పాపకు ధారపోయాలని అనుకుంటున్నారనే ఆలోచన నాకు మాటి మాటికి వచ్చినది. నేనేమి చేయగలను! మరల మరల శ్రీ లాలాజీ సాహెబ్‌ను ప్రార్థిస్తూ, నా ఇచ్ఛాశక్తిని ఉపయోగించి, ఆ పనిని ఆపడానికిగాను పనికిమాలిన, మూర్ఖమైన ప్రయత్నాన్ని చేసాను. చివరకు నేనే ఓడిపోయాను. నేను ఈ విషయాన్ని గూర్చి నా తల్లిగారితోను, ఇంకా ఒకరిద్దరు అభ్యాసులతో కూడా చర్చించాను. కాని నాకు ఎటువంటి మనశ్శాంతి లభించలేదు. మూడవ రోజున, పెండ్లి వారంతా ఇంటికి రాగానే, శ్రీ బాబూజీ మహరాజ్‌ను చూడగానే దుఃఖంతో "ఓ ప్రభూ! మీరు ఎందుకు ఈ విధంగా చేసారు? ఈ విధంగా చేయాలనే కదా, మీరు ముందుగా నిశ్చయించుకొని, అలహాబాద్‌కు వెళ్ళారు" అని అనగానే, అప్పుడు 'వారు' ఏమన్నారో తెలుసా? చాలా నెమ్మదిగా, ప్రశాంతంగా, "జడ్జిగారు చాలా బాధలో ఉన్నారు. అది నేను చూడలేకపోయాను'' అని మరల ''ఆ సమయంలో ఏదో హెూమియోపతి మందు కూడా చాలా బాగా పనిచేసింది" అని అన్నారు. ప్రమాణ స్వరూపంగా, ఈ రోజున, ఆ సోదరిని పరిశీలించి చూస్తే సాధారణమైన అభ్యాసీ కంటే ఎన్నోరెట్లు గొప్పగా కనబడుతుంది. ముఖంలో దైవీయ కాంతి, మృదువైన వాణి, ధృఢమైన సంకల్పం మొదలైనవి అన్నీ ఆ సోదరిలో కనబడతాయి. ఈ విధంగా అర్పణ చేయడానికి మన దగ్గర ఏముంది? ఈ విషయం అంటే,

జీవితాన్ని ధార పోయడం అనేది నేర్చుకోవాలనే అభిలాష నాకు చాలా ఉండేది. నాకు నేర్పించమని, బాబూజీగారిని చాలాసార్లు అడిగాను. కాని దానికి ఒక్కటే ప్రత్యుత్తరం. "నేను నీకు నేర్పించ డానికి, ఇదేమీ గొప్ప విద్య కాదు. కాని ఇటువంటి సంఘటన మరల జరగకుండా లాలాజీ సాహెబ్ నా వద్ద నుండి మాట తీసు కున్నారు" అని అన్నారు.

బాబూజీగారి యొక్క సరళతను గురించి ఏమని చెప్పాలి! ఒక పసిపిల్లవాడు కూడా 'వారి' ముందు ఓడిపోతాడు. సరళత యొక్క యధార్థ స్వరూపం, 'వారి'ని చూస్తేనే చాలు, మనకు తెలుస్తుంది. సరళత అనే గుణం, అప్పుడప్పుడు ఎవరిలోనైనా మనకు కనబడవచ్చు. కాని ఈ సరళతయే శ్రీ బాబూజీ మహరాజ్‌గారి చరణాలను చుంబించి, వారిలోనే లయమైనది. అందువల్లనే 'వారి' వ్యవహార విషయాలలో ఈ సరళత అనే గుణం తొణికిసలాడుతుంది. దానిని గురించి మనం ఏమి వర్ణించగలం. కేవలం 'వారి' సమక్షంలో ఉండి, 'వారి'ని చూస్తూ ఉండడమే. ఎప్పుడైనా, ఎక్కడైనా చిన్న చిన్న దుకాణాలకు ప్రారంభోత్సవం జరిగినపుడు, చిన్న పిల్లలకు క్షౌరకళ్యాణం జరిగినపుడు, మన ఇళ్ళలో ఏమైనా చిన్న చిన్న శుభకార్యాలు జరిగినపుడు, ఆ సందర్భంలో ఎవరైనా శ్రీ బాబూజీగారిని ఆహ్వానించినపుడు, 'వారు' నూలుతో కుట్టినటువంటి ఇస్త్రీలేని కోటును మరియు ధోవతీ లేదా ఆలీగఢ్ పైజామాను ధరించి, వెంటనే తయారయ్యి ఆ శుభకార్యానికి వెళ్ళేవారు. ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు నవ్వుతూ, "హుజూర్! మీరు ఈ చిన్న చిన్న కార్యాలకు ఎందుకు వెళ్ళతారు?" అని ప్రశ్నించినపుడు 'వారు' ఈ విధంగా

అన్నారు: “భాయీ! నా ఆశీర్వాదం వలన వాళ్ళ పనులన్నీ చక్కగా నెరవేరాలనే ఆశతో ప్రజలు నన్ను ఆహ్వానిస్తారు. నేను కూడా 11 లేదా 21 రూపాయలు ఆశీర్వాదంగా ఇచ్చి వస్తాను. నిజమే మరి! నా జేబు తప్పకుండా ఖాళీ అవుతుంది” అని అన్నారు. ప్రజలు బాబూజీగారు ఇచ్చిన రూపాయలను, “ఇవి బాబూజీగారి ఆశీస్సులు” అని భద్రంగా దాచిపెట్టుకుంటారు. కాని ఈ ఆలోచన మాత్రం ఎవ్వరికీ రాదు. అది ఏమిటంటే, ఈ విధంగా డబ్బులు ఖర్చు చేయడంవలన, 3,4 రోజులవరకు బాబూజీగారు పాలు త్రాగడం మానివేస్తారు. అంతేకాదు, కోర్టు దూరంగా ఉండడంవలన, డబ్బు ఆదా చేయడానికిగాను చాలా దూరం కాలి నడకనే వెళ్తారు. కాలాంతరంలో ‘వారి’ పని యొక్క అద్భుతం వెలుగులోనికి రాసాగినది. అప్పుడు అభ్యాసుల యొక్క మనస్తత్వంలో పూర్తిగా మార్పు రావడం మొదలైనది. మనం కూడా బాబూజీగారి విశ్రాంతిని గూర్చి శ్రద్ధ తీసుకోవాలి; బాబూజీగారి ఖర్చులను మనమే భరించాలి – అనే భావనలు అభ్యాసులకు కలిగాయి. కాని మాలిక్ సమక్షంలో ఈ సూక్ష్మ చింతనను చిగురింపజేసే అవసరం అభ్యాసులకు ఏ విధంగా దొరుకుతుంది? ఒకసారి, ఒక అభ్యాసీ మొదటిసారిగా బాబూజీని తన కారులో కూర్చొబెట్టుకొని ఆశ్రమానికి తీసుకొనిపోయినపుడు ‘వారు’, “ఇంత పెట్రోలు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముంది? డబ్బు, నేను ఖర్చు చేసినా, నీవు ఖర్చు చేసినా ఒకటే కదా!” అని అన్నారు. అభ్యాసీలపట్ల వారికిగల ఇటువంటి ఆత్మీయత, మన హృదయాలను స్పర్శించకుండా ఎట్లా ఉంటుంది! కాని అప్పుడప్పుడు ఇందుకు భిన్నంగా ‘ఎవరికోసం’ అను మతిభ్రమ

కలుగుతూ ఉంటుంది. అందుకొరకే 'వారు' ఈ విధంగా చెప్పారు: "మనం నాది అను మనస్తత్వాన్ని నిత్యమూ సరిచేసుకోవాలి. ఎందుకంటే, మనస్తత్వమే వ్యక్తిత్వాన్ని తెలియపరుస్తుంది. లయావస్థ అభివృద్ధి చెందినకొద్దీ మనస్తత్వం కూడా లయమైపోతుంది. అప్పుడు 'నాది' అను భిన్న వ్యక్తిత్వం ప్రభువులో లీనమైపోతుంది. అప్పుడు మిగిలి ఉన్నది భావం మాత్రమే. ఆ భావం ప్రభువులో లయావస్థను పొందటంవలన దివ్యశక్తి పోషణలో ఉంటుంది. ఆ దివ్యశక్తి భావంతో "నీవు పరమాత్మ అంశంగా ఉన్నావు. నీకు స్వాగతం. 'నేను' అను భావాన్ని విస్మరించు" అని చెబుతుంది. ఆ దివ్య ఆహ్వానం అభ్యాసీ తనలో స్వీకరించినప్పుడు, తన సొంతం చేసుకున్నప్పుడు "ప్రభువు నాలోనే ఆవిర్భవించి నిత్యం ఉన్నాడు" అని అనుభూతి కలుగుతుంది. అప్పుడు మానవజన్మ ధన్యమై వాతావరణంలోని వాయువులాగా అనంతమై ఉన్న ఆ విరాట్ చరణాల యందు వ్యాప్తి చెందుతుంది. అప్పుడు ఆ దివ్యశక్తి అభ్యాసీకి తన ప్రభువు యొక్క ఆధారం లభిస్తుంది. ఆ ఆధారం ఆ ప్రభువుని చరణారవిందములందు 'నీవు పెరుగుతున్నావు' అను దివ్య స్పందన అహర్నిశలు గుర్తుచేస్తూ ఉంటుంది. ఇప్పుడు ఆ సరస, దివ్య, విరాట ముఖచంద్రుని చూడటానికి, ముఖాన్ని పైకి ఎత్తుటకు సాహసం ఉంటే ప్రభు దివ్యశక్తిని ఆధారం చేసుకోగలవు."

బసంత్ పంచమి – భండారాకు మాత్రమే కాకుండా, జన్మాష్టమి ఉత్సవం సందర్భంగా మా అందరికీ మళ్ళీ షాజహాన్‌పూర్ వెళ్ళే సౌభాగ్యం లభించేది. మొదటి రోజున శ్రీ బాబూజీగారు ఉపవాసం పాటించేవారు. ఆ రోజున సాయంత్రం 7 గంటలకు

పూజ అయిన తరువాత, ప్రసాద సమర్పణ జరిగేది. ఆ ప్రసాదం చాలా సాధరణమైనదిగా ఉండేది. ప్రసాదం తరువాత, హల్వా తిని, టీ త్రాగి మేమంతా బయట వరండాలో కూర్చునే వాళ్ళం. ఈ క్రమం దాదాపు 5, 6 సంవత్సారాల నుండి నడుస్తున్నది. జన్మాష్టమి ఉత్సవం రెండు రోజులు జరుపబడేది. రెండవరోజున మాత్రం రామేశ్వర్ ప్రసాద్‌జీ ఉపవాసం ఉండేవారు. ఆయనే సిట్టింగ్ ఇచ్చేవారు. ఒకసారి బాబూజీగారు అకస్మాత్తుగా, "ఇప్పటి నుండి మీకు ఇష్టం ఉంటే జన్మాష్టమి ఉత్సవాన్ని చేసుకోండి. లేకపోతే లేదు" అని 'వారు' ఆ వ్రతాన్ని విడిచిపెట్టారు.

అప్పుడు మాలో ఒకరు కుతూహలంతో, "బాబూజీ! ఇప్పుడు మీరు జన్మాష్టమి వ్రతాన్ని ఎందుకు చేయడం లేదు?" అని ప్రశ్నించినపుడు, 'వారు' సాధారణమైన ముఖభంగిమతో చాలా గొప్ప మాటను ఈ విధంగా చెప్పారు: "అసలు కృష్ణుని శక్తే నాలో లయమైనపుడు, మీరు ఇంకా ఎవరి జన్మదినోత్సవాన్ని జరుపుకుంటారు?" అని అనగానే, మేమంతా రెప్పవాల్చకుండా 'వారి' ముఖారవిందాన్నే చూస్తూ ఉన్నాం. అప్పుడు ఆ మాటలు మాకు ఏమీ అర్థం కాలేదు. ఏమి అర్థం అవుతుంది? ఏదో ఒక గొప్ప విశేషం మాత్రం జరిగిందని మాకు అర్థమైనది.

ఈ సంఘటన జరిగిన కొన్ని సంవత్సారాల తరువాత, 'వారి' కృప వలన నాకు ఈ విషయం గూర్చి కొద్దిగా అర్థమైంది. ప్రారంభంలో, ప్రతి విషయంలోను, ప్రతి క్షణం గొప్ప గొప్ప వాళ్ళ ఆదేశాలు బాబూజీగారికి వచ్చేవి. కాని ఇప్పుడు ఆ ఆదేశాలు రావడమనేది ఇంచుమించుగా పూర్తిగా ఆగిపోయాయి. ఎందుకు?

నాకు స్పష్టంగా అర్థమైనది ఏమిటంటే, ఎప్పుడైతే శ్రీ బాబూజీ మహరాజ్‌లో 'వారి' అంతరంగమునందు క్రమేణా 'భూమా' యొక్క శక్తి పూర్ణరూపంలో, మనోహరంగా వికసించడం ప్రారంభమై క్రియాన్వితం కావడం మొదలైనదో అప్పుడు స్వతాహాగానే మహా పురుషులందరు కూడా తాము చేపట్టిన మహత్ కార్యక్రమాలతో పాటుగా మరియు తమ వ్యక్తిత్వంతోపాటుగా, తమ శక్తులతో పాటుగా, ఈ దివ్యపురుషునిలో సంపూర్ణంగా లయమయ్యారు. ఇంకా అప్పుడు ఆదేశాల అవసరం ఏముంది?

సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ యొక్క తీవ్రమైన సాధనా ఫలితంగా ఈ భూమి మీద అవతరించిన శ్రీ బాబూజీ మహరాజ్‌లో ఎప్పుడైతే సమస్త దివ్యశక్తులు లయమైనవో, శ్రీ లాలాజీ సాహెబ్‌గారి దివ్యమైన వరదహస్తం నీడలో ఉన్న ఆ దివ్యపురుషులు, అప్పటి నుండి మరింత మనోహరంగా అయ్యారు. **తమ దివ్యమైన పుత్ర రత్నమైన శ్రీ బాబూజీ మహరాజ్ పావనమైన తమ దివ్య కాంతులను ధరణి అంతటా విరజిమ్ముతూ, వ్యాప్తి కావడమనే ఈ దృశ్యాన్ని, శ్రీ లాలాజీగారు తమ దివ్యదృష్టితో చూసి, ఎంతగానో పులకించిపోయి, ఈ దివ్యమైన దృశ్యాన్ని, దివ్యలోకంలో ఈదు లాడుతున్న వారందరికి చూపించాలనే కోరికను ఆపుకోలేకపోయారు. ఎందుకంటే, దివ్యమైన ఆదిశక్తి యొక్క క్రియాన్విత శక్తి నేడు శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలో ఈ ధరణిపై అవతరించినది అనే విషయం ఆ దివ్యలోకవాసులకు కూడా తెలియడానికి;** ఇప్పుడు మీరే చెప్పండి, బాబూజీ అంటే ఎవ్వరు? ఎవరైనా చెప్పగలరా?

ఈ రోజున నా మనోపటలం నుండి ఉప్పొంగిన ఈ దృశ్యాలన్నింటిని, మీ ముందు ఉంచేవరకు ఈ రచయిత్రి విశ్రాంతి తీసుకోదలచుకోలేదు. అందువల్లనే నేను చెప్పేది ఏమిటంటే, ఈ దోషం ఇద్దరిది. ఈ దృశ్యాలను నాకు చూపించిన ప్రభువుది మరియు ఈ విషయాలన్నింటిని మీకు తెలపాలనే ఆరాటం కలిగిన ఈ రచయిత్రిది. నా మనోపటలం మీద చిత్రించబడిన మన జీవన సర్వస్వం అయిన శ్రీ బాబూజీగారి యొక్క ఈ దృశ్యాలన్నింటిని మీ ముందు ఉంచాలని నేను వివశురాలవుతున్నాను. **'వారు' ఈ విధంగా అనేవారు: "నేను ఎటువంటి ప్రకృతి రహస్యాన్ని కూడా, రహస్యంగా ఉంచదలచలేదు."** అదే విధంగా నేను ఎట్టి రహస్యాన్ని కూడా రహస్యంగా ఉంచదలచటంలేదు. అలా ఎందుకంటే, మన వంటి సాధారణ వ్యక్తులు, కేవలం 'వారి' కృపవలన ఆ దివ్య రహస్యాల దృశ్యాలను చూడగలుగుతారు. ఆ కారణం మూలంగానే ఈ పుస్తకం అందరికీ అందుబాటులో ఉంది. ఈ లేఖిని 'వారి'కి కట్టుబానిస వంటిది అయి ఉండగా 'వారు' ఎప్పుడు వ్రాయించదలచుకుంటె అప్పుడు వ్రాస్తుంది, 'వారు' ఎప్పుడు ఆపాలి అనుకుంటె అప్పుడు ఆగిపోతుంది. **లాలాజీగారి యొక్క 'లాల్' అంటే పుత్రరత్నం – శ్రీ బాబూజీ మహరాజ్ ఈ యుగానికే ప్రాణంగా మారి, ఈ యుగంలోనే ఇమిడిపోయారు. 'వారి' ద్వారా నిరంతరం ప్రవహించే ప్రాణాహుతి యొక్క నిరంతర ప్రవాహం, ఈ యుగ ప్రవాహంతోపాటుగా, యుగంలోని ప్రాణుల యొక్క స్పందనగా మారి, ప్రాణిమాత్రుల హృదయాలను స్పర్శిస్తున్నది.** కేంద్రం యొక్క కేంద్రం అంటే 'భూమా' యొక్క శక్తి మన శ్రీ బాబూజీ మహరాజ్‌గారి యొక్క దివ్య

ముఖారవిందం యొక్క దివ్య జ్యోత్స్నలతో (జ్యోత్స్న అంటే వెన్నెల కాంతి) యోగాన్ని పొంది, నేడు మానవమాత్రుల కొరకు సులభంగా మారినది. దీనితోపాటుగా, 'వారి' యొక్క వ్యావహారిక విషయాలు కూడా మన దైనందిన జీవితానికి ఒక శిక్షణగా, ఆదర్శప్రాయంగా నిలిచి ఉన్నాయి. 'వారి' యొక్క సాధారణమైన మరియు సరళమైన దైనందిన జీవన చర్య – ఉదయం, సాయంత్రం ఆవు, దూడలకు మేత వేయడం, నీళ్ళు పెట్టడం, ప్రేమతో వాటి వీపును తట్టడం – ఇవన్నీ కూడా 'వారి' నిత్యజీవితంలోని అంశాలుగా మారిపోయాయి.

అప్పుడప్పుడు 'వారి'లోని చిన్న పిల్లలవంటి పట్టుదల కూడా చూడముచ్చటగా ఉండి 'వారి' దివ్య సౌందర్యాన్ని మరింతగా ఇనుమడింప జేస్తుంది. ఒకసారి జూన్ నెలలో మేము షాజహాన్‌పూర్ చేరుకున్నాము. అనేక ప్రాంతాల నుండి అభ్యాసీలు అక్కడకు వచ్చి ఉన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్‌గారు ఎంతో శ్రద్ధతో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పారిజాతపు పూల మొక్కలకు కలుపు తీసి, నీరు పోయడం మేమంతా గమనిస్తూనే ఉన్నాం. ఇది చూసిన ఒక అభ్యాసీ, 'హైరానా'పడి "బాబూజీ! మీరు పారిజాతపు పూల మొక్కలకు నీరు పోయడంలో అంతగా ఎందుకు లీనమై ఉన్నారు?" అని అనగానే 'వారు' నెమ్మదిగా, ధృఢంగా, ఈ విధంగా అన్నారు: "దక్షిణ భారతీయులకు పారిజాత పుష్పాలంటే చాలా ఇష్టం. వాళ్ళు ఇక్కడకు వస్తున్నారని ఉత్తరం వచ్చినది. నేను కోరేది ఏమిటంటే, వారు ఇక్కడకు వచ్చేసరికి, ఇవి పువ్వులు పూయాలి" అని అన్నారు. అప్పుడు ఆ అభ్యాసీ, "బాబూజీ! పారిజాత పుష్పాలు సెప్టెంబర్, ఆక్టోబర్ నెలలో పూస్తాయి; ఇప్పుడు కాదు" అని అనగానే 'వారు', "అయితే

నాకు ఏమిటి? నాకు కావలసినది పువ్వులు" అని అన్నారు. మేమంతా కూడా అప్పుడు ఒక వారం రోజులు షాజహాన్‌పూర్‌లోనే ఉన్నాం. నాలుగు రోజుల తరువాత, ఉదయాన్నే 'వారు' 4,5 పారిజాత పుష్పాలను తీసుకొని మా గదిలోనికి వచ్చి వాటిని మాకు చూపిస్తూ, "లాలాజీ సాహెబ్‌కు ధన్యవాదాలు. దక్షిణదేశం అభ్యాసీలు రేపు ఇక్కడకు రాబోతున్నారు. కాని ఈ రోజుననే ఈ పువ్వులు పూసాయి" అని అన్నారు. ఒక్కసారిగా మేమంతా ఖంగుతిన్నాము. 'వారి' మాటలు మన ఆలోచనా శక్తికి అతీతమైనవి. ఇంకా వాటిని గురించి మనం ఏమి ఆలోచిస్తాము. కాని తమ అభ్యాసులపట్ల వారికిగల ప్రేమ మన హృదయాంతరాళాన్ని త్రాకుతుంది.

**అభ్యాసులలోని లోపాలను, అవగుణాలను ఏమాత్రం చూడకుండా, వారిలో ఉత్సాహాన్ని పెంపొందిస్తూ, వారిని ఆధ్యాత్మిక పథంలోకి తీసుకొని పోవడమనేది శ్రీ బాబూజీగారి యొక్క స్వాభావికమైన స్వభావంగా మారినది.**

**ఒకసారి ఒక అభ్యాసీ తనలోని అవగుణాలన్నింటిని శ్రీ బాబూజీగారి సమక్షంలో ఉంచినప్పుడు, 'వారు' తమ సహజ స్వరంతో, చాలా తేలికగా, ఈ విధంగా అన్నారు: "చూడు, నీవు నాకు ఈ విషయాలన్నింటిని తెలిపావు. వీటన్నింటిని తీసుకొనే శక్తి నాలో ఉంది. ఎప్పుడైనా సరే, అభ్యాసీ నిజాయితీతో, తనలోని బలహీనతలన్నింటిని నాకు తెలిపితే చాలు, నేను నాలోని శక్తిని విడుదల చేస్తాను. ఆ శక్తి వీటినన్నింటిని పీల్చి వేస్తుంది. అప్పుడు ఇంకా నీలో అయోగ్యత ఎక్కడ మిగులుతుంది?" అని అన్నారు.** మరల చాలా సంతోషంతో వారు, "భాయీ! నీవు చాలా తెలివిగల

వానివి. ఇప్పుడు నీ భాగమున యోగ్యత మాత్రమే మిగిలి ఉన్నది" అని అన్నారు. ఈ మాటలు వినగానే మన అంతరంగంలో ఒక విధమైన ఉత్సాహం కలిగి, ఒక ఆశ్చర్యకరమైన శక్తి జనిస్తుంది. ఎంతటి ఔదార్యం! ఎంతటి అద్భుతమైన క్షమత!

ఒకసారి బాబూజీగారిని ఒక అభ్యాసీ ఈ విధంగా అడిగాడు: "బాబూజీ! ఎవరైనా ఒక గొప్ప పండితుడు మీ దగ్గరకు వచ్చినపుడు, ఆయన మీద మీరు ఎట్లా పనిచేస్తారు? ఎందుకంటే, ఆ పండితునిలో 'అహం' అనేది చాలా స్పష్టంగా కనిపిస్తుంది కదా!" అని అనగానే 'వారు' ఈ విధంగా సమాధానం ఇచ్చారు: "మొదట నేను చేసే పని ఏమిటంటే, నా ఇచ్ఛాశక్తితో ఆయన పాండిత్యం చుట్టూ ఒక ఆవరణాన్ని ఏర్పరుస్తాను. ఎందుకంటే, ఎప్పటివరకైతే ఆయనకు, నేను గొప్ప పండితుడను అనే భావన ఉంటుందో, అప్పటివరకు ఆయన మీద నేను చేసిన పని వికసించదు" అని మరల 'వారు' నెమ్మదిగా, "ఇందులోని రహస్యం ఏమిటో నీకు తెలుసా? దైవీయ సంకల్పంతో ఏర్పరచబడిన ఆ ఆవరణవలన, ఆ పండితుని అహంకారం కూడా కరిగిపోతుంది" అని అన్నారు.

మన హృదయాలను ఖరీదు చేసెడి ప్రేమతో కూడిన 'వారి' ఆహ్వానం, 'వారి' యొక్క సరళతకు ఒక ఉజ్వలమైన నమూనా అని చెప్పవచ్చు. నా సొంత పని గురించి 'వారు' నన్ను ఆహ్వానించడానికి 'వారు' వ్రాసిన లేఖ ఒకటి నాకు ఇప్పటికి కూడా గుర్తున్నది. 'వారు' పంపించిన లేఖలో ఈ విధంగా ఉన్నది. ఆ లేఖను 'వారే' స్వయంగా తమ మనుమరాలి తరపున ఈ విధంగా వ్రాసారు: "నా కేశఖండన ఉత్సవం ఉన్నది. అందరి మేనత్తలు వస్తున్నారు. అందువలన నా

మేనత్త కూడా తప్పకుండా రావాలి" అని. ఆ భాష మాత్రం మనుమరాలిది. కాని వణుకుతున్న ఆ హస్త కమలం యొక్క ఆ వ్రాతను చూడగానే, కృతజ్ఞతతో నిండిన ఈ హృదయం నుండి కన్నీళ్ళు జర జర ప్రవహించాయి. ఆ అశ్రువులు నా అంతరంగాన్ని పరిశుభ్రపరచి, స్ఫటికంలాగా స్వచ్ఛంగా చేసినట్లు అనిపించింది. 'వారి' దివ్యచరణాల చెంత నివసిస్తున్న నేను, ఇవ్వడం – తీసుకోవడం అనేది ఎప్పుడైనా జరిగినదా? లేదా? అని ఈ నాటికి కూడా నిర్ణయించుకోలేకపోతున్నాను. ఎందుకంటే, ఇప్పటికి కూడా నా హృదయానికి తృప్తి కలగలేదు. మరి 'వారి' పవిత్రమైన ఆశీర్వచనాలన్నీ ఏమైపోయాయి? నాకు మాత్రం తెలియదు. 'వారు' అతిథిగా వచ్చారు. కాని హృదయమే తమ అమూల్యమైన సంపద అన్నట్లుగా, 'మాలిక్'గా మారి హృదయంలోనే స్థిరపడ్డారు. కాని 'వారు' ఎటువంటి అపూర్వమైన అతిథి అంటే మన అశ్రుధారలుకాని, మన అంతరంగంలో నిశ్చలస్థితి యొక్క నిశ్చలత్వంకాని 'వారి' మీద ఎటువంటి ప్రభావాన్ని చూపించలేవు. కాని 'వారు' నిరంతరం తమ కర్తవ్యంలో లీనమై ఉండి, మెలకువతో కూడిన తమ కనుచూపులనే ప్రేమఖైదుతో పిల్లలలైన మనలను స్వేచ్ఛతో నుంచేవారు. తమ అభ్యాసుల హృదయాలతో తాను విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకొని, దానిని కూడా మరచిపోవడమనేది 'వారి' సహజమైన స్వభావంగా మారినది. వారు ఎవరు? అంటే మీరు ఏమైనా అర్థం చేసుకోగలరా? మీరే చెప్పండి!

తమ దివ్యత్వాన్ని చాటుచేసుకొని నాలో తమను ఆవిర్భవింప చేసుకుంటూ నా స్థితి 'ఇది' అని నాచేత వ్రాయించటం 'వారి'

సహజ ఆదేశంగా ఉన్నది. ఇటువంటి అలౌకిక క్రీడ మనకు చూడటానికి ఎప్పుడైనా అవకాశం లభిస్తుందా? సహజమార్గం ద్వారా ఈ దివ్య విద్యతో మన హృదయాలలోని పొరలను క్షాళాన చేస్తూ, ఆవరణను తొలగిస్తూ మన అంతరంగంలో దివ్యగతులను ఆవిర్భవింపచేసి, 'వారు' మన అంతరంగంలో ఏ స్థితి యొక్క చిత్తరువును (చిత్రాన్ని) ఆవిర్భవింపచేసి, మనలను ధన్యం చేసినది తెలియ చెప్పరు. అప్పుడు అద్వితీయ చిత్రాన్ని చిత్రించిన ఆ దివ్య చిత్రకారుడు తాను అనుకున్న రీతిలో 'రంగు'ను మనలో ఆధ్యాత్మిక సృష్టి కొరకు నింపుతున్నారు. అది మనం ఎలా తెలుసుకోగలం? మరల సంతోషంతో ఇలా అంటారు: **"లాలాజీకి కృతజ్ఞతలు, మీ శ్రమ ఫలించినది. మీ ఆధ్యాత్మిక గతితో ఫలానా స్థితి ఏర్పడినందున మీకు శుభాలే కలిగాయి." ఆ శబ్దాలు వాటి మాధుర్యాన్ని మరచి 'వారి'కి అంకితమైపోయాయి. అప్పుడు 'శబ్దం' శబ్దంగా ఉండక దివ్యలోకం నుండి వచ్చిన 'దివ్యవాణి'యై మనలను పులకింప చేస్తుంది. పరవశులను చేస్తుంది.**

సాధారణంగా బాబూజీగారు రాత్రి భోజనం చాలా అలస్యంగా చేసేవారు. బాబూజీగారు మరియు ఈశ్వర్ సహాయ్‌గారి భోజనం కాగానే, వెంటనే మేము కూడా భోజనం చేసి, బాబూజీగారి కొరకు ఒక తమలపాకును తీసుకొని, వరండాలోకి వచ్చేవాళ్ళం. వేసవి కాలమైతే వరండా బయట పచార్లు చేసేవారు. శీతాకాలమైతే వరండా లోపల 15, 20 నిమిషాలు పచార్లు చేసేవారు. నడుం వెనకాల చేయి పెట్టుకొని నిలబడి, నవ్వుతూ ఈ విధంగా అనేవారు: "భాయీ! నేను ఒక నిశాచరుడిని (రాత్రి సంచరించేవాడిని).

ఎందుకంటే, నా పని అంతా కూడా, ఉత్తరాలు మొదలైనవి వ్రాయించడం రాత్రి 11,12 గంటలకు ప్రారంభమవుతుంది" అని అనేవారు. నిజమే మరి. 'వారు' ఉత్తరాలు వ్రాయించే సమయంలో చాలా సంతోషంతో ఉండేవారు. ఉత్తరాలు వ్రాసే సమయంలో ఎవ్వరూ కూడా 'ఆ' – 'ఊ' అని అనకూడదనే కఠినమైన నిబంధన విధించేవారు. లేఖ వ్రాస్తున్నప్పుడు, మధ్యలో ఏదైనా మరచిపోతే, దానిని ఆ లేఖ పూర్తయిన తరువాతనే బాబూజీగారిని అడగాలి. ఈ ఉత్తరాలను వ్రాయించే సమయంలో, 'వారి'ని గమనించినట్లయితే, 'వారు' ఎక్కడో, వేరే లోకంలో ఉండి, అక్కడి నుండి మాట్లాడుతున్నట్లుగా మనకు కనబడుతుంది. ఆ సమయంలో 'వారి' ముఖంలోని దివ్యకాంతులను చూడగానే, 'ఆ' – 'ఊ' అనాలనే సాహసం మనకు ఉండదు.

**ప్రారంభంలో నేను, బాబూజీగారిని కలుసుకోవడానికి షాజహాన్‌పూర్ వెళ్ళి మరల తిరిగి ఇంటికి వచ్చే సమయంలో, వియోగం యొక్క వ్యథతో నా హృదయం బ్రద్దలయ్యేది. నేత్రాలు కన్నీటి ధారలను వర్షించేవి. ఒకసారి నేను ఉండబట్టలేక, శ్రీ బాబూజీగారు ఏకాంతంగా ఉన్నప్పుడు, "'బాబూజీ! మిమ్మల్ని కలుసుకోవడం వలన కలిగే ఆనందం ఇదేనా? హృదయంలో వ్యథ కన్నీటి వర్షం'' – అని అడగ్గానే, బాబూజీగారు, ఏదో పోగొట్టుకొన్నవానిలాగా, ఈ విధంగా జవాబు నిచ్చారు: "బిటియా! ఇది కలుసుకోవడం వలన కలిగిన అనందం కాదు. కాని ఇవి వియోగం యొక్క జ్ఞాపకాలు మాత్రమే అని అర్థం చేసుకో. ఎందుకంటే, సృష్టికర్త నుండి ఎంతకాలం నుండి మనం వియోగం**

**చెందామని సమయమే మనలను ప్రశ్నిస్తుంది. అప్పుడు దానికి గుర్తుగా మన దగ్గర కేవలం హృదయం యొక్క ఈ బాధ, కన్నీటి ధారలు తప్ప ఏవీ ఉండవు.** ఇప్పుడు నీకు అర్థం అయ్యింది అనుకుంటాను" అని అన్నారు. అప్పటికి కూడా నాకు ఏమీ అర్థం కాలేదు. కాని నా హృదయానికి, నేత్రాలకు మాత్రం తప్పకుండా కొద్దిగా అర్థం అయినట్లు ఉన్నది. ఎందుకంటే, అప్పటి నుండి నా హృదయం, నేత్రాలు ఈ వియోగం యొక్క బాధతో సరిపెట్టుకున్నట్లు ఉన్నాయి. ఎందుకంటే, 'మాలిక్' తమ మాటల ద్వారా, ప్రేమ ప్రవాహాన్ని  నా హృదయంలోకి ప్రవహింపజేసి, ఈ వియోగం యొక్క వ్యథను తగ్గించి హృదయానికి సామీప్యత అనే వెచ్చని పట్టీని వేసినట్లుగా అనిపించినది. ఈ రోజున, ఆనాటి స్థితి యొక్క రహస్యం అర్థం అవుతుంటే ఈ విధంగా అనిపిస్తున్నది. వియోగం యొక్క బాధ పొంగి పొరలినపుడే, 'వారు' ఎవ్వరు? మరియు ఎవ్వరి యొక్క అంశ? అనే విషయం ఈ హృదయానికి కొద్దిగా అర్థమైనది. ఎప్పుడైతే 'వారి' స్మరణ వలన, హృదయ ద్వారాలు తెరవబడి, ఆశ్రు జలంతో ప్రక్షాళన కావింపబడి, అంతర్నేత్రాలు ప్రభువు యొక్క శుభాగమనం అనే సౌభాగ్యం కొరకు ఆరాటంతో, ఎదురుచూస్తూ ఉంటాయో, అప్పుడే శ్రీ బాబూజీగారి యొక్క ఈ వాక్యం– "ఇవి కలుసుకోవడం వలన కలిగే ఆనందం కాదు. కాని వియోగం యొక్క స్మృతులు ఇప్పుడు వచ్చాయి" అనేది అర్థమవుతుంది. 'వారి' శూన్యమైన చూపుల నుండి మనకు ఇటువంటి సమాధానమే లభిస్తుంది.

శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క చూపులు ఒక విధమైన అలౌకికమైన ప్రభావంతో కూడుకొని ఉంటాయి. ఎప్పుడైనా 'వారి'

ముఖమండలం శూన్యత్వంతో దేదీప్యమానంగా వెలుగుతున్నప్పుడు, గొప్ప గొప్ప విద్వాంసులు, జ్ఞానులు సైతం, 'వారి' సమక్షంలో కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేని అసమర్థులవుతారు. ఒకసారి డాక్టర్ కె. సి. వరదాచారి గారు తన మిత్రుడు, తనలాగే ఫిలాసఫర్ మరియు భారత రాష్ట్రపతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణను కలుసుకోవడానికి, బాబూజీగారిని కూడా తీసుకొని వెళ్ళారు. డాక్టర్ రాధాకృష్ణగారు, సోదరుడు వరదాచారిగారిని చూడగానే, ఉత్సాహంతో లేచి, వారిని దగ్గరకు తీసుకొని, కుశుల ప్రశ్నలు వేసారు. కాని డాక్టర్ రాధాకృష్ణగారి దృష్టి శ్రీ బాబూజీగారి మీదకు వెళ్ళలేదు. బాబూజీగారు నిశ్శబ్దంగా నిలబడి వారిద్దరి సంభాషణ అంతా వింటున్నారు.

కొంత సమయం తరువాత వరదాచారిగారు బాబూజీగారిని డాక్టర్ రాధాకృష్ణగారికి పరిచయం చేయగానే, ఆయన బాబూజీగారితో చేతులు కలిపి, "మీరు ఏమేమీ తీసుకుంటారు?" అని అడిగారు. శ్రీ బాబూజీగారు ఇంటికి వచ్చిన తరువాత ఈ విధంగా అన్నారు: "డాక్టర్! వారు నన్ను, ఏమేమి తీసుకుంటారు? అని అడిగారు. దానికి నేను ఏమి జవాబు చెప్పగలను. **మన లాలాజీ సాహెబ్ గారు ఈ సృష్టినంతటిని నడిపించడానికి కావలసిన శక్తిని, అధికారాన్ని మరియు ఇతరులను అంతిమం వద్దకు చేర్చు శక్తిని నాకు ప్రసాదించారు. ఇంకా ఏదైనా కొద్దిగా కూడా తీసుకోవడానికి లాలాజీగారు అసలు నాలో ఖాళీ ప్రదేశమే ఉంచలేదు.** అందుకని 'మీరు ఏమైనా తీసుకుంటారా?' అని డాక్టర్ రాధాకృష్ణగారు అడిగినపుడు నేను మౌనం వహించాను" అని అన్నారు. 'వారి' ఈ

సమాధానాన్ని వినగానే డాక్టర్ వరదాచారిగారితో సహా, మేమందరం ఆశ్చర్యపోయి, 'వారి'నే చూస్తూ ఉండిపోయాము. మరల 'వారు', "ఈ రోజున నేను, ఇద్దరు గొప్ప ఫిలాసఫర్‌ల యొక్క సంభాషణను విన్నాను. కాని వీళ్ళిద్దరి మధ్యలో నేను ఏమి మాట్లాడగలను. ఎందుకంటే, వీళ్ళను తయారుచేసినది ఫిలాసఫర్‌లు మాత్రమే, కాని నన్ను తయారు చేసింది మాత్రం యోగి" అని అన్నారు.

ఆధ్యాత్మికంగా ఏదో ఒకటి ఇవ్వాలనే ఉత్సాహం శ్రీ బాబూజీగారి వ్యక్తిత్వానికే సాటిలేనటువంటిది. ఒకసారి తమ గురుభాయీ అయిన శ్రీ కరణాశంకర్‌ను ద్వారం వద్ద చూడగానే, శ్రీ రామేశ్వర్‌గారితో 'వారు', "రామేశ్వర్‌జీ! ఇప్పుడు కరుణాశంకర్‌ను 'కుతుబ్' స్థితికి తీసుకొని వెళ్ళాలి" అని అనగానే, చతురుడైన గురుభాయీ రామేశ్వర్‌జీ, "భాయీ సాహెబ్! మీరు బాగా ఆలోచించారా? అని అనగానే, వెంటనే 'వారు', "ఏదైతే ఇవ్వాలనుకుంటున్నానో, దాని కోసం ఆలోచించాలా? ఒకవేళ ఆలోచించినట్లయితే, నా మనస్సు మారిపోతే, లాలాజీ సాహెబ్ యొక్క బహుమతిని వెనుకకు తీసుకున్నట్లు కాదా? ఆ విధంగా నేను చేయలేను" అని అన్నారు. పతివ్రత నుదుటి మీద ప్రకాశించే తిలకంలాగా, తమ లాలాజీ సాహెబ్ యొక్క చిర సౌభాగ్యాన్ని చాటిచెప్పే ఈ తిలకమే శ్రీ బాబూజీ మహరాజ్. శ్రీ బాబూజీగారు తమ సద్గురువు యొక్క గొప్పతన్నాన్ని గౌరవాన్వితం చేస్తూ, ఎల్లవేళలా ఆధ్యాత్మికతలో సూర్యునిలాగా ప్రకాశిస్తూ, ఈ విశ్వమంతటిని ఎల్లవేళలా, తమ ఈశ్వరీయ శక్తితో దేదీప్యమానం చేస్తున్నారు అనేది

ధృవ సత్యం. నిజం చెప్పాలంటే, **సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క దివ్యమైన మరియు విరాట్ గౌరవం యొక్క మరో పేరు 'బాబూజీ మహరాజ్'.**

ఇంతేకాదు, గురుభాయీలపట్ల గల ప్రేమ, ఆదర భావాలు 'వారి' మనస్సులో ఏ విధంగా ఉండేవి అంటే, వాటి స్థానంలో వేరే ఇతర భావాలు ఏవీ కూడా ప్రవేశించేవి కావు. ద్వారం వద్ద గురుభాయిని చూడగానే, వాళ్ళ సామానులను మోయడానికి స్వయంగా లేచేవారు. ఎప్పుడు కూడా నౌకర్లకు చెప్పేవారు కాదు. అభ్యాసీలు వస్తే మాత్రం వాళ్ళ సామానులు మోయమని మాలిన్‌కు లేదా నౌకర్లకు చెప్పేవారు. బాబూజీని గూర్చి 'వారి' గురుభాయీలు ఈ విధంగా అనేవారు: "మా భాయీ సాహెబ్‌చేత ఇవ్వబడిన ఈ గౌరవం, ఆదరభావాలు మేము మరియు అభ్యాసులందరు కూడా అనుసరించదగినవి. అంతేకాదు, ఇది నిష్కల్మషత్వంతో కూడిన ఆత్మీయత మాత్రమే కాదు. ఇది మా అంతరంగంలోని అభిమానాన్ని అంటే మాలోని అహంకార భావాలను నిర్మూలిస్తుంది" అని అనేవారు. 'వారి' దివ్యమైన వ్యక్తిత్వాన్ని గూర్చి మనం ఏమి చెప్పగలం!

శ్రీ బాబూజీగారిది ఎంత సహజమైన, సాధారణమైన వ్యక్తిత్వమంటే, ఎప్పుడు, ఎవ్వరినీ మాటలతో ఏ మాత్రం కొద్దిగా కూడా నొప్పించేవారు కాదు. అందువలన– **నీలో ఈ లోపం ఉన్నది – అని ఎప్పుడు కూడా మాటలతో వ్యక్తం చేసేవారు కాదు.** "బాబూజీ! నేను క్రమం తప్పకుండా ధ్యానం చేయలేకపోతున్నాను" అని ఒక అభ్యాసీ అన్నప్పుడు, 'వారు' ఆ విషయం అభ్యాసీది కాదు,

తమ గురించే అన్నట్లుగా భావించి, "భాయీ! ధ్యానంలో కూర్చొనాలంటే నేను కూడా భయపడతాను. ఒకసారి లాలాజీ సాహెబ్‌గారు నన్ను ధ్యానంలో కూర్చోమని ఆదేశించే భావంలో (మూడ్) ఉన్నట్లుగా నేను గమనించాను. వెంటనే నేను వారిని చూడడం మానివేసి, నా చూపులను క్రిందికి దించుకొన్నాను. కొంత సమయం తరువాత నెమ్మదిగా తల పైకెత్తి లాలాజీ గారిని చూసాను. అప్పుడు లాలాజీగారు ముసి ముసి నవ్వులు నవ్వుతున్నారు. ఇంకేముంది, నాకు అర్థమైపోయింది. ధ్యానంలో కూర్చోకూడదనే నా దొంగతనం పట్టుబడిపోయినది. వెంటనే నా కనురెప్పలను క్రిందకి దించుకున్నాను. అపుడు సమర్థ సద్గురు లాలాజీగారు – "ధ్యానంలో కూర్చోకుండా ఇప్పుడు నీవు చాలా దొంగగా మారావు" అని లాలాజీగారు అన్నారని బాబూజీగారు చెబుతూ, ఆ అభ్యాసీతో మరల, "భాయీ! ఇదంతా కూడా, నేను నా సాధన సమాప్తం అయిన తరువాతనే ఈ విధంగా చేసాను" అని అనగానే అ అభ్యాసీ తెల్లబోయాడు.

శ్రీ బాబూజీగారి వ్యావహారిక జీవనం గురించి ఏమి చెప్పగలం? జీవితంలో దుఃఖాలు అంటే మనం చాలా హైరానా పడతాము. కాని 'వారు' సుఖదుఃఖాలు రెండిటిలో కూడా సమానంగా పాలుపంచుకొనేవారు. ఒక రోజున ఒక అభ్యాసీ, "బాబూజీ! సుఖదుఃఖాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగినపుడు, నేను శ్రీ బాబూజీ మహరాజ్‌గారిలో దివ్యమైన మంచితనంతో కూడిన, అపూర్వమైన ఠీవిని చూసాను. సుఖదుఃఖాల విషయంలో తన గురించి తాను ఏమి చెప్పకోగలరు! తనను తాను

రక్షించుకుంటూ, సహజస్వరంతో ఈ విధంగా అన్నారు: "ఈ విషయంలో మన లాలాజీగారు చెప్పిన సమాధానం సాటిలేనిది. **లాలాజీ సాహెబ్ తాను కప్పుకున్న శాలువాను చూపిస్తూ ఈ విధంగా అనేవారు– సుఖదుఃఖాలు అనేవి ఈ శాలువాకు ఉన్న రెండు అంచుల వంటివి. ఒక అంచు ఈ సృష్టి యొక్క ఉత్పత్తితో జతపరచబడినది. ఇది శాశ్వత సుఖానికి, శాంతికి ప్రతీక. రెండవ అంచు ఈ సంసార జీవితంతో ముడి పెట్టబడినది. ఇది దుఃఖానికి చిహ్నంగా నిలిచి ఉన్నది. ఒకసారి మనం ఈ శాలువా యొక్క ఒక అంచును కప్పుకుంటాము. మరొకసారి, ఇంకొక అంచును కప్పుకుంటాము. అదే విధంగా, ఒకసారి సుఖాలు, మరొకసారి దుఃఖాలు మనకు జీవితంలో ఎదురవుతాయి అని లాలాజీ సాహెబ్ అన్నారు."** మానవుడు గృహస్థ జీవితాన్ని గడుపుతున్నప్పటికీ, ఏ విధంగా వాటికి అతీతంగా ఉండాలో అని ఈ మాటల వలన మనకు తెలుస్తుంది.

శ్రీ బాబూజీగారి యొక్క మామూలు మాటలలోను, 'వారి' సాధారణమైన సంభాషణలోను, మనకు ఎక్కడో ఒకచోట, ఆధ్యాత్మికత యొక్క తళుకులు తప్పకుండా దొరుకుతాయి. ఒకసారి చాలా ఉత్సాహంతో వారు, "భాయీ! **ధ్యానంలో లోతుగా వెళ్ళండి** – అని నేను మీ అందరితో అంటూ ఉంటాను. కాని దీనిలోని అంతరార్థం ఏమిటో నాకే తెలియదు" అని అన్నారు. మరల ఈ విధంగా అన్నారు: "భాయీ! **ధ్యానం యొక్క సహజస్థితిని చేరుకోవడమే, ధ్యానంలో లోతుగా వెళ్ళడం. ధ్యానం యొక్క సహజస్థితిని పొందాలంటే, మనం ప్రథమంగా ఈ అసహజ స్థితిని అతిక్రమించవలసి ఉంటుంది"** అని అన్నారు. మరల, తమ మధుర

కంఠంతో, స్వయంగా ఈ విధంగా అన్నారు: "ధ్యానం యొక్క సహజస్థితి అంటే ఏమిటో తెలుసా?" అని ప్రశ్నించారు. స్వయంగా 'వారే' ఈ విధంగా జవాబు నిచ్చారు: **"ఆత్మ భగవంతునిలో 'లయం' కావడమే ధ్యానం యొక్క సహజస్థితి"** అని అన్నారు. మరల ఈ విధంగా అన్నారు: "ఇప్పుడు మీరు నన్ను అడుగుతారేమో! **ధ్యానం యొక్క అసహజస్థితి అంటే ఏమిటి?** అని. **ఏ విషయాలైతే మనలను ధ్యానం యొక్క సహజస్థితి నుండి దూరం చేసాయో, వేటివల్లనైతే మనం భగవంతుని నుండి విడిపోయామనే భావాలు కలిగాయో, అవి అన్నీ కూడా అసహజమైనవే.** అంటే నేను చెప్పేది ఏమిటంటే, **ఈ సూక్ష్మ శరీరం మరియు కారణ శరీరం కూడా మన అసహజ స్థితి యొక్క పరిణామమే" అని అన్నారు.**

ఇటువంటి సందర్భాలలో, మేము నిశ్శబ్దంగా కూర్చొని, 'వారి' మధురవాణి నుండి వెలువడిన ఈ అమృత వాక్కులను, రసాస్వాదన చేస్తూ, ముగ్ధులమైపోతాము.

**ఎప్పుడైనా మన మనస్సులో ఏమైనా ప్రశ్నలు ఉదయిస్తే, వాటికి జవాబుగా 'వారే' స్వయంగా అటువంటి ప్రశ్నలను అడిగి, జవాబులను చెప్తారు. కాని మనస్సులో ఏదైనా జిజ్ఞాస కలిగితే, దానికి తగిన అనుభూతిని మనకు కలిగించి, మనలను తృప్తిపరుస్తారు.** ఒకసారి నా మనస్సులో ఒక జిజ్ఞాస కలిగింది. అది ఏమిటంటే, ఇంతమంది అభ్యాసులలో, ఫలానా అభ్యాసీని, ఫలానా స్థితి నుండి యాత్ర చేయించాలని బాబూజీగారికి ఎలా తెలుస్తుంది? మరల మనకు కావలసినటువంటి స్థితిని సరైన సమయంలో ఏవిధంగా ఏర్పరుస్తారు? ఇన్ని వేల మంది

అభ్యాసులకు, ఎవరికి, ఎప్పుడు, ఏది కావాలో అది బాబూజీగారు ఎలా ఇవ్వగలుగుతున్నారు" అనే జిజ్ఞాస నాలో ఏర్పడింది. 3,4 రోజులు గడిచాయి. ఒకరోజు రాత్రి 11 గం. 30 ని॥లకు శ్రీ బాబూజీగారు పిలిచినపుడు, నేను వెళ్ళి 'వారి' ఎదురుగా కూర్చున్నాను. ఒక సెకండ్ తరువాత, నా ఎదురుగా ఒక ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూసాను. ఆ పావన దృశ్యం, నాలుగు రోజుల క్రితం నా మనస్సులో ఉద్భవించిన జిజ్ఞాసకు ప్రత్యక్షమైన స్పష్టీకరణ అని నాకు అర్థమైనది. ఆ దృశ్యాన్ని అలానే చూస్తూ ఉండిపోయాను. "నా సమక్షంలో ఆధ్యాత్మిక సముద్రం ఉన్నది. అందులో, నీటి బుడగలు ఉండుండి, పైకి ఎగిసిపడుతున్నాయి. ఆ నీటి బుడగలలో అభ్యాసీల యొక్క ముఖాలు కనిపించాయి. ఆ పవిత్ర సాగరంలో అభ్యాసులందరు, తమ కోసం ఏదో అర్థిస్తున్నారు." రెండు నిమిషాలలోనే ఆ దృశ్యం 'వారి'లోనే లీనమైపోయినది. దానితోపాటుగా నా మనస్సులో ఉద్భవించిన జిజ్ఞాస కూడా అదృశ్యమైనది. ఒక్కసారిగా, 'వారి' కంఠం నుండి వెలువడిన స్వరలహరి, నా మనస్సు మరల ఈ లోకంలోకి తీసుకొని వచ్చింది. ఆ స్వరలహరి, నా కర్ణకుహరాలలో ఆధ్యాత్మికత అనే ప్రాణాన్ని ఊదినట్లుగా అనిపించినది. "ఇప్పుడు నీకు అర్థం అయ్యింది అనుకుంటాను" – అని అన్న 'వారి' మాటలకు నేను ఏమి జవాబు చెప్పగలను. నేను కేవలం ఇంత మాత్రం చెప్పగలను. అది ఏమిటంటే, నేను చూసిన ఆ పావన దృశ్యం మానవ గమ్యానికి అతీతమైనది. ఆ! గుర్తుకు వచ్చినది. శ్రీకృష్ణ భగవానుడు ఒకసారి అర్జునునకు తన విశ్వరూపాన్ని చూపించినపుడు, అర్జునుడు ముగ్ధుడై

ఆ దృశ్యాన్నే చూస్తూ ఉండిపోయాడు. కాని ఆ రోజున నేను ఆ పరమ సత్యం యొక్క ఎటువంటి దృశ్యాన్ని చూసానంటే ప్రతి హృదయం కూడా శ్రీ బాబూజీ మహరాజ్ నుండి ఆధ్యాత్మికంగా, తన యొక్క భాగాన్ని అర్థిస్తూ ఉన్నది. ఆత్మ, పరమాత్మలోని అంశ మాత్రమే, నేడు శ్రీ బాబూజీ మహరాజ్ తమ ప్రాణాహుతి శక్తి యొక్క ప్రవాహం ద్వారా, ఈ దివ్య దశను మానవమాత్రుల కోసం సులభతరం చేసి ఉన్నారు. ఇంతకంటే ఉత్తమమైన సత్యం ఏమిటంటే, ఇటువంటి దివ్య బహుమానాన్ని ప్రసాదించే ఆ పరమశక్తి సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ యొక్క దివ్య ప్రార్థనా ఫలితంగా మానవరూపం ధరించి, శ్రీ బాబూజీ మహరాజ్‌గారి రూపంలో ఈ ధరణిపై అవతరించినది. 'వారి'లోని దివ్య సౌందర్యం 'వారి' యొక్క దివ్యమైన చూపులు ఎంత ఆకర్షణీయంగా చేసినవంటే, ఆ పరమ శక్తికి, 'వారు' అంటే ఎవ్వరు? అనే విషయం ఏమాత్రం కూడా తెలియదు. దివ్య తేజస్సుతో కూడుకొని ఉన్న 'వారి' ముఖముద్ర అలౌకికమైనది.

అభ్యాసుల యొక్క ఆధ్యాత్మిక ప్రగతి అనే పరమ సౌభాగ్యాన్ని చూసి బహుశా ఋషులు, మునులు కూడా ముగ్ధులవుతూ ఉంటారు.

'బసంత్ పంచమి' పావన పర్వదినం సందర్భంగా దేశ, విదేశాల నుండి వచ్చినటువంటి వేల కొలది అభ్యాసీలు, షాజహాన్‌పూర్ (ఉత్తర ప్రదేశ్)లో నిర్మించబడిన పెద్దది మరియు అత్యంత సుందరమైన ఆశ్రమంలో సమావేశమవుతారు. రంగు, రంగుల దుస్తులు ధరించి, రకరకాల భాషలను మాట్లాడుతూ,

అందరు కూడా దివ్యత్వమనే ఆ పరమానందంలో మునిగిపోయి, అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. అభ్యాసులందరు చిన్న చిన్న గుంపులుగా కూర్చొని, ఆధ్యాత్మిక విషయాలను గూర్చి చర్చించడంలో నిమగ్నమై ఉంటారు. ఆశ్రమం యొక్క ప్రాంగణంలో ఒక వైపు, చివరి భాగమున, ఉత్సవ సమయంలో ఒక 'క్యాంటీన్' కూడా ఉంటుంది. ద్వారం బయట కిళ్లీ కొట్టు మరియు చిన్న చిన్న ఆట వస్తువులను ఆమ్మే వాళ్ళు కూడా కనబడతారు. ఆశ్రమంలో అనేకమైన గదులు ఉన్నప్పటికీ, అభ్యాసులు ఉండడానికిగాను, ఆ ప్రాంగణంలో పెద్ద పెద్ద షామియానాలు వేసి ఉంటాయి. ఆ దృశ్యం చూడడానికి ఎంతో అలౌకికంగా ఉంటుంది. అక్కడ, ఇక్కడ, ధ్యానంలో కూర్చున్న అభ్యాసీ సోదర, సోదరీమణులు 'మాలిక్' నుండి శక్తిని పొంది, ప్రాణాహుతిని ప్రసారం చేయడానికిగాను ఆజ్ఞను పొంది, నలువైపుల కూర్చుని ఉన్న ప్రశిక్షక సోదరులు, ప్రశ్నలకు జవాబులు చెప్తూ, పూజ చేయిస్తూ ఉంటారు. అందరు కూడా ఆ దివ్య కృపలో మునిగిపోయిన అవస్థలో ఉండడం మనకు కనిపిస్తుంది. సోదరీమణులు మరియు మాతృమూర్తులు అందరు కూడా ఇతరమైన పనులు చేస్తూ ఉన్నప్పటికీ, ధ్యానావస్థలో లీనమై ఉండడం మనకు కనిపిస్తుంది. అత్యధికంగా చలి ఉన్నప్పటికీ, అభ్యాసులందరు ప్రాతః కాలముననే స్నానం చేసి, ధ్యానంలో కూర్చుంటారు. కొంతమంది ప్రత్యేకమైన అభ్యాసులు ధ్యాన మందిరంలోనే కూర్చోవాలని కోరుకుంటారు. ఎందుకంటే, ఆ 'డయాస్' మీద, సాధరణమైన జంపుఖానా మీద కూర్చున్న దివ్య స్వరూపమును (శ్రీ బాబూజీ మహరాజ్) ఎవరైతే స్వయంగా ధ్యానం

యొక్క మూర్తిరూపంగా మారి, ఈ ధరణిపై అవతరించారో, 'వారి'ని చూడాలని కోరుకుంటారు. ఆ ధ్యానమందిరంలో ఎంతసేపు కూర్చున్నా తృప్తి తీరదు. ఆ ధ్యానమందిరం దివ్యశక్తి (డివైన్ పవర్)తో ఎంతగా 'చార్జ్' అయ్యిందంటే, అక్కడి నుండి లేవడానికి, మనస్సు ఏ మాత్రం ఒప్పుకోదు. బాబూజీ మహరాజ్ 'డయాస్' మీద నుండి వెళ్ళిపోయారనే విషయం మాకు అసలు తెలిసేది కాదు. ఈ విధంగా ఎన్నోసార్లు జరిగినది. "అరే! బాబూజీగారు బయటకు వెళ్ళిపోయారు. ఇంక మనం కూడా బయటకు వెళ్ళదాము" అని ఎవ్వరైనా అన్నప్పుడు మాకు "ఇంతవరకు నేను ఎక్కడికో వెళ్ళాను. ఇప్పుడు మరల 'అక్కడ' నుండి తిరిగి రావడంవల్లననే ఈ బాహ్యస్మృతి కలిగినది" అని అనిపించేది. శ్రీ బాబూజీ గారు వంట గది, భోజనశాల మరియు అభ్యాసీలు ఉండే ప్రదేశాలన్నీ కూడా తిరిగేవారు. 'వారి'ని చూడగానే ఆరే! అటుచూడు! బాబూజీగారు ఇటువైపే వస్తున్నారు" అని ఒకరితో ఒకరు అనుకుంటూ, నిశ్చేష్టులై అలానే నిలబడిపోయేవారు. అప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ చిరునవ్వులను చిందిస్తూ, కుశల ప్రశ్నలు వేస్తూ, మనందరి దృష్టిని పావనం చేస్తూ ముందుకు సాగిపోయేవారు.

ఈ ప్రకారంగా ఒక బసంత్ ఉత్సవం సమాప్తం కాగానే, మరొక బసంతోత్సవం కొరకు ప్రతీక్షిస్తూ, మేమంతా, ఎవరి ఇంటికి వాళ్ళము చేరుకునే వాళ్ళము. బసంత పంచమి ఆహ్వాన పత్రం కూడా చూడడానికి చాలా అందంగా, అద్భుతంగా ఉండేది. పసుపు రంగు పోస్టుకార్డు మీద, ఎరుపు రంగు అంచులతో ఉండేవి. శ్రీ బాబూజీ మహరాజ్ గారి తరపు నుండి వచ్చిన ఈ ఆహ్వాన పత్రికను

మేము ఎంతో భద్రంగా, ప్రాణప్రదంగా దాచుకొనే వాళ్ళం. ప్రభువుచేత వ్రాయబడిన ఆ ఆహ్వాన పత్రంలోని వాక్యాలు కూడా, మాకు మా ప్రాణాల కంటే కూడా ఇష్టంగా ఉండేవి. అందులో ఈ విధంగా వ్రాయబడి ఉంటుంది. "ప్రియమైన సోదరులారా! నేను ఈ విషయాన్ని మీకు తెలియజేయడానికి చాలా సంతోషపడుతున్నాను. ఈసారి మన శ్రీరామచంద్రా మిషన్ యొక్క భండారా, ఎప్పటి మాదిరిగానే, మన సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క పావన జన్మదినం అంటే 'బసంత్ పంచమి' రోజున జరుపబడుతుంది. ఈ వార్షిక భండారాయందు అధిక సంఖ్యలో అభ్యాసీలందరు పాల్గొనవలసినదిగా కోరుతున్నాను. అందువలన ఒకరితో ఒకరికి పరిచయం ఏర్పడుతుంది. దానితోపాటుగా శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క దివ్యకృపను పొందే సౌభాగ్యం కలుగుతుంది" అని వ్రాయబడి ఉండేది. మొదట భండారా బసంత పంచమి కంటే రెండు రోజులు ముందుగా ప్రారంభమయ్యేది. అంటే మొదటి రోజున సాయంత్రం ఒక సిట్టింగ్, రెండవ రోజున రెండు సిట్టింగులు, బసంత్ పంచమి రోజున రెండు సిట్టింగులు, ఆ తరువాత రోజున ఉదయం సిట్టింగ్‌తో ఉత్సవం సమాప్తమయ్యేది. అంటే, మొదట, మొత్తం ఆరు సిట్టింగులు ఉండేవి. కాని తరువాత, ఉద్యోగం చేసుకునే అభ్యాసుల విన్నపం వలన, అవి ఐదు సిట్టింగులకే పరిమితం చేయబడ్డాయి. ఈ విధంగా ఒక సిట్టింగును తగ్గించి వేయడంవలన, శ్రీ బాబూజీగారి సన్నిధిలో ఉండడానికిగాను, కొద్దిగా సమయం తగ్గిపోయిందని మేము చాలా బాధపడ్డాము. కాని అభ్యాసీ సోదరుల సౌకర్యార్థం మమ్మల్ని మేము సరిపెట్టుకున్నాం.

ఒక విషయాన్ని వ్రాయడమే మరచిపోయాను. అది ఏమిటంటే, ఎప్పటివరకైతే, ఆశ్రమ నిర్మాణం కాలేదో, అప్పటివరకు, అంటే దాదాపు 17, 18 సంవత్సరాలపాటు, ఈ బసంత్ పంచమి మహోత్సవం శ్రీ బాబూజీ మహరాజ్ ఇంటిలోనే జరపబడేది. అప్పుడు చాలా ఆనందంగా ఉండేది. అభ్యాసీ సోదర, సోదరీ మణులము మేమందరం కలిసి కూరగాయలను కోసి, వంటలు వండేవాళ్ళం. అభ్యాసులందరు కలిసి ఒకచోట సమావేశమై, ఉత్సవంలో 'టిఫిన్' కోసం ముందుగానే వేరుశనక్కాయలు, మైదాపిండితో చేసిన తినుబండారాలను తయారుచేసి, పెద్ద పెద్ద పీపాలలో భద్రపరిచేవాళ్ళం. ప్రారంభంలో 'టిఫిన్'ను విస్తరాకులలో చేసేవాళ్ళం. 'టీ'ని మట్టిపాత్రలలో త్రాగే వాళ్ళం. ఈ మహోత్సవానికి అయ్యే ఖర్చు నంతా కూడా శ్రీ బాబూజీ మహరాజ్ ఒక్కరే భరించేవారు. మేమంతా ఉదయాన్నే 'టీ' త్రాగిన తరువాత, మట్టి పాత్రలను శుభ్రంగా కడిగి, రాత్రి భోజనం అయిన తరువాతనే వాటిని బయట పడవేసే వాళ్ళం. విస్తరాకులలో మిగిలిపోయిన భోజనాన్ని శ్రీ బాబూజీగారే స్వయంగా ఆవులకు, దూడలకు వేయడం మేము గమనించాము. ఆ తరువాత ఆహారాన్ని వృథా చేయకుండా, మేము నెమ్మది నెమ్మదిగా జాగ్రత్తపడ్డాము. ఇంటి బయట చెట్టు క్రింద పొయ్యిని ఏర్పాటుచేసి అక్కడ కూరగాయలు వండేవాళ్ళం. స్త్రీలందరు కలిసి చపాతీలు, పూరీలు మాత్రం ఇంటిలోపలనే కాల్చేవారు. ఈ రోజునకు కూడా ఆ దృశ్యాలు గుర్తుకు వచ్చి, నా మనో నేత్రాల ముందు తిరుగుతూ ఉంటే, పూర్వపు స్మృతులతో, మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోతుంది. స్త్రీలందరు చపాతీలు,

పూరీలు పీటల మీద తయారుచేస్తూనే, పాటలు కూడా పాడేవారు. ఆ పాటల యొక్క ధ్వని, పూర్తి శబ్దంతో బయటకు వినబడేది. ఆ సమయంలో శ్రీ బాబూజీ మహరాజ్ లెక్క లేనన్నిసార్లు, వంట గుమ్మంవద్ద నిలబడి, ఆ పాటలను ఎంతో ప్రసన్నవదనంతో వినేవారు. భోజనం చేసిన తరువాత, అందరం కలిసి శ్రీ బాబూజీ గారి ఎదురుగా కూర్చునే వాళ్ళం. అప్పుడు బాబూజీగారు, మన లాలాజీ సాహెబ్ భండారా సమయంలో ఇంటిలోపల డోలక్‌ను మ్రోగించి, ఇది అత్యంత సంతోషకరమైన సమయం – అందరు చాలా పాటలు పాడాలి – సంగీతపు ధ్వనులను మ్రోగించాలి – అని అందరికి చెప్పేవారని 'వారు' మాకు తరచుగా గుర్తు చేసేవారు. అప్పుడప్పుడు 'వారి' పావన నేత్రాలలో కన్నీటి బిందువులు ఉండటాన్ని మేము గమనించేవాళ్ళం. ఎందుకంటే, ఆ కన్నీటి ముత్యాలు కూడా 'వారి'కి అత్యంత ప్రాణప్రదమైన శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క మధుర స్మృతుల ఫలితమే. బాబూజీ గారు ఈ విధంగా చెప్పేవారు: "మన లాలాజీ సాహెబ్ యొక్క స్వరం ఎంతో మధురంగా ఉండేది. 'వారు' పాట పాడుతుంటే ఆ ధ్వనికి వాతావరణమంతా కూడా పులకించిపోయేది. ఇంతేకాదు 'వారి' పాట విన్నంతసేపు మేము ఎక్కడ కూర్చున్నాము? ఏమిటి? అనే విషయాన్ని కూడా మరచిపోయేవాళ్ళం" అని బాబూజీగారు అన్నారు. ఇంతేకాదు, తమ పరమ ప్రాణమైన శ్రీ లాలాజీ గారి మధుర స్వరం అంటే ఎంత ఇష్టమో, దానిని గూర్చి చిన్న సంఘటన ఒకటి ఉంది. ఒకసారి ఒక అభ్యాసీ సోదరి పాట పాడుతున్నప్పుడు విని బాబూజీగారు ఒక్కసారిగా ఉలిక్కిపడి, "అరే భాయీ! ఈశ్వర్

సహాయ్‌జీ! నీవు ఈమె పాటను విన్నావా! గొంతెత్తి పాడుతుంటే, కొద్దిగా మన లాలాజీ సాహెబ్ స్వరంలాగా అనిపిస్తున్నది" అని అన్నారు. ఇంకేముంది, శ్రీ బాబూజీ గారు ఆనందపరవశులై ఆ సోదరికి ఆధ్యాత్మికోన్నతి అనే బహుమానాన్ని ప్రసాదించారు. ఆ తరువాత బాబూజీ గారు నవ్వుతూ "ఈశ్వర్ సహాయ్‌జీ! ఫకీర్ల వద్ద ఇవ్వటానికి ఏముంటుంది? ఆశీర్వచనాలు తప్ప, వేరే ఏమీ ఉండవు కదా!" అని అన్నారు.

నేను ఇప్పుడు మీ అందరి దృష్టిని ఎక్కడికి తీసుకొని వెళ్ళుతానంటే, అక్కడికి చేరుకున్న తరువాత, మరల మీరు ఎప్పుడు కూడా ఇక్కడకు రావడానికి ఇష్టపడరు. పవిత్రమైన బసంత్ పంచమి ఉత్సవం సందర్భంగా ఉండే  ఆరు సిట్టింగులతోపాటుగా, శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క అలౌకికమైన, మధుర ధ్వని మా కర్ణకుహరాలకు వినబడగానే, మేమంతా కూడా బాహ్య స్మృతిని కోల్పోయి, అందరం కూడా, ఆ దివ్య ధ్వనితోపాటుగా దివ్యలోకాలకు చేరుకునే వాళ్ళం. "ఓ ప్రభూ! నాలోని దుర్గుణాలను మీరు ఏమాత్రం లెక్క చేయవద్దు" అని, భక్త సూరదాసు వ్రాసిన ఈ పాట, శ్రీ బాబూజీగారి స్వరలహరి నుండి వెలువడేది. ఈ పాట పూర్తయిన పది, పదిహేను నిమిషాల తరువాత – **"దీనన దుఃఖ హరన్ నాథ్ సంతన హిత కారి"** అనే మరొక పాట 'వారి' స్వరలహరి నుండి వెలువడి, మా కర్ణకుహరాలలో ఇమిడిపోయి, ఆత్మ, పరమాత్మలో లీనం కావడానికి, ఆ పాట, ఒక ఉపకరణంగా మారినదా! అన్నట్లుగా అనిపించేది. ఈ పాట పూర్తయిన కొన్ని నిమిషాల తురువాత, పూజ అయిపోయింది –అని తెలుపగానే, ఒక్కసారిగా, మా అంతరంగంలో,

ఒక బలమైన కుదుపు కలిగేది. "అయ్యో! అప్పుడే పూజ అయిపోయిందా!" అని అనుకుంటూ, ఈ బాహ్యస్మృతిలోకి వచ్చేవాళ్ళం. సాయంత్రం పూజలో తరచుగా 'వారి' గురుభాయీ పండిట్ రామేశ్వర్‌జీ ప్రాణాహుతి ప్రసారం చేసేవారు. దివ్యప్రేమలో మునిగిపోయి, బ్రహ్మాండమైన తేజస్సుతో వెలుగుతున్న శ్రీ బాబూజీగారి ముఖం కన్నీటి ధారలను కురిపించే 'వారి' మధుర స్వరం, ఇవన్నీ కూడా మా మనస్సు యొక్క బంధనాలన్నింటినీ త్రెంచివేసి, బయటకు విసిరివేసినవా, అన్నట్లుగా ఉండేది. "ఓ! బాబూజీ మహరాజ్! మీరు లేకుండా మేము జీవించలేము" అని బిగ్గరగా అరిచి, అందరికీ చెప్పాలని, నాకు మనస్సులో అనిపించేది. కాని మరల ఈ విధంగా అనిపించేది: **"సమస్త బంధాలనుండి విముక్తిని కలిగించే శ్రీ బాబూజీగారే, స్వయంగా ఇప్పుడు ఈ ప్రేమ బంధనాన్ని మనకు ప్రసాదించాలి" అని అనిపించేది.** ఈ సంసారం యొక్క సంకెళ్ళు ఏనాడో త్రెంచి వేయబడ్డాయి. కాని నేను పైన చెప్పిన విధంగా చేయడానికి, నాకు ఎటువంటి స్వాతంత్ర్యం లేదు. ఎందుకంటే ప్రభువు ఎల్లప్పుడు కూడా దైవీయ ప్రేమ అనే ప్రక్రియ ద్వారా, మన అంతరంగాన్ని అదుపులో ఉంచుతారు. **"వేల సముద్రాల ఆధ్యాత్మికతను త్రాగినప్పటికీ, మన నోటి నుండి, ఇంకా కావాలి! ఇంకా కావాలి! అనే మాటలే వెలువడుతాయి" – అనే శ్రీ బాబూజీగారి యొక్క ఈ వాక్యం మనలను ఎల్లవేళలా లక్ష్యంపట్ల మెలకువగా ఉంచుతుంది.**

అప్పుడప్పుడు 'వారు' మనలనందరిని నవ్వించడానికిగాను, కథలు కూడా చెప్పేవారు. కాని ఆ కథలలో కూడా ఎక్కడో ఒకచోట

మనకు నీతి కనిపిస్తుంది. ఒకసారి 'వారు' చాలా సంతోషంగా ఉండి, ఒక కథను చెప్పడం ప్రారంభించారు. ఆ కథ ఒక 'సైతాన్'ను గురించి. ఒకసారి, ఒక మహాపురుషుడు, నెమ్మదిగా నడుచుకుంటూ ఒక నది వంతెనను దాటుతున్నాడు. ఇంతలో అకస్మాత్తుగా ఆయన కాళ్ళు ఎవరినో త్రాకినట్లుగా అనిపించినది. వెంటనే ఆ మహాపురుషుడు తల వంచి చూసి, ఎవరు నీవు? అని అడిగాడు – నేను సైతాన్‌ను – అని అనగానే, ఆ మహాపురుషుడు, "నీవు 'సైతాన్' అయి ఉండి ఎందుకు విశ్రాంతి తీసుకుంటున్నావు?" అని ప్రశ్నించగానే, ఆ సైతాన్ ఈ విధంగా జవాబు ఇచ్చింది: "నేను, నాలాగ వేయి మంది సైతాన్‌లను తయారుచేసాను. అందుకే ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నాను" – ఈ మాటలు వినగానే మేమంతా ఒక్కసారిగా నవ్వాము. 'వారు' కూడా మాతోపాటుగా నవ్వారు. మరల కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉన్న తరువాత ఈ విధంగా అన్నారు: "చూడండి! మనకు లాలాజీ సాహెబ్‌తో పని కావాలి కదా! ఇప్పుడు 'వారి' దృష్టి మన మీదనే ఉంది" అని అన్నారు.

ఒకసారి ఒక అభ్యాసీ సోదరుడు, "బాబూజీ! మానవుడు చాలా త్వరగా చెడ్డవానిగా మారిపోగలడు, కాని అదే మంచి మానవునిగా మారాలంటే అతను చాలా కష్టపడవలసి ఉంటుంది. మరల చాలా సమయం పడుతుంది. ఎందుకు?" అని అడిగినపుడు వెంటనే వారు, "భాయీ! అది కాదు; మానవుడు అధఃపతనం చెంది కొన్ని యుగాలు గడిచిపోయాయి. తన తప్పులవల్లనే మానవుడు అధఃపతనం చెందాడు. కాని ఎప్పుడైతే మానవుడు మరల ఉన్నతమైన స్థాయిని చేరాలని నిశ్చయించుకుంటాడో అప్పుడు అతనికి ఈశ్వరీయ

శక్తి యొక్క సహాయం లభిస్తుంది. అంతేకాదు, ఆ ఈశ్వరీయ శక్తి మానవునిలోనికి ప్రవేశించి, అతనిని ధ్యేయంవద్దకు చేర్చుతుంది. అందువల్లనే మానవుడు అత్యున్నతమైన లక్ష్యాన్ని కలిగి ఉండి, దానిని సాధించటానికి ధృడమైన సంకల్పాన్ని కలిగి ఉండాలి" అని అన్నారు.

ఒక పర్యాయం ఏ పారవశ్యంతో ఉన్నారో తెలియదు. ఆ తన్మయత్వంతో ఏదో పాటను పాడుకొంటున్నారు. మేమంతా ప్రశాంతంగా వింటున్నాం. ఆ పాట –

**"సబ్ కహేం రామ్, రామ్ కహేం సైంయా సైంయా,**

**సబ్ కేతో రామ్ హైం, హమారె తో గోసియా సైయా"**

(అందరూ రామ, రామ అంటారు మేము స్వామి, స్వామి అంటాము అందరికి రాముడు ఉంటే మాకు మాత్రం గోసాయి స్వామి ఉన్నాడు.)

ఆ పాట వింటూ మేము తన్మయులయ్యాము. అది మా హృదయంలో హత్తుకుపోయింది. ఇంతలో ఇలా అన్నారు: "ఈ పాట నాకు చాలా ఇష్టం. సతికి 'స్వామి' శబ్దం ఎంత దగ్గర అంటే ఆమె ఆ శబ్దాన్ని అందరి ఎదుటా ఉపయోగించదు.

ఒక్కొక్కసారి ఏ విధంగా ఉంటుందంటే, ఇంద్రజాలం జరిగినట్లుగా ఉంటుంది. ఆ సమయంలో 'వారు' చెప్పే మాటలు అర్థం చేసుకోవడమనేది అసంభవమైన విషయం. ఒకరోజు మధ్యాహ్న సమయంలో శ్రీ బాబాజీ మహారాజ్‌గారు నిద్రపోతున్నారు. మేమందరం నిశ్శబ్దంగా వెళ్ళి 'వారి' గదిలోపల కూర్చున్నాం. 5 నిముషాల తర్వాత 'వారు' నిద్రనుండి లేచి, నన్ను

పూజలో కూర్చోమని అన్నారు. 'వారు' ఆ విధంగా అనగానే నా ధ్యానం అక్కడితో పూర్తయిపోయినట్లుగా అనిపించినది. ఈ విధంగా ఎందుకు జరిగింది? అని మనస్సులో అనుకుంటూ 'వారి'వైపు చూడగానే 'వారు' ఈ విధంగా అన్నారు: "నా నిద్రతోపాటుగా నీవు ఎంతవరకైతే వెళ్ళావో, అక్కడ నీవు ఇంతకంటే ఎక్కువ సమయం ఉండటమనేది అసంభవమైన విషయం. ఈ కారణంచేతనే నేను, నిన్ను అక్కడి నుండి, మరల క్రిందికి తీసుకొని రావడానికిగాను, ఈ విధంగా చేయాల్సి వచ్చినది" అని అన్నారు. ప్రతి క్షణం, ప్రతి పనిలోను 'వారు' మనకు చూపించే మార్గదర్శకత్వాన్ని మనలో ఎవరు అర్థం చేసుకోగలరు? 'వారి' యొక్క అపారమైన కృపను గూర్చి ఏమని వర్ణించగలం?

అప్పుడప్పుడు మనం మన మూర్ఖత్వంతో ప్రేమ స్వరూపి అయిన శ్రీ బాబూజీ మహరాజ్‌ను చాలా కష్టాలకు గురిచేస్తాం. కాని క్షమాగుణానికి ప్రతిరూపమైన 'వారు', మన తప్పులను ఎంతో తేలికగా అసలేమి జరగనట్లుగా స్వీకరిస్తారు.

లఖింపూర్ నివాసియైన పుత్తీబాబు అనే అభ్యాసీ వకీలు ఒకసారి తన కష్టాలన్నింటినీ శ్రీ బాబూజీగారికి వివరించి దుఃఖంతో ఈ విధంగా అన్నాడు: "బాబూజీ మహరాజ్! ఈ కారణాలవలన నేను, అసలు ధ్యానమే చేసుకోలేకపోతున్నాను" అని అన్నాడు. ఇప్పుడు ఈ రచయిత్రి ఏమి చెబుతారో అని మీరు వినాలని అనుకుంటున్నారు కదా! దయాగుణం యొక్క సజీవమూర్తియైన శ్రీ బాబూజీ మహరాజ్ వెంటనే ఈ విధంగా అన్నారు – "పుత్తీబాబు! నీవు ఒక పని చేయి. నీ మొత్తం సమస్యలన్నీ నాకు ఇచ్చివేయి.

అప్పుడు నీవు చక్కగా ప్రతిరోజు ధ్యానం చేసుకోవచ్చు" అని అన్నారు. పాపం! ఆ వకీలుగార్కి, బాబూజీగారి ఈ మాటల యొక్క గొప్పతనం ఏమి అర్థమవుతుంది? "అవును బాబూజీ! మీరు చెప్పింది సరిగ్గా ఉంది" అని ఆ వకీలు సహజంగానే అన్నాడు. మరల బాబూజీ గారు, "సరే! ఈ రోజు నీవు లఖింపూర్ వెళ్ళు. రేపు ఉదయం సరిగ్గా 9 గంటలకు పూజలో కూర్చో, నీ మొత్తం సమస్యలన్నీ కూడా బాబూజీవద్దకు పోతున్నాయి అని కేవలం ఈ భావనతోనే పూజచేయి" అని అనగానే, ఆ వకీలుగారు సరేనని, లఖింపూర్ ప్రయాణం అయ్యాడు.

ఒక విషయం ఏమిటంటే, బాబూజీగారు ఎంత జాగ్రత్తగా ఉంటారంటే, శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు లేని సమయంలోనే, ఇటువంటి మాటలు మాట్లాడతారు.

మేము పూర్తిగా అజ్ఞానులం, అవివేకులం. ఈ విధంగా జరుగుతుందని మేము ఎప్పుడూ వినలేదు. ఎక్కడా చదవలేదు. మహాత్ములు ఈ విధంగా చేస్తారని మాకు తెలియదు. రెండవ రోజున ఉదయం 9 గంటలకు శ్రీ బాబూజీగారు స్నానం చేసిన తరువాత పూజ గదిలోనికి వెళ్ళారు. ఎప్పుడైనా సరే, బాబూజీగారు పిలిచినప్పుడే, మేము ఆ పూజ గదిలోనికి వెళ్ళేవాళ్ళం. శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు కూడా అక్కడే వరండాలో కూర్చొని ఏదో వ్రాసుకుంటున్నారు. పది నిమిషాల తరువాత, శ్రీ బాబూజీ గారు పూజ గదిలో నుండి బయటకు రాగానే, 'వారి'ని చూడగానే, మేమంతా భయంతో ఒక్కసారిగా లేచి నిలబడిపోయాము. ఎందుకంటే పూజ్య బాబూజీ గారి శరీరం కంపిస్తున్నది.

దేదీప్యమానంగా వెలిగిపోయే 'వారి' ముఖం ఒక్కసారిగా తేజోవిహీనంగా మారిపోయింది. ఇది చూడగానే శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీగారి దగ్గరకు వెళ్ళి – "బాబూజీ! ఏమైంది? మీకు ఏమైంది?" అని అడుగుతూ ఉన్నారు. కొంతసేపు సంభాళించుకున్న తరువాత శ్రీ బాబూజీగారు, "నేను వకీల్ సాహెబ్‌ను ఈ సమయంలో పూజలో కూర్చోమని చెప్పాను. బహుశా అందువల్లనే ఈ విధంగా జరిగింది కాబోలు" అని అన్నారు. "బాబూజీ! మీరు ఈ విధంగా ఎందుకు చేసారు?" అని ఈశ్వర్ సహాయ్‌గారు కోపంతో ప్రశ్నించగానే, వారు "ఏ సమస్యలయితే వకీల్ సాహెబ్ సాధనకు ప్రతిబంధకాలుగా ఉన్నాయో, వాటి నన్నింటినీ నేను తీసుకున్నాను. ఇపుడు ఆయన ప్రతిరోజూ శ్రద్ధగా ఈశ్వరుని ధ్యానం చేసుకుంటాడు" అని బాబూజీగారు అనగానే, వెంటనే ఈశ్వర్ సహాయ్‌గారు, "బాబూజీ! ఈ విధంగా మీరు వకీల్ సాహెబ్ కష్టాలన్నింటినీ తీసుకున్నారు. కాని ఆయన మాత్రం మీకు ఇచ్చిన మాటను తప్పకుండా మరచిపోతాడు" అని అన్నారు. ఈ సంఘటన జరిగిన మూడు మాసాల తరువాతనే, శ్రీ బాబూజీగారు మరల సంపూర్ణంగా ఆరోగ్యవంతులయ్యారు. ఇటువంటి ప్రేమ మూర్తి మనకు ఎక్కడ దొరుకుతారు? కన్నతల్లి కంటె కూడా అధికంగా ప్రేమించే గుణం ఎవరిలో ఉంది? తన కుమారుడు కష్టాల్లో ఉంటే, వాటిని స్వయంగా, సంతోషంగా స్వీకరించే ఆ మహానుభావుడు ఎవ్వరు? కేవలం శ్రీ బాబూజీ మహరాజ్ ఒక్కరు మాత్రమే.

ఒక రోజున శ్రీ బాబూజీగారు బయట వరండాలో కుర్చీలో కూర్చుని హుక్కా త్రాగుతున్నారు. మేమంతా 'వారి' చుట్టూ కూర్చుని, 'వారు' ఏమైనా చెబుతారేమోనని నిరీక్షిస్తున్నాం. అప్పుడు ఒక్కసారిగా 'వారు' ఈ విధంగా అన్నారు: "తప్పుడు భావాలను నేను చిగురింపజేయను" అని అన్నారు. ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మా సంస్కారాలను మీరు ఎందుకు అనుభవిస్తారు?" అని అడిగినపుడు, 'వారు' వెంటనే "తెలివితక్కువగా మాట్లాడకూడదు. ప్రతికష్టం సంస్కారాల ఫలితంగానే రాదు. ఉదాహరణకు అనారోగ్యం ఏదైనా సంస్కారం వలన ఏర్పడితే, దాని యొక్క ప్రతిక్రియ అనేక రూపాలలో మనకు కనబడుతుంది. కాని అన్ని ప్రతిక్రియలు సంస్కారవశమున ఏర్పడవు. రెండవ విషయం ఏమిటంటే, ఎవరైతే స్వయంగా సంస్కారాలకు అతీతంగా ఉంటారో, ఆయనకు సంస్కారాలను ఏ విధంగా ఇవ్వగలవు? కాని **ఎప్పుడైతే అభ్యాసీ లయావస్థ యొక్క విశుద్ధ రూపాన్ని పొందుతాడో, అప్పుడు ఒక స్థితి తప్పక కలుగుతుంది. అప్పుడు సంస్కారాలన్నీ కూడా అభ్యాసీని వదిలి, ఎవరిలోనైతే అభ్యాసీ లయమవుతున్నాడో, వారివైపుకు ప్రయాణిస్తాయి. కొన్ని సంస్కారాలు సద్గురువు యొక్క చూపు మాత్రాన్నే భస్మమవుతాయి.** అంతేకాని, వాటిని 'వారు' అనుభవించరు" అని అన్నారు. **సహజమార్గంలోని సహజత్వం మరియు లయావస్థ యొక్క మహాత్మ్యం మనలను ఎటువంటి పావనమైన స్థితికి తీసుకొని వెళ్ళుతుందంటే, శ్రీ బాబూజీ మహరాజ్ కృపతో మనం పొందినటువంటి ఆధ్యాత్మిక స్థితుల అనుభూతి యొక్క ఆనందం కంటే కూడా ఆ స్థితి అతీతంగా ఉంటుంది.**

ఇటువంటి దివ్య స్థితి నేడు ప్రాణిమాత్రుల కోసం సులభతరం చేయబడినది అనే విషయాన్ని ఎవరు తెలుసుకోగలరు!

విశ్వశాంతి స్థాపన కొరకు ఆ దివ్యపురుషుడు చేసే పనులను కూడా తరచుగా మేము గమనించేవాళ్ళం. బహుశా అవతార పురుషులు కూడా వీటి నుండి వేరుగా ఉండలేరేమో! ఎందుకంటే, అనేకసార్లు శ్రీ బాబూజీ మహరాజ్ ఆకస్మాత్తుగా 'డివైన్ మూడ్'లోకి వెళ్ళడం మేము చూసేవాళ్ళం. ఆ డివైన్ మూడ్‌లో ఉన్నప్పుడు 'వారు' ఈ విధంగా అనేవారు: "నిశ్శబ్దంగా ఉండండి. చైనాలో ఇపుడు యుద్ధం జరుగుతుంది. ఇది ప్రకృతి యొక్క ఆజ్ఞ" అని అనేవారు. ఒకసారి బంగ్లాదేశ్ గురించి స్వతహాగానే ఈ విధంగా అన్నారు: "అసలు అటువంటి ఆజ్ఞవస్తే, పరిస్థితి ఇలానే ఉంటుంది" అని. కాని అప్పుడు ఏమి జరిగింది మరియు శ్రీ బాబూజీగారు ఏమి చేసారు అనే విషయాన్ని గూర్చి, 'వారి'ని అడిగి తెలుసుకోవాలనే ధైర్యం మాలో ఎవ్వరికీ ఉండేది కాదు.

"ఈశ్వర్ సహాయ్‌జీ! మన చర్చలు రాత్రి 11 గంటల తరువాతనే ప్రారంభమవుతాయి కదా!" అని అంటూ, శ్రీ బాబూజీ మహరాజ్ ముసి ముసి నవ్వులు నవ్వేవారు. నిజమే మరి! ఆ సదస్సులలో పాల్గొన్నది ఎవ్వరు? అజ్ఞానులం, ఉత్త తెలివితక్కువ వాళ్ళం, ఎందుకు పనికిరాని వాళ్ళం అయినటువంటి చిన్న పిల్లలం మేమే. ఈరోజునకు కూడ, ఆ దివ్యమైన సమావేశాలు కనుల ముందు కనబడుతూ ఉంటే, నేత్రాలు అశ్రువులతో నిండిపోతాయి. మరి ఆ దివ్య పురుషుడు, దివ్య తేజస్సుకు ప్రతీక అయిన శ్రీ బాబూజీ మహరాజ్ గారు మాతో అతి సాధారణమైన, సామాన్యమైన

మానవునిలాగా వ్యవహరించేవారు. ఈ రోజున, అప్పటి ఆ భావాలన్నీ కూడా మనస్సులో ఉప్పొంగుతూ ఉంటే, 'మమత' అనే సంపూర్ణ రస సాగరాన్ని 'వారు' మా మీద గుమ్మరించినట్లుగా అనిపిస్తుంది.

**ఆ శూన్య గరిమకు కూడా గౌరవాన్ని ఇచ్చే శ్రీ బాబూజీ మహరాజ్‌గారి దివ్య స్వరూపాన్ని ఎలా అలంకరించి ఉంటారో కదా! 'వారి' పసితనపు పవిత్ర బోళా స్వరూపాన్ని ఏ చతుర చిత్రకారుడు తన మనో ప్రాణాలు అనే కుంచెతో చిత్రించెనో కదా! ఎవ్వరు ఆ శూన్యదృష్టితో సంపూర్ణ విశ్వపటాన్ని చిత్రించి, ఇదిగో ఇంక దీనిని మీరే పోషిస్తూ సంరక్షించుకుంటూ ఉండాలని చెప్పారో కదా! మానవులమైన మనం అదృష్టవంతులం. శ్రీ లాలాజీ గారు 'వారి'ని అందరికి సులభసాధ్యులుగా చేసి మనందరకి 'వారి'ని అప్పగించారు.**

అవును ఒకసారి శ్రీ బాబూజీగారి హుక్కా గురించి చర్చ జరుగుతున్నది. 'వారు' నవ్వుతూ, "ఇటు చూడండి! లాలాజీ సాహెబ్ నాతో ఏమంటున్నారో తెలుసా? నవాబ్ సాహెబ్ పని గురించి ఎప్పుడు మాట్లాడుతారు? అని నాతో అంటున్నారు" అని మాకు తెలిపారు. రెండు నిమిషాల తరువాత మరల గంభీర స్వరంతో, "ఏమని చెప్పను. ఇప్పుడు నేను నెహ్రూగారి ప్రాణాలను కాపాడాలి. ఇది పైనుండి వచ్చిన ఆదేశం. అసలు కనీసం కొద్దిగా కూడా ఆలోచించడానికి సమయంలేదు. అంతా రేపు ఉదయం లోపలే ఈ పనిని పూర్తి చేయాలి. లేనట్లయితే నెహ్రూకు ఏదైనా ప్రాణాపాయం సంభవించవచ్చు" అని అన్నారు. శ్రీ బాబూజీగారు ఈ విషయమై ఏమి చేస్తారా అని తెలుసుకోవాలని మేమంతా ఎంతో

ఉత్సాహంతో ఉన్నాం. అప్పుడు మేము శ్రీ ఈశ్వర్ సహాయ్ గారిని, నెమ్మదిగా కదిలించగానే వారు, బాబూజీగారిని ఈ విధంగా అడిగారు: "హుజూర్! మరి ఈ పనిని మీరు ఎలా చేస్తారు?" అని అడగ్గానే, 'వారు' తమ సహజ ధోరణితో "చెయ్యాల్సింది ఏముంది? ఆ పట్టణంలో ఒక భూకంపాన్ని సృష్టిస్తాను. దానితో కొంత సమయం గడిచిపోతుంది. అప్పుడు నెహ్రూను హత్య చేయాలనే పథకం యొక్క రహస్యం దానంతట అదే బయటపడుతుంది" అని అన్నారు. రెండవ రోజు ఉదయం, దిన పత్రికలో కలకత్తా పట్టణంలో భూకంపం ఏర్పడింది. ఒక వర్గంలోని వ్యక్తులు నెహ్రూగారి మీద హత్యా ప్రయత్నానికి సన్నాహాలు చేస్తుండగా పట్టుబడ్డారు" – ఈ వార్తను చదవగానే శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క శక్తిని, గొప్పతనాన్ని మరియు మెలకువతనాన్ని చూసి మేమంతా ఆశ్చర్యపోయాం.

తరచుగా ఏ విధంగా ఉండేదంటే, ఆ దివ్యపురుషుని యొక్క మాటలు మా గ్రహింపుకు అతీతంగా ఉండేవి. అటువంటప్పుడు ఆ మాటలు ఏ విధంగా అర్థమవుతాయి? కాని 'వారి' యొక్క వాణి మమ్మల్ని మోహితులను చేసేది. తిరగి బాహ్య స్మృతిలోకి వచ్చిన తరువాత, బాబూజీగారు ఏమి చెప్పారని ఎంత గుర్తు చేసుకున్నా కొద్దిగా కూడా గుర్తుకు వచ్చేది కాదు. ఆ సమయంలో మా దగ్గర 'టేప్ రికార్డర్' ఉంటే ఎంత బాగుండేది అని అనుకునేవాళ్ళం. మా దగ్గర ఒక్క 'కెమెరా' లేదు, 'టేప్ రికార్డర్ లేదు', ఏవీ లేవు. 'టేప్' స్థానంలో కేవలం మా మనోప్రాణాల యొక్క ఏకాగ్రత ఉండేది. 'కెమెరా' స్థానంలో 'వారి' ముఖారవిందం యొక్క ఆ నిర్మలత్వం, అమాయకత్వం మరియు సరళత్వంతో కూడినటువంటి శ్రీ

బాబూజీగారి యొక్క దివ్య స్వరూపం మా హృదయాలలో ముద్రించబడినది. 'వారి' యొక్క భౌతిక పావన రూపాన్ని గూర్చి మనం ఏ మాత్రం కూడా చిత్రించలేము.

అప్పుడప్పుడు బాబూజీగారు మాకు కొన్ని రహస్యమైన విషయాలు కూడా తెలిపేవారు. కాని 'వారు' చెప్పే విధానం చూస్తే, అసలు అది రహస్యమే కాదన్నట్లుగా ఉండేది. ఒక రోజున 'వారు' ఈ విధంగా అన్నారు: "గాంధీజీ మృత్యువు వలన యావత్ దేశమంతా కూడా దుఃఖంలో మునిగిపోయింది. కాని ఇంతకుపూర్వమే దక్షిణాఫ్రికాలో గాంధీజీ మీద హత్యా ప్రయత్నం గావించబడినది. అప్పుడే అవి ఆయన జీవితం యొక్క అంతిమ ఘడియలు. కాని ఆ సమయంలో ప్రకృతి యొక్క ఆజ్ఞానుసారం, ఒక యోగి తన జీవితాన్ని గాంధీజీకి ధారపోసారు. ఎందుకంటే, గాంధీజీ అప్పుడు నిర్వహించే పనిని, ఆయన తప్ప ఇంక ఎవ్వరూ కూడా చేయలేరు కాబట్టి. ఆ యోగి యొక్క గొప్పతనాన్ని గురించి ఏమని చెప్పాలి? ఆ యోగి ఎంతో సంతోషంతో తన జీవితాన్ని గాంధీజీకి ధారపోసారు. దాని ఫలితంగా గాంధీజీకి స్వస్థత చేకూరినది. ఆ క్షణం నుండి గాంధీజీ ముఖంపై ఆ మహాత్ముని తేజస్సు వ్యాప్తి చెందినది. అప్పటినుండి ఆయన అంతరంగంలో పరివర్తన కలిగినది" అని అన్నారు. ఈ రోజున ఈ రహస్యాన్ని ఎవరు అర్థం చేసుకొనగలరు?

నాకు ఈ రోజున, ఆనాటి సంఘటనలు ఒక్కొక్కటి స్మరణకు వస్తున్నాయి. ఆ రోజున, అప్పుడే, మేమందరం కూడ బయట

వరండాలో, శ్రీ బాబూజీగారి ఎదురుగా కూర్చున్నాం. బహుశా ఆ సమయమునందే కాబోలు వైజ్ఞానికులు ప్రథమ అంతరిక్ష 'రాకెట్'ను చంద్రమండంలోకి వదిలారు. కాని ఆ రాకెట్ 'క్యాప్స్యూల్' నుండి విడిపోయింది. అది మరల అతుక్కోవడం లేదు. అప్పుడు ఒక్కసారిగా వారు, "నిశ్శబ్దంగా ఉండండి. మన అంతరిక్ష యాత్రికులు ప్రాణాపాయకరమైన పరిస్థితిలో ఉన్నారు" అని అన్నారు. మరల కొన్ని క్షణాలు గడిచిన తరువాత ఈ విధంగా అన్నారు: "మన వైజ్ఞానికులు ఎంత ప్రయత్నించినప్పటికీ కూడా ఆ క్యాప్స్యూల్ 'రాకెట్'కు అతుక్కోవడం లేదు. అప్పుడు ఈ పనిని నేను చేయాల్సినదిగా మన లాలాజీ సాహెబ్ నన్ను ఆజ్ఞాపించారు. ఇంకేముంది, ఈ సేవకుడు ఎల్లవేళలా యజమానుని సేవలో సిద్ధంగా ఉంటాడు కదా! ఇప్పుడు ఆ క్యాప్స్యూల్ రాకెట్‌కు అతుక్కున్నది. అంతరిక్ష యాత్రికుల జీవితాలు సురక్షితంగా ఉన్నాయి" అని హుక్కా పీల్చుకోవడం మొదలుపెట్టారు. "భాయీ! రేడియోలో వార్తలు వినండి'' అని బాబూజీ అనగానే మేము మరింత ఆశ్చర్యపోయాము. ఎందుకంటే ఐదు నిమిషాల తరువాత – కాప్స్యూల్ రాకెట్‌కు అతుక్కోబడినది. ఈ పనిని విజయవంతంగా చేసినందుకుగాను, ప్రపంచమంతా కూడా వైజ్ఞానికులను చాలా ప్రశంసిస్తున్నది– అని రేడియోలోని వార్తలలో తెలిపారు. అసలు పని అంతా తాను చేసి, అందరికి 'వారు' గౌరవాన్ని ఇస్తూ, ఇతరులు తమను గౌరవించినా, గౌరవించకపోయినా అది తమకు అక్కరలేదన్నట్లుగా 'వారు' నిర్లిప్తభావంతో కూర్చొని హుక్కాను పీల్చుకుంటూ, నిశ్శబ్దంగా రేడియోలోని వార్తలను విన్నారు. అప్పటికీ

మేము ఇంకా 'వారి' ముఖంలోని భావాలను గమనించడానికి అసఫలమైన (సఫలంకానిదైన) ప్రయత్నాన్ని చేసాము.

మేము అప్పుడే క్రొత్తగా మిషన్‌లో చేరాము. ఆ సమయంలో 'వారి' కుటుంబ సమస్యలకు చెందిన కోర్టు కేసు ఒకటి తీవ్రంగా నడుస్తున్నది. ఆ కేసు దాదాపు తుది నిర్ణయానికి వచ్చినది. కాని ఆ కేసులోని కొన్ని అంశాలు, శ్రీ బాబూజీగారి తరఫున బలహీనంగా ఉన్నాయి. బాబూజీ గారి తరఫున వాదించే వకీలు; 'వారి'ని ఒక చిన్న అబద్ధమాడలసినదిగా కోరాడు. ఎందుకంటే, ఆ చిన్న అబద్ధం వలన 'వారు' ఆ కోర్టు కేసులో తప్పకుండా గెలుస్తారు. కాని 'వారు' అందుకు అసలు ఒప్పుకోలేదు. ఏ విధంగా ప్రయత్నించినప్పటికీ బాబూజీగారు అబద్ధం మాట్లాడరని ఆ వకీలుకు అర్థమైనది. అప్పుడు ఆ వకీలు తెలివితో చిన్న ఎత్తుగడను ప్రదర్శించి, "బాబూజీ! మీరు అబద్ధం పలికిన తరువాత లాలాజీ సాహెబ్‌ను తలచుకుంటే ఆ పాపం కడిగి వేయబడుతుంది కదా!" అని అనగానే 'వారు' చాలా శక్తివంతమైన మాటలతో, గంభీర స్వరంతో ఈ విధంగా అన్నారు: "లాలాజీ సాహెబ్‌కు ఇవ్వడానికి నా దగ్గర అసలు పుణ్యమే లేనప్పుడు పాపం ఎలా ఇవ్వగలను? బాగా గుర్తు పెట్టుకో! లాలాజీగారు ఈ ప్రపంచంలోని పాపాలన్నింటినీ క్షమిస్తారు కాని నా ఒక్క చిన్న అబద్ధాన్ని కూడా క్షమించరు" అని మరల, "ఎందుకో తెలుసా? లాలాజీ సాహెబ్ నాతో ఒకసారి ఈ విధంగా అన్నారు – ఈ ప్రపంచంలోని తప్పులన్నింటినీ నేను క్షమిస్తాను. కాని నీది ఒక్క చిన్న తప్పును కూడా క్షమించను. ఎందుకంటే, నీవు చేసే ఆ ఒక్క తప్పు యొక్క విషం ఈ విశ్వంలోని వాతావరణమంతటా

వ్యాపిస్తుంది. నిజానికి నీవు దోషరహితునివి, ఎందుకంటే **నీవు, ఈశ్వరీయ శక్తి సహాయంతో ఈ ప్రపంచంలోని సమస్త ప్రాణుల యొక్క దోషాలను విముక్తి చేయడానికి ఈ భూమి మీద అవతరించావు.** నీవు అసలు ఒక చిన్న తప్పు కూడా చేయలేవు. ఎందుకంటే, **నీవు సాక్షాత్తుగా ఆ 'భూమా' నుండి, ఎక్కడైతే ఈ ధరణి యొక్క నీడ కూడా కనీసం చేరదో, అక్కడి నుండి అవతరించావు కాబట్టి– అని లాలాజీ సాహెబ్ అన్నారు"** అని తెలిపారు. అత్యంత శక్తివంతమైన ఆ మాటలు మా చెవులలో మారుమ్రోగాయి. అవి విన్న తరువాత 'వారు' ఇంకా ఏమైనా చెబుతారేమో అని ఆతురతతో నిరీక్షిస్తున్నాము. అప్పుడు వారు "ఒక మహాత్ముడు పాపం చేసినా లేదా పాపాత్ముడు చేసినా, పాపం అనేది పాపంగానే ఉంటుంది. అది ఎప్పటికీ కూడా పుణ్యంగా మారదు – అబద్ధం అనేది ఎవరి నోటి నుండి వెలువడినా అది అబద్ధంగానే ఉంటుంది" అని అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ గారిని గురించి మనం ఏమి చెప్పగలం? ఆ ఆలోచనా శూన్య వ్యక్తిత్వం నుండి వెలువడే ఆ శబ్ద ధార శూన్యంవైపు దారి చూపుతున్నట్లుగా ఉంటుంది. ఎప్పుడైతే ఆ శబ్ద ధార ప్రకృతితో కలుస్తుందో, అప్పుడు ఆ శబ్దాలు ఆలోచనలుగా అలంకరించబడి, సహజంగానే 'వారి' పావన ముఖారవిందం నుండి వర్షిస్తాయి.

అవి శీతాకాలపు రోజులు. మన పరమ జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ మహరాజ్ గారు బయట, వరండాలో, రేకుల షెడ్డు క్రింద కూర్చొని ఉన్నారు. అభ్యాసీలు కొందరు కుర్చీల మీద, కొందరు నులక మంచం మీద, కొందరు చాపల మీద, మరి కొంతమంది

నేలమీద కూర్చుని, శ్రీ బాబూజీగారు ఎప్పుడు ఈ నిశ్శబ్దాన్ని భంగపరుస్తారా, అని నిరీక్షిస్తూ, 'వారి'వైపే చూస్తున్నారు. ఎందుకంటే, కొంత సమయం క్రితమే, అభ్యాసుల మధ్యన ఒక చర్చ జరిగింది. ఆ చర్చలోని అంశం ఏమిటంటే – మిషన్ కోసం నల్లధనాన్ని ఉపయోగించినట్లయితే అది కూడా తెల్ల ధనంగా మారుతుందా? ఆ చర్చ జరిగినంతసేపు 'వారు' పూర్తిగా, శాంతంగా కూర్చున్నారు. కాని ఆ చర్చ సమాప్తమై దాదాపు 20, 25 నిమిషాల తరువాత, హుక్కాను ఒక ప్రక్కకు పెట్టి, అకాస్మాత్తుగా 'వారు', "అభ్యాసులై ఉండి కూడా ఎటువంటి మాటలు మాట్లాడుతున్నారు! మిషన్ కోసం ఉపయోగించే నల్లధనం తెల్లధనంగా అవుతుందా? మీ పిల్లలకు మీరు ఒకటిని రెండుగా, రెండును ఒకటిగా లెక్కబెట్టమని చెప్పగలరా? ఇటువంటి ఆలోచనల వలన మిషన్ చెడిపోతుంది కాని మన లాలాజీ సాహెబ్ యొక్క మిషన్‌లో ఇటువంటి చెడుకు ఎప్పుడు  కూడా స్థానం లేదు" అని అన్నారు శమ, నియమ, దమ, తపం మొదలైనవి సాధన చేయాలని 'వారు' మనకు ఎప్పుడు కూడా చెప్పలేదు. కాని 'వారు' తపస్సు కంటే అత్యున్నతమైన ఆధ్యాత్మిక శిక్షణను, మనకు అడుగడుగునా అందిస్తున్నారు. ఈ రోజునకు కూడా 'వారి' దివ్యమైన క్షమాగుణం మన హృదయాలలో మెలగుతూ, మనలను సన్మార్గంలో నడిపిస్తూ, సహజమార్గం ద్వారా, సూటిగా లక్ష్యం వద్దకు తీసుకొనిపోతున్నారు.

**"బాబూజీ! మీరు మమ్మల్ని తపస్సు చేయమని ఎందుకు అనరు?" అని ఒకసారి ఒక అభ్యాసీ ప్రశ్నించినపుడు, చాలా సూటిగా, సరళంగా మరియు సహజమైన జవాబుతో మన**

**హృదయాంతరాళాలను స్పర్శించునట్లుగా, వారు, "తపస్సులో ఈశ్వరుడు వేరు, మన ఉనికి వేరు అనే భావన మనలో ఉంటుంది. ఎందుకంటే, తపస్సు భౌతికతపై ఆధారపడి కొన్ని పరిమితులకు లోబడి ఉన్నది. కాని సహజమార్గ సాధనలో మనం మన ఉనికిని మరచిపోతాము. కేవలం భగవంతుని గూర్చిన ఆలోచనలో లీనమైపోతాము. హృదయము నందలి అచంచలమైన భక్తితో ధ్యానంలో మునిగిపోవటం వలన మనం ఆ తన్మయత్వాన్ని పొందుతాము. కాని ఇది తపస్సులో సంభవం కాదు" అని అన్నారు.** ఈ మాటలు వినగానే మేము నిశ్చేష్టులమయ్యాము. ఇటువంటి సూక్ష్మమైన రహస్యాలను ఆ దివ్య పురుషులు తప్ప ఇంకెవ్వరు వివరించగలరని మేము మనస్సులోఅనుకున్నాము.

ఒక రోజున శ్రీ బాబూజీగారు అకస్మాత్తుగా ఈ విధంగా అన్నారు: **"ఎక్కడ కోరిక ఉంటే, అక్కడ మార్గం ఉంటుంది (Where there is a will, there is a way) - దీని అర్థం ఏమిటో తెలుసా?" అని. ఆ సమయంలో మాకు తెలిసింది కూడా పూర్తిగా మరచిపోయినట్లనిపించింది. అంతే! 'వారి' ముఖారవిందం నుండి వెలువడే మాటలను వినాలనే ఆతురతతో ఉన్నాం. మరల స్వయంగా వారే, "ఎక్కడ కోరిక ఉంటే - దీనిని కొద్దిగా మార్చినట్లయితే, ఆధ్యాత్మిక అర్థం విశదమవుతుంది. అది ఏమిటంటే, ఎక్కడ తపన/ఆవేదన ఉంటే, అక్కడ మార్గం ఉంటుంది (Where there is a craving, there is a way) . ఆవేదనయే మార్గం. ఇదే సహజమార్గం యొక్క ప్రాణం"** అని అన్నారు. సామాన్యంగా కనిపించే ఈ శబ్దాలు మానవమాత్రులపట్ల గల ప్రేమ యందు పుట్టి, పెరిగి

అందులో మిళితమైనటువంటివి. 'వారు' ఉపయోగించే శబ్దావళి నిరాడంబరతకే ప్రాణం వంటిది. శ్రీ బాబూజీ గారు, "లక్ష్యంవద్దకు అందరిని తీసుకొని పోవాలని కోరుకున్నా లేదా స్వయంగా వెళ్ళాలని కోరుకున్నా ఫలితం ఒకే విధంగా ఉంటుంది'' అని, మా అమ్మగారివైపు చూస్తూ, "నేను చాలా మంచి మాట చెప్పాను కదా అమ్మా!" అని అన్నారు. అప్పుడు నలువైపులా 'ప్రేమ' అనే సముద్రం ఉప్పొంగి మా అంతరంగాలను అందులో పూర్తిగా తడిపివేసినట్లుగా అనిపించింది.

శ్రీ బాబూజీ గారు నిశ్శబ్దంగా ఉంటే ఎంత ఆశ్చర్యంగా ఉంటుందంటే, పూర్తిగా వాతావరణం అంతా కూడా ఆలోచనా రహితమై మౌనం వహిస్తుంది. 'వారు' తమ సహజ ధోరణిలో మాట్లాడుతున్నప్పుడు, సుషుప్తిలో ఉన్న ఈశ్వరీయ ధార నలువైపులా ప్రవహిస్తున్నదా! అన్నట్లుగా ఉంటుంది. ఒకరోజు సాయంత్రం మేమందరం 'వారి' చుట్టూ కూర్చొని ఏదో చర్చించుకుంటున్నాం. 'వారు' శాంతికి ప్రతీకగా అన్నట్లుగా నిశ్శబ్దంగా కూర్చొని ఉన్నారు. మొత్తం వాతావరణం అంతా కూడా 'వారి' ముఖారవిందం నుండి వర్షించే దివ్యమైన పూలజల్లులను ఏరుకోవాలని నిరీక్షిస్తున్నట్లుగా ఉన్నది. ఇంతలో ఇద్దరు క్రొత్త వ్యక్తులు అక్కడకు వచ్చారు. ఇద్దరు అభ్యాసీ సోదరులు లేచి, వాళ్ళను కుర్చీలలో కూర్చోమని చెప్పారు. ఆ ఇద్దరు సజ్జనులు, అభ్యాసీలు మాట్లాడుకుంటున్న మాటలన్నీ కూడా శ్రద్ధగా వింటున్నారు. కొంత సమయం తరువాత వాళ్ళు, "బాబూజీ! మీ సంస్థ అసలు ఆధ్యాత్మిక సంస్థయే కాదు. ఎందుకంటే, ఇప్పటివరకు మేము, ఏవైతే మాటలు విన్నామో, అందులో

భగవంతుని గురించి ఎటువంటి ప్రస్తావన కూడా రాలేదు. ఎక్కడైతే ఆత్మ – పరమాత్మను గూర్చిన మాటలు ఉండవో, ఆ సంస్థ ఆధ్యాత్మిక సంస్థ అని అనబడదు. ఇక్కడ వీళ్ళంతా కేవలం మీ గురించే మాట్లాడుకుంటున్నారు" అని ఆ క్రొత్త వ్యక్తులు అనగానే, మేమంతా నిశ్చేష్టులమై, దీనికి 'వారు' ఏమని జవాబు చెబుతారా! అని అనుకుంటున్నాము. అప్పుడు పరమ ధీర, గంభీరమైన స్వరంతో శ్రీ బాబూజీ మహరాజ్‌గారు ఈ విధంగా జవాబు నిచ్చారు: "భాయీ! **మా సంస్థ కేవలం ఆధ్యాత్మిక సంస్థ మాత్రమే. ఎందుకంటే, ఇందులో ఈశ్వర ప్రాప్తియే మా లక్ష్యం. నా గురుమహరాజ్ లాలాజీ సాహెబ్ మా సహజమార్గ పద్ధతిలో ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికిగాను, మానవుల యొక్క అంతరంగంలో, తమ ఇచ్ఛాశక్తి ద్వారా, ఈశ్వరీయ ధారను ప్రవహింప చేసి, అందరిని పావనం చేస్తూ, ఈశ్వర ప్రాప్తికి కావలసిన యోగ్యతను ప్రసాదించే దృఢమైన ఆసరాను కూడా ఇచ్చారు. ఈశ్వరీయ శక్తి యొక్క పావన ప్రవాహం వలన, ప్రాణాహుతి శక్తిని పొంది అభ్యాసీ యొక్క హృదయం ఈశ్వరుని యొక్క కృపతో మరియు శక్తితో పులకితమవుతుంది. మా 'మిషన్'లోని ప్రార్థన యొక్క చివరి వాక్యంలో కూడా 'మీ సహాయం లేనిదే మిమ్ముల్ని పొందటం అసంభం' అని వ్రాయబడి ఉన్నది. కేవలం ఈ పూజ చేయడం మాత్రమే మా లక్ష్యం కాదు. కాని ఈశ్వర ప్రాప్తియే మా లక్ష్యం. ఒకవేళ ఈ విధంగా మాట్లాడుకునే వీళ్ళందరి లక్ష్యం కేవలం నేనే అయితే మాత్రం, అసలు నేను ఏమిటి? అనేది నాకే తెలియదు. అటువంటప్పుడు వీళ్ళందరిని లక్ష్యంవద్దకు ఎవరు తీసుకొని వెళ్ళతారు? కాని ఈశ్వర ప్రాప్తి అనే లక్ష్యమే, నా**

**సహజమార్గం యొక్క ప్రాణం. దీనిని పూర్తి చేయటానికే నేను భూమి మీద అవతరించాను. అందువలన ఇది సంపూర్ణంగా నా బాధ్యత మాత్రమే. ప్రజలందరు విగ్రహారాధనలో చిక్కుకొనిపోవడం నాకు ఇష్టం లేదు. అది సద్గురు స్వరూపమైనప్పటికీ ఇష్టం లేదు; నా గురించి మాట్లాడుకుంటే చాలు! సహజంగానే ప్రాణాహుతి ప్రవాహం అభ్యాసులకు లభిస్తుంది. ఇది నా లాలాజీ సాహెబ్ యొక్క అనుగ్రహం" - అప్పుడు నాకు అర్థమైనది ఏమిటంటే, సద్గురు చరణాలను అంటిపెట్టుకొని, 'వారి' కనుచూపులలో నిండిపోయి, నడుస్తూ ఉంటే అప్పుడే మన ఆధ్యాత్మిక ప్రయాణం పూర్తయి, పూర్ణ లక్ష్యాన్ని పొందగలం.**

తమ అభ్యాసులలో ఉత్సాహాన్ని పెంపొందింపచేస్తూ, ఆ ఉత్సాహాన్ని కూడా శ్రేష్ఠతరం చేయడమనేది శ్రీ బాబూజీగారి యొక్క స్వాభావికమైన స్వభావంగా మారిపోయినది. ఎందుకంటే, మనమందరం ఎల్లప్పుడు ఉత్సాహంతో, చిరునవ్వుతో ఉండాలనేదే 'వారి' కోరిక. ఒకసారి ఒక సోదరి 51 రూపాయలు చందాగా బాబూజీగారికి ఇచ్చారు. శ్రీ బాబూజీ గారు ఆ 51 రూపాయలను మరల ఆ సోదరికి ఇచ్చివేస్తూ, "చూడు, నీవు ఇంటికి వెళ్ళి, ఈ డబ్బులను నీ పిల్లలకు పంచిపెట్టి, వీటితో వాళ్ళ అవసరాలను పూర్తిచేయి" అని అన్నారు. ఈ మాటలు వినగానే ఆ సోదరి చాలా దుఃఖపడి, మనస్సులో ఈ విధంగా ఆలోచించసాగినది: "ఈ మొత్తం డబ్బులు చాలా తక్కువగా ఉన్నాయి కాబోలు. అందుకనే బాబూజీగారు వీటిని మరల నాకు ఇచ్చి వేసారు'' అని అనుకోసాగినది. ఎందుకంటే, అంతకుక్రితమే ఒక ధనవంతుడైన

అభ్యాసీ బాబూజీగారికి 500 రూపాయలు చందాగా ఇస్తే, 'వారు' వాటిని స్వీకరించారు. అప్పుడు పరమ పూజ్య బాబూజీగారు ఆమె మనస్సులోని భావాలను గ్రహించి, "చూడు, ఈయన దగ్గర లక్షల విలువచేసే ఆస్తి ఉన్నది. అందులో నుండి 500 రూపాయలు ఈ విధంగా ఇచ్చినా, బయట పారవేసినా లేదా పోగొట్టుకున్నా సరే, ఆయన సంపద కొద్దిగా కూడా తరిగిపోదు. కాని నీ ఈ 51 రూపాయలు ఎంతో విలువైనవి. ఇవి నీ మరియు నీ పిల్లల అవసరాలను తీర్చడానికి ఉపయోగపడతాయి'' అని మరల బాబూజీగారు ఆ సోదరి నుండి ఒక్క రూపాయి అడిగి తీసుకొని "నా ఈ సంతోషం నీ అవసరాలన్నింటినీ పూర్తిజేయుగాక! ప్రభువు నీకు మేలును చేకూర్చుగాక!" అని ఆశీర్వదించారు. ఈ మాటలు వినగానే ఆ సోదరి నేత్రాల నుండి ఆశ్రుధారలు పొంగిపొరలాయి. ఎందుకంటే, **శ్రీ బాబూజీగారు 'అవసరాలు' అనే ఆమె ఖాళీ సంచిని, ఆనందాశ్రువులతో నింపారు.** అపుడు ఆ సోదరి ముఖం మరల సంతోషంతో వెలిగిపోయింది.

అవి వేసవి కాలపు రోజులు. మధ్యాహ్న సమయం 11, 12 గంటలు అవుతుంది కాబోలు, ఎండ తీవ్రంగా ఉన్నది. బయట వరండాలో కుర్చీలో నిర్వికారంగా కూర్చొని ఉన్న శ్రీ బాబూజీగారు, పంఖా ఏదీ లేకపోవడం వలన తమ శరీరం మీద వ్రాలిన ఈగలను పారద్రోలడానికి తమ అంగవస్త్రాన్ని అటు ఇటు ఊపుతున్నారు. ఆశ్చర్యకరమైన సంగతి ఏమిటంటే, 'వారి' ఎదురుగా కూర్చున్న మాకు, ఆ తీవ్రమైన ఎండ యొక్క ప్రభావం ఏ మాత్రం కూడా అనిపించటంలేదు. ఎందుకంటే, బహుశా 'వారు' మా

అంతరంగంలో వేడిమిని (సంస్కారాలను) తీసివేస్తున్నారు కాబట్టి. దాదాపు 12 గంటల సమయం కావొస్తున్నది. పట్టణంలో పేరుపొందిన డాక్టర్‌గారు ఒకరు అపుడే వచ్చి 'వారి' ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నారు. నమస్కార, ప్రతినమస్కారాలు అయిపోయాయి. వారిరువురు ఏవో కుటుంబ విషయాలను గూర్చి చర్చించుకుంటున్నారు. ఇంతలో ఆ డాక్టర్‌గారి మనస్సులో ఏ ఆలోచన వచ్చినదో తెలియదు కాని, వారు, "బాబూజీ! మంత్రం యొక్క ప్రభావం వలన మానవుడు ముగ్ధుడవుతాడని నేను విన్నాను. మీ ధ్యానం వలన కూడా మానవుడు ముగ్ధుడవుతాడా?" అని ప్రశ్నించగానే వేంటనే వారు, "భాయీ! **మంత్రం మానవుడిని ముగ్ధునిగా చేస్తుంది. కాని నా సహజమార్గ పద్ధతి మానవుని ఈ ముగ్ధావస్థ నుండి ఇంకా అతీతమైన స్థితికి తీసుకొని వెళ్ళి అంతిమ లక్ష్యంపట్ల అతనిని సర్వదా మెలకువతో ఉంచుతుంది**" అని అన్నారు. మరల ఆ డాక్టర్‌గారు, "బాబూజీ! మంత్రం సిద్ధించటం అంటే ఏమిటి?" అని అడగ్గానే 'వారు' అత్యంత ధీర, గంభీర, పూర్ణాధికార స్వరంతో మనలనందరిని చైతన్యవంతులుగా చేస్తూ, "మంత్రం యొక్క పరిమిత శక్తి మన ఆధీనంలోకి రావటాన్నే మంత్రం సిద్ధించటం అని అంటారు" అని అన్నారు. ఆ మాటలు వినగానే మేమందరం ఎక్కడో మునిగిపోయినట్లుగా అనిపించినది. 'వారి' సన్నిధిలో ఎక్కడో మునిగిపోవడమంటే మనలోని సంస్కారాలు ఆ దివ్యత్వంచేత శుభ్రపరచబడుతున్నాయని అర్థం. డాక్టర్ గారు మరల ఏమీ మాట్లాడలేదు. అప్పుడు **ఒక అభ్యాసీ సోదరుడు, "బాబూజీ! ధ్యానం ఎప్పుడు తన చరమ దశను చేరుకుంటుంది?" అని అడగ్గానే,**

**ఆ ప్రశ్న పూర్తి కాకమునుపే జవాబు వారి నుండి వెలువడినది. "ఎప్పుడైతే భగవంతుడు నిన్ను స్మరించడం ప్రారంభిస్తాడో అప్పుడు" అని అన్నారు.** ఆనాటి మధుర క్షణాల యొక్క మధుర స్మృతులను తలచుకోగానే మనస్సు పరమానందంలో మునిగిపోయి, దాని నుండి బయటకు రావడానికి ఏ మాత్రం కూడా ఇష్టపడలేదు. వర్తమాన ఆధ్యాత్మిక స్థితి, ఆనందం దానిని మరల పిలుస్తున్నది. కాని మనస్సు, ఆ ఆనందానికి ఎలా వెన్ను చూపుతుంది.

ఒకసారి ఏదో ఇంటి సంబంధమైన విషయం గురించి చర్చ జరుగుతున్నది. నా తల్లిగారు మనస్సులో ఏమి ఆలోచించుకున్నారో తెలియదు కాని, ఈ విధంగా అన్నారు: **"బాబూజీ! మీ మాటలు చాలా అద్భుతంగా, అపూర్వంగా ఉంటాయి. మీరు చాలా గొప్ప మహాత్ములు కదా! చూడడానికి సాధారణమైన వ్యక్తిలా ఉంటారు. పాత అంగ వస్త్రం, పాత చెప్పులు, బక్క పలుచని శరీరం – మరి మహాత్ములంటే చాలా దృఢంగా, దర్పంగా ఉండాలి కదా!"** అని **అనగానే 'వారు' నవ్వుతూ, "అమ్మా! పాత అంగ వస్త్రం, పాత చెప్పులు ధరించిన వ్యక్తిని లాలాజీ సాహెబ్ ఎంతటి ధనవంతుణ్ణి చేసారంటే, నేడు ఆ పరమ ధనాన్ని నేను 'సహజమార్గ' విధానం ద్వారా సమస్త జనులకు పంచిపెట్టుతున్నాను" అని మరల తమ సహజరీతిలో ముసి ముసి నవ్వులు నవ్వుతూ "తెలిసిందా అమ్మా! పాత అంగవస్త్రం, పాత చెప్పులను ధరించే ఈ మామూలు మనిషి యొక్క గొప్పతనం" అని అన్నారు.** లెక్కలేనన్నిసార్లు ఆ దివ్య పురుషుని సమక్షంలో చర్చలలో పాల్గొని, ఆ పరమానందంలో మునిగిపోయేే వాళ్ళం. 'వారు' ఎప్పుడూ, ఏదో ఒకటి

చెబుతుండేవారు. ఈ రహస్యాలన్నింటిని ప్రోగుచేయడానికిగాను, నేను ఎల్లప్పుడు మెలకువగా ఉండేదానిని. అది కూడా 'వారి' ప్రేరణవల్లనే.

నేను ఈ పుస్తకంలో అడుగడుగునా మన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దృష్టి విషయంలో 'శూన్య' అనే మాటను ఉపయోగించాను. ఈ రోజున ఆ మాట యొక్క విశిష్టత కూడా స్పష్టం చేయాలనే ఆలోచన మరల మరల రావడంవలన, ఈ 'శూన్యదృష్టి'ని గూర్చి స్వల్పంగా వ్రాయడానికి నేను వివశురాల నవుతున్నాను. ఈ విషయాన్ని గురించి ఈ రచయిత్రి ఏమి వ్రాయగలదు! అంతా 'వారి' యొక్క 'కృప' పాత్రయే నాతో వ్రాయిస్తుంది.

**ఎప్పుడైతే ప్రభువు ఈ పుస్తకాన్ని వ్రాయాలనే సంకల్పాన్ని ఈ రచయిత్రికి ఇచ్చారో, అప్పటినుండి ఆ ప్రభువు యొక్క శూన్య దృష్టి నా మీద ఏ విధంగా కేంద్రీకరించబడినది అంటే, ఒకవేళ నేను 'వారి'వైపు కొంచెంసేపు తదేక దృష్టితో చూస్తే, ఏ విధంగా అనిపించేదంటే, 'వారి' చూపులు ఒక పెద్ద ఎడారిని దాటి – ఈ పుస్తకం కొరకు 'ప్రేమ' అనే పవిత్ర జలాన్ని తీసుకొని రావడానికి, ఎక్కడికో వెళ్ళిన్నట్లుగా, నా దృష్టి 'వారి' నిరీక్షణలో మునిగిపోయి, శ్రీ బాబూజీగారు ఇప్పుడే వస్తారు, ఇప్పుడే వస్తారు అని అన్నట్లుగా ఉండేది. బహుశా అందువల్లనే కాబోలు, 'వారు' అక్కడి నుండి ఇక్కడకు రావడంవల్లనే శ్రీ బాబూజీ గారి పవిత్ర ప్రేమ జలం అనే వర్షంలో ఈ పుస్తకం వ్రాయబడినది.** ఇప్పుడు మీరే చెప్పండి! శ్రీ బాబూజీ గారి దృష్టి శూన్యదృష్టి అని నేను ఎలా చెప్పగలను?

'వారి' దృష్టి శూన్యదృష్టి కాదని కూడా నేను ఎలా చెప్పగలను? ఈ రోజున కూడా నాకు చాలా స్పష్టంగా గుర్తు ఉన్నది. ఎప్పుడైతే ఈ రచయిత్రి ఆ ప్రభువు యొక్క గుణగణాలను కీర్తిస్తూ ఒక పాటను వ్రాస్తున్నప్పుడు, అందులో ఒక చరణం – **"దివ్యత్వం కూడా ఓడిపోతుంది, మీ మోము చూడగానే"** అని వ్రాసినప్పుడు కూడా, నా సమక్షంలో, ఆ సమయంలో, శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క శూన్యదృష్టి నాపై అమితమైన ప్రేమ వర్షాన్ని కురిపించినది. బహుశా ఈ ఆశయాన్ని తీసుకొనే కాబోలు, 'వారు' ఆ ఆధ్యాత్మిక దశను వర్ణిస్తూ, ఒకసారి ఈ విధంగా వ్రాసారు – ఇటువంటి ఎడారుల వంటి ఆధ్యాత్మిక స్థితులను ఎన్నింటినో దాటిన తరువాతనే, జన్మభూమిని చేరుకోవడానికి మార్గం లభిస్తుంది. అప్పుడే ఆ అవినాశి (వినాశము లేనివాడు లేదా శాశ్వతుడు) యొక్క 'కృప' అనే సెలయేటి ప్రవాహం మనకు కనబడుతుంది. ఆ దివ్య ప్రవాహంలో మనం లయమైనప్పటికీ మనం అందులో మునిగిపోలేము. అందులో మునిగిపోవడానికి మనం ప్రయత్నించినపుడు మన దృష్టి కూడా శూన్యంగా మారిపోతుంది.

# దివ్య కిరణాలు

ప్రియమైన ఈ పుస్తకం యొక్క ఉపసంహారం ఎప్పటికీ కూడా కాదు. **ఎప్పటివరకైతే ఈ సృష్టి నడుస్తుందో అప్పటివరకు శ్రీ బాబూజీ మహరాజ్ నుండి వెలువడిన ఈ దివ్య కిరణాలు విశ్వాన్నే పులకింపచేస్తూ ఉంటాయి. పరిణామ స్వరూపంగా ఏ ప్రకారంగా ఈ దివ్యకిరణాలు మానవ స్మృతులలో వెల్లడి అవుతాయి అంటే, ఆ స్మృతులే స్వయంగా తమంతట తాముగా మాట్లాడాలని కోరుకుంటాయి.** ఇటువంటి ఉపసంహారాన్ని పొందే సౌభాగ్యం ఎప్పుడైనా, ఏ రచనకైనా లభించినదా? దివ్యం, మధురం మరియు సతతం, చిరునవ్వులను ఒలికించే ఆ దివ్య పురుషుని ఈ ధరణి మీదకు ఎవరు తీసుకొని వచ్చారు? ఎప్పుడైతే ఈ రహస్యం మానవ సమక్షంలో దృష్టి గోచరమవుతుందో, అప్పుడు 'ఆనందం' అనే ఆ పవిత్ర వసంత ఋతువు యొక్క శోభతో మానవ హృదయాలు నిండిపోయేటటువంటి సౌభాగ్యాన్ని కూడా 'వారే' ప్రసాదించాలి. ఇటువంటి దివ్య ప్రేమను ఆ సమర్థ సద్గురు శ్రీ లాలాజీ మహరాజ్ తప్ప ఇంకెవ్వరు మనకు ఇవ్వగలరు? ఆ దాతృత్వంలో కూడా 'వారి'కి 'వారే' సమర్థులు. అంతే కాదు, **శ్రీ లాలాజీ సాహెబ్ మనకు ఎటువంటి దివ్యమైన ఉపకారాన్ని చేసారంటే, శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క శూన్యదృష్టి ప్రాణి మాత్రులందరి మీద పడటంవలన, మనమందరం ఉద్ధరించబడి, 'వారి' సమక్షంలోనే, 'వారి' చరణాల చెంతనే వ్యాప్తి చెందునట్లుగా చేసారు. సమర్థ సద్గురు లాలాజీ గారి దివ్య ప్రేమ యొక్క గొప్పతనం అనే స్పందన ఫలితంగానే నేడు మనం ఆ దివ్యపురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్‌గారి పాదపద్మాలను**

**చేరుకోగలిగాము.** శ్రీ బాబూజీగారి సమక్షంలో నేడు మన సంపూర్ణ జీవితం శ్రద్ధతో, నమ్రతతో ఒదిగిపోయినది.

శ్రీ బాబూజీ మహరాజ్ తమ ఇచ్ఛాశక్తి ద్వారా, దివ్య ఈశ్వరీయ శక్తితో నిరంతరం మన హృదయాలను శుభ్రంచేస్తూ సమస్త ప్రాణికోటిని తమ విరాట్ హృదయంలో ఇముడ్చుకొందరు గాక! ఇదే నా ప్రార్థన.

నిరంతరం ప్రసరించే ఈ దివ్యకిరణాలు శ్రీ బాబూజీ మహరాజ్ పవిత్ర ప్రాణాహుతి ప్రభావంచేత, సహజమార్గం ద్వారా 'ఆధ్యాత్మికత'ను స్వచ్ఛం చేస్తూ మనలను 'అనంతం'వైపు అంటే ఆ 'భూమా' వైపుకు తీసుకొని వెళ్ళే సాహసాన్ని ప్రదానం చేస్తాయి. ఎందుకంటే, భగవత్ సాక్షాత్కారం అనే సరిహద్దును దాటిన తరువాతనే ఆ 'అంతిమ స్థితి' లోనికి ప్రవేశించగలం. త్రివేణి సంగమంలో సరస్వతీ నది సదృశ్యంగా ఉన్నప్పటికీ, అది ఏ విధంగా అదృశ్యంగా ఉన్నట్లు కనబడుతుందో అదే విధంగా ఆ దివ్యత్వం అనే త్రివేణి సంగమంలో ప్రవేశం కల్పించే (శ్రీ లాలాజీ మహరాజ్) సమర్థ శక్తి శ్రీ బాబూజీ యొక్క ఇచ్ఛాశక్తిలో లీనమై ఉన్నది. నేడు పుస్తకరూపంలో ఇవ్వబడిన ఈ కానుక మానవమాత్రుల ఉపయోగార్థం 'భూమా' ద్వారంలో ప్రవేశాన్ని పొందటానికిగాను యుగాల పర్యంతం నిర్దేశం చేస్తుంది.

భూమి మీద ఉన్నటువంటి చెడును నశింపచేయటానికి అవతార పురుషులు ఎల్లప్పుడు వస్తూనే ఉంటారు. కాని అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థితులను పొందటానికి తీవ్ర ప్రతిబంధకంగా ఉన్నటువంటి సూక్ష్మ అహంకారాన్ని ఆ దివ్య

పురుషులు తప్ప ఇంకెవరు నశింపచేస్తారు! ఈ దైవీయ రహస్యాన్ని తెలియపర్చటానికే 'మాలిక్' నాకు "కౌన్ థే వే?" అనే ఈ పుస్తకాన్ని వ్రాసే సౌభాగ్యాన్ని ప్రసాదించారు. చివరగా నేను చెప్పేది ఏమిటంటే, ఈ దివ్య కిరణాల యొక్క దివ్య ప్రకాశం ఈ ధరణీతలం నుండి ఆ దివ్యమండలం వరకు ఎల్లప్పుడు ద్యివ్యత్వంతో ప్రకాశించుగాక!

భక్త మీరావలె, కబీర్‌వలె భజనలు పాడడానికి ఆధ్యాత్మిక స్థితిలో ఉండి బాబూజీ మహరాజ్ మీద వ్రాసిన గీతాలను ఆలపించడానికి చాలా తేడా ఉన్నది. నా గీతాలు బాబూజీ మహరాజ్ కృపతోనూ, 'వారి' ప్రసాదించిన స్థితులతోనూ పూర్తిగా నిండి ఉన్నాయి. నా పాటలు భగవత్ సాక్షాత్కారాన్ని "దర్శించు"కుంటూ స్థితులను వర్ణిస్తూ వ్రాసినవి. ఏదో భావోద్రేకంతో వ్రాసినవి కావు.

ఏ విధంగా పుష్పం నా చేతిలో ఉన్నా, దాని సువాసనను మీరు అందరూ గ్రహిస్తున్నారో అదే విధంగా ఈ గీతాలను దివ్య భావనతో, గీతాలలో నిండి ఉన్న స్థితులలో లీనమై పాడితే, మీ అందరికీ కూడా ఆ స్థితులు లభిస్తాయి. మీరు స్వతఃస్సిద్ధంగా ఆ స్థితికి చేరి ఉండకపోయినప్పటికీ పొందటం జరుగుతుంది. బాబూజీ మహరాజ్ ఆశీస్సులతో, కృపతో మన హృదయాలు ఆ యొక్క దివ్య పరిమళంతో అనుసంధింపబడ్డాయి.

**– కస్తూరి బెహెన్**

# వో కౌన్ థే (పాట)

మీ బాబూజీ అంటే ఎవరు? ఏ విధంగా ఉంటారు? 'వారి'ని మీరు ఏ విధంగా చూడగలిగారు? అని ప్రజలంతా నన్ను అడుగుతూ ఉంటారు. కాని 'వారి' దర్శనాన్ని నేను ఎప్పుడు, ఏ విధంగా పొందాను? మరియు బాబూజీ మహరాజ్ అంటే ఎవరు? మొదలైన విషయాలన్నింటినీ ఈ పాటలో వ్రాయడానికి ప్రయత్నించాను.

**1.** నన్ను 'లక్ష్యం' వద్దకు తీసుకొని వెళ్ళడానికి 'వారు' వస్తారని ఎన్నో రోజుల నుండి నా మనస్సు 'వారి' కోసం అన్వేషిస్తున్నది. 'వారి' రాక కోసం నిరీక్షిస్తూ ఉన్నది. మరి 'వారు' ఎవరు? (కౌన్ థే వే?) అప్పుడే 'వారు' మొదటిసారిగా శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారితోపాటుగా మా ఇంటికి వచ్చారు. మొదటిసారిగా 'వారి'ని చూడగానే, శ్రీ లాలాజీ సాహెబ్ ద్వారా ఈ భూమి మీదకు తీసుకొని రాబడిన ఆ మహాపురుషులు **వీరే** అని అనిపించినది. శ్రీ లాలాజీగారి కుమారుడు తమ దివ్యశక్తితో సమస్త విశ్వంపై విజయాన్ని సాధించడానికే భూమిపై అవతరించాను అని అన్నట్లుగా 'వారు' నా ఎదుట నిలబడి ఉన్నారు. పవిత్రమైన 'వారి' భౌతిక స్వరూపం ఎంతటి అపూర్వమైన సౌందర్యంతో ఉన్నదంటే, 'వారి' శుభాగమనం వలన సృష్టియే ఒక సుందరమైన ఆభరణాన్ని ధరించినదా! అన్నట్లుగా ఉన్నది. కాని 'వారు' శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటికి వెళ్ళిపోగానే 'వారి'ని పొందాలనే తపన ఆవేదనలతో నా మనస్సు నిండిపోయినది. నేను ఎవరి సాక్షాత్కారం అయితే పొందవలసి ఉన్నదో **వారే** ఈ దివ్య పురుషుడు అని నాకు అప్పుడు అర్థమైనది.

**2.** ఎప్పుడైతే నా మనస్సు 'వారి'ని గూర్చి పదే పదే ఏ విధంగా ఆలోచించడం ప్రారంభించినదో, అప్పుడు అదే విధంగా 'వారి' దైవీయ రూపం నా ఎదుట ప్రత్యక్షం కాసాగినది. 'వారి' హృదయం 'ప్రేమ' అనే సముద్రంలాగా ఉన్నది. 'వారు' భూమి మీద నడుస్తూ ఉన్నప్పటికీ, 'వారు' మాత్రం భూమి మీద లేరు; అంటే అతీతంగా ఇంకా ఎక్కడో వేరే చోట నడుస్తున్నారని 'వారి' శూన్యమైన చూపులు (శూన్య –నిగాహ్) నాకు తెలిపాయి.

అతిసాధారణమైన 'వారి' వస్త్రధారణ, అత్యంత నిరాడంబరమైన 'వారి' స్వరూపం మరల మరల నా మనస్సులోకి రాగానే, మనందరికీ సాక్షాత్కారాన్ని ప్రసాదించటానికిగాను, **వీరే** ఆ దైవీయ శక్తిపై ఆధిపత్యాన్ని వహించి ఇక్కడకు వచ్చారనే ప్రేరణతో నా అంతరంగం నిండిపోయినది. నా మనస్సులోని ఈ భావాన్ని 'వారు' మౌనంగా స్వీకరించినట్లుగా, అమాయకత్వంతో నిండిన తమ చిరునవ్వు ద్వారా ప్రకటించగానే, అప్పుడే 'వారు' ఎవరో నాకు కొద్దిగా అర్థమైనది.

**3.** నెమ్మది నెమ్మదిగా 'వారి' సామీప్యత నా మనస్సులో ఏ విధంగా నిండిపోయిందంటే, మరల నేను ఒక నూతన జీవితాన్ని పొందినట్లుగా నా మనస్సుకు అనిపించినది. ఈ అనుభవాన్ని పొందగానే, "బాబూజీ! ఇపుడు మీరు నా ప్రాణం కంటే కూడా ఎక్కువ ఇష్టంగా ఉన్నట్లు అనిపిస్తున్నది" అని నేను 'వారి'కి వ్రాసాను. దీని తరువాత 'వారు' మా ఇంటికి వచ్చినపుడు, 'వారి' దివ్య పాదపద్మాలపై శిరస్సును ఆనించినపుడు ఈ విధంగా అనిపించినది – నేను నా శిరస్సును వంచాను. కాని నా మనస్సు ఎక్కడికి

పోయింది? నేను దానిని కనుక్కోలేకపోయాను. ఎందుకంటే, అది ఇప్పుడు నావద్ద ఉండకుండా 'వారి' వద్దకు వెళ్ళి, 'వారి' సొంతమైనది. అప్పుడే నాకు ఈ సత్యం కూడా ప్రత్యక్షమైనది. అది ఏమిటంటే, శ్రీ బాబూజీ గారు నాకు ఆ స్థితిని (నన్ను నేను మరచిపోయిన స్థితిని) సంపూర్ణంగా ప్రసాదించారు. అప్పటి నుండి 'నేను', 'నాది' అనే భావం ఎప్పుడూ కూడా అనిపించలేదు.

**4.** ఆ తరువాత నాకు ఈ విధంగా అనిపించసాగినది – ఎవరో నన్ను ఖరీదుచేసి తమ వెంట తీసుకొని వెళ్ళినట్లుగా అనిపించినది. కాని **వారు** నన్ను ఎందుకు, ఏ భావంతో కొన్నారనేది నాకు తెలియలేదు. అంటే **వారు** నన్ను నా నుండి ఖరీదుచేసి అందుకు మూల్యంగా **వారు** ఏమి చెల్లించారనేది నేను ఇప్పటికీ కూడా తెలుసుకోలేకపోయాను. ఇంతేకాదు, **వారు** నన్ను ఖరీదుచేసి నన్ను ఎక్కడకు (ఏ దివ్య దేశానికి) తీసుకొని వెళ్ళారనేది నేను ఈ పాటను వ్రాస్తున్నప్పుడు నా ఎదుట ఆ ఆహ్లాదకరమైన దృశ్యం ప్రత్యక్షమైంది. కాని ఆ దృశ్యాన్ని మాటలతో వర్ణించడమనేది అసంభవమైన విషయం అని నాకు ఆ విధంగా అనిపించినది. **వారు** నాకు మరల బాహ్యస్మృతిని కలిగించి, "బిటియా! ఇటు చూడు! నేను నిన్ను 'కుతుబ్' స్థితికి చేర్చాను" అని అన్నారు. ఇప్పుడు మీరే చెప్పండి; ప్రతి స్థితిలోను అనుక్షణం ఆ స్థితికి అనుగుణంగా మారిపోతున్న **వారి** దర్శనాన్ని గూర్చి,"వారు ఎవరు?" అంటే నేను ఏమని చెప్పగలను!

**5.** ఎప్పుడైతే 'కుతుబ్' స్థితిలో 'లయం' అవుతామో అప్పుడే భగవత్ సామ్రాజ్యంలోనికి ప్రవేశించగలం. అది ఎటువంటి స్థితి అంటే, అందులో ప్రవేశించగానే ఆ స్థితి యొక్క దర్శనం మాత్రాన్నే

మనం అందులో ఏ విధంగా మునిగిపోతామంటే, ఎవరో మనలో సంపూర్ణంగా లయమైనట్లు అనిపిస్తుంది. ఇక్కడితో సహజమార్గ పద్ధతి యొక్క కార్యం పూర్తయ్యింది. ఎందుకంటే, మానవుడు ఇంతవరకే చేరుకోగలడు. ఇప్పుడు పరిమితి యొక్క పరిమితిని కూడా దాటాము. దీని యొక్క 'సంకల్పం' మాత్రమే మనలను ముందుకు తీసుకొని వెళ్ళుతుంది. కాని అప్పుడే అకస్మాత్తుగా ఒక సందర్భం వచ్చింది. అప్పుడు వెంటనే 'వారు' నా ఎదుట ప్రత్యక్షమై – "నేను నిన్ను తీసుకొని వెళ్ళడానికే ఇక్కడకు వచ్చాను" అని అన్నారు. **వాస్తవానికి 'వారు' మనకు 'సాక్షాత్కారం' మాత్రమే ప్రసాదించడం కాకుండా, ఇంకా సాక్షాత్కారం కంటే కూడా అతీతంగా మనలను తీసుకొని వెళ్ళడానికి కావలసిన శక్తి సామర్థ్యాలతో ఈ భూమిపై అవతరించారని అప్పుడు నాకు అర్థమైంది. ఈ విధంగా 'వారు' ప్రతి స్థాయిలోను, ఆ స్థాయికి సంబంధించిన 'వారి' దివ్యరూపం యొక్క దర్శన భాగ్యాన్ని నాకు కలిగించారు.**

**6.** ఇప్పుడు ఇంకా ముందుకు వెళ్ళిన తరువాత ఆ స్థితిని గూర్చి నేను ఈ విధంగా చెప్పగలను: **సముద్రం యొక్క లోతును మనం ఎప్పుడైనా కొలవగలమేమో కాని 'వారి' యొక్క దివ్య ప్రేమ అనే సముద్రం నుండి ఉప్పొంగుతున్నటువంటి, కనీసం ఆ ప్రేమ తరంగాల యొక్క లోతును కూడా కొలవడమనేది అసంభవమైన విషయం. 'వారి' ఈ ప్రేమ సముద్రం యొక్క మహత్తరమైన స్వరూపాన్ని నేను దర్శించిన తరువాత, 'వారు' నా సమక్షంలో శూన్యంగా ఏ విధంగా నిలబడి ఉన్నారంటే, అసలు 'వారి'వద్ద ఏమీ లేనట్లుగా 'వారు' నిలబడి ఉన్నారు. దీని తరువాత 'వారు'**

**తమ అపారమైన కృపతో నాకు 'శూన్యావస్థ'ను ప్రసాదించినపుడు, నా వంటి అల్పమైన అభ్యాసీని ఇటువంటి మహత్తరమైన శూన్యావస్థ స్థితికి తీసుకొని రాగల వారు, ఎవరో నాకు అర్థమైనది.** కాని 'వారి'ని గూర్చి నేను ఏ విధంగా తెలపగలను? ఎందుకంటే, ఇప్పుడు 'వారు' నన్ను ఇంతకంటే కూడా ఆశ్చర్యకరం, అద్భుతం అయిన స్థితికి తీసుకొని వెళ్ళుతున్నారు.

**7.** ఒక సూఫీ మహాత్ముడు వ్రాసినట్లుగా ప్రేమికులు అనేవారు రెండు రకాలు. మొదటి రకం వారు, ఉప్పొంగుతున్న ప్రేమను త్రాగలేక, వాటి అలలను చూడగానే, వాటితోనే మత్తెక్కి పోతారు. ఇంక రెండవ రకం వారిని 'సాలిక్' అని అంటారు. వీరు ఉప్పొంగుతున్న ఆ ప్రేమను పూర్తిగా త్రాగి, ఇంకా దప్పికగా ఉన్నట్లుగా, ఇంకా కావాలి! ఇంకా కావాలి! అని అంటారు. **ఒకసారి బాబూజీగారు నాకు ఈ విధంగా వ్రాసారు: వేల సముద్రాలకొద్దీ ప్రేమను త్రాగినప్పటికీ, మన నోటి నుండి ఇంకా కావాలి! ఇంకా కావాలి! అనే మాటలే వెలువడుతాయి అని వ్రాసారు.** 'వారు' నన్ను ఇటువంటి ఆశ్చర్యకరమైన స్థితికి తీసుకొని వెళ్ళిన తర్వాత నాకు ఏ విధంగా అనిపించినదంటే, ఇటువంటి 'సాలిక్'లను తయారుచేయునటువంటి **వీరి** మనోహర రూపం ఎటువంటిది? అని. ప్రేమ యొక్క సంపూర్ణ స్థితిని కూడా **వీరు** తమలోనే లీనం చేసుకొని ఉన్నారని నాకు అనిపించినది. ఆ తరువాత నేను చూసినది ఏమిటంటే, **వారి అడుగులు భూమి మీద పడగానే నాకు ఏ విధంగా అనిపించినదంటే దివ్యత్వం అనేది సంపూర్ణంగా వీరి చరణాల ద్వారానే ఈ భూమిని చుంబిస్తున్నట్లుగా అనిపించినది. అందువల్లనే**

**'వారి'ని దర్శించిన వారు, ఎవ్వరూ కూడా 'వారు' లేకుండా జీవించలేరని నాకు అప్పుడు అనిపించినది. శ్రీ బాబూజీ మహరాజ్ సంపూర్ణ విశ్వానికే ప్రాణంగా మారి ఈ భూమిపై అవతరించారని నాకు అప్పుడు అర్థమైనది.**

**8.** నా బాబూజీ మహరాజ్ ఈ ధరణి అంతటా ఉన్నారనే విషయాన్ని గూర్చి ఈ రోజున ఆలోచిస్తూ ఉంటే వీరి తండ్రి ఎవరు? వీరి మాతృమూర్తి ఎవరు? అనే ప్రశ్నలు నాలో కలిగాయి. **ఈ దివ్యపురుషుని భూమి మీదకు అవతరింపజేసిన శ్రీ లాలాజీ సాహెబ్ వీరికి పితృతుల్యులు; ఆదిశక్తి (భూమా)యే వీరి మాతృమూర్తి అని నాకు అనిపించినది. మరి శ్రీ బాబూజీగారి శరీరాన్ని సృష్టించినది ఎవరు? అది శ్రీ బాబూజీ మహరాజ్‌గారి ఇచ్ఛాశక్తి (సంకల్పం) మాత్రమే.** 'బసంత్ పంచమి' శుభదినమున ఈ పాట పూర్తి అయ్యేసరికి 'వారి'ని గురించి నాకు ఎంతయితే అర్థమైనదో, నేను పైన అంతే వర్ణించాను. అప్పుడు నా స్థితి ఈ విధంగా మాట్లాడుతున్నట్లుగా అనిపించినది. ఈ పాట పూర్తి అయ్యేసరికి 'నేను' అనేది కూడ అంతమైనది. **బస్ + అంత్ = బసంత్** (End of 'I' ness).

**9.** ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త ఎప్పుడైన తన సృష్టిని గూర్చి మరచిపోవచ్చు. కాని 'సంధ్య' (సిస్టర్ కస్తూరిగారి కలం పేరు) ఏమి చెప్తూ ఉన్నదంటే, ఈ సృష్టిలో నివసిస్తున్న మనలను ఆ దివ్య పురుషుడు ఏ విధంగా మరచిపోగలడు? అంటే వారు మనలను ఎప్పటికీ మరచిపోలేరు. ఎందుకంటే వారు మనలను

'అంతిమం' వద్దకు తీసుకొని పోవాలనే 'సంకల్పం' తోనే ఈ భూమిపై అవతరించారు. నేడు ఈ సమస్త విశ్వంలోని వారందరు కూడా, వారి నుండి దివ్యకృపను పొందటానికిగాను, వారి పైననే తమ దృష్టిని కేంద్రీకరించారు. ఈ పాట పూర్తి అయ్యేసరికి కౌన్ థే వే? అంటే నేను ఇంతవరకు మాత్రమే చెప్పగలను. వారిని గూర్చి ఇంకా తెలిసిన తరువాత, ముందు ముందు మరల వ్రాస్తాను.

"ప్రార్థనను హృదయపూర్వకమైన ప్రేమ, భక్తితో ఎందుకు నివేదించాలి అంటే దానికి కారణం, దివ్య కృప అతనివైపు తరలించబడటానికిగాను అతడు లేదా ఆ వ్యక్తి స్వయంగా తన ఆంతరికంలో ఒక ఖాళీని (శూన్యత్వాన్ని) సృష్టించుకోవాల్సి ఉంటుంది. ప్రార్థన అనేది భక్తికి సంకేతం."

**– బాబూజీ**

# వారు ఎవరంటే.......

**1.** ఎవరు, వారెవరు? ఎలా చెప్పేది వారెవరని
ఒక శుభ దినాన ప్రత్యక్షమైనప్పుడు తెలిసింది వారెవ్వరో

**2.** మానవ బాధను ఎదను (హృదయం) దాచుకు, 'లాలా' ప్రియతముడు నిలబడగా
చిరవిజేత యోధుడాతడు, సృష్టికే అలంకారమాతడు
మనస్సు వియోగంతో తపించగా, తెలిసింది వారెవరో.

**3.** హృదయం ప్రేమ సాగరంగా, దృక్కులు శూన్యమై ఉండగా
సహజత్వం ఐక్యతకు సంకేతమై ఉండగా
సరళత్వం చిరునవ్వు చిందించగా, తెలిసింది వారెవరో.

**4.** మా ప్రాణమై లయమొందగా, మేము బ్రతికి లేచినట్లు ఉన్నాము.
మా తలలు వారి పాదాలపై వ్రాలినప్పుడు
మనస్సు ఎక్కడ ఉన్నదో, మేము ఎక్కడ ఉన్నామో
మరల స్పృహ తిరిగి రానప్పుడు తెలిసింది వారెవరో.

**5.** 'మేము' అను భావాన్ని మరచి ఆయనకు అంకితమైపోవగా
ఏ దేశానికి తీసుకొని వెళ్ళారో, అది ఎటువంటి మధుర స్వప్నమో
ధృవతారపై నెక్కి నిల్వగా, తెలిసింది వారెవరో.

**6.** లోగిలి ముంగిటకు వచ్చినప్పుడు, సర్వం ఆయన దర్శనంలో లీనమైపోవగా
మేము దారి మరువగా, అది అంతానికి, అంతమై ఉండగా
ఎదుట ఎవ్వరో మందహాసం చేసినప్పుడు తెలిసింది వారెవరో.

**7.** కొలువవచ్చు సముద్రపు లోతునైనా,
కొలవజాలం పొంగిపొరలే ఆ ప్రేమ సాగరాన్ని,
శూన్యమై నిలిచినప్పుడు, తెలిసింది వారెవరో.

**8.** మన మధ్య తిరుగాడు, జీవనముక్తి మూర్తి అతడు, ఆ రూపమే అద్వితీయం
వారిలోని కాంతిపుంజం, కాంతియై వెలుగొందగా,
వారు వేసిన, అడుగడుగున, దివ్యత్వం, నాట్యమాడగా,
వారిని విడిచి ఉండలేనప్పుడు, తెలిసింది వారెవరో.

**9.** లాలాజీ వారి జనకులు, ఆదిశక్తి వారి మాత
సృష్టికర్త ఎవరో వారికే తెలియాలి, వారి మనోగతం,
మన వసంతం వచ్చినప్పుడు తెలిసింది వారెవరో.

**10.** సృష్టికర్త యుగాన్ని మరచిపోవచ్చునేమో
కాని ఈ లోకప్రియుని ఎలా మరువగలం
సర్వం తేజస్సులో లయమైనప్పుడు తెలిసింది వారెవరో.

అభ్యాసులందరు ఆలకింపగా,
సంధ్య (సిస్టర్ కస్తూరిగారు) పాడిన గీతం ఇది.

## ఎవరు? వారు ఎవరు?
## ఎలా చెప్పేది వారు ఎవరని?

